ఈనాడు

విజయవాడ 26-1-2019 శనివారం సిటీ సంపుటి 45 . సంచిక 166

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ప్రణబ్, నానాజీ, హజారికా

భారత రత్నాలు


మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, జనసంఘ్ నేత నానాజీ దేశ్‌ముఖ్, గాయకుడు భూపేన్ హజారికాలకు దేశ అత్యున్నత పురస్కారం

- 'ఎల్‌అండ్‌టీ' నాయక్‌కు పద్మవిభూషణ్
- నటుడు మోహన్‌లాల్, నంబి నారాయణ్‌లకు పద్మభూషణ్

తెలుగు వెలుగులు...

- సిరివెన్నెల, హారిక, సునీల్ ఛెత్రి, రైతునేస్తం వెంకటేశ్వరరావులకు పద్మశ్రీ

... సమగ్ర వివరాలు 2, 7 లలో



నానాజీ దేశ్‌ముఖ్



భూపేన్ హజారికా



ప్రణబ్ ముఖర్జీ

కీలక సమయమిది...ఓటును మరవకండి: రాష్ట్రపతి 12లో

అసమానతలతో సప్తపది ప్రత్యేక వ్యాసం 4లో

ఆడబిడ్డలూ ఆశీర్వదించండి

డ్వాక్రా మహిళల ప్రాంతీయ సదస్సుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు 2లో



అమరావతిలోని నేలపాడులో జరిగిన సదస్సులో సీఎంకు బొట్టుపెట్టి సత్కరిస్తున్న జిల్లా సమాఖ్యల అధ్యక్షురాళ్లు వై ఈశ్వరమ్మ, గద్దె అనూరాధ, వై ప్రవీణ, ఎన్.పుష్పావతి

అన్నదాతా సుఖీభవ!

- రైతుల కోసం భారీ పథకం
- ఎకరాకు రూ.10 వేల చేయూత
- ఏటా రూ.20 వేల కోట్ల పెట్టుబడి సాయం
- కౌలు రైతులకూ మేలు జరిగేలా నిబంధనలు
- వారం పది రోజుల్లో విధివిధానాలు

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలోని రైతులకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు ఉద్దేశించిన భారీ పథకాన్ని ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనుంది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రూపకల్పన చేస్తున్న ఈ పథకాన్ని 'అన్నదాత సుఖీభవ' పేరుతో అమలు చేసే అవకాశముంది. అసలు రైతులతోపాటు (భూమి యజమానులు), కౌలు రైతులకూ మేలు జరిగేలా ఈ పథకాన్ని రూపొందిస్తోంది. ఒక్కో (మిగతా 11లో)

వామపక్షాలతో కలిసే పోటీ

- ఫిబ్రవరిలో సీట్ల పంపిణీపై చర్చలు
- ఆపై ఉమ్మడి ప్రణాళిక విడుదల
- జనసేన అధినేత పవన్ వెల్లడి
- ఈవీఎంలపై అనుమానాలను కేంద్రం నివృత్తి చేయాలి: సురవరం
- మన్యంలో బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తున్నాం: బీవీ రాఘవులు

ఈనాడు - విశాఖపట్నం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, సీపీఐ, సీపీఎం పొత్తు పెట్టుకుని కలిసే పోటీ చేస్తాయని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పునరుద్ఘాటించారు. శుక్రవారం విశాఖ శివారులో 'ప్రజా సమస్యలపై జనసేన, సీపీఐ, సీపీఎం సమావేశం' నిర్వహించారు. అందులో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి మధు తదితరులతో విస్తృతంగా చర్చలు నిర్వహించారు. అనంతరం పవన్ కల్యాణ్ విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఎన్నికల్లో ఎలా (మిగతా 10లో)



జనసేన, వామపక్షాల సమావేశ వివరాలు వెల్లడిస్తున్న పవన్ కల్యాణ్. వేదికపై కె.రామకృష్ణ, మాదాసు గంగాధరం, సురవరం, బీవీ రాఘవులు, నాదెండ్ల మనోహర్, పి.మధు



జగన్ సమర శంఖారావం

- 4 నుంచి జిల్లాల పర్యటన 10లో

సోమశిల-స్వర్ణముఖి

రెండో విడతకు పచ్చజెండా

- రూ.1,953.49 కోట్లతో మొదటి దశతో కలిపి అంచనాల సవరణ
- 47 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు
- 3 చోట్ల జలాశయాలు, ఎత్తిపోతలు 3లో

రూ.489 కోట్లతో ఎత్తిపోతల

- జగ్గయ్యపేట మండలం ముక్త్యాల వద్ద నిర్మాణం
- 2.7 టీఎంసీల మళ్లింపు
- 38,627 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం 6లో

ఇదీ సంగతి!



ఆడబిడ్డలూ.. ఆశీర్వదించండి

- మూడు విడతలుగా పసుపు, కుంకుమ సొమ్ము
- ఫిబ్రవరిలో డ్వాక్రా మహిళలకు చెక్కులు
- త్వరలో స్మార్ట్‌ఫోన్ల పంపిణీ
- వెలుగు ఉద్యోగులకు వరాల జల్లు
- డ్వాక్రా సంఘాలు నా మానసపుత్రిక
- డ్వాక్రా మహిళల ప్రాంతీయ సదస్సుల్లో సీఎం చంద్రబాబు



అమరావతిలోని నేలపాడులో శుక్రవారం డ్వాక్రా మహిళల సదస్సులో ప్రసంగిస్తున్న చంద్రబాబు.. చిత్రంలో మంత్రి పితాని సత్యనారాయణ, కోన శశిధర్, వై.ఈశ్వరమ్మ (ప్రకాశం), గద్దె అనురాధ (గుంటూరు), వై.ప్రవీణ (కృష్ణా), ఎన్.పుష్పావతి (పశ్చిమగోదావరి), శ్రావణ్‌కుమార్, పుల్లారావు, నక్కా ఆనందబాబు, నన్నపనేని రాజకుమారి, షేక్ జానీమూన్, దేవినేని ఉమా

ఈనాడు-అమరావతి, కడప, విశాఖపట్నం

డ్వాక్రా సభ్యులు చైతన్య దీపికలుగా మారి పని చేసే ప్రభుత్వాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా రాజధాని ప్రాంతం నేలపాడు సమీపంలో, కడప, విశాఖ నగరాలలో శుక్రవారం వేర్వేరుగా నిర్వహించిన ప్రాంతీయ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. మూడు సదస్సుల్లో సమీప జిల్లాల డ్వాక్రా సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సమావేశాల్లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'మన మధ్య రక్తసంబంధం లేకపోయినా పూర్వజన్మ రుణానుబంధం ఉంది. మరో ఆరు లక్షల మంది సభ్యులు చేరితే ఈ అన్నకు కోటి మంది చెల్లెమ్మల సైన్యం తయారవుతుంది. ఇది నా అదృష్టమే. నా వ్యక్తిగత విజయం. అందుకే వారికి అన్ని విధాలా అండగా ఉంటా. రూ.200 పింఛను రూ.రెండు వేలు చేసిన ఘనత నాదే. రూ.200 ఇచ్చిన గత ప్రభుత్వాలు రెండువేల సార్లు ఆ విషయాన్ని చెప్పుకున్నాయి. రూ.రెండు వేలు ఇస్తున్న నేను ఎన్నిసార్లు చెప్పుకోవాలి? ప్రతి డ్వాక్రా మహిళను పారిశ్రామికవేత్తగా మార్చుతా. స్వయంసహాయక బృందాలకు ఆహార శుద్ధి పరిశ్రమల కింద ఐదేళ్లలో రూ.750 కోట్లు ఇస్తా' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలతోపాటు పనిముట్లను కూడా ఆడపిల్లల పేరిటే ఇస్తున్నామని గుర్తుచేశారు. 'ఆడపిల్లలకు కట్నంగా రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఇస్తున్నాం. నాకు మళ్లీ అధికారమిస్తే మరిన్ని పసుపు కుంకుమలు ఇస్తా. కేవలం ఆర్థికంగానే కాకుండా రాజకీయంగానూ ఎదగడానికి వీలుగా వారికి స్థానిక ఎన్నికల్లో పోటీ అవకాశాలను కల్పిస్తా. ఓ యువతి తొమ్మిదో తరగతిలో ఉండగా పెళ్లవడంతో కుటుంబ బాధ్యతల్ని మోస్తూ డ్వాక్రాలో చేరి పిల్లలను చదివించుకుంది. తాను కూడా కుమారుడితోపాటు ఎంబీఏ చదువుతూ ఆదర్శంగా నిలుస్తోంది' అని ప్రశంసించారు.

75 రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయి. చిన్న పొరపాటు జరిగి మనం రాకపోతే వెనక్కి వెళ్లిపోతాం. సుస్థిర పాలన కొనసాగాలి. రాష్ట్రంలో 25 ఎంపీ స్థానాలు, 150కిపైగా ఎమ్మెల్యేలను గెలిపిస్తే పాలన సునాయాసంగా ఉంటుంది. అది మీ నుంచి ఆశిస్తున్నా. మన, పిల్లల భవిష్యత్తు కోసం 75 రోజులు పనిచేయడానికి మీరు సిద్ధంగా ఉన్నారా? అని మహిళలను ప్రశ్నించారు. 'ఎవరైనా మనల్ని విమర్శిస్తే చితగ్గొట్టాలి. అడ్డుకోడానికి చూస్తే భరతం పడతామనాలి' అని సూచించారు. చెల్లెమ్మల ఆశీర్వాదం ఉంటే కొండలనైనా పిండి చేసే శక్తి వస్తుందన్నారు. చెల్లెమ్మలకు డబ్బులిచ్చే అధికారం ముఖ్యమంత్రికి ఉండదా? అని ప్రశ్నించారు.

వంద రెట్లు పెంచాం..

'ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం పసుపు కుంకుమకు శ్రీకారం చుట్టాం. మీకు కష్టమొస్తే ఎవరూ ఆదుకోరని నేరుగా రూ.20వేలు ఇస్తున్నా. ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు పండగలా చెక్కులిస్తాం. ఫిబ్రవరి ఒకటిన రూ.2500, మార్చి 8న రూ.3500, ఏప్రిల్ 5న రూ.4వేలు వారి ఖాతాల్లో నుంచి తీసుకోవచ్చు. తొలి విడత ప్రతి సభ్యురాలికి రూ.10వేల చొప్పున రూ.8604 కోట్లు, వడ్డీ రాయితీ కింద రూ.2514 కోట్లు, ప్రస్తుతం ఇస్తున్న రూ.10వేలకు రూ.9400 కోట్లు కలిపి రూ.21వేల కోట్లకుపైగా ఇస్తున్నాం' అని వివరించారు. 'ఈతరం పెళ్లిళ్లు వద్దు.. పిల్లలను కనం అంటున్నారు. వారిని డ్వాక్రా మహిళలు చైతన్యపర్చి పిల్లల సంఖ్య పెరిగేలా చూడాలి. నలుగురు పిల్లలున్నా ప్రోత్సహించాలని నిర్ణయించాం' అని వివరించారు. వైఎస్ ఐదేళ్లలో డ్వాక్రా సంఘాలకు రూ.200కోట్లు ఇచ్చారు. తర్వాత ప్రభుత్వం రూ.2వేల కోట్లు ఇచ్చింది. మేం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో రూ.21వేల కోట్లు ఇచ్చాం. ఇది వంద రెట్లు ఎక్కువ' అని గుర్తు చేశారు.

డ్వాక్రా సంఘాలు ప్రపంచానికే ఆదర్శం

'ప్రకృతి సేద్యంలో రాష్ట్ర విజయం డ్వాక్రా సంఘాల వల్లే సాధ్యమైంది. మన గ్రామంలో ప్రకృతి సేద్యంలో పండించిన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విదేశాలకు పంపి ప్రపంచానికే దిక్సూచిగా నిలవాలి' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'త్వరలో డ్వాక్రా సభ్యులందరికీ స్మార్ట్ ఫోన్లు ఇస్తాం. 1.40 కోట్ల మందికి అందిస్తాం. చరవాణి చేతిలో ఉంటే ప్రభుత్వ సేవలు యాప్ ద్వారా పొందవచ్చు. మీరు తయారుచేస్తున్న వస్తువులను పోర్టల్‌లో పెట్టుకుని విక్రయించుకోవచ్చు. ఎక్కడికక్కడ చెల్లింపులు చేసే వ్యవస్థకు శ్రీకారం చుడతాం. అలాంటి వ్యవస్థకు మీరే నాయకులు. రాష్ట్ర, జిల్లా, మండల, సాధికారమిత్రలతో మొదలుపెట్టి అందరికీ స్మార్ట్‌ఫోన్ల పంపిణీని ప్రారంభిస్తాం' అని తెలిపారు.

రూ.50వేల ఆదాయమే లక్ష్యం

'మండలకేంద్రాల్లో ఏర్పాటుచేసే సూక్ష్మ మధ్యతరహా పారిశ్రామిక పార్కు (ఎంఎస్ఎంఈ)లలో డ్వాక్రా సంఘాలకు ప్రాధాన్యమిస్తాం. ఇంటి వద్ద తయారుచేసిన ఉత్పత్తులను ప్రాసెస్ చేసుకోడానికి, భద్రపరుచుకోడానికి గోదాములు, సరకు రవాణాకు వసతులు కల్పిస్తాం. కొత్త వస్తువులకు బ్రాండ్ తయారుచేస్తాం. మొదటివిడత రూ.10వేల ఆదాయం, రెండోవిడత రూ.25వేలు, మూడో దశలో రూ.50వేలు నెలకు సంపాదించేలా వారు ముందుకెళ్లాలి' అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఆయా సదస్సుల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దొంగ సర్వేలు జగన్‌కు అలవాటే: ముఖ్యమంత్రి

వైకాపా అధ్యక్షుడు జగన్‌కు ఎన్నికల ముందు దొంగ సర్వేలు అలవాటేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. డబ్బుతో ప్రజాభిమానాన్ని కొనగలమన్న అహంభావంతో వైకాపా ఉందని మండిపడ్డారు. 'దుష్ప్రచారంలో జగన్ ఘనాపాటి. డబ్బుతో దేన్నయినా కొనగలనన్న అహంభావం ఆయనది. 2014 ఎన్నికలకు ముందు కూడా ఇలాగే తప్పుడు సర్వేలు ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధించింది. దొంగ సర్వేలతో ప్రజాదరణ తారుమారు చేయలేరు. ప్రజాభిమానాన్ని తెదేపాకు దూరం చేయడం అసాధ్యం' అని శుక్రవారం ఉదయం తెదేపా నాయకులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'ప్రతికూల నాయకత్వానికి జగన్ రుజువు. వైకాపాది పెడధోరణి' అని ధ్వజమెత్తారు. జగన్ అహంభావం భరించలేకే అనేక మంది ఆ పార్టీకి దూరమవుతున్నారని.. వంగవీటి రాధాకృష్ణ, నిర్మాత ఆదిశేషగిరిరావు కూడా ఇలాగే బయటకు వచ్చారని వివరించారు. బాధ్యతారాహిత్యానికి జగన్ ప్రతిబింబమని, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులపై మోదీని జగన్ ప్రశ్నించరని చంద్రబాబు ధ్వజమెత్తారు.

రిటర్న్ గిఫ్టులు మనమే ఇవ్వాలి

'ఒకరు రిటర్న్ గిఫ్ట్ ఇస్తానంటున్నారు. ఆయనకు 5 రిటర్న్ గిఫ్టులు ఇవ్వడానికి చెల్లెమ్మలు సిద్ధంగా ఉండాలి. ముగ్గురు మోదీలు గద్దల్లా వాలి అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. 94లక్షల డ్వాక్రా మహిళలు, 55 లక్షల మంది పింఛనుదారులు ఓటేస్తే విజయం మనదే'

వెలుగు ఉద్యోగులకు వరాలు

- గతంలో ప్రకటించిన 20శాతానికి అదనంగా మరో 10శాతం కలిపి మొత్తం 30 శాతం వేతనాల పెంపు
- ఎన్టీఆర్ ఆరోగ్యకార్డులు. రూ.10లక్షల ప్రమాద బీమా. 10రోజుల వైద్య సెలవులు
- మండల కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు ప్రస్తుత వేతనానికి అదనంగా రూ.3వేలు
- వందశాతం వేతనంపై హెచ్ఆర్ఏ, ఈపీఎఫ్ మంజూరు
- ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అడ్డంకిగా ఉన్నాయి. మంత్రిమండలి ఉపసంఘానికి సిఫార్సు చేశాం. దాని నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటాం.

డ్రోన్ విప్లవం దిశగా ఏపీ ముందడుగు

- కొత్త మార్గదర్శిని అమలు చేయాలని నిర్ణయం
- దేశంలోనే ఇది మొదటిసారి

దావోస్: డ్రోన్ విప్లవం దిశగా ఆంధ్రప్రదేశ్ కీలక ముందడుగు వేసింది. కొత్తగా ఆవిష్కరించిన 'అడ్వాన్స్డ్ డ్రోన్ ఆపరేటర్స్ టూల్‌కిట్'ను అమలు చేయడానికి నిర్ణయించింది. తద్వారా భారత్‌లో దీన్ని చేపట్టబోతున్న మొట్టమొదటి రాష్ట్రంగా అవతరించింది. మందులు వంటి కీలక సరఫరాలను రవాణా చేయడానికి డ్రోన్లను ఉపయోగించాలనుకుంటున్న ప్రభుత్వాలకు ఇది ఓపెన్ సోర్స్ మార్గదర్శిగా పనికొస్తుంది.

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో ఈ ఓపెన్ సోర్స్ గైడ్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్ల ద్వారా రవాణా కార్యకలాపాలను వీలుకల్పించేలా ఈ టూల్‌కిట్‌లో అభివృద్ధి చేసిన విధానపరమైన ముసాయిదాలను పరీక్షించడం మొదలుపెడతామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, గ్రామీణాభివృద్ధి మంత్రి నారా లోకేశ్ దావోస్ సదస్సులో వెల్లడించారు. దీన్ని అమలు చేసే మొట్టమొదటి ప్రభుత్వ భాగస్వామిగా ఆంధ్రప్రదేశ్ నిలవడం గర్వకారణమన్నారు. ఇందులోని అంశాలను ఉపయోగించుకొని రాష్ట్రంలో ప్రజలకు కీలకమైన వైద్య సంబంధిత సరఫరాలను చేరవేసే ఒక డ్రోన్ రవాణా కార్యక్రమాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. స్విట్జర్లాండ్, రువాండా ప్రభుత్వాలతో విస్తృత భాగస్వామ్యం ద్వారా ఈ టూల్‌కిట్‌ను అభివృద్ధి చేశారు. డ్రోన్ ఇన్నోవేటర్స్ నెట్‌వర్క్ (డీఐఎన్) చేసిన కసరత్తును ఉపయోగించుకున్నారు. సమాజానికి ఉపయోగపడే అధునాతన డ్రోన్ కార్యకలాపాలను ప్రారంభించాలనుకుంటున్న ప్రభుత్వాలకు ఉపయోగపడే మార్గసూచీ. డ్రోన్ కార్యకలాపాల్లో నేర్చుకున్న పాఠాల ఆధారంగా దీన్ని రూపొందించారు. డ్రోన్‌లకు సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేయడంలో ఉన్న అవరోధాలను అధిగమించి, భద్రంగా వాయు మాధ్యమ వినియోగానికి ఊతమిచ్చే చర్యలను పాటించేందుకు ఇది దోహదపడుతుంది. ప్రభుత్వాల పరిశీలన కోసం నిర్దిష్ట సూచనలను కూడా ఇందులో చేశారు. డ్రోన్ ద్వారా బట్వాడా సేవలను అందిస్తున్న సంస్థల్లో తాము ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉన్నామని జిప్‌లైన్ సంస్థ సహ వ్యవస్థాపకుడు విల్ హెట్జలర్ చెప్పారు. తాజా టూల్‌కిట్‌లో తాము కూడా తమ అనుభవాన్ని జోడించామని తెలిపారు.

ప్రణబ్, నానాజీ, హజారికా.. భారత రత్నాలు

దిల్లీ: దేశంలోని అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ఈ ఏడాది ముగ్గురు ప్రముఖులను వరించింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, భారతీయ జనసంఘ్ నేత నానాజీ దేశ్‌ముఖ్, గాయకుడు భూపేన్ హజారికాలకు భారతరత్న పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. నానాజీ, హజారికాల పేర్లను మరణానంతరం పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రభుత్వ అధికారిక ప్రకటన పేర్కొంది. నాలుగేళ్ల విరామం అనంతరం భారతరత్న పురస్కారాలను ప్రకటించారు. చివరిసారిగా 2015లో మోదీ ప్రభుత్వం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు మదన్‌మోహన్ మాలవీయలకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇప్పటిదాకా భారతరత్న పొందిన వారి సంఖ్య 48కి చేరింది. కేంద్ర ప్రభుత్వం 2019 గణతంత్ర దినోత్సవం సందర్భంగా 11 మంది విదేశీయులుసహా 112 మంది ప్రముఖులకు 'పద్మ' పురస్కారాల్ని ప్రకటించింది. ఇందులో నలుగురిని పద్మవిభూషణ్, 14 మందిని పద్మభూషణ్, 94 మందిని పద్మశ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది.

పద్మవిభూషణ్ వీరికే..

యెమెన్ నుంచి భారతీయులతోపాటు, వివిధ దేశాల వారిని రక్షించడంలో కీలకపాత్ర పోషించిన డిజిబౌటి అధ్యక్షుడు ఇస్మాయిల్ ఒమర్ గుయెల్లె, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జానపద గాయని తీజన్‌బాయి, మహారాష్ట్రకు చెందిన ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఏఎం నాయక్, మహారాష్ట్రకు చెందిన రంగస్థల కళాకారుడు బల్వంత్ మొరేశ్వర్ పురందరెలకు పద్మవిభూషణ్ పురస్కారాలు ప్రకటించింది.

పద్మభూషణ్ వీరికే..

ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, తప్పుడు కేసుల్లో ఇరుక్కొని చివరికి సుప్రీంకోర్టు కోర్టు ద్వారా నిర్దోషిగా విడుదలైన అంతరిక్ష శాస్త్రవేత్త నంబి నారాయణ్, దివంగత పాత్రికేయుడు కులదీప్ నయ్యర్, లోక్‌సభ మాజీ డిప్యూటీ స్పీకర్, ప్రస్తుత ఎంపీ కరియాముండా, 6 సార్లు పార్లమెంటుకు ఎంపికైన భాజపా ఎంపీ, కేంద్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి హుకుందేవ్ నారాయణ్ యాదవ్, అకాలీదళ్ నేత, మూడుసార్లు ఎంపీ, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన సుఖ్‌దేవ్‌సింగ్ ధిండ్సా, ఎండీహెచ్ మసాలా వ్యవస్థాపకులు, సీఈఓ మహాశయ్ ధర్మపాల్, పర్వతారోహకురాలు బచేంద్రీపాల్, మాజీ కాగ్ వీకే షుంగ్లూలకు పద్మభూషణ్ పురస్కారాలు దక్కాయి. ప్రముఖ నృత్యదర్శకుడు, నటుడు, దర్శకుడు ప్రభుదేవా, దివంగత బాలీవుడ్ నటుడు కాదర్‌ఖాన్, భారత క్రికెట్ క్రీడాకారుడు గౌతంగంభీర్, మాజీ రాయబారి జైశంకర్ పద్మశ్రీ వరించిన ప్రముఖుల్లో ఉన్నారు.

తెలుగు పద్మాలు..

తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ నుంచి జాతీయ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్, ప్రపంచవ్యాప్తంగా క్రియాశీలకంగా ఉన్న క్రీడాకారుల్లో అత్యధిక గోల్స్ సాధించిన సునీల్ ఛెత్రి, 3 వేలకు పైగా సినీగీతాలు రాసిన సినీగేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, ఆంధ్రప్రదేశ్ నుంచి దశాబ్దకాలంగా చెస్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ 2011 చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన ప్రముఖ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, 'రైతునేస్తం' ఫౌండేషన్ ద్వారా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న వ్యవసాయ పాత్రికేయుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావులకు పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది.

ఎవరికెన్ని..

112 పద్మ పురస్కారాల్లో అత్యధికంగా మహారాష్ట్రకు 12 దక్కాయి. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌కు 10, దిల్లీకి 8, తమిళనాడుకు 7, గుజరాత్‌కు 6, మధ్యప్రదేశ్‌కు 4, కేరళ, కర్ణాటక, బిహార్, హరియాణాలకు 5 చొప్పున, ఝార్ఖండ్‌కు 4, ఒడిశా, పంజాబ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, జమ్మూకశ్మీర్‌లకు 3 చొప్పున, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు 2 చొప్పున, మణిపూర్, సిక్కిం, త్రిపురలకు 1 చొప్పున లభించాయి. విదేశీయుల్లో అమెరికాకు 6, దక్షిణాఫ్రికాకు 1, జర్మనీకి 1, కెనడాకు 1, ఫ్రాన్స్‌కి 1 చొప్పున లభించాయి.

ఎక్కువే పొందాను: ప్రణబ్

తనకు భారతరతన పురస్కారం వరించడంపై ప్రణబ్‌ముఖర్జీ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. 'నేను ఎప్పుడూ చెప్పేదే మళ్లీ చెబుతున్నాను, ఈ దేశానికి నేను అందించిన దానికన్నా ఎక్కువగానే ప్రజల నుంచి పొందాను' అని ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ప్రధాని మోదీ అభినందనలు

ప్రణబ్ ముఖర్జీ తన నిస్వార్థ శ్రమతో దేశ వృద్ధిపథంపై బలమైన ముద్ర వేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అసాధారణ రాజనీతిజ్ఞులని కొనియాడారు. ఆయనకు భారతరత్న వరించడం ఆనందదాయకమని ట్వీట్ చేశారు. నానాజీ దేశ్‌ముఖ్ గ్రామీణాభివృద్ధికి చేసిన కృషి పల్లెవాసుల సాధికారతకు సరికొత్త మార్గ నమూనాను చూపిందన్నారు. హజారికా పాటలు, సంగీతాన్ని పలు తరాలు ఆస్వాదించాయన్నారు.

గర్వకారణం: రాహుల్

ప్రణబ్‌ముఖర్జీకి భారతరత్న వరించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అభినందనలు తెలిపారు. 'భారతరత్న వరించినందుకు ప్రణబ్ దాకు అభినందనలు, ప్రజాసేవ, దేశ నిర్మాణంలో అపార కృషి చేసిన ప్రణబ్ ముఖర్జీకి గౌరవం దక్కినందుకు కాంగ్రెస్ పార్టీ గర్వంగా భావిస్తోంది.' అని ట్వీట్ చేశారు.

ప్రణబ్‌కు భారతరత్న సముచితం


ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి భారతరత్న ప్రకటించడం సముచితమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రపతిగా, కేంద్ర ఆర్థిక, రక్షణ శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలు అనితర సాధ్యమని తెలిపారు. నానాజీ దేశ్‌ముఖ్, భూపేన్ హజారికా మరణానంతరం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న దక్కడం హర్షణీయమని వివరించారు. ప్రముఖ సినీగీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, చదరంగ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, యడ్లపల్లి వెంకటేశ్వరరావులకు పద్మశ్రీ దక్కడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్ని పర్యాయాలు, ఎన్ని అభ్యర్థనలు చేసినా ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించడంలో కేంద్ర ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఇది తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిర్లక్ష్యం చేయడమేనన్నారు.

పింఛన్ల రెట్టింపుపై ఉత్తర్వులు విడుదల

ఈనాడు డిజిటల్, అమరావతి: సామాజిక భద్రతా పింఛన్లను రెట్టింపు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం జారీచేసింది. జనవరి నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని అందులో పేర్కొంది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత, డప్పు కళాకారులు, చర్మకారులకు ఇచ్చే పింఛన్లను రూ.1000 నుంచి రూ.2 వేలకు పెంచినట్లు అందులో పేర్కొంది. వికలాంగులకు రూ.1500 నుంచి రూ.3 వేలకు, డయాలసిస్ వ్యాధిగ్రస్థులకు రూ.2500 నుంచి రూ.3500లకు పెంచుతున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వుల్లో తెలిపింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రణబ్ దా



'ప్రణబ్ దా'గా సన్నిహితులు ఆత్మీయంగా పిలుచుకొనే 83 ఏళ్ల ప్రణబ్ ముఖర్జీ భారత రాజకీయాల్లో అత్యంత కీలక నేతల్లో ఒకరు. యాభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక ఉన్నత పదవులు నిర్వహించిన ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. కాంగ్రెస్‌లో వివాద పరిష్కర్తగా పేరు పొందారు.

పశ్చిమ బెంగాల్‌లోని మిరాటిలో 1935 డిసెంబర్ 11న ప్రణబ్ జన్మించారు. ఆయన తండ్రి కె.కె.ముఖర్జీ స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. పశ్చిమ బెంగాల్ శాసన మండలిలో కాంగ్రెస్ తరఫున ప్రాతినిధ్యం వహించారు. గ్రాడ్యుయేషన్ తర్వాత ప్రణబ్ పొలిటికల్ సైన్స్, చరిత్రలో మాస్టర్స్ పట్టాలను పొందారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి న్యాయ పట్టాను సాధించారు. సువ్రా ముఖర్జీని వివాహమాడారు.

రాజకీయ ప్రస్థానం ప్రారంభించడానికి ముందు ప్రణబ్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో అప్పర్ డివిజన్ క్లర్క్‌గా బాధ్యతలు చేపట్టారు. 1963లో ఆయన విద్యానగర్ కళాశాలలో అధ్యాపకుడిగా బాధ్యతలు చేపట్టారు. బెంగాలీ పత్రిక 'దేషర్ దక్'లో పాత్రికేయుడిగా పని చేశారు. రాజకీయాల్లో ప్రణబ్ కీలక అడుగు 1969లో పడింది. నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఆయనను కాంగ్రెస్ తరఫున రాజ్యసభకు పంపారు. ఆ తర్వాత ఆయన ఇందిరకు అత్యంత నమ్మకస్తుడిగా ఎదిగారు. 1973లో ఆమె మంత్రివర్గంలో బెర్త్ సాధించారు. 47 ఏళ్ల వయసులోనే 1982లో ఆయన దేశ ఆర్థిక మంత్రి బాధ్యతలు చేపట్టారు. తద్వారా భారత్‌లో అత్యంత పిన్న వయస్కుడైన ఆర్థిక మంత్రిగా గుర్తింపు పొందారు. ఇందిరకు తానే తగిన రాజకీయ వారసుడినని ప్రణబ్ భావించారు. అయితే ఆ బాధ్యతను ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ చేపట్టడంతో ఆయన రాష్ట్రీయ సమాజ్‌వాదీ కాంగ్రెస్ పేరుతో సొంత పార్టీ పెట్టుకొన్నారు. 1989లో దాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. 1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆయన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా, 1995లో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

1998లో కాంగ్రెస్ అధ్యక్ష పగ్గాలు చేపట్టేలా సోనియా గాంధీని ఒప్పించడంలో ప్రణబ్ కీలక పాత్ర పోషించారు. సంక్లిష్ట సమయంలో ఆమెకు మార్గనిర్దేశం చేశారు. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆయన తొలిసారిగా లోక్‌సభ నుంచి గెలుపొందారు. 2012 వరకూ ఆయన కీలకమైన విదేశీ, రక్షణ, ఆర్థిక శాఖలను నిర్వహించారు. 2012 నుంచి 2017 వరకూ ఆయన దేశ 13వ రాష్ట్రపతి బాధ్యతలను నిర్వర్తించారు. గట్టి కాంగ్రెస్‌వాదిగా పేరొందిన ప్రణబ్ గత ఏడాది నాగ్‌పూర్‌లో జరిగిన ఒక ఆరెస్సెస్ కార్యక్రమానికి హాజరు కావడం కొన్ని వర్గాల నుంచి విమర్శలకు దారితీసింది.

హజారికా సంగీతం.. అడవిపూల పరిమళం



అమ్మ లాలిపాటలు....అమాయక గిరిజనుల గళాల్లో పొంగులెత్తిన తీయతేనియ స్వరాలే తాను సంగీత ప్రపంచంలో అడుగుపెట్టడానికి స్ఫూర్తిదాయకమైనాయని చెప్పే భూపేన్‌హజారికా నేడు 'భారత రత్న'మై మెరిశారు. సుసంపన్న అసోం, ఈశాన్యప్రాంత జానపదాలను తన గళంలో సుమధురంగా పలికించి...వాటికి ప్రపంచవేదికపై ఓ ప్రత్యేక స్థానాన్ని కల్పించిన మహాగాయకుడాయన. కవిగా, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, నటుడిగా, రచయితగా, పాత్రికేయుడిగా, చిత్ర నిర్మాతగా సుప్రసిద్ధుడైన భూపేన్ ఇప్పుడు భౌతికంగా మన మధ్య లేకున్నా....ఆ స్వరం సంగీత ప్రపంచంలో అజరామరంగా నిలిచిపోయింది. అసోంలోని సదియాలో 1926లో జన్మించిన భూపేన్ చిన్నతనం నుంచే కవితలల్లే వారు. గంభీర కంఠస్వరంతో పాడేవారు. గువాహటి, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చదువుకున్న హజారికా ఆ తర్వాత కొలంబియా వర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. పన్నెండేళ్ల లేత వయసులో 1939లో తొలిసారిగా అసామీ చిత్రం 'ఇంద్రమాలతి'లో పాడటంతో ఆయన సంగీత జైత్రయాత్ర మొదలైందని చెప్పవచ్చు. అనేకానేక అస్సామీ, బెంగాలీ, హిందీ చిత్రాల్లో ఆయన పాడారు. చిత్రనిర్మాణం....చలన చిత్ర సంగీత దర్శకత్వమూ వహించారు. హిందీ చలన చిత్ర రంగాన్నీ తన సృజనతో ఉర్రూతలూగించారు. ప్రఖ్యాత చిత్రకారుడు ఎం.ఎఫ్‌హుస్సేన్ 'గజగామిని'....కల్పనా లాజ్మీ 'రుడాలీ' వంటి హిందీ సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. 'పద్మశ్రీ', సాహిత్యఅకాడమీ వంటి అనేకానేక పురస్కారాలు పొందారు. సంగీతనాటక్ అకాడమీ ఛైర్మన్‌గా పనిచేశారు. అసోం చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి మండలి, సెన్సారుబోర్డు సభ్యుడిగా ఉన్నారు. ప్రసారభారతి బోర్డు సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. అసోం శాసనసభ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. 2011 ఆయన భౌతికంగా మనను వీడిపోయినా....ఆయన విలక్షణ స్వరం మాత్రం చిరంజీవిగా మిగిలిపోయింది.

ఆరెస్సెస్ గుండెల్లో అమరజీవి నానాజీ దేశ్‌ముఖ్



'నానాజీ దేశ్‌ముఖ్'గా ఖ్యాతిగాంచిన చండికాదాస్ అమృత్‌రావ్ దేశ్‌ముఖ్ 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్'(ఆరెస్సెస్)గుండెల్లో అమరజీవిగా నిలిచిపోయారు 1916లో మహారాష్ట్రలోని హింగోలీలో జన్మించిన నానాజీ సికార్‌లో చదువుల అనంతరం 'బిట్స్'.. పిలానీలో చదువుకున్నారు. వెంటనే ఆరెస్సెస్‌లో చేరారు. ఆరెస్సెస్ సిద్ధాంతాల ప్రచారమే అంతర్లీన లక్ష్యంగా ఆయన దేశవ్యాప్తంగా 'సరస్వతి శిశు మందిర్' పాఠశాలలను స్థాపించారు. మధ్యప్రదేశ్‌లో దీన్ దయాళ్ పరిశోధనా సంస్థ, చిత్రకూట్ గ్రామోదయ విశ్వవిద్యాలయాలను నెలకొల్పారు. గ్రామోదయ వర్సిటీని తొలి గ్రామీణ విశ్వవిద్యాలయంగా పరిగణిస్తారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1974లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ ఉద్యమ రూపకర్తల్లో నానాజీ ప్రముఖంగా నిలిచారు. 1977లో జనతాపార్టీ ప్రభుత్వ ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారు. గతంలో ఆయనకు ప్రభుత్వం పద్మవిభూషణ్‌నిచ్చి సత్కరించింది. 2010లో 94 వయసులో నానాజీ చనిపోయారు.

రైళ్లలో కొనుగోళ్లకు బిల్లు

ఈనాడు, దిల్లీ: రైళ్లలో విక్రయించే ఆహార ధరల్లో పారదర్శకత కోసం ఐఆర్‌సీటీసీ బిల్లు యంత్రాల్ని (పాయింట్ ఆఫ్ సేల్-పీవోఎస్) తీసుకొచ్చింది. ఫలితంగా ప్రయాణికులు చెల్లించిన డబ్బుకు వెంటనే బిల్లు రావడం వల్ల ఏ ఆహార పదార్థానికి ఎంత చెల్లించాలనే విషయం ప్రయాణికులకు స్పష్టంగా తెలియనుంది. రైళ్లలో విక్రేతలు అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు వినియోగదారుల నుంచి ఫిర్యాదుల వస్తుండటంతో ఐఆర్‌సీటీసీ ఈ నిర్ణయం తీసుకొంది. ఆహార విక్రయ లైసెన్సుదారులంతా ప్రతి రైలులో కనీసం 8 పీవోఎస్ యంత్రాలు ఏర్పాటు చేసి, ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఐఆర్‌సీటీసీ ఆదేశించింది. ఇందుకోసం ఇప్పటిదాకా 2,191 యంత్రాలను అందుబాటులో ఉంచారు. వీటి వినియోగాన్ని పరిశీలించేందుకు ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 2 వరకు రైళ్లలో ఐఆర్‌సీటీసీ ప్రత్యేక తనిఖీలు చేపట్టనుంది.

మంచి ప్రభుత్వం

ప్రభుత్వమనేది ఎంత తక్కువ అధికారం చెలాయిస్తే అంత మంచిదన్నది నా ప్రగాఢ విశ్వాసం!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

26–1–2019 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
షష్ఠి: రా. 10.39 తదుపరి సప్తమి
హస్త నక్షత్రం: రా. 9.16 తదుపరి చిత్త
అమృత ఘడియలు: మ. 3.33 నుంచి 5.04
వర్జ్యం: ఉ.శే. 7.56 వరకు తిరిగి తె. 4.58 నుంచి 6.31 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6.38 నుంచి 8.07 వరకు
రాహుకాలం: ఉ. 9.00 నుంచి 10.30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-48

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విశాఖపట్నం	17.6	29.4
రాజమహేంద్రవరం	18.5	32.5
తిరుపతి	18.7	34.5
హైదరాబాద్	18.9	31.0
గుంటూరు	19.8	30.6
తాడేపల్లిగూడెం	20.0	29.0
విజయవాడ	20.0	30.1
నరసాపురం	21.0	30.6
నెల్లూరు	22.0	32.0

రికార్డుస్థాయిలో కౌలు రుణాలు

- బ్యాంకర్ల సాయంతో సత్ఫలితాలు సాధించాం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ ప్రశంస
- డిపాజిట్లకు మించి రుణాలు అందించడం అభినందనీయం: కుటుంబరావు

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో కౌలు రైతులకు రూ.5 వేల కోట్ల బ్యాంకు రుణాలు అందించడం దేశంలోనే ఒక రికార్డని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనిల్‌చంద్ర పునేఠ అన్నారు. రాష్ట్ర విభజనతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బ్యాంకుల సహకారంతో మెరుగైన ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు అంతర్జాతీయ సంస్థల నుంచి పురస్కారాలు లభించడమే దీనికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, బ్యాంకులు కలిసి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేయడంతో ఇది సాధ్యమైందన్నారు. భవిష్యత్తులోనూ బ్యాంకులు ఇలాగే సహకరించాలని కోరారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి సీఎస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వ శాఖలు కూడా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడం పట్ల అభినందనలు తెలిపారు.

వివిధ వినూత్న విధానాల అమలులో ఆంధ్రప్రదేశ్ అందరికీ ఆదర్శంగా నిలిచిందని ఆంధ్రా బ్యాంకు ఎండీ, రాష్ట్రస్థాయి బ్యాంకుల కమిటీ అధ్యక్షులు పకిరిసమి అన్నారు. 2018-19 వార్షిక రుణ ప్రణాళిక అమలులో గత సెప్టెంబరు నాటికి 1,47,075 కోట్ల రుణాలు అందించి 75.73 శాతం లక్ష్యం చేరుకున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 116 శాతం క్రెడిట్ డిపాజిట్ రేషియో ఉండటం రాష్ట్రంపై బ్యాంకులకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న డిపాజిట్లకు మించి రుణాలు అందించడం అభినందనీయమన్నారు. సమావేశంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టర్ సుబ్రతదాస్, నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్, ఆంధ్రా బ్యాంకు సర్కిల్ జనరల్ మేనేజర్ శివవరప్రసాద్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు ఎస్ఎస్ రావత్, బి.ఉదయలక్ష్మి, కె.దమయంతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ భూ కుంభకోణంలో..
ఆక్రమణదారులపై చర్యలకు సిద్ధం

ఈనాడు, అమరావతి: విశాఖ భూ కుంభకోణంపై విచారణ జరిపి సిట్ నివేదిక సమర్పించిన నేపథ్యంలో ఆక్రమణదారులపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకునేందుకు ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశం ద్వారా మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని విశాఖ జిల్లా అధికారులకు అధికారికంగా తెలియజేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలియవచ్చింది. ఆక్రమణలకు గురైన ప్రైవేట్ భూములను సంబంధిత వ్యక్తులకు అప్పగించేందుకూ చర్యలకు ఆదేశాలు జారీచేయనున్నట్టు సమాచారం.

జయహో బీసీ సభకు ఏర్పాట్ల పూర్తి

- ఉపముఖ్యమంత్రి చినరాజప్ప వెల్లడి


రాజమహేంద్రవరంలో బీసీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిమ్మకాయల చినరాజప్ప

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ నెల 27న నిర్వహించే జయహో బీసీ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో జరుగుతున్న సభ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో మాట్లాడారు. సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. బీసీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు వేదిక వద్దకు చేరుకుంటారన్నారు. బీసీల్లో ఉపకులాలకు చెందిన సంఘాల నాయకులందరినీ వేదికపైకి ఆహ్వానిస్తామన్నారు. ఇప్పటికే బీసీ నాయకులతో చంద్రబాబు నాయుడు సమావేశం ఏర్పాటు చేసి, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారన్నారు. ఈ వేదిక ద్వారా బీసీల ఉన్నతికి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. విజయనగరం జిల్లాలో సర్వే చేస్తున్న వారిపై వైకాపా వర్గీయులు దాడి చేయడం అమానుషమన్నారు.

సోమశిల-స్వర్ణముఖి రెండో విడతకు పచ్చజెండా

- రూ.1,953.5 కోట్లతో మొదటి దశతో కలిపి అంచనాల సవరణ
- 47 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు
- 3 చోట్ల జలాశయాలు, ఎత్తిపోతల, కాలువ నిర్మాణం

ఈనాడు-అమరావతి: సోమశిల-స్వర్ణముఖి లింకు కాలువ పనుల్లో రెండో విడత పనులూ చేపట్టేందుకు జలవనరులశాఖ పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా తెలుగు గంగ చీఫ్ ఇంజినీరు ప్రతిపాదించిన పనులను చేపట్టేందుకు పాలనామోదం ఇచ్చింది. సోమశిల ప్రాజెక్టులో అన్నం సంజీవరెడ్డి లింకు కాలువ రెండో విడత పనుల నిర్మాణంలో భాగంగా గ్రావిటీ కాలువ తవ్వాల్సి ఉంటుంది. మూడు చోట్ల బ్యాలెన్సింగ్ జలాశయాలు నిర్మిస్తారు. ఒక పంపుహౌస్ నిర్మించి నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. తొలి విడత పనులు 52 శాతం వరకు పూర్తయిన నేపథ్యంలో రెండో విడత పనులు చేపట్టేందుకు చీఫ్ ఇంజినీరు ప్రభుత్వ అనుమతి కోరుతూ లేఖ రాశారు. దీంతో పాటు తొలిదశ పనుల అంచనా సవరణలు, కొత్త పనులు కూడా కలిపి మొత్తం రూ.1,953.5 కోట్లకు అంచనాలు సవరిస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ రెండో విడత పనులు చేపట్టడం వల్ల నెల్లూరు జిల్లాలోని దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి, మర్రిపాడు మండలాల్లోని 47 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వవచ్చని జలవనరులశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం మీద రూ.461 కోట్లు అదనంగా ఖర్చవుతోంది.

ఈనాడు

ఓటుకు తూటు పడకుండా...

ప్రాగ్దిశాకాశంలో ఉదయించిన వినూత్న తారగా పండిత్ నెహ్రూ అభివర్ణించిన స్వతంత్ర భారత్ సర్వసత్తాక గణతంత్ర రాజ్యంగా నేడు డెబ్భయ్యోపడిలోకి అడుగిడుతోంది. గణతంత్ర దేశానికి జన తంత్ర పునాదిగా ఒక రోజు ముందే ఆవిర్భవించిన కేంద్ర ఎన్నికల సంఘం- పదిహేడో సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లను సమాయత్తపరుస్తూ, తాజా జాబితాలో పేర్లు ఉన్నదీ లేనిదీ పరిశీలించుకోవాలని పిలుపునిస్తోంది. ప్రతి ఎన్నికకు ప్రతి ఒక్కరికీ చేరువ చెయ్యడమే లక్ష్యమంటూ ఎలెక్షన్ కమిషన్ (ఈసీ) ఎంతగా చెబుతున్నా, తప్పుల తడకగా రూపొందుతున్న ఓటర్ల జాబితాలు లక్షలాది పౌరుల్ని వారి పౌరహక్కుకు దూరం చేస్తున్న దారుణ దృశ్యాలుగా కళ్లకు కడుతూనే ఉంది. మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల నాటికి 21 ఏళ్లు నిండిన వయోజనులంతా ఓటుహక్కు పొందినవారు 17.3 కోట్ల మంది. వచ్చే ఎన్నికల నాటికి ఓటర్లసంఖ్య అంతకు ఐదింతలకు పైగా ఉండబోతుందని కేంద్ర ఎన్నికల సంఘమే చెబుతోంది. ఓటర్ల చేతిలో ఫొటో గుర్తింపు కార్డు, పోలింగ్ కేంద్రంలో ఎలెక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం- ఈ రెండూ ఈసీ స్వర్ణోత్సవ లక్ష్యాలని నిర్వచన్ సదన్ 2001లో ప్రకటించింది. ఓటింగ్ యంత్రాల విశ్వసనీయతపై విపక్ష శిబిరం విమర్శలు దీర్ఘకాలంగా చెవిన పడుతుంటే, చేతిలో ఫొటో గుర్తింపు కార్డు ఉన్నా జాబితాలో పేరు లేదన్న కారణంగా ఓటుహక్కు వినియోగించుకోలేకపోతున్నవారి గోడు- ఈసీ సామర్థ్యాన్నే ప్రశ్నార్థకం చేస్తోంది. ఇప్పటికే 16 సార్వత్రిక ఎన్నికలు, 375 దాకా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన ఈసీ అనుభవం- ఓటర్ల జాబితాల సక్రమ కూర్పు విషయంలో పదేపదే ఎందుకు విఫలమవుతోంది? అర్హులైన ఓటర్లు ఎవరూ జాబితాల నుంచి జారిపోకుండా అడ్డదారిన బోగస్ ఓట్లు పోగుపడకుండా, ఈసీ జాగ్రత్త వహించాలని ప్రధాన ఎలెక్షన్ కమిషనర్లే ఎన్నోసార్లు కర్తవ్యబోధ చేస్తున్నా- బండి గాడిన పడితే ఒట్టు. ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలన్న పిలుపులు సరే, నిబద్ధ ఓటర్ల భాగస్వామ్యాన్ని నిలబెట్టే కర్తవ్యనిష్ఠ ఈసీ చొరవలో ప్రస్ఫుటం కావాలిప్పుడు!

'ఏవో హత్యాయత్నాలతో ప్రజాస్వామ్యం మృత్యువాత పడే అవకాశం లేదు. కానీ ఉదాసీనత, నిర్లక్ష్యం, జాగ్రత్త పెంచి పోషించుకోలేకపోవడం వల్ల ప్రజాస్వామ్యం క్రమేణా కనుమరుగైపోతుంది'- రాబర్ట్ హచిన్స్ అనే అమెరికన్ తత్వవేత్త సూత్రీకరణ అది. కోట్లాది జనం అవిరళ త్యాగాల ఫలంగా పొందిన స్వాతంత్ర్యం- సమన్యాయం, సమధర్మం ప్రాతిపదికలపై అందరి అభివృద్ధికీ మేలు బాటలు పరవాలనే సదాశయంతోనే ఒక ఓటు- ఒకే విలువ సూత్రంగా భారత ప్రజాతంత్రం పురుడుపోసుకుంది. అసలు ఓటు అంటే ఏమిటో మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలు తెలియజేసింది, నిరక్షరాస్యులతంగా సంపూర్ణ అవగాహనతో ఓటేయడం రెండో ఎన్నికల నాటికే ఓటర్లకు అలవడిందని లోగడ ఈసీయే ఘనంగా చాటింది. తొలి ఓటర్ల జాబితా తయారీ సందర్భంగా యూపీ, బిహార్ లాంటిచోట్ల స్త్రీలు తమ పేర్లు చెప్పకుండా ఫలానా వ్యక్తి భార్య, కూతురు అని నమోదు చెయ్యాలని కోరిన వైనాల నుంచి, జాబితాలో తమ పేరు ఎందుకు మాయమైందని నిలదీసేంతగా మహిళల్లోనూ చైతన్యం ప్రభవించింది. జన చైతన్యానికి తగ్గట్లుగా నయా సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటుతో ఓటర్ల జాబితాల్ని పటిష్ఠీకరించడంలో ఈసీ వైఫల్యం- ప్రజాస్వామ్యంపట్ల నమ్మకాన్ని ఖర్చు రాసేస్తోంది. ఇటీవలి తుది జాబితా ప్రచురణలోనూ తప్పులు కుప్పలు పోగుపడటం ప్రజాస్వామ్య హితైషుల్ని కలవరపరుస్తోంది. మరింత మెరుగైన పనితీరుకు భరోసా ఇస్తూ నాలుగేళ్ల (2018-2022) కార్పొరేట్ ప్రణాళికతో ఆస్ట్రేలియా ఎన్నికల సంఘం ముందుకొచ్చిన తీరు నిర్వాచన్ సదన్ పెద్దలకు మార్గదర్శకం కావాలి. స్వయంప్రతిపత్తిని ఏకరువు పెట్టడం కాదు, సాంకేతిక మేళవింపుతో సృజన పరిష్కారాలకు సంకల్పించాలి!

ఓటర్ల జాబితాల కూర్పు- ఎన్నికల సంఘానికి రాజ్యాంగబద్ధంగా దఖలుపడిన విధి. ప్రతి వెయ్యి జనాభాకు ఓటర్ల జాతీయ సగటు 689; అది కొన్నిచోట్ల వెయ్యికి మించిపోవడం ప్రజాస్వామ్యాన్ని క్రూరంగా పరిహసిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం పోకడ ఇది కాగా, అత్యంత ప్రాచీన జనస్వామ్య దేశంగా రాణకెక్కిన అమెరికాలో దాదాపు మూడోవంతు మందికి అసలు ఓటు హక్కునే నమోదు కాని విడ్డూరం దాని ప్రతిష్ఠకు తూట్లు పొడుస్తోంది. ఓటరు నమోదు ప్రక్రియను ఆధునికీకరించి- అర్హులైన ఓటర్లందరూ, కేవలం అర్హులే జాబితాలో ఉండేలా అమెరికన్ చట్టసభ చొరవ చూపుతోంది. ఓటర్ల నమోదులో 92 శాతం రికార్డు సాధించిన ఆస్ట్రేలియా- ఓటరు జాబితాల క్రియాశీల నిర్వహణ ద్వారా అర్హులందరికీ పోలింగ్ సేవలను సమర్థంగా అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఇటీవల వెలుగుచూసిన ప్రజాస్వామ్య సూచీలో- మొత్తం 167 దేశాల జాబితాలో అమెరికా 25వ స్థానంలో, ఇండియా 41వ స్థానంలో నిలిచాయి. పూర్తిస్థాయి ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్న తొలి 20 దేశాల్లో ఆస్ట్రేలియా న్యూజిలాండ్ చోటు దక్కించుకోగా, తప్పుల తడక జనస్వామ్య దేశాల జాబితాలో ఇండియా ఈసురోమంటోంది. జాతీయ స్థాయిలో పౌరులందరి సమాచార నిధిని నిర్వహిస్తున్న స్వీడన్- ఓటర్ల నమోదు ప్రక్రియను యాంత్రికంగా కానిచ్చేస్తుంటే, ఒక రాష్ట్రానికి చెందిన పౌరుడు ఎక్కడి నుంచైనా ఓటు వేసే అవకాశాన్ని ఆస్ట్రేలియా కల్పిస్తోంది. కేవలం సొంత ఊళ్లో లేనందువల్ల 2014 ఎన్నికల్లో ఏకంగా 28 కోట్లమంది ఓటుహక్కు వినియోగించుకోలేక పోయిన దేశం మనది. పౌరుల అస్తిత్వానికి చిహ్నంగా మారిన ఓటు విలువను మొదట ఈసీ గుర్తించాలి. అర్హులైన ఓటర్లంతా స్వేచ్ఛగా సక్రమంగా తమ హక్కు వినియోగించుకోవడంలో ఎలాంటి అవరోధాలు లేకుండా ఎన్నికల సంఘమే కాచుకోవాలి!

అసమానతలతో సప్తపది!

ఏథెన్స్ యువతను తన బోధనలతో తప్పుదారి పట్టిస్తున్నారన్న కారణంతో గ్రీకు తత్వవేత్త సోక్రటీస్‌కు అప్పటి ప్రభుత్వం మరణశిక్ష విధించింది. శిక్ష తేదీ దగ్గరపడుతున్న తరుణంలో జైల్లో ఉన్న సోక్రటీస్ వద్దకు ఆయన చిర కాల మిత్రుడు క్రిటో వెళ్ళాడు. ఏథెన్స్ ప్రభుత్వం అన్యాయంగా ఆయనను ఇరికించిందని, సోక్రటీస్ జైలునుంచి తప్పించుకుపోవడానికి సకల ఏర్పాట్లూ చేశానని, మరో మాట లేకుండా పారిపోవాలని గ్రీక్ తత్వవేత్తకు క్రిటో సూచిస్తాడు. సోక్రటీస్ ఆ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. 'నా మీద మోపిన అభియోగాలు తప్పా, ఒప్పా అన్న చర్చ ఇప్పుడు అనవసరం. ఏథెన్స్ ప్రభుత్వం నన్ను దోషిగా తీర్మానించి, శిక్ష విధించింది. చట్టాలు, నిబంధనలను నా వంటివారే ధిక్కరిస్తే ఇక ఏథెన్స్ నడిచేదెట్లా? ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి చట్టాలకు సొడ్డుకొడితే... ప్రభుత్వ పాలన తలకిందులవుతుంది. వ్యవస్థల మనుగడకు అది ప్రమాదకరం. కాబట్టి నన్ను శిక్ష అనుభవించనివ్వు!' అని జవాబిచ్చిన సోక్రటీస్ చట్ట ఉల్లంఘన కన్నా మరణంవైపే మొగ్గుచూపారు! మితిమీరిన వ్యక్తిపూజ భారతావనిలో పాలన వ్యవస్థలను, ప్రజాస్వామ్యాన్ని గుల్లబారుస్తున్న పరిస్థితుల్లో- చట్టాలకు కట్టుబాటు చాటుతూ సుమారు 2,400 సంవత్సరాల క్రితమే గ్రీకు రాజ్యంలో వెల్లివిరిసిన నిబద్ధత ఆశ్చర్యపరచకమానదు. సువిశాల భారతావని నేడు సప్తపదుల గణతంత్ర పర్వదినం జరుపుకొంటోంది. 'భారత ప్రజలమైన మేము ఈ దేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా తీర్చిదిద్దడానికి కృతనిశ్చయులమై ఉన్నాం' అంటూ రాజ్యాంగ పీఠికలో గుదిగుచ్చిన సదాశయాలు ఏమేరకు సాకారమయ్యాయన్న నిష్పాక్షిక ఆత్మ సమీక్షే రిపబ్లిక్ దినోత్సవాన్ని అర్థవంతం చేస్తుంది.

వ్యవస్థలకు సరికొత్త సవాళ్లు

ప్రజల అభిమతమే ప్రభుతకు సరైన పునాది కావాలని రాజ్యాంగ నిర్మాతలు లక్షించారు. కానీ అందుకు భిన్నంగా ప్రభుత్వాలు కొందరి పెత్తనంగా మారి, ప్రజాస్వామ్యం మరీచికగా మిగలడంతో రాజ్యాంగంలోని లోపాలవల్లే ఇన్ని సమస్యలూ తలెత్తాయన్న వాదనలు మొదలయ్యాయి. రాజ్యాంగం సక్రమంగా ఉందని, కానీ దాన్ని అమలు చేసేవాళ్లలోనే లోపముందని ఇంకొందరు ఆ వాదనకు ఎదురు నిలిచారు. ఈ విచికిత్స నేపథ్యంలోనే రాజ్యాంగాన్ని అవసరాలకు అనుగుణంగా మార్చుకొనే ప్రయత్నాలు మొదలయ్యాయి. 60 దేశాల రాజ్యాంగాలను పరిశీలించి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ సారథ్యంలో ప్రాణంపోసుకున్న సంవిధానానికి ఇప్పటికి 103 సవరణలు చేశారు. అవసరార్థం రాజ్యాంగాన్ని సవరించే వెసులుబాటును రాజ్యాంగ నిర్మాతలే కల్పించారు. అయిదో దశకంలో శంకరిప్రసాద్, ఆరో దశాబ్దంలో సజ్జన్‌సింగ్ కేసుల్లో- 368 నిబంధన కింద రాజ్యాంగాన్ని సవరించే సమయంలో పార్లమెంటు రాజ్యాంగ సభలా వ్యవహరించవచ్చునని, కాబట్టి దాన్ని ఏ స్థాయిలోనైనా మార్చే అధికారం ప్రభుత్వానికి ఉందని న్యాయస్థానాలు తీర్పిచ్చాయి. కానీ అనంతరం గోలక్‌నాథ్ కేసు తీర్పులో రాజ్యాంగ సవరణలు సైతం చట్టాల వంటివే కాబట్టి- వాటిని సమీక్షించి అందులోని రాజ్యాంగ బద్ధతను నిర్ణయించే అధికారం కోర్టులకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో మార్పులు తెచ్చేలా సవరణలు ఉండరాదని 1973లో కేశవానంద భారతి కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే మౌలిక స్వరూపం అంటే ఏమిటన్న విషయంలోనే పూర్తి స్పష్టత లేదు. వ్యక్తి స్వేచ్ఛ, స్వపరిపాలన, చట్టబద్ధ పాలన, వయోజన ఓటు హక్కు, న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి, స్వేచ్ఛాయుత ఎన్నికలు, బహుళ పార్టీ వ్యవస్థ వంటివే ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్నాయి కాబట్టి వాటికి సంబంధించి సవరణలు చేయడానికి అవకాశం లేదని రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం. అయితే జవాబుదారీతనం కొరవడిన, బాధ్యతలేని ప్రభుత్వాల పాలబడి రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు అడుగడుగునా అపహాస్యం పాలవుతున్నాయి. ఏడు దశాబ్దాల రాజ్యాంగ ప్రస్థానగతిలో ఇష్టంలేని రాష్ట్రాలకు పూచికపుల్లపాటి విలువ ఇవ్వని కేంద్ర ప్రభుత్వాలను, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను ఒక్క కలం పోటుతో నేలకూల్చిన ఢిల్లీ పెద్దలను చూశాం! కోట్ల సంఖ్యలో కేసులు పేరుకుపోయి కోర్టుల్లో న్యాయ నిర్ణయం అసాధ్యంగా మారిన వైనం మన కళ్లముందుంది. అధికార కేంద్రీకరణ మితిమీరి నీరవ్ మోదీలు, విజయ్‌మాల్యాలు, మెహుల్ చోక్సీలకు దోచిపెడుతున్న ప్రభుత్వాలను చూస్తున్నాం. సాక్షాత్తు సుప్రీంకోర్టు న్యాయమూర్తులే వ్యవస్థీకృత అవకతవకలను తూర్పారపడుతూ మీడియా సమావేశాలు నిర్వహించడమూ ఇటీవలి ముచ్చటే. కొందరు వ్యక్తులు వ్యవస్థలకే సవాలు విసిరే స్థాయికి ఎదిగారంటే అది వారి బలంకన్నా ప్రభుత్వాల బలహీనతగానే భావించాల్సి ఉంటుంది. రాజ్య వ్యవస్థ కేవలం కొందరి ఆస్తులు, ఆధిపత్యాన్ని కాపాడేందుకు మాత్రమే పూనుకొంటే- రాజ్యాంగంలో ప్రవచించిన సంక్షేమ రాజ్య భావన బూటకంగా మారిందనే అర్థం. రాజకీయ ప్రజాస్వామ్యం ద్వారా ప్రతి మనిషికీ సమాన విలువనిచ్చే సురాజ్య సాధనను లక్షించిన ఆదేశిక సూత్రాలకు ప్రభుత్వాలు పూచికపుల్లపాటి విలువైనా ఇవ్వడం లేదు. సామాజిక, ఆర్థిక గమనంలో బలహీనులు, బహిష్కృతులు, తిరస్కృతుల హక్కులకు భరోసా కల్పించి; వారి ఎదుగుదలకు నిచ్చెనమెట్టుగా ఉపయోగపడటమే స్వాతంత్ర్యానంతర భారతావని అందిపుచ్చుకోవాల్సిన సరికొత్త విలువగా రాజ్యాంగం తీర్మానించింది. సంక్షేమ రాజ్య సాకారాన్ని ఆకాంక్షిస్తున్న రాజ్యాంగంలోని నాలుగో భాగంలో ఉన్న ఆదేశిక సూత్రాలను- ప్రాథమిక హక్కుల తరహాలో న్యాయస్థానాలకు వెళ్ళి సాధించుకోవడం కుదిరేపనికాదు. ప్రభుత్వాల నడవడికి, పురోగతికి దారిదీపాలుగా అక్కరకొచ్చే ఆదేశిక సూత్రాలపట్ల డెబ్బయ్యేళ్ల గణతంత్ర భారతావని ప్రస్థానంలో ఏ దశలోనూ ప్రజాప్రతినిధులవైపునుంచి సద్వివేచన వ్యక్తం కాకపోవడం గమనార్హం!



డెబ్బయ్యోపడిలో భారత గణతంత్రం

సమస్యలపై మరో సమరం

'కష్టపడ్డాం.... స్వాతంత్ర్యం సాధించాం. ఇకమీదట ప్రతి చిన్న సమస్యకూ బ్రిటిష్‌వారిని సాకుగా చూపే అవకాశాన్ని మనం కోల్పోయినట్లే. మున్ముందు ఏ తప్పు జరిగినా అందుకు పూర్తిగా మనమే బాధ్యులం. మునుపటిలా నెపం మరొకరి మీదకు నెట్టివేయడం కుదరదు... దేశంకన్నా మత విశ్వాసాలకు ప్రజలు మొదటి ప్రాథమ్యం ఇస్తారా లేక మతానికంటే ఒక్క మెట్టుపైనే దేశాన్ని నిలబెడతారా? ఏం జరగబోతోందో నాకు తెలియదు. కానీ ఒకటి మాత్రం నిజం. దేశాన్ని పక్కనపెట్టి జనం మతం వెనక పరిగెడితే మాత్రం భారతావని రెండోసారి స్వాతంత్ర్యాన్ని బహుశా శాశ్వతంగా కోల్పోతుంది'- అంబేడ్కర్ చేసిన ఈ హెచ్చరిక చాలామందికి ఎరుకలో కూడా లేదు కాబట్టే దేశం ఇప్పుడు సంక్షోభాల నడుమ ప్రస్థానిస్తోంది. స్వాతంత్ర్య సమరంనాటితో పోలిస్తే అంతకన్నా తీవ్రమైన పోరాట దశలో దేశం ప్రస్తుతం కొనసాగుతోంది. ఆకలి, దారిద్ర్యం, అవిద్య, అజ్ఞానంపై పోరాటం- స్వాతంత్ర్య సాధనోద్యమం కన్నా కీలకమైనది. సురాజ్య నిర్మాణం చాలా మెలకువతో, ఎంతో విజ్ఞతతో జరగాల్సిన ప్రక్రియ. తొలి దశలో ప్రతి హక్కూ ఆకాంక్షగానే మొదలవుతుంది. ఆ తరవాత అది ఉద్యమ రూపం తీసుకొని ప్రభుత్వాలను కదిలించి చట్టంగా మారి హక్కుగా స్థిరపడుతుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాల ప్రాతిపదికగా వ్యవస్థల నిర్మాణం జరగాలని రాజ్యాంగ అవతారికలో ఆదర్శం ప్రకటించారు. ఏడు దశాబ్దాల కాలంలో సమాజం సాధించుకున్న నాగరికతా ప్రమాణాలకు రాజ్యాంగ విలువలు సూచికగా నిలుస్తాయి. కనిష్ఠ ప్రభుత్వం, గరిష్ఠ పాలన దిశగా అడుగుల వడి పెరగాల్సిన తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ గ్రామ పంచాయతీలకు ఆచరణలో సంపూర్ణంగా బాధ్యతలను బదిలీ చేయకపోవడం ఆందోళనకరం. వికేంద్రీకరణను ఆదర్శంగా మాత్రమే కాకుండా చట్టరీత్యా ఆమోదించక తప్పని కర్తవ్యంగా ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. పంచాయతీ రాజ్ సంస్థలను సిసలైన స్వపరిపాలనకు ప్రతీకలుగా రూపుదిద్దే కృషి ఏనాడో ఆగిపోయింది. స్థానిక సంస్థలకు నిధులు, విధుల బదలాయింపునకు సంబంధించి రాష్ట్ర స్థాయుల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకత- ఆదర్శాలు ఆచరణ మధ్య వైరుధ్యాన్నే వెల్లడిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని వేధిస్తున్న అనేక సమస్యలకు గరిష్ఠ ప్రజాస్వామ్యంతోనే పరిష్కారాలు సాధ్యపడతాయన్న స్పృహ ప్రభుత్వాల్లో ఇప్పటికీ మొగ్గతొడగకపోవడమే విషాదం!

సమీక్షలతో బలోపేతం

కోట్లాది ప్రజల అవసరాలను తీర్చగల దేశమాతకు ఏ ఒక్కరి దురాశనూ భరించగల శక్తి లేదని జాతిపిత బాపూజీ ఆరున్నర దశాబ్దాల క్రితమే ఉద్ఘాటించారు. అత్యంత కీలకమైన రాజకీయ, అధికార స్థానాల్లో వందల మంది అత్యాశపరులు కుదురుకుని దేశ సంపదను కొల్లగొడుతున్న ప్రస్తుత దుస్థితి ప్రజాజీవనంలో నైతిక విలువల పతనానికే అద్దం పడుతోంది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), 'కాగ్' వంటి వ్యవస్థలను సైతం అపహసించే దుస్సంస్కృతి దేశంలో ప్రబలుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం స్వరాజ్య సాధనకు ప్రతీకగా నిలిస్తే, గణతంత్ర వేడుక సురాజ్య స్థాపనకు స్ఫూర్తి పతాకగా భాసిల్లాలి. ప్రపంచంలో అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా బ్రిటన్‌ను తోసిరాజని భారత్ ఠీవిగా కొలువుతీరినప్పటికీ- అభాగ్యజనం నికర పరిస్థితిలో చెప్పుకోదగిన మార్పేమీ లేదు. 2018లో దేశ జనాభాలో ఒక శాతంగా ఉన్న ధనవంతుల వద్ద దేశ సంపదలో సగానికిపైగా పోగుపడి ఉందని, ప్రతి రోజూ వారి సంపద సగటున రూ.2200 కోట్లు పెరుగుతోందన్న ఇటీవలి 'ఆక్స్‌ఫామ్' నివేదిక విస్తరిస్తున్న అంతరాలు, అసమానతలకు దర్పణం పట్టింది. మరోవంక దేశంలోని సుమారు 13.6 కోట్ల మంది అత్యంత నిరుపేదలు గడచిన 14 ఏళ్లుగా అంతకంతకూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నట్లు ఆ నివేదిక వెల్లడించింది. ఇదే పరిస్థితి కొనసాగితే సామాజిక, ఆర్థిక వ్యవస్థలు మరెంతో కాలం మన్నవు. దేశంలో నానాటికీ పెరుగుతున్న ఆత్మహత్యలు, వర్గవైషమ్యాలు- ఆదేశిక సూత్రాల సారాన్ని ఆకళింపు చేసుకొని చట్టాలను కూర్చడంలో ప్రభుత్వాల వైఫల్యానికే దర్పణం పడుతున్నాయి. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మూలస్తంభాలుగా ఆవిర్భవించిన రాజ్యాంగ ఆదర్శాలను పౌరులందరికీ మేలు చేకూర్చేలా అమలు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మూడుశాతంగా ఉన్న వృద్ధి రేటు తొమ్మిదో దశకానంతరం ఆరుశాతానికి ఎగబాకడానికి సస్య, శ్వేత, టెలికం, ఐటీ విప్లవాల వంటివి కారణమనడంలో సందేహం లేదు. అయితే సామాన్యుల సంపూర్ణ పురోగతికి అవసరమైన మౌలిక సౌకర్యాల ఏర్పాటులో మాత్రం డెబ్బయ్యేళ్ల గణతంత్ర భారతావని పనితీరు అధ్వానంగా ఉంది. సగటు పౌరుల జీవన హక్కులకు భరోసా పలుకుతూ రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల స్ఫూర్తికి పట్టం కట్టాల్సిన ప్రభుత్వాలు ఏడు దశాబ్దాలుగా గాడితప్పడంవల్లే మానవాభివృద్ధి సూచీల్లో భారత్ ఇప్పటికీ అట్టడుగు స్థానాల్లో మగ్గుతోంది. ప్రాగ్దిశాకాశంలో ఆవిర్భవించిన వినూత్న తారగా పండిత నెహ్రూ అభివర్ణించిన స్వేచ్ఛాభారతి- సామాజిక, ఆర్థిక అంతరాలను పరిమార్చలేక ఇప్పటికీ ఆపసోపాలు పడుతోందంటే అది దార్శనికత కొరవడిన నాయకుల దుష్పరిపాలన ఫలితమే! నైతిక దివాలాకోరుతనం నేడు జాతిని వెనక్కి నడిపిస్తున్న అతిపెద్ద సమస్య. రాజకీయ పక్షాల్లో నైతిక ప్రవర్తన నియమావళి, ప్రజాబాహుళ్యంలో పౌరబాధ్యత, అధికార యంత్రాంగంలో సుపరిపాలన స్ఫూర్తి కొరవడటంతో జాతి పాలనసౌధం బీటలు వారుతోంది. వ్యక్తిస్వేచ్ఛకు పట్టంకడుతూ దేశాభివృద్ధికి బాటలు పరవడమెలాగన్న విషయంలో ఇప్పటికే ఎంతో చర్చ జరిగింది. రాజకీయ పార్టీలను ప్రజాస్వామ్యీకరించి, ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళించి, పాలనలో పారదర్శకతకు చోటుపెట్టడం ద్వారానే గుణాత్మక మార్పును సాకారం చేయాలి. 'సమున్నత ఆశయ ప్రకటనల్ని బట్టి కాదు... వాటి అమలుకు కచ్చితంగా తీసుకున్న చర్యల్ని బట్టే మన పనితీరు నిగ్గుతేలుతుంది' అన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటలే గీటురాళ్లుగా ఏడు దశాబ్దాల ప్రస్థానగతిని సమీక్షించుకోవాలి. జాతి నవనాడులనూ బలహీనపరుస్తున్న అవ్యవస్థలకు ప్రజా చేతనే ద్వారానే అగ్నిసంస్కారం జరపాలి. భారతావనిని అగ్నిపునీతగా నిగ్గుతేల్చాలి. అప్పుడే గణతంత్ర దినోత్సవం... నిజమైన సంబరమవుతుంది!

– ఉల్చాల హరిప్రసాదరెడ్డి

విద్యుత్ కష్టాలకు విరుగుడు

ఒకే దేశం ఒకే పన్ను నినాదంతో వస్తుసేవల పన్నును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం, గృహ వినియోగదారుల కోసం దేశమంతటా ఒకే స్థాయి విద్యుత్ రుసుము(ఛార్జీ)లను వసూలు చేయాలనే డిమాండ్ వినవస్తోంది. నగరాల్లో నివసిస్తున్న కుటుంబాలకు రుసుములు తడిసి మోపెడవుతున్న దృష్ట్యా ఈ వాదన క్రమంగా బలం పుంజుకొంటోంది. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ విద్యుత్ లభ్యత, దాని ఛార్జీలు చర్చకు వస్తున్నాయి. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా విద్యుచ్ఛక్తి విధానాలు దేశమంతటా ఒకే తీరున ఉండాలని నిర్దేశించింది. ప్రైవేటు సరఫరాదారులూ ఉన్న మహారాష్ట్ర, గుజరాత్ మినహా ఇతర రాష్ట్రాలు దాదాపు ఒకే టారిఫ్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. విద్యుత్తును అధికంగా వినియోగించే రంగాలకు ఎక్కువ ఛార్జీలను వసూలు చేసి, దిగువ శ్రేణి వినియోగదారులకు తక్కువ తీసుకునే క్రాస్ సబ్సిడీ విధానానికి స్వస్తి చెప్పి అందరికీ ఒకే మొత్తం వసూలు చేయాలనే డిమాండ్ బలంగా వస్తోంది. నేడు 3.50 లక్షల మెగావాట్ల స్థాపిత సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్లతో ఏర్పడిన జాతీయ గ్రిడ్ విద్యుత్ విపణిని శాసిస్తోంది. బొగ్గు, సహజవాయువు, అణు, పునరుత్పాదక వనరుల నుంచి విద్యుత్తును తయారుచేసే సంస్థలు గ్రిడ్‌కు కరెంటును సరఫరా చేస్తాయి. అక్కడి నుంచి వ్యవసాయం, రైల్వే వంటి వినియోగదారులకు విద్యుచ్ఛక్తి సరఫరా అవుతుంది. అధిక వినియోగదారులు ఎక్కువ ఓల్టేజీతో కరెంటును తీసుకుంటే దిగువ శ్రేణి వినియోగదారులు 230 ఓల్టేజీ కరెంటును తీసుకుంటారు. ప్రస్తుతం అధిక వినియోగానికి అధిక ధర వసూలు అసంతృప్తికి దారితీస్తోంది. వ్యవసాయ వినియోగదారులకు ప్రభుత్వాలు రాయితీ ఇస్తున్న సంగతి తెలిసిందే.

నష్టాల ఊబిలో డిస్కమ్‌లు

ప్రస్తుతం 2003 విద్యుత్ చట్టానికి అనుగుణంగా విద్యుత్ ఛార్జీలు నిర్ణయిస్తున్నారు. మరుసటి సంవత్సరానికి వసూలు చేయాల్సిన ఛార్జీల గురించి విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) సమర్పించే ప్రతిపాదనలను దాదాపు 30మంది నియంత్రణదారులు పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. ఇలాంటి పద్ధతి మరే దేశంలోనూ లేదు. దీనివల్ల డిస్కమ్‌లు నిరంతరం నష్టాల్లోనే ఉంటున్నాయి. బ్యాంకు వడ్డీరేటు 14 శాతంగా ఉన్న రోజుల్లో నిర్ణయించిన ధరలను, ఇప్పుడు బ్యాంకు రేటు తొమ్మిది శాతానికి దిగినా యథాతథంగా కొనసాగిస్తున్నందువల్ల వినియోగదారులు నష్టపోతున్నారు. డిస్కమ్‌లకూ నష్టాలు పెరుగుతున్నాయి. వాటికి రుణాలిచ్చిన బ్యాంకులకు నిరర్థక ఆస్తులూ ఎక్కువ అవుతున్నాయి. ధరల నిర్ణయ విధానాన్ని, విద్యుత్ సరఫరా విధానాన్ని సవరించి వినియోగదారులకు ప్రయోజనం కల్పించాలి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో గృహ వినియోగదారుల (24 కోట్లు) సంఖ్యే ఎక్కువ. వీరు 24 శాతం విద్యుత్తును ఉపయోగిస్తున్నారు. గృహ వినియోగదారులు సగటున నెలకు 180 యూనిట్లు వాడుతున్నారు. యూనిట్ సగటు ధర అయిదు రూపాయలు కాబట్టి ప్రతి కుటుంబం నెలకు సగటున రూ.900 చొప్పున విద్యుత్ బిల్లు కడుతోంది. ఈ బిల్లు పరిమాణం రాష్ట్రానికి, రాష్ట్రానికి మారుతోంది. అండమాన్, గోవా, డయ్యూడామన్‌లలో యూనిట్‌కు మూడు రూపాయలు వసూలు చేస్తుంటే, ముంబయిలో రిలయన్స్ వంటి ప్రైవేటు సంస్థలు ఏకంగా రూ.12 వసూలు చేస్తున్నాయి. ఈ మధ్య ఎల్ఈడీ బల్బులు వచ్చినప్పటి నుంచి తలసరి వినియోగం తగ్గుతోంది. విద్యుదుత్పాదనకు వస్తే ఎన్టీపీసీ ఏటా 47,200 మెగావాట్లు ఉత్పత్తి చేస్తోంది. ఇతర కేంద్ర విద్యుత్ సంస్థలను కలుపుకొంటే ఉత్పాదన దాదాపు 60,000 మెగావాట్లకు చేరుతుంది. ఇవన్నీ కలిసి 90 శాతం వినియోగ సామర్థ్యంతో యూనిట్ విద్యుత్తును రూ.2.90కు ఉత్పత్తి చేస్తున్నాయి. రాష్ట్రాల్లో పాత విద్యుదుత్పాదన కేంద్రాలు మూడు రూపాయలకు ఉత్పత్తి చేస్తున్నాయి. భాక్రానంగల్ వంటి జలవిద్యుత్ కేంద్రాలు, ఈశాన్య భారతంలోని కేంద్రాలు కొన్ని పైసలకే విద్యుదుత్పాదన సాగిస్తున్నాయి. ఈ విద్యుత్తును గృహ వినియోగదారులకు యూనిట్ నాలుగు రూపాయల చొప్పున అందించవచ్చు. జాతీయ విద్యుత్ పంపిణీ సంస్థ వంటిది ఏర్పాటుచేసి ఇలా సరసమైన ధరకు విద్యుత్తును సరఫరా చేస్తే రాష్ట్రాలకు, చిన్న వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది. విపణిలో గిరాకీ పెరిగి విద్యుత్ రుసుములు తగ్గుతాయి. అది దేశంలో ఎనిమిది శాతంగా ఉన్న వాణిజ్య వినియోగదారులకు మేలు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే సుంకాలు, సెస్సులలో 75 శాతాన్ని నేరుగా వ్యవసాయ రాయితీలకు వెచ్చించడం వీలవుతుంది. బడ్జెట్ కేటాయింపులపై ఒత్తిడి తగ్గుతుంది.



ధర దిగివచ్చే మార్గం

ప్రైవేటు రాకతో లాభాలు

ఇప్పటికే రైల్వేల వంటి భారీ వినియోగదారులు డిస్కమ్‌ల పరిధి నుంచి తప్పుకొంటున్నాయి. ప్రైవేటు ప్లాంట్లతో బేరమాడి, విద్యుత్ ప్రసార ఖర్చులను భరించి తక్కువ ధరకే విద్యుత్తును సమకూర్చుకొంటున్నాయి. దీని వల్ల ప్రభుత్వాలు వ్యవసాయానికి, గృహాలకు తక్కువ ఛార్జీలకు విద్యుత్తు అందించడంపై దృష్టి కేంద్రీకరించగలుగుతాయి. ఉత్తరోత్రా ఒకే దేశం, ఒకే విద్యుత్ ఛార్జీ విధానానికి మారడం సులువవుతుంది. ఇంకా చెప్పాలంటే జర్మనీలో మాదిరిగా విద్యుదుత్పాదన సంస్థలే వినియోగదారులకు డబ్బు చెల్లించే రోజు రావచ్చు. గిరాకీని మించి విద్యుత్ ఉత్పత్తి అయినప్పుడు విద్యుత్ ప్లాంట్లను తాత్కాలికంగా మూసివేసి మళ్ళీ గిరాకీ పెంచుకోవచ్చు. కానీ, ప్లాంట్లను తిరిగి ప్రారంభించడానికి బాగా ఎక్కువ ఖర్చవుతుంది కాబట్టి వినియోగదారులకు ఉచితంగానో, తక్కువ ధరలకో విద్యుత్ విక్రయించే పద్ధతి జర్మనీలో అమలవుతోంది. పునరుత్పాదక వనరుల నుంచి విద్యుదుత్పాదన పెరిగిన కొద్దీ భారత్‌లోనూ ఇదే విధానాన్ని చూసే రోజు రావచ్చు.

విద్యుత్ రంగంలో అనేక పంపిణీదారులకు ప్రవేశం కల్పించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. వారిమధ్య పోటీ పెరిగి వినియోగదారులు తమకు నచ్చిన ధరకు కావలసిన పరిమాణంలో విద్యుత్తును కొనుగోలు చేసే వీలుండాలని భావిస్తోంది. కానీ, చివరకు విద్యుత్ సరఫరా సంస్థలు ముఠాకట్టి ధరలు పెంచేసే ప్రమాదమే హెచ్చు. రాజకీయంగానూ కేంద్రీకరణకు ప్రతిఘటన ఎదురవుతోంది. జీఎస్టీ మండలి తరహాలో విద్యుత్ మండలిని ఏర్పరచి విద్యుత్తుకు సరసమైన ధర నిర్ణయించాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. గృహ, వ్యవసాయ వినియోగదారులకు సమంజసమైన ధరలు వర్తింపజేయడానికి ఏది ఉత్తమమో దాన్నే చేపట్టడం అవసరం!

– డి.రాధాకృష్ణ

(రచయిత– విద్యుత్ రంగ నిపుణులు)

యోగసాధన

శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఉన్నతమైన యోగ స్థితిని ఎలా పొందగలమో వివరించాడు. అభ్యాసం, వైరాగ్యం అనే రెండు మాటలతో మనసును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించిన మార్గం చూపించాడు. దీన్నే అభ్యాస యోగం, సాధన యోగం అంటారు.

మనసు స్వాధీనానికి తప్పనిసరిగా 'యమ' (అహింస, సత్యవ్రతం, దొంగతనం చేయకుండా ఉండటం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం), 'నియమ' (శారీరక, మానసిక, పరిశుభ్రత, సంతృప్తి, శాస్త్రాధ్యయనం, దైవారాధన) అనే అభ్యాసాలు సాధన చేయాలని యోగశాస్త్రాలు చెబుతున్నాయి.


మనసు అల్లకల్లోలమైనప్పుడు మనం ఊపిరి వేగంగా తీసుకుంటాం. క్రమబద్ధతా ఉండదు. మనసును శాంతపరచడానికి శ్వాసను క్రమబద్ధం చేయడం ఒక పద్ధతి. నిండుగా గాలిని పీల్చి వదలడాన్ని క్రమం తప్పకుండా అభ్యసిస్తే నిశ్చలమైన మానసిక స్థితిని పొందవచ్చు. ప్రాణశక్తి మీద పట్టు సాధించడం కోసం ఊపిరిని నియంత్రించడమే ప్రాణాయామం.

యోగి ఎవరన్నదానికి గీతలో కృష్ణుడు సమాధానమిచ్చాడు. ఈ ప్రాపంచిక కోరికలు, వాంఛల నుంచి మనసును అధిగమించి స్వతంత్రంగా, వ్యక్తిగా ఉండగలిగేవారే యోగి.

మనసును అధిగమించడమంటే దాన్ని నొక్కిపెట్టి ఉంచడం, నియంత్రించడం కాదు. మనసనేది ఆలోచనల ప్రవాహం. కోరికలు, వాంఛలూ ఆలోచనలతో సంక్రమించేవే. అంతవరకూ అనుభవంలోకి రాని దాన్ని అనుభవించాలనుకోవడం కోరిక. అదే అనుభవాన్ని మళ్ళీ మళ్ళీ పొందాలనుకోవడం వాంఛ.

ఆలోచనతో గుర్తింపు అంటే- 'నేను కోపంగా ఉన్నాను' అనుకోవడం కాకుండా 'నా మనసు తెరమీద కోపం కనిపిస్తోంది' అనుకోవాలి. ఆ కోపాన్ని చూడగలిగినప్పుడు ఆలోచనను వేరుచేయడం కుదురుతుంది. ఆ ఉద్వేగాన్ని తన నుంచి దూరంగా ఉంచినప్పుడు అది బలహీనపడుతుంది. ఆలోచనలను ఒక సాక్షిగా చూడగలిగినప్పుడు వ్యక్తికి, అతడి ఆలోచనకు ఖాళీ ఏర్పడుతుంది. యోగి కావడానికి కోరిక అడ్డుకాదు. ఆ కోరిక కోసం పాకులాడటం, దానికి అతుక్కుపోవడం చేయకూడదు. అందుకే మనసును అధిగమించాలి.

ఒకే గమ్యం చేరుకోవడానికి నాలుగు యోగమార్గాలను సూచించారు. నిత్య జీవితంలో ఇంటాబయటా ఎటువంటి అహం లేకుండా పనిచేసుకుపోతూ, కొంత దైవ చింతనతో ఇతరులకు సహాయాన్ని అందించడం కర్మయోగ.



సాధకుడు ప్రార్థన, దైవారాధన, నిర్నిబంధంగా ఇతరులను ప్రేమించడం భక్తియోగలో భాగం.

మానసిక విజ్ఞానం తెలుసుకుని చేసే ఒక ప్రయాణం లాంటిది రాజయోగ. జీవశక్తి (ప్రాణం) గురించి అవగాహన, ధ్యానంతో మనసును ప్రభావితం చేయాలి అనుకునేవారికి రాజయోగ చక్కని మార్గం.

బుద్ధిజీవులకు తోడ్పడేది జ్ఞానయోగ. వేదాంతాన్ని ఒక వాహనంగా తీసుకుని మనశ్శక్తితో ముందుకెళ్ళడం. వ్యక్తిగత స్వభావాల గురించి తెలిసుండాలి. ఇతర మార్గాల్లోని పాఠాలను గ్రహించినవారు ఈ మార్గంలో ఆత్మజ్ఞానం పొంది ఆధ్యాత్మిక బాటలో పయనిస్తారు.

'యోగ అన్నది విజ్ఞానశాస్త్రం. సాధకులకు మనసును అధిగమించడమెలాగో నేర్పుతుంది' అని పతంజలి యోగ సూత్రాలు చెబుతున్నాయి. స్థితప్రజ్ఞత గురించి ప్రస్తావిస్తూ, ఏ చర్య చేపట్టాలన్నా యోగికి ఉండే కౌశలాన్ని సంపాదించాలంటాడు భగవద్గీతలో శ్రీకృష్ణుడు.

యోగ సాధన వల్ల మనసులో సద్భావనలు చోటుచేసుకుంటాయి. చిత్తశుద్ధి ఏర్పడుతుంది.

'వెయ్యిమందిని వెయ్యిసార్లు యుద్ధంలో ఓడించినవాడికన్నా తన మనసును జయించినవాడే పరాక్రమవంతుడు' అంటాడు గౌతమ బుద్ధుడు.

– మంత్రవాది మహేశ్వర్



శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఆటో నడుపుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఆటో నడిపిన అచ్చెన్నాయుడు

టెక్కలి, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఆటో నడిపి ఆకట్టుకున్నారు. ఆటోలపై జీవితకాల పన్ను మినహాయింపు ఇస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు శుక్రవారం వందలాదిమంది చోదకులు ఆటోలతో చేరుకున్నారు. అనంతరం వారంతా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆతర్వాత ఆటో చోదకుల కోరికమేర నిమ్మాడ నుంచి సుమారు 25 కిలోమీటర్లు మంత్రి అచ్చెన్నాయుడు ఆటోను నడిపారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై దారిపొడవునా ఉన్న గ్రామాల్లోని ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. టెక్కలి పట్టణంలోనూ ఆటోలతో నిర్వహించిన ర్యాలీలో సాక్షాత్తూ మంత్రి ఆటోను నడపడాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

గ్రామీణ నీటి సరఫరా పనులకు రూ.28కోట్లు

ఈనాడు, అమరావతి: గ్రామీణ నీటిసరఫరాలో వివిధ రకాల పనుల నిమిత్తం రూ.28కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పాలనాపరమైన అనుమతినిచ్చింది. జాతీయ గ్రామీణ తాగునీటి పథకం కింద చేపట్టే ఈ పనులకు కేంద్రం 50శాతం, రాష్ట్రం 50శాతం నిధులను వెచ్చిస్తాయి. నీటి సరఫరా, నాణ్యత పర్యవేక్షణ వంటి పనులకు వినియోగించే మానవవనరుల్లో 26,657మందికి శిక్షణనిచ్చేందుకు రూ.1.50కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగుల వివరాల సమర్పణకు గడువు పెంచండి: ఎస్టీయూ

ఈనాడు, అమరావతి: జీతాల చెల్లింపునకు సంబంధించి సమగ్ర ఆర్థిక నిర్వహణ విధానం (సీఎఫ్ఎంఎస్)లో ఉద్యోగుల సమాచారం సమర్పణకు ఫిబ్రవరి 15 వరకు గడువు పొడిగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు.

'గ్లోబరీనా' మోసం చేసింది

- పోలీసులను ఆశ్రయించిన జేఎన్‌టీయూకే
- రూ.26.63 కోట్ల నష్టం జరిగినట్టు ఫిర్యాదు
- తామూ నష్టపోయామంటూ ఇప్పటికే కోర్టుకెక్కిన హైదరాబాద్ సంస్థ
- వర్సిటీలో వివాదాస్పదంగా మారిన ఒప్పందం



కాకినాడ జేఎన్‌టీయూ

ఈనాడు – కాకినాడ

తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని జేఎన్‌టీయూ మరోమారు రచ్చకెక్కింది. ఓ ప్రైవేటు కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందం బెడిసికొట్టిన వైనం ప్రస్తుతం వివాదాస్పదమైంది. జేఎన్‌టీయూకేలో విద్యార్థులకు బోధన, పరీక్ష విధానంలో వేగవంతమైన ఆన్‌లైన్ సేవలు అందించే ఉద్దేశంతో 2013లో అప్పటి ఉపకులపతి హయాంలో హైదరాబాద్‌కు చెందిన గ్లోబరీనా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఈ- కంటెంట్ డెవలప్‌మెంట్, పరీక్ష పత్రాలు ఆన్‌లైన్‌లో దిద్దడం, ఈ-లాస్ వంటి విద్యా విషయక అంశాలను అభివృద్ధి చేసి అందించాలన్నది దీని సంకల్పం. 2013 మార్చి 6న సంబంధిత కంపెనీ రంగంలోకి దిగింది. ఈ పనుల కోసం గ్లోబరీనా కంపెనీకి సమీకరణ బయానాగా (మొబలైజేషన్ అడ్వాన్స్) కింద విశ్వవిద్యాలయం రూ.26,63,88,500 చెల్లించింది. తర్వాత క్రమంలో కంపెనీ ఈ- కంటెంట్ అభివృద్ధిలో ఎలాంటి పురోగతి చూపించలేదన్న ఆరోపణలు జేఎన్‌టీయూకే నుంచి ఎదురయ్యాయి. స్టాండర్డ్ కమిటీ మార్గదర్శకాల ప్రకారం సేవలు లేవని.. సేవల్లో నాణ్యత లేదనే ఫిర్యాదుల నేపథ్యంలో కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని 2015లో వర్సిటీ రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ 2016లో గ్లోబరీనా సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించి మధ్యవర్తిత్వం (ఆర్బిట్రేషన్) పిటిషన్ వేసింది. జేఎన్‌టీయూకేతో ఒప్పందం తర్వాత చర్యల ఫలితంగా కంపెనీ రూ.44 కోట్లు నష్టపోయిందని, న్యాయం చేయాలని కోరింది. ఈ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉండగానే తాజాగా జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ వి.వి. సుబ్బారావు ఈ నెల 18న సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వర్సిటీకి సంబంధిత ఒప్పందం కారణంగా రూ.26.63 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని, సేవలు అందించకుండా గ్లోబరీనా కంపెనీ మోసపుచ్చిందని ఇందులో పేర్కొన్నారు.

మూడున్నరేళ్లకు...

ఒప్పందం విషయంలో అప్పటి పాలకవర్గం తీరుతో పాటు రూ.26.63 కోట్ల చెల్లింపుల వ్యవహారం విమర్శలకు తావిస్తోంది. మొబలైజేషన్ అడ్వాన్సు కింద ఇచ్చిన మొత్తం సకాలంలో వెనక్కు రప్పించడంలో సమర్థ చర్యలు చేపట్టలేదన్న వాదన వినిపిస్తోంది. ఇంతకు ముందు పనిచేసిన ఇన్‌ఛార్జి వీసీ పదేపదే ఈ విషయంలో పోలీసులను ఆశ్రయించాలని సూచించినా కింది స్థాయి యంత్రాంగం స్పందించకపోవడం అనుమానాలను రేకెత్తిస్తోంది. ఉచ్చు బిగుస్తుండటంతో మూడున్నరేళ్ల తర్వాత ఎట్టకేలకు జేఎన్‌టీయూకే వర్గాలు పోలీసులను ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది.

పలువురికి తాకీదులు

జేఎన్‌టీయూకే ఫిర్యాదు నేపథ్యంలో సీఐ గోవిందరాజులు పర్యవేక్షణలో ఈ కేసుపై దర్యాప్తు చేపట్టారు. గ్లోబరీనా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో పనిచేసిన ఉపకులపతి, డైరెక్టర్లు, విభాగాధిపతుల వాంగ్మూలాన్ని సేకరించే క్రమంలో పోలీసులు తాఖీదులు జారీ చేశారు. ఇప్పటి యాజమాన్యాన్నీ విచారిస్తున్నారు. ప్రస్తుతానికి జేఎన్‌టీయూకేను గ్లోబరీనా సంస్థ మోసపుచ్చినట్లు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినా ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరపాల్సి ఉందని సర్పవరం సీఐ గోవిందరాజులు 'ఈనాడు'తో చెప్పారు.



భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

మురిసిన మువ్వన్నెల జెండా

విశాఖలో 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకం ప్రదర్శన

గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో విశాఖలో భారీ త్రివర్ణ పతాకం ఆకట్టుకుంది. శుక్రవారం 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల జాతీయ జెండాతో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. 'స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు, యువత పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన జాతీయ జెండా ప్రదర్శన సెంట్రల్ పార్కు వరకు కొనసాగింది.

– న్యూస్‌టుడే, కార్పొరేషన్(విశాఖపట్నం)

ఏపీపీఎస్సీ ఎదుట విద్యార్థుల ఆందోళన

- అడ్డుకున్న పోలీసులు

విజయవాడ సిటీ – న్యూస్‌టుడే

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ మెరిట్ అభ్యర్థులను జనరల్ పోస్టులకు అనుమతించాలని, గ్రూప్1 పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ శుక్రవారం డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఏపీపీఎస్సీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక్కసారిగా కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు లోపలికి వెళ్లనీయకుండా ఆందోళనకారులను అడ్డుకున్నారు. అరెస్ట్ చేసి ప్రత్యేక వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఏపీపీఎస్సీ ప్రిలిమ్స్‌లో కామన్ కటాఫ్ తీసి వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రతిభ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు జనరల్ కోటా ఉద్యోగాలకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఏపీపీఎస్సీ ఛైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్ నిర్ణయాలను తీసుకుంటున్నారని ఆరోపించారు. గతంలో లేని విధంగా గ్రూపు-1లో కఠిన సిలబస్ తీసుకువచ్చారని, వాటికి సంబంధించి బయట మార్కెట్‌లో పుస్తకాలు కూడా దొరకడం లేదన్నారు. మార్చి 10న జరిగే పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామన్న, ఎం.సూర్యారావు, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు అఫ్సర్, ఎ.అశోక్, ఎం.సుబ్బారావు, రవిచంద్ర, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఏపీపీఎస్సీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

బీసీలకు 50 శాతం సీట్లు ఇచ్చిన పార్టీకే మద్దతు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాబోయే ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లతో పాటు చట్టసభల్లో రిజర్వేషన్లపై స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న బీసీలను రాజకీయ పార్టీలు నేటికీ ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు అనగానే 33 పార్టీలు ముందుకొచ్చాయని, మూడు రోజుల్లోనే చట్టసభలతో పాటు రాష్ట్రపతి ఆమోదం కూడా లభించిందని తెలిపారు. బీసీల రిజర్వేషన్లపై కొన్నేళ్లుగా పోరాడుతున్నా చట్టబద్ధత కల్పించడానికి ప్రభుత్వాలు ముందుకు రావడం లేదని ఆర్.కృష్ణయ్య ఆక్షేపించారు. దేశంలో బీసీలు 16 శాతం మాత్రమే చట్టసభలకు వెళ్లారని, 15 శాతం ఉన్న అగ్రకులాల నుంచి మాత్రం 65 శాతం మందికి ప్రాతినిధ్యం లభించిందన్నారు. ఉద్యోగాల్లో కేవలం తొమ్మిది శాతం, ప్రైవేటు రంగంలో ఒక శాతం ఉపాధి అవకాశాలు మాత్రమే వెనకబడినవర్గాలకు దక్కాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 71 ఏళ్లుగా బీసీ ముఖ్యమంత్రి లేకపోవడం రాజకీయ పార్టీల నాటకానికి అద్దం పడుతోందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడుతున్న బీసీలకు రాజ్యాధికారమే పరిష్కారమని.. త్వరలో బీసీ సమైక్య ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య తెలిపారు.

పురుషోత్తపట్నం కేసు విచారణ వాయిదా

మార్చి 6న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తాం: ఎన్జీటీ

ఈనాడు, దిల్లీ: అనుమతులు లేకుండానే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం చేపట్టారని మడిచర్ల సత్యనారాయణ, మడిచర్ల రామకృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఈ ప్రాజెక్టుపై విచారణలో ఉన్న ఇతర పిటిషన్లకు జత చేసింది. పర్యావరణ అనుమతులు వచ్చాకే పురుషోత్తపట్నం పనులు చేపట్టాలంటూ పిటిషన్‌దారుల తరపు న్యాయవాది శ్రావణ్ కుమార్.. జస్టిస్ రఘువేంద్ర ఎస్.రాథోడ్ నేతృత్వంలోని ధర్మాసనానికి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై జమ్ముల చౌదరయ్య, ఇందుకూరి సూర్యనారాయణరాజుల వ్యాజ్యం కూడా విచారణలో ఉందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత అనుమతుల అంశం తేల్చమని కేంద్ర పర్యావరణ శాఖను ఇప్పటికే ఆదేశించామని తెలిపింది. ఒకే అంశమైనందున ఆ వ్యాజ్యానికి దీన్ని జత చేసినట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో మార్చి ఆరున ఆ కేసుతో పాటే దీనిని కూడా విచారించనుంది.

ఉపాధ్యాయ పదోన్నతులు వెంటనే అమలు చేయాలి

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వ న్యాయవాది ఇచ్చిన సూచన మేరకు వెంటనే ప్రక్రియ ప్రారంభించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఛైర్మన్, ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, జి.హృదయరాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అడ్‌హక్ నిబంధనలు రూపొందించి పదోన్నతులు అమలు చేయాలని, లేకుంటే ఉపాధ్యాయుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధనల మేరకు జాబితా రూపొందించి, షెడ్యూల్ విడుదల చేయాలని, లేని పక్షంలో ఈ నెల 30న కమిషనరేట్ కార్యాలయం ముట్టడిస్తామని ప్రకటించారు.

16 నెలల్లో బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తివనం

ఈనాడు డిజిటల్– అమరావతి: రాజధాని అమరావతిలో 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న 'బాబూ జగ్జీవన్‌రామ్ సమతా స్ఫూర్తి వనం' ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీని నిర్మాణానికి ఏపీఐఐసీని ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా నియమించింది. నిర్మాణాన్ని 4 దశల్లో చేపట్టాలని, మొత్తం 16 నెలల్లో పూర్తిచేయాలని సూచించింది. నిర్మాణాల ఆకృతుల ఖరారు, ప్రాజెక్టు అంచనాలను రెండున్నర నెలల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుకు నోడల్ అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు వ్యవహరిస్తారని పేర్కొంది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులిచ్చింది.

ప్రాజెక్టులో భాగంగా నిర్మించేవి:

- ★ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం
- ★ వివిధ కళాకృతులతో కూడిన మెమోరియల్ పార్కు, ల్యాండ్ స్కేప్ గార్డెన్
- ★ 'సమతాసదన్' పేరుతో వెయ్యి మంది ఒకేసారి వీక్షించేందుకు వీలుగా బహుళప్రయోజన సమావేశ మందిరం
- ★ 'స్ఫూర్తిభవన్' పేరుతో బహుళ ప్రయోజన భవంతి

విరిసిన చైతన్యం.. ఇది నవచరితం

శ్రీకాకుళంలో 8320 మంది విద్యార్థులతో 'రెడీ టు ఓట్' ప్రదర్శన

ఓటు వజ్రాయుధం. ప్రజాస్వామ్యానికి అదే పునాది. ఓటరు చైతన్యానికి ఎన్నికల సంఘం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీకాకుళం వినూత్న కార్యక్రమంతో ఓటు స్ఫూర్తి చాటిచెప్పింది. ఈ క్రమంలో రికార్డు పుటల్లోనూ చోటు దక్కించుకుంది. శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 8,320 మంది విద్యార్థులు 'రెడీ టు ఓట్' అనే ఆంగ్ల పదాల క్రమంలో ప్రదర్శన, ప్రతిజ్ఞ చేపట్టడంతో పాటు 'మా తెలుగు తల్లికి' గీతాలాపన చేశారు. ఇక ఎన్నికల గుర్తు ఆకృతిని తలపించేలా 150 మంది దివ్యాంగులు మూడు చక్రాల సైకిళ్లపై వచ్చి పాల్గొన్నారు. గతంలో తెలంగాణలోని వనపర్తిలో 6300 మందితో నిర్వహించిన ఓటరు అవగాహన ప్రతిజ్ఞ రికార్డును ఈ ప్రదర్శన అధిగమించింది. ఈ రికార్డు సాధించినందుకుగాను ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్షిణ భారత సమన్వయకర్త డాక్టర్ స్వర్ణశ్రీ, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా ముఖ్య సమన్వయకర్త బింగి నరేంద్రగౌడ్‌లు నిర్వాహకులకు ధ్రువపత్రాలను అందజేశారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకూ సంస్థ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.

– న్యూస్‌టుడే, పాతబస్టాండు (శ్రీకాకుళం)





మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సాష్టాంగ ప్రణామం చేస్తున్న గవర్నర్ నరసింహన్ దంపతులు

శ్రీ లక్ష్మీనృసింహస్వామి సేవలో గవర్నర్ దంపతులు

మంగళగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ నరసింహన్ దంపతులు శుక్రవారం మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి, శ్రీపానకాలస్వామి ఆలయాలను సందర్శించారు. మధ్యాహ్నం తొలుత కొండపైన శ్రీపానకాలస్వామి ఆలయానికి వెళ్లి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి నైవేద్యంగా పటిక బెల్లం పానకాన్ని గవర్నర్ దంపతులు సమర్పించారు. అనంతరం కొండ కింద ఉన్న దిగువ సన్నిధి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రదక్షిణ తర్వాత శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో గవర్నర్ నరసింహన్ దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం పలికారు.

ప్రమాణపత్రం దాఖలు చేయండి

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)కు చెందిన వివరాల్ని సమాచార హక్కు చట్టం(స.హ.చట్టం) కింద కోరితే సెబీ, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలశాఖ ఇవ్వలేదని పేర్కొంటూ 2018లో దాఖలైన వ్యాజ్యంలో ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఆర్ఐఎల్ ఛైర్మన్, ఎండీని హైకోర్టు ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు సంబంధించిన వివరాల్ని సమాచార హక్కు చట్టం ద్వారా కోరితే సంబంధిత దస్త్రం(ఫైలు) అందుబాటులో లేదని కేంద్ర ప్రభుత్వం, సెబీ అధికారులు చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన టి.గంగాధర్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. డొల్ల కంపెనీలకు రిలయన్స్ సంస్థ రూ.కోట్లలో నిధుల్ని మళ్లించిందని ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాల్ని స.హ.చట్టం ద్వారా కోరితే సంబంధిత అధికారులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారన్నారు. శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపున న్యాయవాది శివరాజ్ శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. రిలయన్స్ సంస్థలో రూ.2,700 కోట్ల నిధులను మళ్లించారన్నారు. రికార్డులను కోర్టుకు సమర్పించేలా ఆదేశించాలని కోరారు. సెబీ ఇప్పటికే ఈ వ్యాజ్యంలో ప్రమాణపత్రం దాఖలు చేసిందన్నారు. రిలయన్స్ సంస్థ ప్రమాణపత్రం దాఖలు చేయాల్సి ఉందన్నారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేస్తూ ప్రమాణపత్రం దాఖలు చేయాలని రిలయన్స్ సంస్థను ఆదేశించింది.

మీ వైఖరి తెలపండి

బాలకృష్ణపై కేసు నమోదు చేయాలన్న వ్యాజ్యంలో ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా రోడ్ షో ప్రచారంలో పాల్గొన్న హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని.. దానిపై కేసు నమోదు చేయాలని అభ్యర్థిస్తూ 2017లో దాఖలైన వ్యాజ్యంలో ప్రమాణపత్రం దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది.

నంద్యాల ఉప ఎన్నికలో తెదేపా అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహిస్తూ బాలకృష్ణ ఓటర్లకు బహిరంగంగా డబ్బు పంపిణీ చేశారని, ఆయనపై ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేసేలా ఆదేశించాలని కోరుతూ వైకాపా ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్ ఆగస్టు 2017లో హైకోర్టును ఆశ్రయించారు.

అభయగోల్డ్ ఎండీ అరెస్టు

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: అభయగోల్డ్ ఎండీ, అక్షయగోల్డ్ డైరెక్టర్ కూకట్ల శ్రీనివాస్‌ను సీఐడీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆయనకు జిల్లా న్యాయస్థానం ఫిబ్రవరి 4వరకు రిమాండ్ విధించింది. ఏలూరు టూటౌన్‌లో గతంలో అభయ, అక్షయగోల్డ్ ఫైనాన్స్ కంపెనీలు నిర్వహించేవారు. అప్పట్లో ఖాతాదారులకు ఈ కంపెనీలు సొమ్ము ఎగవేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఏలూరు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కూకట్ల శ్రీనివాస్‌పై 2013లో కేసు నమోదైంది. బాధితులు ఎక్కువమంది కావడం, అక్షయగోల్డ్‌లో 30 కేసులు, అభయగోల్డ్‌లో 20 కేసులు ఉండటంతో వీటిని రాజమహేంద్రవరం సీఐడీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సీఐడీ పోలీసులు 2013 చివరలో శ్రీనివాస్‌ను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఆయనకు రిమాండ్ విధించగా కొంతకాలానికి బెయిల్‌పై విడుదలయ్యారు. తరువాత కోర్టుకు హాజరుకాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం శ్రీనివాస్‌ను సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు.



జీఎంసీ ప్రధానాచార్యులు సుబ్బారావుతో చర్చిస్తున్న తెలికిచర్ల ట్రస్టు సభ్యులు

జీజీహెచ్‌కు తెలికిచర్ల ట్రస్టు రూ.కోటి సాయం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు సర్వజనాసుపత్రిలో నిర్మించతలపెట్టిన మాతాశిశు సంరక్షణ కేంద్రం భవనానికి తెలికిచర్ల ట్రస్టు రూ.కోటి సాయం ప్రకటించింది. గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి తెలికిచర్ల మదనమోహన్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు.. ఇప్పటికే జీజీహెచ్‌లో నిర్మించిన పొదిల ప్రసాద్ భవన నిర్మాణంతో పాటు పలు ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించింది. స్థానికంగా పరిశోధనల ప్రోత్సాహానికి ఏటా రూ.3.5 లక్షల సాయం కూడా చేస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం అమెరికా నుంచి వచ్చిన ఆ ట్రస్టు ప్రతినిధులు డాక్టర్ టీకే రావు, అన్నబరపు రామారావు, ఇందుప్రభ, డాక్టర్ టి.కృష్ణకుమార్, నిర్మల, దేవేంద్రకుమార్‌లు గుంటూరు వైద్య కళాశాల (జీఎంసీ) ప్రధానాచార్యులు సుబ్బారావు, సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ రాజునాయుడులను కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

నేడు పాలకొల్లులో దాసరి కాంస్య విగ్రహావిష్కరణ

పాలకొల్లు, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి, దర్శకరత్న, దివంగత దాసరి నారాయణరావు కాంస్య విగ్రహాన్ని ఆయన సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లా క్షీరపురి (పాలకొల్లు)లో శనివారం ఆవిష్కరించనున్నారు. సినీనటుడు డాక్టర్ ఎం.మోహన్‌బాబు ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తలపెట్టిన ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

సచివాలయంలో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ

ఈనాడు, అమరావతి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎన్. శ్రీకాంత్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నినదించారు. న్యాయశాఖ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

వరించిన పురస్కారాలు

- ముగ్గురు రాష్ట్ర పోలీసులకు రాష్ట్రపతి విశిష్ట అవార్డులు
- 18 మందికి ప్రతిభా సేవా పతకాలు

ఈనాడు - దిల్లీ, అమరావతి

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులను రాష్ట్రపతి విశిష్ట పోలీసు పతకం వరించింది. ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప వద్ద ఓఎస్డీగా పనిచేస్తున్న ఎస్పీ స్థాయి అధికారి అడ్డాల వెంకటరత్నం, విశాఖపట్నం రేంజి ఏసీబీ డీఎస్పీ కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్ ఈ పతకానికి ఎంపికయ్యారు. మరో 15 మంది ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి విజయవాడలో అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్న ఎన్.ప్రకాశ్‌రావు కూడా రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. మరో ముగ్గురు ప్రతిభా సేవా పతకాలకు అర్హులయ్యారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ పురస్కారాలను ప్రకటించింది.




అడ్డాల వెంకటరత్నం ■ వెంకట రామకృష్ణప్రసాద్

1. ఎస్.హరికృష్ణ, ఎస్పీ(ఇంటెలిజెన్స్), విజయవాడ
2. వరుపుల సత్తిరాజు, డిప్యూటీ ఎస్పీ(ఏఆర్), రాజమహేంద్రవరం
3. కొత్తపల్లి శామ్ వినోద్‌కుమార్, డిప్యూటీ ఎస్పీ(ఎస్సీ, ఎస్టీ సెల్), కర్నూలు
4. కళ్లా జనార్దన్‌నాయుడు, డిప్యూటీ ఎస్పీ(ఇంటెలిజెన్స్), తిరుపతి
5. పాలేటి మోహన్‌ప్రసాద్, అడిషనల్ కమాండెంట్, ఏపీఎస్పీ, విశాఖపట్నం
6. పెనుమూడి కిరణ్‌కుమార్, అసాల్ట్ కమాండర్ (గ్రేహౌండ్స్), హైదరాబాద్
7. వెన్నపూస వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ (సీఐ సెల్), విజయవాడ
8. బండారు రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్ (పోలీస్ శిక్షణ కళాశాల), ఒంగోలు
9. మంత్రిప్రగడ వెంకటగణేశ్, ఇన్‌స్పెక్టర్ (ఏసీబీ), విశాఖపట్నం
10. నటేశం గుణశేఖర్, ఎస్ఐ (రోడ్ సేఫ్టీ పెట్రోలింగ్), బంగారుపాళ్యం
11. షేక్ ముస్తాఖ్ అహ్మద్ బాషా, ఏఆర్ ఎస్ఐ, ఎస్ఏఆర్‌సీపీఎల్, హైదరాబాద్
12. గండవరపు వెంకట రామారావు, హెడ్ కానిస్టేబుల్, విశాఖపట్నం
13. గోపిశెట్టి సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ (ఏఆర్), విజయవాడ నగరం
14. ఇంజారపు వీరవెంకట సత్యసాయి ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్, పోరంకి
15. బోగాది వెంకటేశ్వరరావు, రైల్వే పోలీస్ కానిస్టేబుల్, విజయవాడ

కేంద్ర ప్రభుత్వ శాఖల పరిధిలో

1. మొదలవలస పోలినాయుడు, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్, విజయవాడ
2. గొల్ల రాము, హెడ్ కానిస్టేబుల్, సీబీఐ, విశాఖపట్నం
3. జహీద్‌ఖాన్, కమాండెంట్, ఎన్డీఆర్ఎఫ్, గుంటూరు

సమాఖ్యల స్థానంలో కార్పొరేషన్లు

- పరిమితులకు మించి సాయం అందించేందుకే..
- కొత్తగా 4 కార్పొరేషన్ల ఏర్పాటుకు నిర్ణయం

ఈనాడు డిజిటల్, అమరావతి: వెనుకబడిన వర్గాలకు మరింత సాయం అందించేందుకు 11 బీసీ సమాఖ్యలను కార్పొరేషన్లుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు బీసీల్లోని మరికొన్ని వర్గాల సంక్షేమానికి కొత్తగా యాదవ, కురుమ, శెట్టిబలిజ, చేనేత కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతమున్న ఫెడరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం ఆర్థిక సాయం ఇస్తున్నా.. వాటి ఫలాలు కొద్ది మందికి మాత్రమే అందుతున్నాయి. ఫెడరేషన్లకు ఉన్న పరిమితి దృష్ట్యా ప్రభుత్వ సాయం ఎక్కువ మందికి చేరడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఫెడరేషన్లను కార్పొరేషన్లగా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు.

బృందంగా ఏర్పడితేనే సాయం

- ప్రస్తుతమున్న 11 ఫెడరేషన్ల ద్వారా ఆయా వర్గాల వారికి వ్యక్తిగత రుణాలిచ్చే వెసులుబాటు ఉండదు.
- కనీసం 10 నుంచి గరిష్ఠంగా 15 మంది సభ్యులు కలిసి ప్రాథమిక సంఘంగా ఏర్పడి సహకార చట్టం కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ సంఘం ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉండాలి.
- కేవలం స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు ఆర్థిక సాయం అందించేందుకు మాత్రమే ప్రభుత్వం ఫెడరేషన్లకు నిధులిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఎక్కువగా అవగాహన ఉండడం లేదు. నమోదు చేసుకోవడంలో ఉన్న క్లిష్టత దృష్ట్యా ఎక్కువ మంది ఫెడరేషన్ల సాయానికి దూరంగానే ఉండిపోతున్నారు.

కార్పొరేషన్లతో వ్యక్తిగత లబ్ధి

- స్వయం ఉపాధి కోసం వ్యక్తిగత, బృంద రుణాలు ఇచ్చే అధికారం కార్పొరేషన్లకు ఉంటుంది
- ప్రభుత్వ కార్యక్రమాలను కార్పొరేషన్ల ద్వారా నేరుగా అమలుచేయొచ్చు
- ఆయా వర్గాల సంక్షేమం కోసం కొత్త పథకాలకు రూపకల్పన చేసే అధికారం ఉంటుంది. కార్పొరేషన్లను కంపెనీల చట్టం ప్రకారం ఏర్పాటు చేస్తారు.

ఉదాహరణ కాపు కార్పొరేషన్..

విద్యార్థులకు ఉపకారవేతనాలతో పాటు, విదేశీ విద్యకు, స్వయం ఉపాధికి ఆర్థిక సాయంతోపాటు, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలో సాయం అందిస్తోంది.

సంఘాలలో చేరింది 4.24 లక్షల మందే..

11 బీసీ ఫెడరేషన్లకు సంబంధించిన సామాజిక వర్గాల జనాభా సుమారు 70 లక్షలకు పైగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసాధికార సర్వే ద్వారా గుర్తించింది. కానీ ఫెడరేషన్లకు అనుబంధంగా ప్రాథమిక సంఘాలుగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు కేవలం 4.24 లక్షల మంది (25,496 ప్రాథమిక సంఘాలు) మాత్రమే ఉన్నారు. వీరికి మాత్రమే సాయం అందుతోంది.

ప్రస్తుతమున్న ఫెడరేషన్లు

రజక
నాయిబ్రాహ్మణ
వడ్డెర
సగర(ఉప్పర)
కృష్ణ బలిజ
శాలివాహన
మేదర
బట్రాజ
కల్లుగీత కార్మికులు
విశ్వబ్రాహ్మణ
వాల్మీకి(బోయ)

రూ.489 కోట్లతో ఎత్తిపోతల

- జగ్గయ్యపేట మండలం ముక్త్యాల వద్ద నిర్మాణం
- 38,627 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం
- టెండర్ల ఆహ్వానానికి ఏర్పాట్లు

ఈనాడు-అమరావతి: కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజికి ఎగువన ముక్త్యాల వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2.7 టీఎంసీల నీటి మళ్లింపు లక్ష్యంగా రూ. 489.28 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు శుక్రవారం జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కు మార్ పాలనామోదం ఇచ్చారు. వెంటనే టెండర్లు ఆహ్వానిస్తూ అవసరమైన చర్యలు చేపట్టారు.

ఇదీ పథకం

ఎక్కడ: కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల వద్ద కృష్ణా నది ఎడమ గట్టుపై నిర్మిస్తారు.

లక్ష్యం: నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు 32.25 టీఎంసీల కృష్ణా జలాల కేటాయింపులు ఉన్నాయి. ఈ నీరు సాగర్ నుంచి విడుదల చేసినా ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు సరిగా చేరకపోవడంతో ఆయకట్టు చివరి రైతులు నష్టపోతున్నారు. ప్రధానంగా బీవీఆర్ బ్రాంచి కాలువ కింద ఉన్న 38,627 ఎకరాల ఆయకట్టుకు ఏనాడూ సరిగా నీరు అందడంలేదు. ఈ ఆయకట్టు స్థిరీకరణకు ప్రాజెక్టు చేపడుతున్నారు.

అమలు ఇలా: పులిచింతల జలాశయానికి 4 కిలోమీటర్ల దిగువన పంపుహౌస్ ఏర్పాటు చేసి, సీజన్‌లో రోజుకు 386.27 క్యూసెక్కుల చొప్పున.. 120 రోజుల పాటు 2.7 టీఎంసీల నీటిని మళ్లిస్తారు. మొత్తం 6 చిన్న పంపులతో ఎత్తిపోసిన నీటిని కొంత మేర పైపుల ద్వారా, మరికొంత కాలువ ద్వారా తరలించి బీవీఆర్ బ్రాంచి కాలువకు అనుసంధానిస్తారు.

ఎకరాకు వ్యయం రూ.1.26 లక్షలు: సాధారణంగా ఆయకట్టు స్థిరీకరణకు ఎకరాకు రూ. 52,500 మాత్రమే ఖర్చు చేయాలనే నిబంధన ఉంది. ఈ పథకం విషయంలో ఆ పరిమితికి సడలింపు ఇచ్చారు. సాంకేతిక కారణాలు, రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఎకరానికి రూ. 1,26,668 ఖర్చుకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

966 మంది వైద్యుల నియామకం

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్ అర్హత కలిగిన 966 మందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగా నియమించారు. రాష్ట్రంలో వైద్య పోస్టుల భర్తీకి ప్రజారోగ్య శాఖ ఇటీవల చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో కౌన్సెలింగ్ ద్వారా 871 మందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, 95 మందిని వైద్య కళాశాలల్లో నియమించినట్లు ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ అరుణ తెలిపారు. ఎంపిక చేసిన వారికి శుక్రవారం నుంచి విధుల్లో చేరేందుకు అవకాశాన్ని కల్పించారు. శ్రీకాకుళం, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాల్లో గరిష్ఠంగా 60 మంది వరకు విధుల్లో చేరారు. ఇతర జిల్లాల్లో 30 నుంచి 49 మంది మధ్యన వైద్యులు ఉన్నారు. 15 రోజుల్లోగా మిగిలినవారంతా విధుల్లో చేరాల్సి ఉంది. వైద్యులుగా నియామకాలు పొందిన వారిలో 75% మంది ఒప్పంద వైద్యులు ఉన్నారు.

హార్టికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ ప్రకటన రద్దు!

ఈనాడు, అమరావతి: ఏపీపీఎస్సీ జారీచేసిన హార్టికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ ప్రకటన రద్దు కాబోతోంది. 39 ఉద్యోగాల భర్తీకి ప్రకటన జారీచేసి, దరఖాస్తులు స్వీకరించారు. అభ్యర్థుల నుంచి 1454 దరఖాస్తులు వచ్చాయి. తొలుత నిర్దేశించిన ప్రకారం బీఎస్సీ డిగ్రీ అర్హతతో దరఖాస్తులు స్వీకరించారు. తాజాగా నాలుగేళ్ల డిగ్రీ అర్హత కలిగిన వారు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని ఉద్యాన శాఖ ఏపీపీఎస్సీకి సమాచారాన్ని అందించింది. ఈ నేపథ్యంలో ప్రకటన జారీచేసి, దరఖాస్తులు స్వీకరించిన అనంతరం జరిగిన ఈ మార్పువల్ల సవరణ ఇవ్వడం కుదరదని, ప్రకటనను పూర్తిగా రద్దు చేస్తామని ఏపీపీఎస్సీ వర్గాలు తెలిపాయి. దరఖాస్తుదారులు కట్టిన రుసుమును వెనక్కు ఇస్తామని వెల్లడించాయి.

15 నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గోవాలో జరగనున్న జాతీయ క్రీడలకు రాష్ట్ర క్రీడా జట్లను సమాయత్తం చేసేందుకు వీలుగా ఫిబ్రవరి 15 నుంచి మూడు రోజుల పాటు 18 క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి సీఎం కప్-2019 పోటీలను నిర్వహిస్తున్నట్లు శాప్ ఛైర్మన్ పోలినేని అంకమ్మచౌదరి విజయవాడలో శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే అండర్-14, 17, 19 సీఎం కప్ స్కూల్ గేమ్స్ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. గత ఏడాది రాష్ట్ర క్రీడా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ ఛాంపియన్‌షిప్‌ల్లో తొలి 8 స్థానాల్లో నిలిచిన జట్లు సీఎం కప్‌లో తలపడతాయని పేర్కొన్నారు. అనంతరం జాతీయ క్రీడలకు అర్హత సాధించిన క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.



అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చిత్రంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, ప్రతాప్ సి.రెడ్డి, సీఎం పళనిస్వామి తదితరులు

ఆధునిక చికిత్స అందరికీ అందాలి

చెన్నైలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు డిజిటల్, చెన్నై: అధునాతన క్యాన్సర్ చికిత్స అందరికీ అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం చెన్నైలో అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్ (ఏపీసీసీ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ఆగ్నేయాసియాలోనే తొలి ప్రోటాన్ థెరపీ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. శరీరంలోని ఇతర అవయవాలకు హాని కలగకుండా చేసే ఈ ఆధునిక చికిత్స బాధిత బాలలకు మరింత మేలు చేస్తుందన్నారు. ఇది దేశంలోనే క్యాన్సర్ వైద్యంలో నూతన అధ్యాయాన్ని లిఖిస్తుందని తెలిపారు. ఈ చికిత్సను మారుమూల గ్రామాల్లోని పేదలకు కూడా అందుబాటులోకి తేవాలని ఉపరాష్ట్రపతి సూచించారు. క్యాన్సర్ మరణాలు 1990లో అంచనా వేసిన వాటికంటే 2016లో రెండింతలు అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్యాన్సర్‌ను జయించాలంటే ముందస్తు గుర్తింపు, విస్తృత అవగాహన అవసరమన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆస్పత్రులు తప్పనిసరిగా భారీస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, అపోలో ఆస్పత్రుల ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి, ప్రీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమికి సేవ చేయండి

ఈనాడు, దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న ప్రవాస భారతీయులు స్వస్థలాలకు సేవ చేయాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఆయా దేశాల నియమ నిబంధనలు పాటిస్తూ భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. వారణాసిలో నిర్వహించిన 'ప్రవాసీ భారతీయ దివస్' కార్యక్రమానికి హాజరైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాలకు చెందిన 50 మందికి పైగా ఎన్నారైలు శుక్రవారం ఉపరాష్ట్రపతి నివాసంలో వెంకయ్యనాయుడితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మాతృమూర్తి, మాతృభాష, జన్మభూమి, మాతృదేశం, గురువు.. ఈ ఐదు అంశాలను ప్రతి ఒక్కరూ జీవితాంతం గుర్తుంచుకోవాలి" అని ఉద్బోధించారు.

ఐటీ భద్రత పర్యవేక్షణకు మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయం, వివిధ శాఖల విభాగాధిపతులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఐటీ భద్రత పర్యవేక్షణకు ప్రభుత్వం మార్గదర్శకాలను శుక్రవారం జారీ చేసింది. ప్రతిశాఖ ఆ శాఖలోని ఐటీ వసతులను రాష్ట్ర సైబర్ భద్రత నిర్వహణ కేంద్రం (ఏపీసీఎస్ఓసీ)కు అనుసంధానం చేసుకోవాలని తద్వారా సైబర్ ముప్పును పర్యవేక్షించే వీలుంటుందని తెలిపింది. ప్రతి శాఖ ఒక అధికారిని (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్-ఎస్‌పీఓసీ) ప్రత్యేకంగా నియమించి సైబర్ భద్రత, ఫిర్యాదులను ఆ అధికారి ఏపీటీఎస్ దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో ప్రభుత్వం పేర్కొంది.

సమ్మె బాటలో ఎన్ఎంయూ

- వచ్చే నెల 8 తర్వాత ఏ క్షణమైనా సిద్ధమని ప్రకటన
- ఆర్టీసీ ఎండీకి నోటీసు అందజేసిన సంఘం నాయకులు

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ ప్రధాన కార్మిక సంఘాల్లో ఒకటైన నేషనల్ మజ్దూర్ యూనియన్ కూడా సమ్మె సైరన్ మోగించింది. వచ్చే నెల 8వ తేదీ తర్వాత ఏ క్షణంలోనైనా సమ్మెకు సిద్ధమని ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర నాయకులు చల్లా చంద్రయ్య, వై.శ్రీనివాసరావు, పీవీ.రమణారెడ్డి తదితరులు శుక్రవారం ఆర్టీసీ ఎండీ ఎన్.వి.సురేంద్రబాబుకు 32 ప్రధాన డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును అందజేశారు. అంతకుముందు విజయవాడలోని ఎన్ఎంయూ కార్యాలయంలో ఆ సంఘం కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్ఎంయూ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ..."ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 54 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే వేతన సవరణ చేపట్టాలి. 32 డిమాండ్లలో 9 రాష్ట్ర ప్రభుత్వం, మిగతా 23 యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలి" అని డిమాండు చేశారు. ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘమైన ఎంప్లాయీస్ యూనియన్‌తో పాటు మొత్తం 8 సంఘాలు ఐకాసగా ఏర్పడి వచ్చే నెల 6 నుంచి సమ్మెకు వెళ్తామని ఇప్పటికే ప్రకటించాయి. ఐకాసలో చేరని ఎన్ఎంయూ శుక్రవారం విడిగా సమ్మె నోటీసు అందజేసి సమ్మెకు సిద్ధమని వెల్లడించింది.



ఆర్టీసీ ఎండీ ఎన్.వి.సురేంద్రబాబుకు సమ్మె నోటీసు ఇస్తున్న ఎన్ఎంయూ నాయకులు

10వేల మందికి ఉద్యోగాల కల్పన

నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అడ్వాంటేజ్ ఏపీ- కెరీర్ ఎక్స్‌పో పేరుతో రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాలో 10,061 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు సంస్థ ఎండీ, సీఈవో కృతిక శుక్లా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26 ప్రాంతాల్లో ఉద్యోగ మేళా నిర్వహించామని, 37,671 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారని వివరించారు. అమెరికన్ ఎక్స్‌ప్రెస్, కోరమాండల్ ఫర్టిలైజర్స్, టెక్ మహీంద్ర, టాటా బిజినెస్ సపోర్టు సర్వీసెస్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై మౌఖిక పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సంస్థ ఏడాదికి రూ. 3.25 లక్షల వేతనంతో ఒకరిని, కోరమాండల్ రూ. 2.5లక్షల వేతనంతో 50మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నాయని వెల్లడించారు. యువనేస్తం లబ్ధిదారులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 40 గంటలపాటు ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి యువనేస్తం లబ్ధిదారులకు ఇప్పటివరకు మూడు విడతలుగా శిక్షణనిచ్చామని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతిభామూర్తులకు పద్మాభిషేకం

విభిన్న రంగాల్లో విశేష సేవలందించిన నలుగురు తెలుగు ప్రముఖులను పద్మశ్రీ పురస్కారం వరించింది. ప్రసిద్ధ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి, ప్రముఖ చదరంగ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, రైతునేస్తం వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఫుట్‌బాల్ క్రీడాకారుడు సునీల్ ఛెత్రీకి పద్మశ్రీ అవార్డులు దక్కాయి. అలాగే హైదరాబాద్‌లో చదివి, అమెరికాలో స్థిరపడిన టెక్ దిగ్గజం శంతను నారాయణ్‌కు ప్రవాస భారతీయుల కోటాలో పద్మశ్రీ లభించింది. దేశవ్యాప్తంగా మొత్తం 94 మందికి కేంద్రం ఈ పురస్కారాలు ప్రకటించింది.

అక్షరానికి 'పద్మా'లంకారం



అక్షరాన్ని అందలం ఎక్కించిన నేర్పరి, పాటని గంగా ప్రవాహంగా మార్చి పరవళ్లు తొక్కించిన కూర్పరి, తెలుగు సినీ వనంలో పద కుసుమాలను పూయించి, సిరివెన్నెలను చిలికించిన గీతకారుడు సీతారామశాస్త్రిని 'పద్మశ్రీ' వరించింది. సరసం, శృంగారం, వేదన, ఆర్ద్రత, ఆలోచన... ఇలా కవిత్వానికి ఎన్ని ఒంపులు ఉన్నాయో, అక్షరంలో ఎన్ని అందాలు ఉన్నాయో తెలిసిన చిత్రకారుడు.. సిరివెన్నెల. 'విధాత తలపున ప్రభవించినదీ' అంటూ ఏ క్షణాన ఆయన తెలుగు సినిమా పాట కోసం కలం పట్టుకున్నారో, అప్పుడే ఆయన తెలుగు పాటకు ముద్దు బిడ్డ అయిపోయారు. అప్పటి సినీ సంగీత ప్రయాణం నిర్విరామంగా సాగుతూనే ఉంది. 'సరస స్వర సుర ఝరీ గమనమైన' ప్రయాణం ఆయనది. 'అమృతగానమది అధరముదా, అమితానందపు యద సడిదా' అని ఆశ్చర్యపరిచిన గీత రచన ఆయనది. ఆయన పాటలతో ప్రశ్నించారు, జోల పాడారు, మేల్కొలిపారు. సంక్లిష్టమైన సన్నివేశానికి సైతం... అందమైన, అర్థవంతమైన పదాలతో, సామాన్యుడికి కూడా అర్థమయ్యేలా సాహిత్యాన్ని అందించారు.

చేంబోలు వేంకటయోగి, సుబ్బలక్ష్మి దంపతులకి ప్రథమ సంతానంగా 1955 మే 20న మధ్యప్రదేశ్‌లోని శివినిలో జన్మించారు సీతారామశాస్త్రి. అనకాపల్లిలో హైస్కూలు విద్యాభ్యాసం, కాకినాడ ఆదర్శ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్యకళాశాలలో చేరి ఒక యేడాది ఎమ్.బి.బి.ఎస్ చదివాక టెలిఫోన్స్ శాఖలో అసిస్టెంటుగా ఉద్యోగంలో చేరారు. కాకినాడలో ఉద్యోగం చేస్తున్నప్పుడే ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ చేశారు. అక్కడే పలువురు సాహితీవేత్తలతో ఆయనకి స్నేహం బలపడింది. భరణి అనే కలం పేరుతో పలు పత్రికల్లో కథలు, కవితలు రాశారు. 1985లో కె.విశ్వనాథ్ 'సిరివెన్నెల' చిత్రంతో సీతారామశాస్త్రి గీత రచయితగా సినీ రంగ ప్రవేశం చేశారు. అలా తొలి చిత్రం పేరే ఆయన ఇంటి పేరుగా మారిపోయింది.

సినిమా గేయ రచనే నాకు ఊపిరి. తెలుగు సినీ పరిశ్రమ మరో జన్మనిచ్చింది. పద్మ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. ఇది తెలుగు సినీరంగానికి లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నా. హృదయం స్పందించేలా రాస్తే పసిపాప మొదలు పండు ముదుసలి వరకు అందరూ ఆస్వాదిస్తారు.
–'సిరివెన్నెల' సీతారామశాస్త్రి.

చదరంగ రాణి



ద్రోణవల్లి హారిక.. చెస్ అభిమానులకు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు. పసి ప్రాయంలోనే చెస్ ఆడటం మొదలుపెట్టిన హారిక.. అండర్-9 జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలవడంతో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో మెరిసింది. 20 ఏళ్ల వయసులో గ్రాండ్‌మాస్టర్ అయిన హారిక.. ప్రతిష్టాత్మక మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో మూడు కాంస్యాలు (2012, 15, 17) సాధించింది. 2016లో మహిళల గ్రాండ్ ప్రి చెస్ టోర్నీ విజేతగా నిలిచింది.

ఫుట్‌బాల్‌ఆటలో మేటి



భారత ఫుట్‌బాల్‌లో మరే క్రీడాకారుడికీ సాధ్యం కాని ఘనతలందుకున్న ఆటగాడు సునీల్ ఛెత్రి. వంద అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఆడిన తొలి ఆటగాడు ఛెత్రినే. ఎక్కువ మ్యాచ్‌లు ఆడటమే కాదు.. ఏకంగా 67 గోల్స్ కూడా సాధించాడు. ప్రస్తుతం ఫుట్‌బాల్‌లో కొనసాగుతున్న క్రీడాకారుల్లో క్రిస్టియానో రొనాల్డో (85 గోల్స్) తర్వాతి స్థానం అతడిదే. ఇటీవలే మెస్సి (65)ను అతను అధిగమించాడు. కెప్టెన్‌గా, జట్టులో కీలక ఆటగాడిగా ఎన్నో ఏళ్లుగా భారత ఫుట్‌బాల్‌కు పర్యాయ పదంలా నిలుస్తున్న ఛెత్రి.. దేశానికి ఎన్నో విజయాలందించాడు.

రైతునేస్తాన్ని వరించిన పురస్కారం



రైతునేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావుకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తుల దిగుబడికి ఆయన చేస్తోన్న నిరంతర కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది.

యడ్లపల్లి 'రైతునేస్తం వెంకటేశ్వరరావు'గా తెలుగు రాష్ట్రాల రైతాంగానికి సుపరిచితులు. గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు మండలం కొర్నెపాడులో 1968లో జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టి, వ్యవసాయం చేస్తూ పెరిగిన వెంకటేశ్వరరావు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. రైతునేస్తం ఫౌండేషన్ స్థాపించి, 12 ఏళ్లుగా ఆదే పేరుతో వ్యవసాయ మాసపత్రిక నడుపుతున్నారు. ఈ క్రమంలో పశునేస్తం, ప్రకృతినేస్తం పత్రికలు ప్రారంభించి రైతులకు చేరువయ్యారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ డా.ఐవీ సుబ్బారావు పేరుతో వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ రంగాలలో విశేష ప్రతిభ కనబరచిన శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు, వ్యవసాయ పాత్రికేయులను ఏటా రైతునేస్తం పురస్కారాలతో గౌరవిస్తున్నారు.

వారం వారం శిక్షణ తరగతులు..

కొంత కాలంగా రైతునేస్తం ఫౌండేషన్ ద్వారా ప్రతి ఆదివారం కొర్నెపాడులో రసాయన రహిత సేద్యం, మిద్దెతోట, చిరుధాన్యాల సాగు ఆవశ్యకత, సేంద్రియ ఉత్పత్తుల అవసరం.. తదితర అనేక అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉభయ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వీటికి తోడు పలు గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

ఈ అవార్డు రైతాంగానికి ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నాను. రసాయనిక సాగు నుంచి సేంద్రియ సాగు వైపునకు రైతులు మరలేందుకు మరింతగా కృషి చేస్తా.
– యడ్లపల్లి వెంకటేశ్వరరావు

– న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, గుంటూరు, వట్టిచెరుకూరు

సౌరభాల సినీ పద్మాలు

కేంద్రప్రభుత్వం ఈ ఏడాది పద్మ పురస్కారాల్లో పలువురు సినీ ప్రముఖులకు చోటు కల్పించింది. ప్రముఖ మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్‌కు 'పద్మ భూషణ్' పురస్కారాన్ని ప్రకటించింది. తెలుగు సినిమా పాటను తన అక్షరాలతో సుసంపన్నం చేసిన ప్రముఖ గీత రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రికి పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. ఆయనతో పాటు ప్రముఖ డ్యాన్సర్ ప్రభుదేవా, డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్, బాలీవుడ్ నటులు ఖాదర్ ఖాన్, మనోజ్ బాజ్‌పాయిలకు పద్మశ్రీ పురస్కారాలు అందుకోనున్నారు.



వన్నె తరగని నటుడు



పాత్ర ఏదైనా సరే... అందులో జీవిస్తారు మోహన్‌లాల్. మాస్ కథానాయకుడిగా ఆయనకి కొండంత ఇమేజ్ ఉన్నా.. తెరపై పాత్రలే కనిపిస్తాయి తప్ప మోహన్‌లాల్ ఏ కోశానా కనిపించరు. మలయాళ చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన ఆయన అక్కడికే పరిమితం కాలేదు. హిందీ, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లోనూ నటించి జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకొన్నారు. అసమాన నటనా పటిమని ప్రదర్శించి నటుడిగా, నిర్మాతగా ఐదు జాతీయ పురస్కారాల్ని అందుకొన్న ఆయన, భారతప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' అందుకొన్నారు. ఇప్పుడు ఆయన కీర్తికిరీటంలో పద్మభూషణ్ కూడా చేరింది. 300 పైచిలుకు చిత్రాల్లో నటించిన ఆయన అభిరుచి గల నిర్మాతగా, గాయకుడిగా కూడా పేరు తెచ్చుకొన్నారు.

ఇండియన్ మైఖేల్ జాక్సన్



ప్రభుదేవా... ఈ పేరు వినిపిస్తే గుర్తుకొచ్చేది డ్యాన్సే. భారతీయ సినిమా డ్యాన్స్‌కి ప్రత్యేకమైన ఒరవడిని తీసుకొచ్చిన నృత్య దర్శకుడు.. ప్రభుదేవా. 'చికు బుకు చికు బుకు రైలే..' పాటలో ఆయన వేసిన డ్యాన్స్ చూసి 'ఒంట్లో ఉన్నవి నరాలా లేక స్ప్రింగులా?' అంటూ ఆశ్చర్యపోవడం ప్రేక్షకుల వంతైంది. ప్రేక్షకులు ఆయనకు ఇండియన్ మైఖేల్ జాక్సన్ అని బిరుదునిచ్చారు. ఇప్పుడు భారత ప్రభుత్వం ఆయనకి 'పద్మశ్రీ' గౌరవాన్ని ప్రకటించింది. 33 యేళ్లుగా సినీ ప్రయాణం కొనసాగిస్తున్న ప్రభుదేవా తాను డ్యాన్స్ వేయడమే కాదు... నృత్య దర్శకుడిగా కథానాయకులతోనూ నృత్యాలు వేయిస్తూ వారి అభిమానుల్ని మురిపించారు.

సంగీత సునామీ శివమణి!



వాయిద్యాలు ఆయనకు దాసోహం అంటాయి... శబ్దాలు ఆయన దగ్గర శివమెత్తి ఆడతాయి... ఆయన సంగీత ప్రయోగాలలో శాస్త్రవేత్త... స్వరాల సమ్మేళనంతో ఆడుకునే మంత్రవేత్త... సినిమా కార్యక్రమమైనా, అంతర్జాతీయ విభావరైనా ఆయన వేదిక మీద ఉంటే ప్రేక్షకులు ఉర్రూతలూగిపోతారు. ఆయనే శివమణి. అందరూ ఆయన్ని 'డ్రమ్స్‌మణి' అంటారు. ఇప్పుడు ఆయన 'పద్మశ్రీ' శివమణి. రకరకాల వాయిద్యాలతో వినూత్నమైన శబ్ద ప్రపంచంలోకి తీసుపోగలిగే సంగీత సునామీ ఆయన. మద్రాసులో 1959లో పుట్టిన శివమణి ఏడేళ్లకే డ్రమ్స్‌ను అలవోకగా వాయించేవాడు. పదకొండేళ్లకల్లా వేదికల మీద కచేరీల్లో మెరిశాడు.

సుమధుర గానానికి గౌరవం



ఐదేళ్ల వయసులోనే వీణ నేర్చుకుని, చిన్నతనంలోనే సంగీతాన్ని అభ్యసించిన కుర్రాడు స్వరాల బాటలోనే ఎదిగి గాయకుడిగా, స్వరకర్తగా శ్రోతలను ఉర్రూతలూగించాడు. అతడే శంకర్ మహదేవన్. బాలీవుడ్ సినిమాల్లో ఆయన అందించిన సినీ గీతాల శ్రావ్యత, ఇప్పుడు 'పద్మశ్రీ'తో పరిమళం కూడా అద్దుకుంది. ముంబైలోని చెంబూర్‌లో తమిళ అయ్యర్ల కుటుంబంలో 1967లో పుట్టిన శంకర్ మహదేవన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయినా స్వరాల ప్రయాణాన్నే కొనసాగించాడు. ఉత్తమ గాయకుడిగా, స్వరకర్తగా నాలుగు జాతీయ పురస్కారాలు సహా ఎన్నో అవార్డులు అతడి సొంతం.

ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయే నటుడు



'ప్రేమ కథ', 'హ్యాపీ', 'పులి', 'వేదం' తదితర తెలుగు చిత్రాల్లో సహాయక పాత్రల్లో కనిపించి మెప్పించిన బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పాయి. ఆయన్ని 'పద్మశ్రీ' వరించింది. రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో హిందీలో తెరకెక్కిన 'సత్య'తో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారాయన. ఈ చిత్రంలోని నటనకుగానూ ఉత్తమ సహాయనటుడిగా జాతీయ పురస్కారం అందుకున్నారు. బిహార్‌లోని సాధారణ రైతు కుటుంబంలో 1969లో జన్మించిన మనోజ్ బాజ్‌పాయ్ కాలేజీలోనే థియేటర్ ఆర్ట్సులో చేరారు. 'ఎలాంటి పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోయే అతికొద్దిమంది బాలీవుడ్ నటుల్లో మనోజ్ బాజ్‌పాయ్ ఒకరు''అనే పేరు బాజ్‌పాయికు ఉంది.

ప్రతి సూపర్‌హిట్‌లోనూ ఖాదర్ ఖాన్!



హిందీ చిత్ర సీమలో వైవిధ్యమైన పాత్రలను రక్తి కట్టించడంలోనే కాదు మాటల రచయితగానూ సత్తా చాటారు ఖాదర్ ఖాన్. బాలీవుడ్ విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఖాదర్ ఖాన్ ఈ మధ్యే అనారోగ్యంతో కన్నుమూశారు. మరణానంతరం ఆయనకు 'పద్మశ్రీ' ప్రకటించింది కేంద్రం. 1973లో రాజేష్ ఖన్నా నటించిన 'దాగ్'తో వెండితెరపై అడుగుపెట్టారు ఖాదర్. 'సుహాగ్', 'ముజ్ సే షాదీ కరోగీ', 'లక్కీ:నో టైమ్ ఫర్ లవ్' తదితర చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు బాలీవుడ్ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. 1980-90ల్లో బాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన ప్రతి చిత్రంలోనూ ఖాదర్ ఏదో ఒక పాత్రలో నటించారు.

ఆణిముత్యాలు.. ఆత్మబంధువులు

భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించిన వారిలో తెర వెనుక కథానాయకులెందరో ఉన్నారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రజాసేవే పరమార్థంగా వివిధ రంగాల్లో తమ జీవితాలను ధారపోస్తున్న ఆణిముత్యాల్లాంటి వ్యక్తులున్నారు. అలాంటి కొందరి సంక్షిప్త విశేషాల సమాహారం.

సాలుమరద తిమ్మక్క (కర్ణాటక)



వయసు: 106
రంగం: సామాజిక సేవ (పర్యావరణం)

- ఒంటరిగానే వేలాది మొక్కలు నాటి వాటిని సొంత పిల్లల్లా పెంచారు
- గత 65 ఏళ్లుగా వేలాది చెట్లను సంరక్షించారు.
- నెలకు 8,000 కి.మీ. మేర దేశమంతటా ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొని అవగాహన కలిగించారు.

డాక్టర్ సెరింగ్ నోర్బూ (జమ్ము-కశ్మీర్)



వయసు: 74 రంగం: వైద్యం

- గత 50 ఏళ్లుగా జమ్ము-కశ్మీర్ రాష్ట్రంలోని లద్దాఖ్ ప్రాంతానికి చెందిన మారుమూల గ్రామాలు, కొండప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు
- గత 50 ఏళ్లుగా ఏటా 500 ఆపరేషన్లు చేస్తున్నారు.
- లద్దాఖ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెన్షన్ అనే సంస్థ వ్యవస్థాపక సభ్యునిగా, గౌరవ కార్యదర్శిగా కొనసాగుతున్నారు.
- కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ గ్రామీణ సర్జన్ అవార్డు అందుకున్నారు.

తావో పోర్చోన్- లించ్ (అమెరికా)



వయసు: నూరేళ్లు
రంగం: యోగా- ఔషధం

- యోగా ద్వారా వయసుకు అతీతమైన దేహాన్ని, కాలమెరుగని మనసును సృష్టించిన మహిళ
- వందేళ్ల వయసున్న యోగా శిక్షకురాలు. రచయిత. మాజీ నటి.
- అమెరికాలో యోగా శిక్షకుల సంఘాన్ని; వెస్ట్‌చెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగాను స్థాపించారు.
- ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలైన యోగా ఉపాధ్యాయురాలిగా 2012లో గిన్నిస్ రికార్డు నెలకొల్పారు. అమెరికా, ఫ్రాన్స్ సహా ప్రపంచ వ్యాప్తంగా 43 ఏళ్లుగా యోగాను బోధిస్తున్నారు. 1,500 మంది యోగా శిక్షకులను తయారు చేశారు. 88 ఏళ్ల వయసులో బాల్‌రూమ్ డాన్స్ నేర్చుకున్నారు.

దయితారి నాయక్ (ఒడిశా)



వయసు: 75 ఏళ్లు
రంగం: సమాజ సేవ

- కొండలపై నుంచి పారే నీటిని పొలాలకు మళ్లించేందుకు 3 కి.మీ. కాలువను ఆయన ఒక్కరే తవ్వారు.
- ఇందుకోసం పార, పలుగు ఉపయోగించి నాలుగేళ్లు శ్రమించారు.
- బైతరణీ గ్రామం చుట్టూ ఉన్న వంద ఎకరాలకు నీళ్లు చేరాయి. ఇప్పటికీ అక్కడ నీటి కొరత లేదు.

మహమ్మద్ హనీఫ్ ఖాన్ శాస్త్రి (దిల్లీ)



వయసు: 67
రంగం: సాహిత్యం, విద్య

- ప్రాచీన భారత శ్లోకాల ఆధారంగా తాను రాసిన పుస్తకాలు, పద్యాల ద్వారా హిందూ-ముస్లిం మత సామరస్యానికి ఎనలేని కృషి.
- సంస్కృత, హిందీ భాషావేత్త
- ప్రాచీన భారత శ్లోకాలపై 8 పుస్తకాలు, 700 పద్యాలు రాశారు.
- 2009లో జాతీయ మత సామరస్య అవార్డు గ్రహీత.

దేవరాపల్లి ప్రకాశ్‌రావు (ఒడిశా)



వయసు: 59
రంగం: ప్రజాసేవ

- టీ విక్రయంతో వచ్చిన సంపాదనతో మురికివాడల చిన్నారులకు ఆయన విద్య, ఆహారం అందిస్తున్నారు.
- ఆదాయంలో సగం మొత్తాన్ని వెచ్చించి కటక్‌లో 'ఆశా ఓ ఆశ్వాసన' అనే పాఠశాలను నిర్వహిస్తున్నారు.
- ఏడో సంవత్సరం నుంచే పనిచేస్తున్న ఆయన పక్షవాతం (లోయర్ టార్సో పెరాలసిస్)తో బాధపడుతున్నారు.
- 1978 నుంచి 200 సార్లుకు పైగా రక్తదానం చేశారు. ఏడుసార్లు ప్లేట్‌లెట్స్ దానం చేశారు.


ఫ్రెడిరైక్ ఇరినా బ్రునింగ్ (జర్మనీ)



వయసు: 59 రంగం: సామాజిక సేవ (పశు సంరక్షణ)

- 23 ఏళ్లుగా గోశాల నడుపుతూ 1,200 ఆవుల సంరక్షణ చూస్తున్నారు
- మథురలో సురభి గౌసేవ నికేతన్‌ను ప్రారంభించారు
- అనారోగ్యానికి గురయిన వేలాది ఆవులను ఆదుకున్నారు
- వీధుల్లో తిరిగే ఆవులను గోశాలకు తీసుకొస్తుంటారు
- నెలకు రూ.22 లక్షల వరకు వెచ్చిస్తున్నారు
- ఆమెను సుదేవి మాతాజీ అని పిలుస్తారు

కుట్రను ఛేదించి సగర్వంగా నిలిచి..



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో కీలక శాస్త్రవేత్తగా ఉన్న నంబి నారాయణన్ కొన్ని శక్తులు పన్నిన దుష్ట పన్నాగం వల్ల తన కెరీర్‌ను, జీవితాన్ని కోల్పోయారు. గూఢచర్యం లాంటి దారుణమైన కేసులో ఇరుక్కొని నానా ఇబ్బందులు, అవమానాలు పడ్డారు. అయినా ధైర్యంగా ఎదుర్కొని తన నిజాయితీని, నిబద్ధతను చాటుకొని దేశం ముందు సగర్వంగా నిలబడ్డారు. భారీ ఉపగ్రహాలను ప్రయోగించేందుకు జీఎస్ఎల్‌వీ రాకెట్‌లను రూపొందించాలనుకున్న ఇస్రో.. అందులో అవసరమైన క్రయోజెనిక్ పరిజ్ఞానంపై దృష్టి పెట్టింది. 1990లో ఈ సాంకేతికతను రష్యా నుంచి కొనుగోలు చేసేందుకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే అమెరికా ఒత్తిడితో రష్యా వెనక్కి తగ్గింది. దీంతో ఈ పరిజ్ఞానాన్ని సొంతంగా అభివృద్ధి చేయాలని ఇస్రో నిర్ణయించింది. నంబి నారాయణన్ నేతృత్వంలో 1994 ఏప్రిల్‌లో ఒక ప్రాజెక్టును చేపట్టింది. అయితే అదే ఏడాది అక్టోబరులో కేరళ పోలీసులు మాల్దీవులకు చెందిన మరియం రషీదా అనే మహిళను అరెస్టు చేశారు. ఆమెను ప్రశ్నించినప్పుడు పాకిస్థాన్ కోసం క్రయోజెనిక్ ఇంజిన్ పరిజ్ఞానాన్ని బదిలీ చేసేలా తాను కొందరు ఇస్రో శాస్త్రవేత్తలను సంప్రదించినట్లు ఆమె చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం నంబి నారాయణన్, శశికుమారన్ అనే మరో శాస్త్రవేత్తను అరెస్టు చేశారు. రహస్య పత్రాలను పాక్‌కు అందజేశారని ఆరోపించారు. 50 రోజుల పాటు వీరిని జైల్లో ఉంచి మానసికంగా, శారీరకంగా హింసించారు. 1996లో ఈ కేసు విచారణను సీబీఐ చేపట్టింది. గూఢచర్యం ఆరోపణలకు ఆధారాలు లేవని తేల్చింది. పోలీసుల ఆరోపణలన్నీ ఉత్తుత్తవేనని పేర్కొంది. ఆ తర్వాత కూడా కేసును తిరగతోడటానికి కేరళ సర్కారు మరోసారి ప్రయత్నించింది. దీనిని సుప్రీం కోర్టు అడ్డుకుంది. మరోవైపు తన జీవితాన్ని నాశనం చేసిన పోలీసు అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు. వీటిని కేరళ సర్కారు పట్టించుకోలేదు. చివరికి గత ఏడాది సుప్రీం కోర్టు ఆయన విజ్ఞప్తిని మన్నించింది. తప్పుడు పద్ధతుల్లో నారాయణన్‌ను ఇరికించిన అధికారులపై చర్యలకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. నారాయణన్‌కు అనుభవించిన మానసిక క్షోభకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని కూడా కేరళ సర్కారును ఆదేశించింది.

శాంతికాముకుడు కులదీప్ నయ్యర్



మానవహక్కుల ఉల్లంఘనలపై విస్ఫులింగమై నిప్పులు చెరిగిన పాత్రికేయుడు కులదీప్ నయ్యర్ ....శాంతికాముకుడిగా కూడా అంతే ప్రసిద్ధుడు. ఎమర్జెన్సీ సమయంలో 'ది స్టేట్స్‌మన్' పత్రిక సంపాదకుడిగా ఉన్న సమయంలో ఏకంగా నాటి ఇందిరాగాంధీ సర్కారుపై నిర్భయంగా వెలిబుచ్చిన అభిప్రాయాలు ఆయన అరెస్టుకూ దారి తీశాయి. ఉర్దూ దినపత్రికతో పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించిన కులదీప్ నయ్యర్ తర్వాత ఆంగ్లపత్రికలకు మారారు. 1923లో సియాల్‌కోట్‌లో జన్మించిన ఆయన వర్తమాన రాజకీయాలపై నిష్కర్షగా వ్యాఖ్యానాలు రాసేవారు. అన్నాహజారే ఉద్యమాన్ని గట్టిగా సమర్థించారు. 1971లో తూర్పు పాకిస్థాన్‌లో పాక్‌సైనిక అత్యాచారాలకు క్షమాపణ చెప్పనందుకు ఆయన పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ఇటు భారత్‌లో...అటు పాకిస్థాన్‌లో అన్యాయాలపై విరుచుకుపడిన ఆయన ఉభయదేశాల్లోనూ శాంతిని ఆకాంక్షిస్తూ అంతే తీవ్రంగా ప్రయత్నించారు. రెండు దేశాలు చక్కని ఇరుగుపొరుగులా ఉండాలని తపించిపోయారు. 2018లో దిల్లీలో ఆయన మరణించారు.



పద్మ పురస్కారాల వివరాల పూర్తి జాబితా www.eenadu.netలో

సెన్సెక్స్ ▼ 170 **36026** | నిఫ్టీ ▼ 69 **10781** | డోజోన్స్ 24741 ▲ 188 | నాస్‌డాక్ 7165 ▲ 91 | రూపాయి 71.17 ▼ 10 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 61.45 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+) నిఫ్టీ	25న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	25న	మార్పు%
BHARTI INFRATEL	279.75	6.37	ZEE ENTERTAINMENT	318.40	-26.61
HCL TECH	969.40	2.42	MARUTI SUZUKI	6513.40	-7.49
YES BANK	219.60	1.95	ULTRATECH CEM	3510.80	-7.38
BHARTI AIRTEL	307.50	1.94	HERO MOTOCORP	2670.15	-4.30
CIPLA	507.65	1.39	INDIABULLS HSG	744.50	-3.75
TCS	1920.80	1.01	GRASIM IND	759.60	-3.33
BPCL	357.45	0.99	JSW STEEL	274.65	-3.17


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.66	74.97	బహ్రెయిన్ దీనార్	174.93	200.14
పౌండ్ స్టెర్లింగ్	84.84	98.37	కువైట్ దీనార్	193.64	241.13
యూరో	73.19	84.90	ఒమన్ రియాల్	171.24	196.16
జపనీస్ యెన్/100	58.90	68.31	సౌదీ రియాల్	17.19	20.37
ఆస్ట్రేలియా డాలరు	45.96	53.18	యూఏఈ దిర్హమ్	17.59	20.55
సింగపూర్ డాలరు	47.58	56.36	మలేషియా రింగిట్	15.30	18.81
థాయ్ బాత్/100	204.09	244.01	చైనీస్ యువాన్	7.42	12.05

శుక్రవారం నిఫ్టీ కదలికలు



మారుతీ సుజుకీకి కలిసి రాలేదు

- 17 శాతం తగ్గిన లాభం
- 5 ఏళ్లలో ఇదే అతిపెద్ద క్షీణత

దిల్లీ: దేశీయ వాహన దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) నిరాశపరచింది. వరుసగా రెండో త్రైమాసికంలోనూ నికర లాభంలో క్షీణత నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.1,489.3 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.1,799 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 17.21 శాతం తక్కువ కావడం గమనార్హం. గత అయిదేళ్లలో ఒక త్రైమాసికంలో ఈ స్థాయిలో లాభం తగ్గడం ఇదే ప్రథమం. పండగల సీజన్‌లో అంచనాల కంటే తక్కువ అమ్మకాలు నమోదు కావడం, అధిక ముడివస్తువుల ధరలు, ప్రతికూల విదేశీ మారక ధరలు లాభంపై ప్రభావం చూపాయని మారుతీ సుజుకీ వెల్లడించింది. ఇక మొత్తం ఆదాయం రూ.19,528.1 కోట్ల నుంచి 5.41 శాతం వృద్ధితో రూ.20,585.6 కోట్లకు చేరింది.



తగ్గిన అమ్మకాలు: సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ మొత్తం 4,28,643 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 0.6 శాతం తక్కువ. అధిక మార్కెటింగ్, అమ్మకాల వ్యయాలు, అధిక వృద్ధి కోసం వనరులు, సామర్థ్యాలపై ఖర్చులు పెరగడం వంటివి ప్రతికూల ప్రభావం చూపాయని కంపెనీ వెల్లడించింది. ఖర్చులు తగ్గించడం, ఉద్యోగులు, పంపిణీదారుల నుంచి సలహాలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించింది. పండగల సీజన్ నేపథ్యంలో డీలర్ల వద్ద అదనంగా 90,000 వాహనాలు నిల్వ ఉంచామని, అయితే అమ్మకాలు అంచనాలు అందుకోలేదని తెలిపింది. సెప్టెంబరు త్రైమాసికంలోనూ కంపెనీ నికర లాభం 9.8 శాతం తగ్గి రూ.2,240.4 కోట్లకు చేరిన విషయం తెలిసిందే. 2013-14 నాలుగో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 35.46 శాతం తగ్గిన తర్వాత.. గత త్రైమాసికంలోనే లాభం ఎక్కువగా తగ్గింది. బలహీన మార్కెట్ పరిస్థితులు సైతం ప్రతికూల ప్రభావం చూపాయని మారుతీ తెలిపింది. ఇక ఎగుమతులు సైతం 8.5 శాతం తగ్గాయి.

కుదేలైన షేరు: బలహీన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మారుతీ సుజుకీ షేరు కుదేలైంది. బీఎస్ఈలో ఇంట్రాడేలో 8.77 శాతం కుప్పకూలిన షేరు.. రూ.6,420 వద్ద 52 వారాల కనిష్ఠానికి చేరింది. చివరకు 7.40 శాతం నష్టంతో రూ.6,516.35 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.15,739.06 కోట్లు ఆవిరై రూ.1,96,845.94 కోట్లకు చేరింది.

ఎల్&టీ లాభం రూ.2,042 కోట్లు

ముంబయి: ఎల్అండ్‌టీ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.2,042 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన రూ.1,490 కోట్లతో పోలిస్తే ఇది 37 శాతం అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.28,747 కోట్ల నుంచి 24 శాతం పెరిగి, రూ.35,709 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయంలో అంతర్జాతీయ ఆదాయం 32 శాతంగా (రూ.11,476 కోట్లు) నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీకి రూ.42,233 కోట్ల ఆర్డర్లు వచ్చాయి. అయితే ఎంపిక విధానాల్లో వాయిదాల వల్ల కొన్ని ఆర్డర్లు ఆలస్యమైన విషయాన్ని కంపెనీ ప్రస్తావించింది. ముఖ్యంగా రోడ్లు, వంతెనలకు సంబంధించిన (ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ఆర్డర్లు, భారీ సివిల్ ఆర్డర్లు, విద్యుత్ వ్యాపారానికి సంబంధించిన ఆర్డర్లు లభించడంలో ఆలస్యమైనట్లు తెలిపింది. 'సమీక్షా త్రైమాసికంలో ప్రాజెక్టు వ్యాపారాలు, సేవా వ్యాపారాల్లో బలమైన పని తీరును కనబరచడం వల్లే ఆదాయంలో మంచి వృద్ధి నమోదైంద'ని కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది.



బీఎస్ఈలో షేరు 0.85 శాతం నష్టంతో రూ.1285.55 వద్ద ముగిసింది.

నిరాశపరచిన ఇండియన్ బ్యాంక్

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ రూ.152.26 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంకు ఆర్జించిన నికర లాభం రూ.303.06 కోట్లతో పోలిస్తే ఇది 50 శాతం తక్కువ. మొత్తం ఆదాయం రూ.4,903.07 కోట్ల నుంచి రూ.5,269.10 కోట్లకు పెరిగింది.

ఆస్తుల నాణ్యత ఇలా: మొత్తం రుణాల్లో బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 6.27 శాతం నుంచి 7.46 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు కూడా 3.30 శాతం నుంచి 4.42 శాతానికి చేరాయి. అంకెల్లో చెబితే, స్థూల ఎన్‌పీఏలు రూ.9,595.15 కోట్ల నుంచి రూ.13,198.40 కోట్లకు చేరగా, నికర ఎన్‌పీఏలు రూ.4,898.60 కోట్ల నుంచి రూ.7,571.07 కోట్లకు పెరిగాయి. దీంతో మొండి బకాయిలకు కేటాయింపులు రూ.385.49 కోట్ల నుంచి రూ.973.88 కోట్లకు పెరిగినట్లు బ్యాంకు ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది.

బీఎస్ఈలో షేరు 6.79 శాతం నష్టంతో రూ.238.70 వద్ద ముగిసింది.

అగ్రి కెమికల్స్‌లోకి నాట్కో ఫార్మా

రూ.100 కోట్లతో నెల్లూరు జిల్లాలో ప్లాంటు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఔషధాల తయారీ కంపెనీ నాట్కో ఫార్మా అగ్రి కెమికల్స్ వ్యాపారంలోకి అడుగుపెడుతోంది. అగ్రి కెమికల్స్ తయారీ నిమిత్తం ఒక కొత్త యూనిట్ కూడా నిర్మిస్తోంది. ఈ విభాగంపై రూ.100 కోట్లు పెట్టుబడిగా పెడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో అగ్రి కెమికల్స్ తయారీ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు నాట్కో ఫార్మా శుక్రవారం ఇక్కడ వెల్లడించింది. ప్లాంటు నిర్మాణం ఇప్పటికే ప్రారంభం అయినట్లు పేర్కొంది. ఈ సంవత్సరాంతం నాటికి ఇది ఉత్పత్తి దశలోకి వచ్చే అవకాశం ఉందని తెలియజేసింది. దీన్లో వ్యవసాయ రసాయనాలు, క్రిమి సంహారక మందులు.. రెండూ తయారు చేయనున్నట్లు వివరించింది. ఔషధాల ఆవిష్కరణ-తయారీ విభాగాల్లో నాట్కో ఫార్మాకు విశేష పరిజ్ఞానం, అనుభవం ఉన్న విషయం తెలిసిందే. ఈ అనుభవంతో అగ్రి కెమికల్స్ విభాగంలోనూ వినూత్నమైన ఉత్పత్తులను ఆవిష్కరించగలుగుతామనే ధీమాను నాట్కో ఫార్మా వ్యక్తం చేసింది.



నాట్కో సీఎండీ వీసీ నన్నపనేని

ఫార్మా కంపెనీలు అగ్రి కెమికల్స్ తయారీ కూడా చేపట్టడం ఎంతో కాలం ముందు నుంచే ఉంది. రసాయన శాస్త్రంలో నైపుణ్యం ఉన్నందున అటు ఔషధాలు, ఇటు క్రిమిసంహారక మందులు తయారు చేసే అవకాశం ఇటువంటి కంపెనీలకు ఉంటోంది. ప్రపంచ వ్యాప్తంగా పలు అగ్రశ్రేణి ఔషధ సంస్థలు మందులతో పాటు క్రిమిసంహారక మందులు కూడా తయారు చేస్తున్నాయి. బహుళ జాతి ఔషధ సంస్థలైన నొవార్టిస్, బేయర్ రెండు దశాబ్దాల క్రితం వరకూ ఔషధాలు, క్రిమిసంహారక మందులు తయారు చేశాయి. ఇప్పటికీ బేయర్ అటు ఔషధాలు, ఇటు క్రిమిసంహారక మందులు విక్రయిస్తోంది. ఈ కోవలో ఇప్పుడు నాట్కో ఫార్మా వచ్చి చేరుతోంది.

దేశీయంగా వ్యవసాయ రసాయనాలు, క్రిమి సంహారక మందులకు అతిపెద్ద మార్కెట్ ఉంది. వ్యవసాయ రసాయనాలు, క్రిమిసంహారక మందుల మార్కెట్ మనదేశంలో వచ్చే అయిదేళ్లలో 5 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.35,000 కోట్లు) చేరుకునే అవకాశం ఉందని అంచనా. ఈ అవకాశాన్ని గుర్తించి ఎన్నో విదేశీ కంపెనీలు ఇక్కడ ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టాయి. అంతేగాక దేశీయ మార్కెట్లో బేయర్ క్రాప్‌సైన్స్, మోన్‌శాంటో ఇండియా, అదామా ఇండియా వంటి విదేశీ కంపెనీల ఆధిపత్యం కనిపిస్తోంది. ఇజ్రాయెల్ సంస్థ అయిన అదామా ఇండియా హైదరాబాద్ కేంద్రంగా హెర్బిసైడ్, ఇన్సెక్టిసైడ్‌లను దేశవ్యాప్తంగా విక్రయిస్తోంది. దేశీయ అగ్రి కెమికల్స్ కంపెనీల్లో పీఐ ఇండస్ట్రీస్, ర్యాలీస్ ఇండియా, ధనూకా, ఎక్సెల్ క్రాప్‌కేర్ తదితర సంస్థలు ఉన్నాయి.

మార్కెట్ కబుర్లు

- హిందుస్థాన్ యునిలీవర్‌తో విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం లభించినట్లు **గ్లాక్సోస్మిత్ క్లైన్ కన్జూమర్ హెల్త్‌కేర్** వెల్లడించింది. పూర్తి ఈక్విటీ బదిలీ ద్వారా జరగనున్న ఈ లావాదేవీ విలువ రూ.31,700 కోట్లు.
- **భారతీ డిఫెన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టుడేస్ రైటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్** షేర్ల ట్రేడింగ్‌ను ఫిబ్రవరి 1 నుంచి నిలిపివేస్తున్నట్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ) తెలిపింది.
- జర్మనీ వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల బ్రాండ్ **క్రెమె 21**ను వెల్లడించని మొత్తానికి ఇమామీ కొనుగోలు చేసింది. మధ్య ప్రాచ్య, ఇతర ప్రధాన విపణుల్లో క్రెమె 21కు మంచి పట్టు ఉంది.
- ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్ దిగ్గజ సంస్థ సీఈఎస్‌సీ నుంచి విడిపడిన **స్పెన్సర్స్ రిటైల్, సీఈఎస్‌ఈ వెంచర్స్** షేర్లు బలహీనంగా నమోదయ్యాయి. ఈ రెండు సంస్థలు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.
- కేడిలా హెల్త్‌కేర్, మరో మూడు సంస్థలకు రూ.2,575 కోట్ల విలువైన షేర్లను విక్రయించడానికి **జైడస్ వెల్‌నెస్**కు సీసీఐ ఆమోదం లభించింది.
- వాల్‌మార్ట్- ఫ్లిప్‌కార్ట్ లావాదేవీపై సీసీఐ ఇచ్చిన అనుమతిపై ట్రేడర్ల సంఘం **సీఏఐటీ** దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) రిజర్వు చేసింది.
- డెన్ నెట్‌వర్క్స్, హాత్‌వే కేబుల్ అండ్ డేటాకామ్‌ల్లో మెజారిటీ వాటాను రూ.5,230 కొనుగోలు చేయాలన్న **రిలయన్స్ ఇండస్ట్రీస్** ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ అనుమతి ఇచ్చింది.
- దిల్లీలోని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)- ఎస్ఈఏఆర్ఓ భవనాన్ని పునరాభివృద్ధి నిమిత్తం రూ.228 కోట్ల విలువైన ఆర్డరును **ఎన్‌బీసీసీ** దక్కించుకుంది. ప్రస్తుతం సంస్థ చేతిలో రూ.80,000 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి
- ఉన్నత శ్రేణి హోటళ్ల నిర్వహణ, అభివృద్ధి కార్యకలాపాలు నడిపే **చాలెట్ హోటల్స్** పబ్లిక్ ఇష్యూకు సిద్ధమైంది. 29న ప్రారంభమయ్యే ఇష్యూ 31న ముగియనుంది. ఈ ఐపీఓ ధరల శ్రేణి రూ.275- 280గా నిర్ణయించారు. ఐపీఓ ద్వారా రూ.1600 కోట్లు సమీకరించడానికి సంస్థ సన్నాహాలు చేస్తోంది.

భారతీ ఇన్‌ఫ్రాటెల్‌కు రూ.2,900 కోట్లు

- టెలికాం సంస్థల నుంచి సెటిల్‌మెంట్ చార్జీలుగా వసూలవుతాయ్

దిల్లీ: కాంట్రాక్టు గడువు తీరడానికి ముందే, సెల్ సైట్ల నుంచి తప్పుకున్న 4 టెలికాం సంస్థల నుంచి రూ.2,900 కోట్లు సెటిల్‌మెంట్ చార్జీలుగా లభిస్తాయని, టెలికాం మౌలిక సదుపాయాల సంస్థ భారతీ ఇన్‌ఫ్రాటెల్ తెలిపింది. భారతీ ఎయిర్‌టెల్, టెలినార్, వొడాఫోన్ ఐడియాల నుంచి ఈ మొత్తం లభిస్తుందని పేర్కొంది. ఇండస్ టవర్స్ వాటా కూడా కలిపితే, మొత్తం పరిష్కార రుసుము కింద రూ.3,600 కోట్లు వసూలు కావచ్చని అంచనా వేసింది. దేశంలోనే పెద్దదైన టెలికాం టవర్ల సంస్థ ఇండస్ టవర్స్‌లో భారతీ ఇన్‌ఫ్రాటెల్‌కు 42 శాతం వాటా ఉంది. అయితే ఈ సెటిల్‌మెంట్ ఒప్పందంలో, నగదు రూపేణ ఇచ్చేది రూ1,800 కోట్లు కావచ్చని సీఎల్ఎస్ఏ నివేదిక పేర్కొంది.

పెద్ద షేర్లు పడేశాయ్

- మారుతీ, జీఎంటర్‌టైన్‌మెంట్ డీలా
- తోడైన బలహీన ఫలితాలు
- 169 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

సమీక్ష

సూచీల ఆరంభ జోరుకు కళ్లెం పడింది. మారుతీ సుజుకీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి పెద్ద షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. బలహీన త్రైమాసిక ఫలితాలు ఇందుకు తోడయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ముడిచమురు ధరలు పెరగడం ప్రతికూల ప్రభావం చూపాయి. వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 361 పాయింట్లు, నిఫ్టీ 126 పాయింట్లు చొప్పున నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,245.77 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ ఇంట్రాడేలో 36,474.48 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఇంట్రాడేలో 35,953.15 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 169.56 పాయింట్ల నష్టంతో 36,025.54 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 69.25 పాయింట్లు కోల్పోయి 10,780.55 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,756.45- 10,931.70 పాయింట్ల మధ్య కదలాడింది.

జీ ధమాల్: వాటా విక్రయానికి సోనీ పిక్చర్స్ సహా పలు సంస్థలతో ప్రమోటర్లు చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వెలువడటంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు కుప్పకూలాయి. ఇంట్రాడేలో 30 శాతం కుప్పకూలిన షేరు రూ.288.95 వద్ద 52 వారాల కనిష్ఠానికి చేరింది. చివరకు 26.43 శాతం నష్టంతో రూ.319.35 వద్ద ముగిసింది. జీ అనుబంధ సంస్థ డిష్ టీవీ సైతం 32.74 శాతం పతనమై రూ.22.60 దగ్గర స్థిరపడింది.

- కొత్త ఎండీ, సీఈఓగా రవ్‌నీత్ గిల్ నియామకం నేపథ్యంలో యెస్ బ్యాంక్ షేర్లు రెండో రోజూ పరుగులు తీశాయి. ఇంట్రాడేలో 10.49 శాతం దూసుకెళ్లిన షేరు రూ.236.30 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2.71 శాతం లాభంతో రూ.219.65 వద్ద ముగిసింది.
- సీబీఐ సోదాల నేపథ్యంలో డీఎల్ఎఫ్ షేరు ఇంట్రాడేలో 18.45 శాతం డీలాపడింది. చివరకు 11.50% నష్టంతో రూ.157.05 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టాలు చవిచూశాయి. మారుతీ 7.40%, హీరో మోటోకార్ప్ 4.23%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.16%, ఏషియన్ పెయింట్స్ 2%, ఎం అండ్ ఎం 1.94%, టాటా స్టీల్ 1.77%, బజాజ్ ఫైనాన్స్ 1.34%, టాటా మోటార్స్ 1.23%, ఎన్‌టీపీసీ 1.21%, కోల్ ఇండియా 1.09% చొప్పున డీలాపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్ 2.54%, భారతీ ఎయిర్‌టెల్ 1.81%, టీసీఎస్ 0.91%, వేదాంతా 0.88%లు రాణించిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి అత్యధికంగా 4.09% తగ్గింది. వాహన, లోహ, యంత్ర పరికరాలు, విద్యుత్, పీఎస్‌యూ, మౌలిక, బ్యాంకింగ్ షేర్లు అదే బాటలో నడిచాయి. మన్నికైన వినిమయ వస్తువులు, ఐటీ షేర్లు మాత్రం రాణించాయి. బీఎస్ఈలో 1885 షేర్లు ప్రతికూలంగా, 677 స్క్రిప్‌లు సానుకూలంగాను ముగిశాయి.

రూ.1950కే 3 ఫోన్లు

సెలెక్ట్ మొబైల్స్ గణతంత్ర దినోత్సవ ఆఫర్లు

హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆఫర్లు ఇస్తున్నట్లు సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై.గురు తెలిపారు. కార్బన్, సెల్‌కాన్‌లోని పలు మోడళ్లపై 26 శాతం నగదు వెనక్కి, మోటరోలా, హానర్, మరికొన్ని బ్రాండ్ల మోడళ్లపై రూ.2019 రాయితీ, రూ.70కే కొన్ని అనుబంధ పరికరాలు (యాక్సెసరీస్), రూ.1950కే 3 ఫోన్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చిత బహుమతి అందిస్తామన్నారు. పాత ఫోన్ మార్పిడి సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.


అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2018–19	నికర లాభం/(నష్టం) 2017–18	మొత్తం ఆదాయం 2018–19	మొత్తం ఆదాయం 2017–18
గృహ్ ఫైనాన్స్	96.95	90.84	540.06	432.75
డీహెచ్ఎఫ్ఎల్	313.60	495.44	3255.90	2896.66
జీఎస్ఎఫ్‌సీ	98.94	199.57	1883.40	1422.75

25న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	417
బెంగళూరు	420	చెన్నై	430
26వ తేదీకి...		చిత్తూరు	423
విజయవాడ/గోదావరి	417	నమక్కల్	420

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 373.85 (380.95) 4760625
ASIAN PAINTS 1372.15 (1401.85) 1613548
AXIS BANK LT 669.75 (663.65) 6628922
BAJAJ AUTO L 2626.35 (2651.65) 304062
BAJAJ FINANC 2599.55 (2635.65) 916927
BAJAJ FINSER 6321.55 (6407.30) 92525
BHARTI AIRTE 307.50 (301.65) 5443641
BHARTI INFRA 279.75 (263.00) 11828569
BPCL 357.45 (353.95) 1934416
CIPLA 507.65 (500.70) 1193442
COAL INDIA L 220.95 (223.85) 3432012
DR. REDDYS 2672.40 (2668.45) 609282
EICHER MOTOR 20049.95 (20115.60) 67189
GAIL 334.90 (333.60) 3615927
GRASIM IND 759.60 (785.80) 991355
HCL TECH 969.40 (946.45) 2155004
HDFC 1977.80 (1971.10) 2240491
HDFC BANK 2096.00 (2102.25) 2815559
HERO MOTOCOR 2670.15 (2790.20) 775065
HINDALCO IND 204.45 (205.05) 4381964
HINDUSTAN UN 1756.80 (1759.50) 1131790
HPCL 241.80 (243.10) 4234919
ICICI BANK 357.20 (364.80) 22978238
INDIABULLS H 744.50 (773.50) 5757364
INDIAN OIL 137.75 (136.80) 6255229
INDUSINDBANK 1484.90 (1490.30) 1738412
INFOSYS LTD 730.35 (732.00) 5543112
ITC 279.20 (278.90) 8897906
JSW STEEL LT 274.65 (283.65) 5191436
KOTAK MAHIND 1266.15 (1267.75) 1441296
LARSEN & TOU 1285.45 (1295.35) 3136788
M&M 683.50 (697.30) 3421228
MARUTI SUZIK 6513.40 (7040.60) 3062762
NTPC LTD 138.30 (140.05) 4552697
ONGC 142.00 (141.70) 3871762
POWER GRID C 185.85 (186.75) 2175999
RELIANCE IND 1246.00 (1247.45) 8550836
SBI 285.40 (288.05) 11121223
SUN PHARMA 422.40 (423.00) 8720973
TATA CONSULT 1920.80 (1901.55) 2327080
TATA MOTORS 173.25 (175.40) 12136892
TATA STEEL L 452.90 (460.75) 4157967
TECH MAHINDR 729.05 (727.75) 2528541
TITAN IND 978.00 (969.65) 1985833
ULTRATECH 3510.80 (3790.70) 1593195
UPL LIMITED 753.10 (747.35) 1770239
VEDANTA LIMI 194.70 (193.50) 6437316
WIPRO 353.45 (351.75) 5236553
YES BANK LTD 219.60 (215.40) 183425643
ZEE ENTERTAI 318.40 (433.85) 74261004

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1254.60 (1258.35) 34335
ACC 1375.00 (1419.70) 533516
ADITYA BIRLA 87.20 (89.45) 1090265
AMBUJA CEMEN 202.35 (211.20) 2945463
ASHOK LEYLAN 82.60 (84.80) 24874754
AUROBIND PHA 786.15 (788.80) 1464004
AVENUE SUPER 1365.70 (1391.55) 683139
BANDHAN BANK 424.45 (413.90) 1308247
BANK OFBAROD 110.20 (113.00) 8760153
BEL 80.35 (82.80) 5902826
BHEL 66.40 (69.05) 7134722
BIOCON LTD 664.70 (670.10) 8429182
BOSCH LTD 18526.25 (19155.40) 19282
BRITANNIA 3206.65 (3216.85) 325166
CADILA HEALT 343.70 (346.10) 784074
COLGATE PALM 1288.30 (1321.90) 786966
CONTAINER 660.40 (664.05) 427790
DABUR INDIA 430.00 (430.40) 1819072
DLF LIMITED 158.00 (177.75) 20781142
GENERAL INS 245.30 (250.00) 39491
GODREJ CONSU 780.30 (790.60) 1154910
HAVELLS INDI 708.15 (702.60) 1994088
HDFC STAND L 359.40 (361.20) 1351651
HINDUSTAN ZI 250.40 (257.95) 1090204
ICICI LOMBAR 855.45 (848.40) 482398
IDEA CELLULR 32.85 (34.05) 23369945
INTERGLOBE A 1161.75 (1178.55) 2320373
L&TFIN.HOLD 134.65 (137.50) 5569523
LIC HOUS.FIN 453.05 (469.60) 1484734
LUPIN 865.05 (868.40) 1345215
MARICO LIMIT 369.90 (373.95) 1340306
MCDOWELL 554.85 (571.75) 1699151
MOTHERSON 150.80 (154.05) 3434367
MRF 63920.95 (64902.75) 3105
NHPC LTD 25.00 (25.30) 2218123
NMDC LTD 90.50 (90.10) 2936155
OIL INDIA 171.85 (170.00) 1337495
ORACLE FIN S 3708.00 (3796.40) 18300
P&G HYG&HEAL 9928.85 (9921.30) 808
PETRONET LNG 227.05 (226.30) 1735213
PIDILITE IND 1129.80 (1109.35) 1102595
PIRAMAL ENTE 2299.20 (2307.75) 372935
SAIL 47.25 (48.25) 9383714
SBI LIFE INS 619.60 (618.25) 222746
SHREE CEMENT 15723.20 (16170.55) 34071
SHRIRAM TRAN 1120.15 (1114.55) 1191243
SIEMENS 1029.75 (1027.95) 213256
SUN TV LTD 505.85 (527.00) 3808529
THE NEW INDI 174.80 (179.00) 30094

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 5.41 (5.69) 75
AISHWARYA TE 2.85 (2.99) 2135
ALPHAGEO 465.20 (470.05) 469
AMAR RAJA BA 764.65 (775.35) 10080
ANDHRA BANK 26.65 (27) 27759
ANDHRA CEMEN 4.87 (5.10) 7941
ANDHRA PAPER 421.40 (432.65) 3499
ANDHRA PETRO 58.70 (59.75) 70031
ANDHRA SUGAR 310.95 (311.05) 956
ANJANI PORTL 115.55 (119.75) 442
ASTRA MICROW 79.65 (80.40) 9806
AUROBINDO PH 783.40 (787.80) 292875
AVANTEL SOFT 222.10 (222) 2384
AVANTI FEEDS 349.40 (358.70) 17206
BALAJI AMIN 461.45 (480.30) 6340
BARTRONICS 6.61 (6.74) 2954
BHAGIRA CHEM 431.35 (430) 3274
BHAGYA NAG 34.25 (34.80) 1751
BN RATHI SEC 24.75 (25.05) 450
BRILLIANT SE 0.96 (1.01) 212661
CAMBRIDGE TE 43.10 (45.40) 3982
CIL SECURI 14.90 (15.15) 3000
CONT COFFEE 269.55 (273.75) 673
COROMAN FERT 440.05 (443) 3553
CUBEX TUB 14.20 (14.62) 1001
CYBERMATE 1.88 (1.96) 75203
CYIENT LIMIT 597.35 (591.95) 5868
DECCAN CEMEN 391 (391) 500
DIVI'S LAB 1493 (1494.85) 16539
DIVYA GRANIT 98.70 (102.90) 2786
DR REDDY 2668.90 (2666.20) 13546
FOUR SOFT 38 (37.85) 149
GATI CORPN 75.40 (76.40) 55181
GAYATRI PROJ 167.25 (166.40) 743
GMR INFRASTR 15.65 (15.95) 576316
GOLDST INFRA 222.80 (238.10) 9134
GOLDSTONE EN 13.25 (13.70) 2770
GRANULES (I) 95.10 (96) 207823
GSS AMERICA 113.70 (117) 63158
GVK POWER 6.91 (6.87) 267680
HBL NIFE POW 25.95 (26.70) 15178
HERITAGE FOO 504.40 (515.85) 1292
HIL LTD 1917.75 (1927.75) 356
IDL INDUSTRS 251.80 (260.20) 924
ILFS ENGINEE 12.55 (12.75) 4512
INCAP 40 (38.85) 201
IVRCL INFRAS 0.94 (0.96) 61763
JEEVAN SCIEN 34.90 (36) 1510
KAKATIYA CEM 186.85 (188.35) 12132
KALLAM SPG 17.35 (16.95) 7425
KAVERI SEED 591.25 (578) 46369
KCP LTD 86.20 (86.35) 4201
KERNEX MICRO 25.60 (25.65) 2991
KNR CONSTRUC 210.45 (210.55) 2815
KREBS BIO 117.45 (112.10) 355
LANCO INDUS 181 (181.45) 12958
LAURUS LABS 372.10 (376.75) 1658
LOKESH MACH 44.05 (44.15) 220
MADHUCON PRO 6.29 (6.73) 8058
MEGA SOFT 7.25 (7.08) 6463
MIC ELECTRON 0.88 (0.92) 48353
MOLD-TEK.TEC 48.60 (50.25) 9432
MOLDTK PLA 253.45 (262.90) 7323
MSR INDIA LT 10.12 (10.58) 4002
NAGARJAGRICH 27.25 (27.50) 5428
NATCO PHARMA 678.55 (681.65) 29483
NAVA BH VENT 110.80 (111.65) 560739
NCC 81.60 (83.90) 569131
NCL IND 124.35 (126.30) 1214
NEHA INTER 4.12 (4.30) 39554
NETTLINX 45.20 (44.65) 6798
NEULAND LAB 493.45 (504.95) 92
NIHAR INFO 10.85 (11.40) 1850
NILE 343.35 (348.30) 2982
NORTHGATE TE 0.65 (0.64) 202245
OIL COUNTRY 13.60 (14) 1829
PANYAM CEMEN 11.59 (11.92) 654
PENNER IND 36 (37) 17026
PIONEER DIST 155.55 (164.80) 755
PITTI LAMIN 55.65 (55.85) 4601
POKARNA 164.45 (172.75) 3165
PRAJAY ENGS 8.18 (8.50) 3278
PREMIER EXPL 255.15 (252.80) 14858
PRISM CEMENT 76.25 (79.40) 22525
PRUDENTL PHA 3.25 (3.49) 236260
RAASI REFRAC 18.12 (17.27) 5529
RAGSAN PETRO 59.05 (56.25) 25
RAIN INDUSTR 114.65 (119.45) 192456
RAJ PACKAGIN 26.50 (28.40) 4303
RAM INFORMAT 43.15 (41.45) 3562
REG.CERAMIC 4.04 (4.25) 686
SAGAR CEM 612.10 (644) 320
SAMKRG PIST 186.65 (182.75) 3351
SATVAH. ISPA 9.02 (9.11) 6923
SMS PHARMA 69.75 (71.95) 1559
SOUTH BIO TE 1.91 (1.94) 674
SREE RAYAL A 35.15 (36.50) 89079
SRI KPR INDU 19.50 (19) 100
SRINIVASA SH 40 (41.45) 276
STARCHIK SP 25.95 (26) 21125
STEEL EXCHAN 12.95 (13.25) 3480
SUJANA METAL 0.37 (0.38) 6220
SUJANA TOWER 1.30 (1.26) 1000
SUJANA UNIVE 0.30 (0.30) 6666
SURYALAKSH.C 42 (40.20) 2183
SURYALATA SP 130 (127.50) 235
SUVEN PHARMA 193.40 (202.10) 58670
TAJ GVK HOTE 179.55 (182.45) 689
TANLA 31.70 (32.85) 68319
TERA SOFTWAR 42.40 (43.80) 2204
TRANS BIOTEK 5.70 (5.81) 6841
TRENDY KNIT 0.22 (0.23) 1201
VAMSHI RUBB 29.35 (31) 1775
VBC FERRO 39.55 (38.50) 130
VICEROY HOTE 3.83 (3.83) 31866
VIJAY TEXTIL 39 (40.25) 2200
VIMTA LABS 257.90 (265.40) 7652
VISAKA IND 375.15 (393.60) 6533
VISTA PHARMA 26.45 (27.20) 2311
VIVIMED LABS 23.20 (25.35) 57360
VJIL CONSULT 38.35 (38.95) 2166
VST INDUS 3201.30 (3208.50) 32
YBRANT DIGIT 2.96 (3.03) 30228
ZENOTECH LAB 30.20 (32.40) 6719
ZENTECH 83.40 (85.55) 7958


భారీగా పడిపోయిన షేర్లు

ఎస్సెల్ గ్రూప్‌నకు చెందిన పలు నమోదిత కంపెనీల షేర్లు శుక్రవారం స్టాక్ మార్కెట్లో కుదేలయ్యాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్, ఎస్సెల్ ప్రొప్యాక్, జీ మీడియా కార్పొరేషన్, డిష్ టీవీలు అందులో ఉన్నాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు ఒక దశలో 33 శాతం నష్టపోయి రూ.288.95 వద్ద 44 నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. చివరకు 26.43% నష్టంతో రూ.319.35 వద్ద ముగిసింది. ఎస్సెల్ ప్రొప్యాక్ 16.08% తగ్గి రూ.98.10 వద్ద, జీ మీడియాకార్పొరేషన్ 9% నష్టంతో రూ.22.10 వద్ద ముగిసింది. డిష్ టీవీ కూడా అదే బాటలో నడిచి 32.74% కోల్పోయి రూ.22.60 వద్దకు చేరింది. గ్రూప్ షేర్ల మార్కెట్ విలువ రూ.14,000 కోట్ల మేర తగ్గింది.

షేరు క్షీణత వెనుక ప్రతికూల శక్తి!

నవంబరు చివర్లో జీ ఎంటర్‌టైన్‌మెంట్‌లో వ్యూహాత్మక వాటా విక్రయాన్ని ప్రకటించారు. దీని ప్రకారం.. ప్రమోటర్ల వాటా సగానికి తగ్గుతుంది. అయితే **ఒక ప్రతికూల శక్తి** షేరు ధరను క్షీణింపజేయడం ద్వారా ఆ పనులకు అడ్డుపడుతోందన్నది సుభాష్ చంద్ర ఆరోపణ. లండన్‌లో ఇటీవల పెట్టుబడుదార్లతో జరిగిన సమావేశాల్లో ఈ వాటా విక్రయానికి సంబంధించి మంచి ముందడుగు పడింది. అయితే శుక్రవారం ఏకంగా 26% మేర షేరు ధర కుంగడం విక్రయ ప్రక్రియను అడ్డుకోవచ్చని ఆయన ఆందోళన వ్యక్తపరచారు.

'ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం తర్వాత అప్పులను అదుపులోకి తీసుకురావడం క్లిష్టమైంది. డిసెంబరు వరకు రుణ వాయిదాలన్నిటినీ గ్రూప్ కట్టగలిగింది. మా బ్యాంకర్లు, ఎన్‌బీఎఫ్‌సీలు, మ్యూచువల్ ఫండ్‌లకు క్షమాపణ చెబుతున్నా. నేను అత్యుత్తమంగా ప్రయత్నించినా కూడా.. మీ అంచనాలను అందుకోలేకపోతున్నా'



సుడిగుండంలో సుభాష్ చంద్ర

- కంపెనీ ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంది
- ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం తర్వాత పరిస్థితి అదుపు తప్పింది
- బ్యాంకర్లకు, వాటాదార్లకు నా క్షమాపణలు
- అన్ని రుణాలనూ తీరుస్తా
- ఓ ప్రతికూల శక్తి వాటా విక్రయాన్ని అడ్డుకుంటోంది
- మౌలిక రంగం ఫలితాన్ని ఇవ్వలేదు
- వేరే వాళ్లయితే చేతులు ఎత్తేసేవారే
- కానీ మేం రూ.5000 కోట్ల అప్పు భరించాం
- కుటుంబ వ్యాపార విభజనలోనూ తప్పు చేశా

☛ ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర బహిరంగ లేఖ

ముంబయి

కంపెనీ ఆర్థిక సమస్యల్లో చిక్కుకుందని ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర అంగీకరించారు. మౌలిక రంగం విషయంలో వేసిన తప్పుడు బిడ్లు కాస్తా.. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం అనంతరం అదుపు తప్పాయని.. వీడియోకాన్ డీ2హెచ్ వ్యాపారం కొనుగోలు వల్ల కూడా ఈ పరిస్థితి వచ్చిందని ఆయన చెప్పుకొచ్చారు. అన్ని బకాయిలను తీరుస్తానని రుణదాతలకు రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే ఎపుడు చెల్లిస్తామో ఇపుడే చెప్పడం కష్టమైన విషయమని అందులో పేర్కొన్నారు.

'గ్రూప్‌లో దిగ్గజ కంపెనీ అయిన జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్‌లో వ్యూహాత్మక వాటా విక్రయం ద్వారా నిధులు సమీకరించాలన్న ప్రయత్నాలను ప్రతికూల శక్తి ఒకటి అడ్డుకుంటోంద'ని ఆరోపించారు. 'మా తాత జగన్నాథ్ గోయెంకా నుంచి నేను ఒక పాఠం నేర్చుకున్నాను. రుణదాతలతో ఎపుడూ నేరుగా చర్చిస్తుండాలని.. ఒకవేళ ఏవైనా రుణాలు చెల్లించలేని పరిస్థితి వస్తే ముందుగా ఆ విషయాన్ని వారికి తెలియజేయాలని నాకు చెప్పారు.' అని అందులో వివరించారు. శుక్రవారం జీ షేర్లు భారీగా నష్టపోయిన నేపథ్యంలో సుభాష్ చంద్ర ఈ ప్రకటన చేయడం గమనార్హం.

దయ చేసి ఓపిక పట్టండి

'ఒక వేళ ఏదైనా రుణం విషయంలో గ్రూప్ డిఫాల్ట్ అయితే దయచేసి రుణదాతలు ఇంకో విధంగా అడుగులు వేయవద్దు. జీ ఎంటర్‌టైన్‌మెంట్ వాటా విక్రయ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఓపిక పట్టండి' అని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. 'వాటా విక్రయానంతరం మా బకాయిలన్నిటినీ చెల్లించగలం. ఒక వేళ రుణదాతలు మరీ ఎక్కువ ఆందోళన చెందితే అది వాళ్లకు, మాకూ ఇబ్బందేన'ని తెలిపారు. ఒక్క రూపాయి కూడా దగ్గర ఉంచుకోవాలని భావించడం లేదు. ఏ ప్రమోటరు కూడా ఎటువంటి ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లోనూ తన 'మకుటంలోని కలికితురాయి' (జీ ఎంటర్‌టైన్‌మెంట్)ని విక్రయించుకోవాలని భావించడు' అని వివరించారు.

సమస్య నుంచి పారిపోను

'నా వైపు పొరబాట్లు జరగలేదని చెప్పడం లేదు. అయితే ఎటువంటి పరిణామాలకైనా సిద్ధంగా ఉన్నా. సమస్య నుంచి పారిపోవడం లేదు. ప్రతి వ్యక్తికీ, ప్రతి బకాయినీ తీరుస్తా' నని స్పష్టం చేశారు. 'నేను మళ్లీ చెబుతున్నా. అన్ని కంపెనీలు అద్భుతంగా రాణిస్తున్నాయి. ఎటువంటి సమస్యా లేదు' అని ఆయన అన్నారు.

➤ జూన్ 2018 నుంచీ సమస్యలు

'జూన్ 2018 నుంచీ సమస్యలు మొదలయ్యాయి. బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థలు, మ్యూచువల్ ఫండ్‌లు, వాటాదార్లకు కొన్ని అజ్ఞాత లేఖలు వెళ్లాయని సుభాష్ చంద్ర ఆరోపించారు. గ్రూప్‌లోని ఏ ఒక్క కంపెనీ కూడా సమస్యలను ఎదుర్కోవడం లేదు. కేవలం ప్రమోటర్లు మాత్రమే వివిధ వ్యవహారాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని నా తప్పులు కూడా ఉన్నాయి. వాటివల్ల ఎస్సెల్ ఇన్‌ఫ్రా విషయంలోనే రూ.4,000-5,000 కోట్ల వరకు నష్టాలను పొందాం. మరికొన్ని మౌలిక కంపెనీల్లోనూ కొన్ని తప్పుడు బిడ్లను వేశాం. సాధారణంగా మౌలిక కంపెనీలు చేతులు ఎత్తేస్తుంటాయి. రుణదాతలను నిరర్థక ఆస్తులతో ముంచెత్తుతుంటాయి. కానీ మేం పరిస్థితుల నుంచి పారిపోయే వాళ్లం కాదు. అదే మాకు రూ.4000-5,000 కోట్ల వరకు నష్టాలు వచ్చేలా చేసింద'ని వివరించారు.

➤ ఆ విషయంలోనూ తప్పు చేశా

నవంబరు 2016(మార్చి 2018లో పూర్తయింది)లో వీడియోకాన్ డీ2హెచ్ వ్యాపారాన్ని కొనుగోలు చేయాలన్న నిర్ణయం కూడా ఇబ్బందుల పాలు చేసిందని చంద్ర తెలిపారు. అది తన సోదరుడు జవహర్ గోయెల్‌కు కలిసివచ్చిందని అన్నారు. కుటుంబ వ్యాపారాల విభజన సమయంలో గ్రూప్ కంపెనీలన్నిటి రుణాలను తీసుకోవాలన్న నిర్ణయం కూడా 'పొరపాటే'నని వెల్లడించారు. చాలావరకు కొత్త వ్యాపారాలేవీ కలిసిరాక అప్పులు పెరిగిపోయాయన్నారు.

➤ కూలంకష దర్యాప్తు అవసరం

నవంబరు 2018 నుంచీ పోలీసులు, మహారాష్ట్ర హోం మంత్రి, సెబీలకు చాలా ఫిర్యాదులు చేసినా.. ఏదీ ఫలితాన్ని ఇవ్వలేకపోయిందని అన్నారు. 'నేను చెప్పినట్లుగా ప్రతికూల శక్తి నుంచి పలు కృత్రిమ దాడులు జరిగినా.. వాటి నుంచి మాకు రక్షణ లభించలేదు. అయినప్పటికీ మేం వ్యవస్థ మద్దతునే కోరుతున్నాం. ఈ విషయాన్ని కూలంకషంగా దర్యాప్తు చేయాలని అడుగుతున్నామ'ని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఈనాడు బిజినెస్

ఆ వార్తలపై చట్టపరమైన చర్యలు

నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్(ఒకప్పటి డ్రీమ్‌లైన్ మ్యాన్‌పవర్) పెద్ద నోట్ల రద్దు అనంతరం రూ.3,000 కోట్లకు పైగా డిపాజిట్లు చేసిందన్న విషయంపై తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం(ఎస్ఎఫ్ఐఓ) ప్రస్తుతం దర్యాప్తు చేస్తోంది. సుభాష్ చంద్రకు చెందిన కొన్ని కంపెనీలతో నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్, కొన్ని డొల్ల కంపెనీలు 2015-2017 మధ్య ఆర్థిక లావాదేవీలు జరిపాయని 'ద వైర్' అనే వార్తా సంస్థ తన కథనంలో తెలిపింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు పతనం వెనక గల కారణాల్లో ఈ కథనం కీలకమని తెలుస్తోంది. కాగా, 'ద వైర్ వెలువరించిన కథనంతో మాకు సంబంధం లేదు. ఇప్పటికే మేం ద వైర్ మీడియా గ్రూప్‌పై చట్టబద్ధ చర్యలు తీసుకున్నామ'ని వాటాదార్లతో జరిపిన కాన్ఫరెన్స్ కాల్‌లో ఎస్సెల్ గ్రూప్ తెలిపింది. ద వైర్' వెలువరచిన కథనంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు కానీ, కంపెనీ ప్రమోటర్లకు కానీ ప్రత్యక్షంగా, పరోక్షంగా 'సంబంధం లేదని ఎస్సెల్ ప్రొప్యాక్ సీఎన్‌బీసీ-టీవీ18కు స్పష్టం చేసింది.


వాటా కొనుగోలులో సోనీ!

నవంబరు 2018లో జీ ఎంటర్‌టైన్‌మెంట్ వాటాను విక్రయించాలని ప్రమోటర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ వాటా కొనుగోలు రేసులో సోనీ కార్పొరేషన్ చేరినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ సీఎన్‌బీసీ-టీవీ18 పేర్కొంది. జీ ప్రమోటరు ఎస్సెల్ గ్రూప్‌తో ఆ మేరకు సోనీ చర్చిస్తోందని ఆ విశ్వసనీయ వర్గాలు పేర్కొనట్లు సమాచారం. చైనాకు చెందిన టెన్సెంట్, అలీబాబాలు కూడా జీ ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్‌పై ఆసక్తి చూపినట్లు సమాచారం. అమెజాన్ కూడా ఈ రేసులో చేరే అవకాశం ఉందని ఆ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే కొద్ది రోజుల్లో తొలి దశ బిడ్డింగ్ జరగవచ్చని అంచనా. ప్రస్తుత పరిస్థితుల్లో కొనుగోలుదారు పేర్లను బయటకు వెల్లడించలేమని జీ ఒక ప్రకటనలో పేర్కొంది.

పద్మ విభూషణుడు ఏఎం నాయక్



- గులాటీ, జాన్ చాంబర్స్‌లకు పద్మభూషణ్
- శంతను నారాయణ్‌కు పద్మశ్రీ







దిల్లీ

ఈ సారి నాలుగు మంది పారిశ్రామిక దిగ్గజాలను 'పద్మ' అవార్డులు వరించారు. మౌలిక రంగ దిగ్గజ సంస్థ ఎల్ అండ్ టీ గ్రూప్ ఛైర్మన్ అనిల్ మణిభాయ్ నాయక్ (ఏఎం నాయక్)కు భారత అత్యున్నత పౌర పురస్కారాల్లో రెండోదిగా భావించే పద్మ విభూషణ్ వరించింది. సిస్కో మాజీ అధిపతి జాన్ చాంబర్స్, ఎండీహెచ్ స్పైసీస్ యాజమాని మహాషయ్ ధరం పల్ గులాటీలకు పద్మ భూషణ్ ప్రకటించారు. అడోబ్ ఛైర్మన్, సీఈఓ శంతను నారాయణ్‌కు ప్రవాస భారతీయుల విభాగంలో పద్మశ్రీ వరించింది. అవార్డుల పొందిన పారిశ్రామికవేత్తల గురించి...

నాయక్: 1940లో గుజరాత్‌లో నాయక్ జన్మించారు. వల్లభ్ విద్యానగర్‌లోని బిర్లా విశ్వకర్మ మహావిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. విద్యానంతరం ముంబయి వెళ్లిన నాయక్.. సరైన ఇంగ్లిష్ నైపుణ్యాలు లేక ఉద్యోగం సాధించలేకపోయారు. ఇంగ్లిష్ నేర్చుకుంటూనే.. పార్శిలకు చెందిన నెస్లర్ బాయిలర్స్ సంస్థలో చేరారు. అయితే సంస్థలో యాజమాన్య మార్పులతో మళ్లీ 1965లో ఉద్యోగ వేటలో పడ్డారు. ఈ క్రమంలోనే 1965 మార్చి 15న ఎల్ అండ్ టీ జూనియర్ ఇంజినీర్‌గా చేరారు. 1986లో జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన నాయక్.. 1996లో సంస్థ సీఈఓ, ఎండీగా నియమితులయ్యారు. అనంతరం ఛైర్మన్‌గా సైతం వ్యవహరించారు. ఐఐఎం అహ్మదాబాద్ ఛైర్మన్‌గా సైతం సేవలందించారు. 2016 ఆగస్టులో స్వచ్ఛంద సేవా సంస్థలకు 75 శాతం ఆదాయాన్ని ఇస్తున్నట్లు నాయక్ ప్రకటించారు. 2009లోనే నాయక్‌ను పద్మభూషణ్ పురస్కారం దక్కింది.

గులాటీ: ప్రముఖ మసాలా తయారీ సంస్థ ఎండీహెచ్‌ను 1919లో గులాటీ స్థాపించారు. 1959లో తొలి కర్మాగారం నెలకొల్పిన ఆయన.. తర్వాత వాటిని 15కు విస్తరించారు. 94 ఏళ్ల వయసులో 2017లో ఆయన అత్యధిక వేతనం అందుకుంటున్న ఎఫ్ఎమ్‌సీజీ సీఈఓగా రికార్డు సృష్టించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన రూ.21 కోట్ల వేతనం పొందారు.

చాంబర్స్: అంతర్జాతీయ దిగ్గజ నెట్‌వర్కింగ్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సంస్థ సిస్కో మాజీ అధిపతి జాన్ చాంబర్స్‌కు పద్మ భూషణ్ దక్కింది. భారత్‌లో సిస్కో భారీ పెట్టుబడులు పెట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

శంతను నారాయణ్: 1962లో హైదరాబాద్‌లో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. అమెరికాలో ఎంబీఏ, ఎంఎస్ పూర్తి చేశారు. టెక్ దిగ్గజం యాపిల్‌లో వృత్తిజీవితాన్ని ప్రారంభించిన ఆయన.. 1998లో అడోబ్‌లో చేరారు. 2007 నవంబరులో అడోబ్ పగ్గాలు చేపట్టిన ఆయన.. 2018లో ఫార్చ్యూన్ 400 కంపెనీగా అడోబ్‌ను నిలబెట్టారు.

ప్రాంతీయ సేవల్లో మరో 235 మార్గాలు

నాగార్జున సాగర్‌లో వాటర్ ఏరోడ్రోమ్

దిల్లీ

చిన్న నగరాలకు, అందుబాటు ధరల్లో విమానాలు నడిపేందుకు ఉద్దేశించిన ప్రాంతీయ విమానయాన పథకం (ఉడాన్) కింద కొత్తగా 235 మార్గాలను ప్రభుత్వం కేటాయించింది. వీటిలో 46 పర్యాటక ప్రాంతాలున్నాయి. మరో 18 మార్గాల్లో సీప్లేన్‌లు నడుస్తాయి. మూడోవిడతలో కేటాయించిన 235 మార్గాల్లో నడిచే విమానాల ద్వారా, ఏడాదికి 69.30 లక్షల సీట్లు జత చేరతాయని పౌర విమానయాన మంత్రి సురేశ్‌ప్రభు తెలిపారు. ఇందులో లక్ష సీట్లు సీప్లేన్‌ల ద్వారానే జత చేరతాయన్నారు.

ఈ సంస్థలకు కేటాయింపు

స్పైస్‌జెట్, ఇండిగో, జెట్‌ఎయిర్‌వేస్, ఎయిరిండియా అనుబంధ ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ (అలయన్స్ ఎయిర్), టర్బో ఏవియేషన్, టర్బో మేఘా ఎయిర్‌వేస్, అండమాన్ ఎయిర్‌వేస్, ఏవియేషన్ కనెక్టివిటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్, ఘోడావత్ ఎంటర్‌ప్రైజెస్, హెరిటేజ్ ఏవియేషన్, జెక్సస్ ఎయిర్ సర్వీసెస్ సంస్థలకు తాజా విడతలో మార్గాలు కేటాయించారు.



- ✦ 11 సంస్థలిచ్చిన 73 ప్రతిపాదనలను మంత్రిత్వ శాఖ ఆమోదించింది.
- ✦ మొత్తం 89 విమానాశ్రయాల్లో ఇప్పటివరకు ఒక్క విమానం కూడా రాకపోకలు సాగించనివి 16, అరకొరగా రాకపోకలు సాగుతున్న 17 విమానాశ్రయాలతో పాటు 6 వాటర్ ఏరోడ్రోమ్‌లు కూడా ఇప్పుడు అనుసంధానమవుతాయి.
- ✦ పర్యాటక మార్గాల్లో ప్రత్యేకంగా ఒక సంస్థే విమానాలు నిర్వహించే పద్ధతి ఉండదు. విమానాశ్రయాల్లో రాయితీలూ ఇవ్వరు.

సీప్లేన్‌లు వీరివి: స్పైస్‌జెట్, టర్బో ఏవియేషన్ నుంచి చెరో ప్రతిపాదన వచ్చిందని పౌర విమానయాన కార్యదర్శి ఆర్.ఎన్.చౌబే తెలిపారు. 18 మార్గాల్లో సర్వీసులు నిర్వహించేందుకు 6 నీటి ఏరోడ్రోమ్‌లు వినియోగిస్తారు. నాగార్జున సాగర్ (తెలంగాణ), సాంబమూర్తి రివర్ ఫ్రంట్, శత్రుంజయ్ డ్యామ్, స్టాట్యూఆఫ్ యూనిటీ (గుజరాత్), గువాహటి రివర్‌ఫ్రంట్, ఉమ్రాంగో రిజర్వాయర్ (అసోం)లలో ఇవి ఉంటాయి.

రూ.1167 కోట్లు అవసరం: మూడో విడతలో కేటాయించిన 69.30 లక్షల సీట్లకు సంబంధించి, వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (విమానయాన సంస్థలకు నష్టం వస్తే భరించేందుకు) కింద రూ.1167 కోట్లు అవసరమవుతాయని చౌబే తెలిపారు. మంత్రిత్వశాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ భారాన్ని పంచుకుంటాయి.

అంతర్జాతీయ మార్గంలోనూ: అంతర్జాతీయ సర్వీసులను కూడా ఉడాన్ పథకంలో నిర్వహించేందుకు స్పైస్‌జెట్ ముందుకొచ్చింది. గువాహటి నుంచి ఢాకా, బ్యాంకాక్‌లకు ఈ సర్వీసులు నడవనున్నాయి.

ప్రస్తుతం 155 మార్గాల్లో..: ఉడాన్ కింద 2 విడతల్లో కేటాయించిన సంస్థలు 155 మార్గాల్లో విమానాలు నడుపుతున్నాయి. తొలి విడతలో 13 లక్షల సీట్లు, రెండో విడతలో 29 లక్షల సీట్లు జతచేరాయి.

ఇంకొన్నేళ్లు వృద్ధి 7 - 7.5% మధ్యే

ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి

దిల్లీ: దేశ వృద్ధిరేటు ఇంకొన్నేళ్ల పాటు 7 - 7.5 శాతంగా ఉంటుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) అంచనా వేసింది. వ్యవస్థాగత లోపాలను సంస్కరణలతో సరిదిద్దడం ద్వారా వృద్ధిరేటును మరో 1 శాతం మేర సులభంగా పెంచవచ్చని శుక్రవారం సమావేశమైన మండలి పేర్కొంది. ఆర్థిక స్థిరీకరణ లక్ష్యాల నుంచి దూరం కాకుండానే, సామాజిక అవసరాలకు ప్రాధాన్యమివ్వాలని మండలి సూచించింది. మధ్యంతర బడ్జెట్‌కు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న తరుణంలో, మండలి ఈ సలహాలు ఇచ్చింది. పేదలు, రైతులకు ప్యాకేజీలు, మధ్యతరగతిని ఆకట్టుకునేందుకు కొన్ని వరాలను వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటిస్తుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో, మండలి ఈ సూచనలు చేయడం గమనార్హం. దేశ స్థూల ఆర్థిక పరిస్థితులు పటిష్ఠంగా ఉన్నా, వ్యవస్థాగత సవాళ్లూ ఉన్నాయని తెలిపింది.

వ్యవసాయ సమస్యలపైనా చర్చ: వ్యవసాయ సమస్యలు, పెట్టుబడులు ఎలా వస్తున్నాయి, ఆర్థిక స్థిరీకరణ, వడ్డీరేట్ల నిర్వహణ, రుణాల జారీ వంటి అంశాలపైనా సలహా మండలి చర్చించింది. వ్యవసాయ పనులకు రుణాల లభ్యత ఎలా ఉంది, ఎంనారేగా వంటి పథకాల ద్వారా ఉపాధి కల్పన ఏ విధంగా జరుగుతోందో నిశితంగా పరిశీలించాలని నిర్ణయించింది.

యువకల నింగికేగెన్

కలాం శాట్ ఉపగ్రహానికి రూపకల్పన చేసిన విద్యార్థులు

కక్ష్యలోకి పంపుతామంటూ ప్రోత్సహించిన ఇస్రో

ఆర్థిక వనరులు అందించిన స్పేస్ కిడ్స్ ఇండియా



షార్‌లో కలాంశాట్ ఉపగ్రహ విద్యార్థుల బృందం

వారంతా వేర్వేరు కళాశాలల్లో చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు. అంతరిక్ష రంగంపై వారికున్న ఆసక్తి వారిని కలిపింది. వారంతా..ఓ ప్రైవేటు సంస్థలో సభ్యులుగా చేరారు. చదువుతోపాటు వివిధ ప్రయోగాలపై దృష్టి పెట్టారు. అంతరిక్షానికి సంబంధించి వివిధ అంశాలపై తర్ఫీదు పొందారు. అత్యంత తక్కువ బరువు గల ఉపగ్రహాన్ని రూపొందించి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)కు అందించారు. పీఎస్ఎల్‌వీ-44 వాహక నౌక ద్వారా గురువారం అర్ధరాత్రి నింగిలోకి పంపారు. ఇప్పటి వరకు విశ్వవిద్యాలయాలకే పరిమితమైన ఉపగ్రహాల తయారీని మొదటిసారిగా ఇంజినీరింగ్ విద్యార్థులు చేసి దేశవ్యాప్తంగా పలువురి ప్రముఖుల అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది.

స్పేస్ కిడ్స్ ఇండియా ద్వారా..

చెన్నైలో స్పేస్ కిడ్స్ ఇండియా అనే సంస్థ ఉంది. ఇక్కడ అంతరిక్షానికి సంబంధించిన వివిధ అంశాలపై తర్ఫీదు ఇస్తుంటారు. ప్రయోగాల పట్ల ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహిస్తారు. ఇందులో చెన్నైలోని వివిధ ప్రాంతాల్లో ప్లస్2, ఇంజినీరింగ్ అభ్యసిస్తున్న విద్యార్థులు సభ్యులుగా చేరి, వివిధ అంశాలపై శిక్షణ పొందుతూ ఉంటారు.

అంతా దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులే..

చెన్నైలోని స్పేస్ కిడ్స్ ఇండియా సంస్థలో చేరిన ఏడుగురు విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడ్డారు. ఇందులో తెలుగు విద్యార్థులు ఇద్దరు..కర్ణాటకకు చెందిన ఒకరు, తమిళనాడుకు చెందిన నలుగురు ఉన్నారు. కలాం శాట్-వి2లో మిషన్ డైరెక్టర్‌గా శ్రీమతి కేసెన్, లీడ్ శాస్త్రవేత్తగా రిఫాత్ షారూక్(కడూరు సమీపాన పాడిపట్టు), లీడ్ ఇంజినీర్‌గా మహ్మద్ అబ్దుల్ కషిఫ్(నల్గొండ), లీడ్ టెక్నీషియన్‌గా యజ్ఞసాయి(తిరుపతి), డిజైన్ ఇంజినీర్‌గా వినయ్ భరద్వాజ్(బెంగళూరు), ఫ్లైట్ ఇంజినీర్‌గా తనిష్క దివేది(చెన్నై), లీడ్ శాటిలైట్ ఆర్కిటెక్టుగా విజయలక్ష్మి నారాయణ్(కోయంబత్తూరు), బయాలజిస్టుగా టి.గోబినాథ్(చెన్నై) వ్యవహరించారు. వీరంతా కలిసి ఓ బృందంగా ఏర్పడ్డారు. వీరికి స్పేస్ కిడ్స్ ఇండియా సీఈవో శ్రీమతి కేసన్ సారథ్యం వహించారు.

బెలూన్ ప్రయోగాల ద్వారా..

బృందం సభ్యులు 2015 నుంచి వివిధ ప్రయోగాలు చేపట్టారు. మొట్టమొదటగా నియర్ స్పేస్ లాంచ్ వెహికల్(ఎన్ఎస్ఎల్‌వీ) కలాం-1 ప్రయోగాన్ని చేశారు. ఇది ఇండియాలో మొదటి బెలూన్ ప్రయోగం. బెలూన్, ప్యారాచూట్‌తోపాటు కొంత పెలోడ్‌ను ఇందులో ఉంచి పనితీరును తెలుసుకున్నారు. ఇలా ఐదు బెలూన్ ప్రయోగాలు చేపట్టారు.

- సూళ్లూరుపేట, న్యూస్‌టుడే

2017లో నాసా ఆధ్వర్యాన

స్పేస్ కిడ్స్ ఇండియా ఆధ్వర్యాన బృంద సభ్యులు ఓ పోటీలో ప్రతిభ కనబరచడంతో ఉపగ్రహం తయారుచేసి, తమ రాకెట్ ద్వారా పంపించే అవకాశం నాసా వారికి ఇచ్చింది. 3.8 సెం.మీ.ల పరిమాణంతో 64 గ్రాముల బరువు గల కలాం శాట్‌కు రూపకల్పన చేశారు. 2017 జూన్ 22న నాసా వీరు తయారుచేసిన ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపింది. అలా..మొదటిసారిగా భారతదేశానికి చెందిన ఉపగ్రహాన్ని నాసా ప్రయోగించినట్లయింది. ఈ ఉపగ్రహం తయారీకి రెండేళ్లకు పైగా సమయం పట్టిందని, సుమారు రూ.లక్ష వ్యయం చేసినట్లు బృందం తెలిపింది. ఇందులో 3డీ ప్రింటింగ్ సాంకేతికతను ఉపయోగించారు. ఈ ఉపగ్రహం 12 నిమిషాలపాటు మైక్రో గ్రావిటీ వాతావరణంలో పనిచేసింది. ఆ తర్వాత సముద్రంలో పడిపోయిన ఉపగ్రహాన్ని నాసా ప్రతినిధులు సేకరించి ఇండియాకు పంపారు. ఆ ఉపగ్రహం సేకరించిన డేటాను విద్యార్థుల బృందం వెలికితీసింది.

ఇస్రోతో కలిసి..

నాసా ద్వారా ఉపగ్రహాన్ని ప్రయోగించిన విద్యార్థుల బృందం స్వదేశంలో ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నారు. చెన్నైకి వచ్చిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలను కలిశారు. ఉపగ్రహాలు తయారుచేస్తే తాము ప్రయోగించేందుకు సిద్ధంగా ఉన్నామని శాస్త్రవేత్తలు వారికి వివరించారు. జనవరిలో పీఎస్ఎల్‌వీ-సీ44 ప్రయోగం ఉందని, ఆలోగా రూపకల్పన చేసిస్తే..దాని ద్వారా కక్ష్యలోకి పంపుతామన్నారు. దీంతో విద్యార్థులంతా రేయింబవళ్లు కష్టపడి 1200 గ్రాముల ఉపగ్రహాన్ని రూపొందించారు. దీనికి కలాంశాట్-వి2గా నామకరణం చేశారు. పలు పరీక్షలు చేపట్టి విజయవంతమయ్యాక శ్రీహరికోట రాకెట్ కేంద్రానికి తరలించారు. శాస్త్రవేత్తలు దాన్ని పీఎస్ఎల్‌వీలో అమర్చి, రోదసిలోకి పంపారు. ఇది పూర్తిస్థాయి కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇందుకు రూ.12 లక్షలు వ్యయం చేశారు. ఈ మొత్తాన్ని స్పేస్ కిడ్స్ ఇండియా భరించింది.



కలాంశాట్-వి2 ఉపగ్రహాన్ని చూపుతున్న స్పేస్ కిడ్స్ ఇండియా సీఈవో కేసన్



ముఖ్యమంత్రి సహాయ నిధి నిమిత్తం తమ ఉద్యోగుల నుంచి సేకరించిన రూ.14.5 లక్షలను సీఎం చంద్రబాబుకు చెక్కు రూపంలో అందిస్తున్న నాబార్డు సీజీఎం సురేష్ కుమార్

జగన్ సమర శంఖారావం

- 4 నుంచి జిల్లాల పర్యటన

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి వచ్చే నెల 4 నుంచి సమర శంఖారావం పేరుతో జిల్లాల పర్యటన చేపట్టనున్నారు. తొలి విడతగా 4న తిరుపతిలో, 5న కడపలో, 6న అనంతపురంలో పర్యటిస్తారు. పార్టీ బూత్ కమిటీల ప్రతినిధులు, క్రియాశీల ప్రతినిధులతో జిల్లాస్థాయిలో నిర్వహించే సమావేశాల్లో పాల్గొంటారు. నియోజకవర్గాల వారీగా బూత్ కమిటీల నియామకం, ఎన్నికల ప్రక్రియకు సిద్ధం చేయడం వంటి విషయాలపై సమీక్షిస్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ సమావేశాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం నుంచి 'అన్న కోసం' పేరుతో మరో కార్యక్రమం చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఆ తరువాత రెండు మూడు వారాల్లో మిగతా జిల్లాల్లో జగన్ పర్యటించనున్నారు.

- బీసీలకు వైకాపా ఎలాంటి హామీలు ఇవ్వనుందనే విషయాలను వెల్లడించేందుకు ఫిబ్రవరి 19న ఏలూరు లేక అనంతపురంలో బీసీ గర్జన సభ నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది.

పాలకొండ సమస్యలను తీర్చండి: కలెక్టర్‌కు లేఖ

పాలకొండ, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డికి లేఖ రాశారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా పాలకొండ నియోజకవర్గంలో ఇటీవల పర్యటించిన సందర్భంలో స్థానిక శాసనసభ్యురాలు కళావతి తన దృష్టికి తీసుకువచ్చిన అంశాలను ఆయన ఈ లేఖలో ప్రస్తావించారు.

మంత్రి మండలి సమావేశం 30న

ఈనాడు, అమరావతి: మంత్రిమండలి సమావేశం ఈనెల 30న జరగనుంది. సాయంత్రం 3గంటలకు సచివాలయంలోని కేబినెట్ సమావేశ హాల్‌లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కలెక్టర్ల సదస్సు 28న: కలెక్టర్ల సదస్సును ఈనెల 28న నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.సాంబశివరావు వెల్లడించారు.

28, 29న ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభలు

ఈనాడు డిజిటల్-అమరావతి: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (ఏపీడబ్ల్యూజేఎఫ్) నాలుగో మహాసభలు ఈ నెల 28, 29న తిరుపతిలోని శ్రీరామతులసి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆ సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు తెలిపారు. ఈ సభలను రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారన్నారు.

తెదేపాలో చేరిన మధునాయుడు

ఈనాడు, అమరావతి: నెల్లూరు జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసిన పేరం మధునాయుడు శుక్రవారం తెదేపాలో చేరారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ పరసా వెంకటరత్నం, తెదేపా నాయకుడు బీద మస్తాన్‌రావు తదితరులతో కలిసి వచ్చిన మధునాయుడు సీఎం సమక్షంలో పార్టీలో చేరారు.

జనగణమనమతడు.. జనసేనై కదిలాడు..

పవన్‌పై పాట రూపొందించిన రామ్‌చరణ్

ఈనాడు, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సినీ హీరో రామ్‌చరణ్ తన బాబాయి జనసేన అధిపతి పవన్‌కల్యాణ్‌పై ఒక పాట రూపొందించి ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. దేశం కోసం పాటుపడ్డ జాతీయ నాయకులకు ఈ పాటను అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. "ఒకడొచ్చాడు...వచ్చాడు... మనలను ముందుకు నడప...వచ్చెర ఒకడు...అతడొక గంగానది, అతడొక హిమశిఖరం.. జనగణమనమాతడు- జనసేనై కదిలాడు" అంటూ ఆ పాట సాగింది.

గణతంత్ర శుభాకాంక్షలు తెలిపిన పవన్: దేశం గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించి 70 ఏళ్లయిన సందర్భంగా రాజ్యాంగ రూపకర్తల స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకోవాలని జనసేన అధిపతి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. దేశ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో కారు జోరు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఇప్పటివరకు రెండు విడతలుగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తెరాస మద్దతుదారులు అత్యధిక స్థానాల్లో విజయకేతనం ఎగురవేశారు. శుక్రవారం రెండో విడత ప్రక్రియ ముగిసింది. తెరాస: 5,234, కాంగ్రెస్: 1,691, భాజపా: 101, తెదేపా: 65, సీపీఐ: 31, సీపీఎం: 55, ఇతరులు: 1,309 స్థానాల్లో ఆయా పార్టీల మద్దతుదారులు గెలుపొందారు.

ఏపీ క్యాడర్‌కు అయిదుగురు యువ ఐపీఎస్‌లు

ఈనాడు, అమరావతి: 2017 బ్యాచ్‌కు చెందిన అయిదుగురు ఐపీఎస్ అధికారులను కేంద్ర ప్రభుత్వం ఏపీ క్యాడర్‌కు కేటాయించింది. అధిరాజ్ సింగ్ రాణా(పంజాబ్), వీఎన్.మణికంఠ చందోలు(ఏపీ), ప్రేరణకుమార్ (ఉత్తర్‌ప్రదేశ్), కృష్ణ కాంత్ పటేల్(తెలంగాణ), తుషార్ దుది(రాజస్థాన్)లు ఈ జాబితాలో ఉన్నారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ వివరాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైల్వే కంట్రోలర్ల సమాఖ్య జాతీయ కమిటీ ఎన్నిక

విజయవాడ, న్యూస్‌టుడే: అఖిల భారత రైల్వే కంట్రోలర్ల సమాఖ్య కొత్త జాతీయ కమిటీ ఎన్నిక శుక్రవారం విజయవాడలో నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడిగా చందన్‌చతుర్వేది (సెంట్రల్ రైల్వే), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మారేపల్లి జోషి (విజయవాడ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.సి.నహక్, ప్రధాన కార్యదర్శిగా డి.వరప్రసాద్ (విజయవాడ) ఉపాధ్యక్షులుగా మనోజ్‌కుమార్, నందకుమార్ భగత్ (అసన్‌సోల్), ఇందర్‌లాల్ భైరన్ (భోపాల్), కోశాధికారిగా చరణ్‌ముదులి(సంబల్‌పూర్) సహాయ కార్యదర్శులుగా శేఖర్‌రౌతు (కుర్దారోడ్), సునీల్‌కుమార్ షైలీ (దిల్లీ)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీసీ విభాగం ప్రాంతీయ సమన్వయకర్తలు

ఈనాడు, అమరావతి: వైకాపా బీసీ విభాగం ప్రాంతీయ సమన్వయకర్తలను శుక్రవారం నియమితులయ్యారు. తొండమల్ల పుల్లయ్య రాయలసీమకు, అంగిరేకుల ఆదిశేష కోస్తాంధ్రకు పి.వెంకట సత్య దివాకర్ ఉత్తరాంధ్రకు సమన్వయకర్తలుగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. పీసీసీ అధికార ప్రతినిధి కనుమూరు రవిచంద్రారెడ్డి వైకాపాలో చేరారు. శుక్రవారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో వైకాపా అధ్యక్షుడు జగన్ సమక్షంలో పార్టీలో చేరారు.

గ్రూప్1 సన్నద్ధత కఠిన పరీక్షే!

- సిలబస్ ఎక్కువ.. సమయం తక్కువ
- నిరుద్యోగ అభ్యర్థుల ఆవేదన
- 3 వారాల వాయిదాపై పరిశీలన: ఏపీపీఎస్సీ



ఈనాడు, అమరావతి: గ్రూపు-1 ప్రాథమిక పరీక్ష (ప్రిలిమ్స్) తేదీని వాయిదా వేయకుంటే తీవ్రంగా నష్టపోతామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీపీఎస్సీ ఖరారు చేసిన సిలబస్‌ను సాధారణ అభ్యర్థి అర్థం చేసుకుని పట్టు సాధించేందుకు తగిన సమయం అవసరమని పేర్కొంటున్నారు. గతంలో గ్రూపు-1 ప్రిలిమ్స్‌కు ఒక పేపరు మాత్రమే ఉండేది. ఇప్పుడు రెండు పేపర్లు చేశారు. కొత్త అంశాలను ఇందులో జోడించారు. ప్రిలిమ్స్ నుంచి ప్రధాన పరీక్షలకు గతంలో మాదిరిగా 1:50 నిష్పత్తిలో కాకుండా 1:15లోనే ఎంపిక చేస్తామని ఏపీపీఎస్సీ చెబుతోంది. ఈ తరుణంలో ప్రిలిమ్స్ పరీక్షకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిందేననీ చెబుతున్నారు. ప్రస్తుతం ప్రిలిమ్స్‌కు ఉన్నది తక్కువ సమయం కావున చాలా నష్టపోతామని ఓ అభ్యర్థి వాపోయాడు.

ఎందుకు గ్రూప్ 1 వాయిదా వేయాలి?

- యూపీఎస్సీ 'క్యాలెండర్' ప్రకారం నోటిఫికేషన్లను జారీ చేసి, ప్రిలిమ్స్ నిర్వహించేందుకు కనీసం 6 నెలల వరకు సమయం తీసుకుంటోంది. ప్రస్తుతం ఏపీపీఎస్సీ ఇచ్చిన సమయం జనవరి ఒకటి నుంచి మార్చి 9 వరకు లెక్కిస్తే 68 రోజుల వరకు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ తక్కువ సమయంలో ఎలా సన్నద్ధం కాగలమని అభ్యర్థుల ప్రశ్న.
- పేపరు-1 కింద చరిత్ర, రాజ్యాంగం (పాలిటి), సామాజిక న్యాయం, భారతదేశ, ఆంధ్రప్రదేశ్ ఎకానమీ, ప్రపంచ, భారతదేశం, ఆంధ్రప్రదేశ్ భూగోళశాస్త్రాలు, పేపరు-2 కింద జనరల్ ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్ ఉన్నాయి. వీటన్నింటిపై పట్టు సాధించడం 68 రోజుల్లో ఎలా సాధ్యం అవుతుందని ఓ అభ్యర్థి ఆవేదన.
- గతంలోలాగా సిలబస్‌లో రిఫరెన్స్ పుస్తకాలను పేర్కొనలేదు. పుస్తకాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ఏపీ ఎకానమీ, జాగ్రఫీకి సంబంధించిన సమాచారం తగిన విధంగా అందుబాటులో ఉండడం లేదు. ఇంతకుముందు నోటిఫికేషన్ రాగానే తెలుగు అకాడమీ ప్రత్యేకంగా పుస్తకాలను ప్రచురించేది. ఈసారి సిలబస్‌ను అక్టోబర్ చివరి వారంలో ఖరారు చేసిన కారణంగా పుస్తకాలు పూర్తిస్థాయిలో మార్కెట్లోకి రాలేదు. సిలబస్‌ను ఎప్పుడు ఖరారు చేసినా సన్నద్ధతపై దృష్టి అనేది నోటిఫికేషన్ వచ్చాకే ఉంటుంది. కాబట్టి సిలబస్ ప్రకారం సమాచార సేకరణకు తగిన వ్యవధి ఉండి తీరాల్సిందే. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే కనీసం 3 నుంచి 4సార్లు పునశ్చరణ చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో మార్చి 10న జరిగే పరీక్షలకు సన్నద్ధం కావడం కష్టమైపోతోందని పలువురు గగ్గోలు పెడుతున్నారు.
- ఉన్న తక్కువ సమయంలో ఎలాగూ సన్నద్ధం కాలేం. పడిన శ్రమంతా వృథా అయ్యే ప్రమాదం ఉంది. ఎందుకైనా మంచిది మిగతా పరీక్షకు ప్రిపేర్ కావడమే మేలు. . అంటూ పలువురు అభ్యర్థులు నిట్టూర్చుతున్నారు.

కొత్త తేదీని ఖరారు చేస్తాం

యూనిఫామ్ పోస్టులకు వయోపరిమితి పెంచినందున గ్రూపు-1 నోటిఫికేషన్ అనుసరించి దరఖాస్తుల స్వీకరణ గడువును వచ్చేనెల 7వరకు పెంచాం. ప్రాథమిక పరీక్ష నిర్వహణ తేదీని వాయిదా వేయాలని ఎక్కువ మంది అభ్యర్థుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. చాలా తక్కువ మంది యథాతథంగా నిర్వహించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మార్చి 10న కాకుండా 3 వారాలు వాయిదా వేసి పరీక్ష నిర్వహించే విషయాన్ని పరిశీలిస్తున్నాం. త్వరలో కొత్త తేదీని ఖరారు చేస్తాం.

- ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్

శ్రీనివాసరావు రిమాండ్ పొడిగింపు

జగన్‌పై దాడి కేసులో ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి, విజయవాడ న్యాయవిభాగం: వైకాపా అధ్యక్షుడు జగన్‌పై దాడి కేసు నిందితుడు శ్రీనివాసరావు రిమాండ్‌ను ఫిబ్రవరి 8 వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. జ్యుడీషియల్ రిమాండ్ గడువు ముగియడంతో శుక్రవారం విజయవాడలోని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కోర్టు న్యాయమూర్తి ఎ.పార్థసారథి ముందు నిందితుడిని పోలీసులు హాజరు పరిచారు. రిమాండ్ పొడిగించడంతో నిందితుడిని రాజమహేంద్రవరం కారాగారానికి తరలించారు. మరోవైపు ఎన్ఐఏ తీరుపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ నిందితుడి తరఫు న్యాయవాది మట్టా జయకర్, సలీమ్ న్యాయస్థానంలో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో వేసిన రెండు మెమోలను ఉపసంహరించుకున్నారు.

ప్రాణహాని ఉంది: రాజమహేంద్రవరం కారాగారంలో ఉంటున్న శ్రీనివాసరావుకు ప్రాణహాని ఉందని నిందితుడి తరఫు న్యాయవాది సందేహం వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో నిందితుడి అభ్యర్థన మేరకు అతనికి పెన్ను, పేపర్లను అందుబాటులో ఉంచాలని, భద్రత విషయంలో జాగ్రత్త తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు.

సిట్ రికార్డులు ఇవ్వలేదు: ఎన్ఐఏ తరఫు న్యాయవాది సిద్ధి రాములు వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తునకు సంబంధించిన రికార్డులను తమకు అప్పగించాలని కోర్టు ఆదేశించినా ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు ఇవ్వలేదన్నారు. వారి చర్య కోర్టుధిక్కరణ కిందకు వస్తుందన్నారు. దర్యాప్తు ఎన్ఐఏకు అప్పగింతపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో రికార్డు ఇవ్వాల్సిన అవసరం లేదని పోలీసు అత్యున్నతాధికారి పేర్కొనడం సరికాదన్నారు. సిట్ అధిపతి ఏసీపీ నాగేశ్వరరావును కోర్టుకు పిలిపించి వివరణ కోరాలని అభ్యర్థించారు. నిందితుడు దాఖలు చేసిన రెండు పిటిషన్లపై అభ్యంతరం వ్యక్తంచేశారు.

వామపక్షాలతో కలిసే పోటీ

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లాలన్న అంశంపై ఫిబ్రవరి తరువాత ఉమ్మడి ప్రణాళిక ప్రకటిస్తామని తెలిపారు. ఫిబ్రవరిలో సీట్ల పంపిణీపై చర్చిస్తామని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యం, మైనింగ్, భూసేకరణ విధానాలు, ఈవీఎంల్లో లోపాలు తదితర అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. వామపక్షాలతో రెండేళ్ల నుంచి కలిసే పనిచేస్తున్నట్లు గుర్తు చేశారు.

భూసేకరణ చట్టం-2013ను తు.చ.తప్పకుండా పాటించాలి

సురవరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ప్రజల్లో చైతన్యం వచ్చేలా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆ మేరకు పలు అంశాలపై మూడు పార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చాయన్నారు. పర్యావరణ పరిరక్షణ తమ ప్రథమ కర్తవ్యమన్నారు. గనుల తవ్వకానికి(మైనింగ్‌కు) తాము వ్యతిరేకం కాదని కానీ తవ్వకాలు హేతుబద్ధంగా, పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా చేయాల్సిన అవసరం ఉందని,. భూసేకరణ విధానాలు ఎక్కడైనా ఒకేలా ఉండాలన్నారు. ఈవీఎంలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రం వాటిని నివృత్తి చేయాలని, ఇందుకోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలు పలు అనుమానాలను కలిగించాయని పేర్కొన్నారు.

హోదా తేవడంలో రాష్ట్రప్రభుత్వం విఫలం

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేవడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పవన్‌కల్యాణ్‌తో ఆయా అంశాలను చర్చించినట్లు తెలిపారు. విశాఖ మన్యంలో బాక్సైట్ తవ్వకాలను మూడుపార్టీలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా మానవహక్కులు, పౌరహక్కుల ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయని, మత సామరస్యం దెబ్బతింటోందని, ధనిక పేద అంతరాలు, అవినీతి పెరిగిపోతున్నాయని మూడు పక్షాల నేతలు పేర్కొన్నారు. జర్నలిస్టు గౌరీలంకేష్ హత్య దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆకాంక్షలు నెరవేర్చే వారికే పట్టం కట్టాలి: చంద్రబాబు

ప్రజలకు సీఎం గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆశలు, లక్ష్యాలకు తూట్లు పొడిచినందున వారి ఆకాంక్షలు నెరవేర్చే వారికి పట్టం కట్టాల్సిన కీలక బాధ్యతలను ఈ గణతంత్ర దినోత్సవం ప్రజల ముందుంచిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పాలకుల నియంతృత్వ పోకడల వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతోందని, దేశంలోని రాజ్యాంగ వ్యవస్థల మనుగడకు విఘాతం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. 'రాష్ట్ర విభజన తర్వాత జరుగుతున్న అయిదో గణతంత్ర వేడుకలివి. బాలారిష్టాలను అధిగమించి రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. దావోస్ పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ బృందం ప్రపంచంలోని పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజాలను ఏపీ వైపు చూసేలా చేయడంలో విజయం సాధించడం ఈ గణతంత్ర దినోత్సవాన శుభసూచకం' అని ప్రకటనలో వివరించారు.

రాజ్యాంగ రక్షణకు కలిసి పనిచేయాలి: జగన్

ఈనాడు, అమరావతి: రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచే శక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అందరం కలిసి పనిచేయడం అవసరమని వైకాపా అధ్యక్షుడు జగన్ వ్యాఖ్యానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులకు శుభాకాంక్షలు తెలిపారు.

యాగం పరిపూర్ణం

కేసీఆర్ దంపతులు, కుటుంబ సభ్యుల పూజలు



తెలంగాణలోని సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లిలో మహా చండీయాగం పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం కేసీఆర్ దంపతులు. చిత్రంలో స్వరూపానందేంద్రస్వామి, రుత్వికులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, సకాలంలో వానలు కురవాలని, పంటలు పండాలని ఆకాంక్షిస్తూ ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన సహస్ర మహాచండీయాగం శుక్రవారం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి సరస్వతి ఆధ్వర్యంలో, అయిదో రోజు మొత్తం ఎనిమిది మండపాల్లో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు, కుటుంబ సభ్యులు ప్రతి మండపానికి వెళ్లి, పూర్ణాహుతిలో పాల్గొన్నారు. రాజశ్యామల, బగళాముఖి, నవగ్రహ, రుగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద మండపాల్లో, తర్వాత ప్రధాన యాగశాల అయిన చండీమాత మహామండపంలో పూర్ణాహుతి జరిగింది.

ముగింపు రోజున.. ముఖ్యమంత్రి కేసీఆర్-శోభ, ఆయన కుటుంబ సభ్యులైన కేటీఆర్-శైలిమ, కవిత-అనిల్, ఎంపీ సంతోష్‌కుమార్-రోహిణి దంపతులు, మనవళ్లు, మనవరాలుతో కలిసి మొదట రాజశ్యామలాదేవి మండపంలో పూజలు నిర్వహించారు. అక్కడ రుత్వికులు నిర్వహిస్తున్న పూర్ణాహుతిలో పాల్గొన్నారు. నవగ్రహ మండపంలో, మహారుద్ర మండపంలో, చతుర్వేద మండపాల్లో కూడా పూర్ణాహుతి జరిగింది. 'సహస్ర శీర్షా, పురుష సంవేద పుష్పమాం, పుష్ప మాలికాం సమర్పయామి.. సౌభాగ్య ద్రవ్య సమర్పయామి..' అంటూ పూర్ణాహుతి నిర్వహించారు. చివరి రోజున పారాయణాలు, జపాలు, తద్దశాంశ హోమ తర్పణాలను నిర్వహించారు. కేసీఆర్ దంపతులు చండీ సంబంధమైన అన్ని రకాల ఉపాసనలు చేశారు.

చండీ ఉపాసనకు ఎంతో ప్రాశస్త్యం: దేశ క్షేమం, లోక సంరక్షణ ప్రధాన ధ్యేయంగా సహస్ర చండీయాగాన్ని నిర్వహించినందుకు సీఎం కేసీఆర్‌ను స్వరూపానందేంద్రస్వామి అభినందించారు. యాగం ముగింపులో ఆశీర్వచనాలను.. శృంగేరీ, జీయర్, ఉడిపి పీఠాల నుంచి వచ్చిన ప్రసాదాలను స్వరూపానందేంద స్వామి కేసీఆర్ దంపతులకు, కుటుంబసభ్యులకు అందజేశారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి యనమల

జగన్ దోపిడీ కారణంగానే రాష్ట్రంలో లోటు బడ్జెట్: యనమల

తొండంగి, న్యూస్‌టుడే: వైఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర ఖజానాను ప్రస్తుత ప్రతిపక్ష నేత జగన్ దోచుకోవడమే.. ఇప్పుడు రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉండడానికి కారణమని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం ఎ.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సభలో ఆయన మాట్లాడారు. "జగన్ రూ.లక్ష కోట్లు దోచుకుని బెంగళూరు, ఇడుపులపాయ, కడప, హైదరాబాద్‌లలో ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. ఆయనకు చెందిన రూ.43 వేల కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఆ డబ్బును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇస్తే అప్పు చేయాల్సిన అవసరం ఉండదు. ఆ నగదును రాష్ట్రానికి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం" అని యనమల తెలిపారు.

కేటీఆర్ విమర్శలు అర్థరహితం: అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పేదవాడి కోసం ఏం చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బాగా తెలుసని మంత్రి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. తెదేపా మా పార్టీ పథకాలను కాపీ కొడుతోందని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందే తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అని, తెదేపాలో పనిచేసిన కేసీఆర్‌కు ఈ విషయం తెలుసని అన్నారు. ఎన్టీఆర్ పేరునే కాపీ కొట్టిన కేటీఆర్ తెదేపా పథకాలను ఎలా విమర్శిస్తారని ప్రశ్నించారు. శుక్రవారం విశాఖ జిల్లా నర్సీపట్నంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

ఏపీని అభివృద్ధిలోనూ ముందుంచుతాం: పురందేశ్వరి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: భాజపా, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా రాజకీయ పక్షాలు కూటమిగా ఏర్పాటైంది స్వలాభం, రాజకీయ లబ్ధి కోసమేనని భాజపా రాష్ట్ర ఎన్నికల ప్రణాళిక సంఘం ఛైర్‌పర్సన్ పురందేశ్వరి విమర్శించారు. ఏపీని అభివృద్ధిలో ముందుంచేందుకు భారతీయ జనతా పార్టీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. అరకు పార్లమెంటు స్థాయి ముఖ్య నాయకులతో శుక్రవారం అరకులోయలో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాజపాను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. పురందేశ్వరి కుమారుడు వైకాపా నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. 30 ఏళ్ల వ్యక్తి తన ఇష్టానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంటుందన్నారు. భాజపా ఎక్కడ పోటీ చేయమంటే అక్కడి నుంచి తాను పోటీ చేస్తానని పేర్కొన్నారు.

రాధా నిర్ణయం వెనుక ఒత్తిళ్లు: రామచంద్రారెడ్డి

ఈనాడు, తిరుపతి: వంగవీటి రాధా పార్టీ మారడంలో అతనిపై విపరీతమైన ఒత్తిళ్లు పనిచేశాయని వైకాపా నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. తాను కృష్ణా జిల్లాకు వైకాపా బాధ్యుడిగా ఉన్నానని.. ఎక్కడ అడిగితే అక్కడ రాధాకు టికెట్ ఇవ్వడానికి పార్టీ సిద్ధంగా ఉన్నట్లు ఎన్నోసార్లు చెప్పినట్లు తెలిపారు. ఒకవేళ ఓడిపోతే ఎమ్మెల్సీ ఇచ్చేందుకు సైతం అంగీకారం తెలిపినట్లు చెప్పారు. పార్టీ మారడం ఆయన వ్యక్తిగత వ్యవహారమని.. ఆయన వెళుతూ జగన్‌పై విమర్శలు చేయడం తగదన్నారు.

జగన్‌కు జన బలం ఉంది: ఆనం

హైదరాబాద్, న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో ధనబలంతో నెగ్గాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చూస్తున్నారని వైకాపా నేత, మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. చంద్రబాబుకు ధనబలం ఉంటే జగన్‌కు జన బలం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

వైకాపాలో చేరిన కాంగ్రెస్ నాయకుడు రవిచంద్రారెడ్డి

నెల్లూరు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత, ఏపీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి కనుమూరు రవిచంద్రారెడ్డి శుక్రవారం వైకాపాలో చేరారు. లోటస్‌పాండ్‌లో జరిగిన కార్యక్రమంలో వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పార్టీ కండువా వేసి రవిచంద్రారెడ్డిని ఆహ్వానించారు.

చంద్రబాబుపై ప్రజల అభిమానాన్ని చెరపలేరు

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

కృష్ణలంక, న్యూస్‌టుడే: చెప్పుచేతల్లో ఉన్న మీడియా సంస్థల సహకారంతో తప్పుడు సర్వేలు చేపట్టి దుష్ప్రచారం చేయించినంత మాత్రాన ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న నమ్మకాన్ని, అభిమానాన్ని ఎవరూ తొలగించలేరని తెదేపా అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ స్పష్టం చేశారు. తెదేపా జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఛానెళ్లు, పత్రికల సాయంతో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని తక్కువగా చూపి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న కేసీఆర్, జగన్, మోదీలు మంత్రాలకు చింతకాయలు రాలవన్న విషయాన్ని గ్రహిస్తే మంచిదని పేర్కొన్నారు.

ఎన్నికల కమిషన్‌ది నియంతృత్వం: తులసిరెడ్డి

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర ఎన్నికల కమిషన్ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. ఈవీఎంల పనితీరుపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతుంటే రాబోయే ఎన్నికలు కూడా వాటితోనే నిర్వహిస్తామని ప్రకటించడం నియంతృత్వమే అవుతుందని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు.

తలసానీ.. తెనాలిలో రాజకీయం చేసిచూడు

బోనబోయిన శ్రీనివాసయాదవ్ సవాల్

తెనాలి (మారీస్‌పేట), న్యూస్‌టుడే: "నేను, ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ హైదరాబాద్‌లో ఎన్నికలకు 20 రోజులు ఉన్నాం. తలసాని శ్రీనివాసయాదవ్ గారూ... మీకు దమ్ము ధైర్యం ఉంటే తెనాలికి వచ్చి 20 నిమిషాలు రాజకీయం చేసి చూడండి... మా సత్తా ఏమిటో... మీ బలమెంతో తెలుసుకుందాం" అంటూ తెదేపా రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు బోనబోయిన శ్రీనివాసయాదవ్ సవాల్ విసిరారు. తెనాలి ఎన్.వి.ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన నియోజకవర్గ బీసీల ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తామంటే ఆంధ్రాలో చెల్లదన్నారు. ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. తెదేపా పుణ్యంతో ఎమ్మెల్యే పదవి పొంది నాయకుడైన విషయాన్ని తలసాని గుర్తుంచుకోవాలన్నారు.

'విశ్వబ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

అలంకార్ కూడలి (విజయవాడ), న్యూస్‌టుడే: విశ్వబ్రాహ్మణులకు రాజకీయంగా అన్యాయం జరుగుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. ఏపీ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ), యువజన విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో చేస్తున్న విశ్వ బ్రాహ్మణ ధర్మపోరాట దీక్షను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటు చేసి 25 లక్షల మంది విశ్వబ్రాహ్మణుల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జేఏసీ అధ్యక్షుడు, జాతీయ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు మాట్లాడుతూ.. ఆర్థికాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి ప్రతి ఏడాది రూ.200 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణులకు 3 ఎమ్మెల్యే, 2 ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించాలని కోరారు.

యువతే దేశ భవిత

- ఓటు వేస్తేనే ప్రశ్నించే హక్కు
- 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ నమోదు చేసుకోవాలి
- జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ నరసింహన్ ఉద్బోధ



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో వెంకట నర్సమ్మ అనే వృద్ధురాలు వేదికపైకి రాలేకపోవడంతో ఆమె వద్దకు వెళ్లి నమస్కరిస్తున్న గవర్నర్ నరసింహన్, కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం

ఈనాడు డిజిటల్ – విజయవాడ

యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటూ ముందుకు కదిలితే దేశ భవిత బంగారం అవుతుందని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈ.ఎస్.ఎల్.నరసింహన్ ఉద్బోధించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు జరిగే రోజు కార్యాలయాలకు, పాఠశాలలకు సెలవిస్తామని, ఆ సమయంలో ఓటు వేయకుండా ఇంట్లో ఉంటే అసమర్థ నాయకుణ్ని పరోక్షంగా ఎన్నుకున్నట్లే అవుతుందని ఆయన హెచ్చరించారు. ఓటరుగా నమోదుతో పాటు, ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే బాధ్యత యువతపై ఉందన్నారు. ఓటరు సమస్యలను పరిష్కరించేందుకు ఫిర్యాదు బాక్సులను ఏర్పాటుచేయాలని ఎన్నికల సంఘానికి సూచించారు. అభ్యర్థులు నచ్చకపోతే 'నోటా'ను ప్రయోగించే వెసులుబాటు ఉందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్.రమేష్‌కుమార్ మాట్లాడుతూ మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకునే హక్కును ఓటు ద్వారా రాజ్యాంగం కల్పించిందన్నారు. కార్యక్రమంలో తొలుత విద్యార్థులు, యువత, అధికారులతో ఓటరు నమోదు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు వీరే..

కొత్త ఓటర్ల నమోదుకు, యువతలో చైతన్యం నింపేందుకు జిల్లాలో వినూత్న కార్యక్రమాలు చేపట్టిన అధికారులకు గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. కృష్ణ, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు బి.లక్ష్మీకాంతం, కోన శశిధర్, కార్తికేయ మిశ్రాలకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డులు అందించారు. వీరితో పాటు సత్యవతి(గుంటూరు), హసీనా సుల్తానా(తహసీల్దారు, పెనుగొండ), పి.విశ్వనాథ్(తహసీల్దారు, హిందూపురం), ఎన్.శశికళ(బీఎల్‌వో, సూళ్లూరుపేట), శైలజ(బీఎల్‌వో, పెనమలూరు)లతో పాటు డేటా ప్రాసెసింగ్ అధికారులు సదాశివరావు, నవీన వరప్రసాద్‌లకు ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

కోడూరుపాడు(హనుమాన్‌జంక్షన్ గ్రామీణం), న్యూస్‌టుడే: అతివేగం, నిద్రమత్తు యమపాశాలై ముగ్గురి నిండు ప్రాణాలను పొట్టనపెట్టుకున్నాయి. మరో ముగ్గురిని గాయాల పాల్జేశాయి. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఈ విషాదం చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా రాయవరానికి చెందిన బద్దే వెంకటేశ్వరరావు(27).. స్నేహితుడు బొడ్డు రాంబాబు(21)తో కలిసి గురువారం రాత్రి విజయవాడకు కారులో బయలుదేరారు. రావులపాలెం బస్టాండ్ వద్ద విజయవాడ వెళ్లేందుకు వేచి ఉన్న నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన గుంతక సంగమేశ్వర్(59), విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, రావులపాలెంకు చెందిన రమణారావు, గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారానికి చెందిన జాషువా ఐన్‌స్టీన్‌లను ఎక్కించుకున్నారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో సర్కార్ జ్యూట్ మిల్లు సమీపంలో వాహనం అతివేగంతో అదుపు తప్పి విభాగిని(డివైడర్)పైకి దూసుకుపోయి గాల్లోకి లేచింది. ఇదే సమయంలో చెన్నై నుంచి విశాఖ వెళుతున్న కంటైనర్ లారీ దీనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు, రాంబాబు, సంగమేశ్వర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు పీవీ పురస్కారం

- ఇండియా నెక్స్ట్ ఆధ్వర్యంలో వచ్చే నెల 28న దిల్లీలో ప్రదానం

హైదరాబాద్, న్యూస్‌టుడే: దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు తన విధానాలు, పాలనతో దశాదిశా మార్చిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ అన్నారు. ఇండియా నెక్స్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న దిల్లీలోని తీన్‌మూర్తి భవన్‌లో జరిగే కార్యక్రమంలో పీవీ నర్సింహారావు జీవిత సాఫల్య జాతీయ పురస్కారాన్ని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ప్రదానం చేసేందుకు జ్యూరీ కమిటీ నిర్ణయించింది. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో జ్యూరీ కమిటీ సభ్యులు జయప్రకాశ్ నారాయణ వివరాలు ప్రకటించారు. జేపీ మాట్లాడుతూ పీవీ అన్ని సంస్థల్ని గౌరవించే వారని, ఎవరిపైనా పెత్తనం చేయకుండా మర్యాద పూర్వకంగా చర్చలు జరిపేవారని గుర్తు చేశారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షతన జ్యూరీ కమిటీ సభ్యులందరమూ కలిసి దేశ ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా, మచ్చలేని వ్యక్తిత్వం ఉన్న డా.మన్మోహన్‌సింగ్‌ను అవార్డుకు అర్హులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జేపీ వివరించారు. రాపోలు ఆనంద భాస్కర్, సీనియర్ ఎడిటర్ రామచంద్రమూర్తి మాట్లాడుతూ 'ది ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఎకనామీ పీవీ నర్సింహారావు' పేరుతో అవార్డు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. తొలి అవార్డుకు మన్మోహన్‌సింగ్‌ను ఎంపికచేయడం సరైన నిర్ణయమని ప్రశంసించారు. జ్యూరీ కమిటీలో డా.సుభాష్ కశ్యప్, డా.కార్తికేయన్, నరేంద్ర ఉన్నారని వివరించారు. సమావేశానికి ఇండియా నెక్స్ట్ కన్వీనర్ ఎస్వీ సూర్యప్రకాశ్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త శ్రీలక్ష్మి, యువజన కో ఆర్డినేటర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



ఇండియా నెక్స్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న లోక్‌సత్తా అధినేత జేపీ, సీనియర్ ఎడిటర్ రామచంద్రమూర్తి తదితరులు

ఎన్నికల సర్వేపై రగడ

- ప్రైవేటు సంస్థ ప్రతినిధుల్ని అడ్డుకున్న వైకాపా నేతలు
- 8 ట్యాబులు తీసుకున్న నాయకులు
- బొత్స మేనల్లుడు సహా 14 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



జామి పోలీస్‌స్టేషన్లో బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (పచ్చ కుర్చీలో కూర్చున్న వ్యక్తి)

ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లాలో ఎన్నికల సర్వే నిర్వహిస్తున్న వ్యక్తుల్ని అడ్డుకొని, ట్యాబులు స్వాధీనం చేసుకున్నారంటూ శుక్రవారం 14 మంది వైకాపా నేతల్ని అదుపులోకి తీసుకోవడం కలకలం సృష్టించింది. విజయనగరం డీఎస్పీ శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం పూసపాటిరేగ మండలం కుమిలి, రెల్లివలసల్లో పబ్లిక్ పాలసీ రీసెర్చ్ గ్రూపు అనే సంస్థ ప్రతినిధులు ఎన్నికలపై సర్వే నిర్వహిస్తుండగా ఓటర్ల జాబితా సర్వే ఎలా చేస్తారంటూ వైకాపా నేతలు అడ్డుకున్నారు. వారి నుంచి 8 ట్యాబులు స్వాధీనం చేసుకుని, పూసపాటిరేగ స్టేషన్‌కి తీసుకొచ్చారు. ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో ట్యాబులు వెంటతీసుకుపోయారు. దీంతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వైకాపా నేతలపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో గురువారం అర్ధరాత్రి నుంచే పూసపాటిరేగ మండల వైకాపా పార్టీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, బూర్లి శ్రీనులతో సహా మొత్తం 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వివిధ స్టేషన్లకు తరలించారు. ట్యాబులు ఇవ్వకుండా తన వద్ద ఉంచుకున్నారన్న కారణంగా శుక్రవారం ఉదయం జిల్లా వైకాపా రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావుని అరెస్టు చేసి జామి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఠాణా వద్ద ఆందోళన: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావుని అరెస్టు చేయడంతో జిల్లాలో కలకలం రేగింది. కొందరు వైకాపా కార్యకర్తలు జామి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. 11 మంది నిందితులపై కేసు నమోదుచేసి మధ్యాహ్నానికి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్ల తొలగింపు ప్రక్రియలో భాగంగా జిల్లాలో 600 మందితో ప్రత్యేకించి వైకాపా కార్యకర్తల ఇళ్ల వద్దకే వెళ్లి ఎన్నికల సర్వే చేయిస్తున్నారని వైకాపా నేతలు ఆరోపిస్తున్నారు.

ఈసీ, డీజీపీకి వైకాపా నేతల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సర్వేల పేరుతో ఇంటింటికి వెళ్లి తెదేపా వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని ఎన్నికల ప్రధాన కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది, డీజీపీ ఠాకూర్‌కు వైకాపా నేతలు వేర్వేరుగా శుక్రవారం ఫిర్యాదు చేశారు. విజయనగరం జిల్లాలో పలువురు యువకుల నుంచి స్వాధీనం చేసుకున్న ట్యాబులను వారికి అందజేశారు. అనంతరం వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ "విజయనగరం జిల్లాలోని కుమిలి గ్రామంలో తెదేపా వారుగా భావిస్తున్న గణపతినగరం యువకులు సర్వే పేరుతో ఇంటింటికి వెళ్లి ఏ పార్టీకి అనుకూలంగా ఉంటున్నారో గుర్తించి వారి పేర్లను ఇతరులకు చేరవేస్తూ ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నించారు. వైకాపాకు చెందిన ఓటర్ల విషయంలోనే ఇలా జరిగింది. వీరిని పట్టుకొని పూసపాటిరేగ పోలీసులకు అప్పగించి వారివద్ద ఉన్న ట్యాబ్‌ల్లో ఏముందో పరిశీలించాలని కోరినప్పటికీ వారు పట్టించుకోలేదు' అని చెప్పారు. పార్టీ నేతలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, ఇతర నేతలు ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేదితో మాట్లాడుతూ.. విజయవాడ ఈస్ట్, వెస్ట్, ఇతరచోట్ల ముందస్తు సమాచారం లేకుండానే ఓటర్లను తొలగించారని తెలిపారు. పటిష్ఠమైన సాంకేతిక వ్యవస్థ ఉన్నందున ఓటర్ల జాబితాలో పేర్లను తొలగించడం సాధ్యం కాకపోవచ్చని ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది అభిప్రాయపడ్డారు. ట్యాబులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజయనగరం కలెక్టరును ఆదేశిస్తామన్నారు. ట్యాబులపై విచారణ జరిపిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు.

అతిపెద్ద ఈవీఎం ఆవిష్కరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బృందం అతిపెద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని తయారుచేసింది. సాధారణ ఓటింగ్ యంత్రం ఎలా పనిచేస్తుందో ఇది కూడా అదేలాపనిచేస్తుందని విద్యార్థులు వివరించారు. 20 మంది విద్యార్థులు నెలపాటు శ్రమించి ఈ యంత్రాన్ని తయారుచేశారని ప్రధానాచార్యుడు జి.పార్థసారథివర్మ తెలిపారు.

విశేషాలు: పొడవు 15అడుగులు, వెడల్పు 6 అడుగులు, ఆర్డినో మెగా మైక్రోకంట్రోలర్, రిలే మాడ్యూల్స్, పి.10 ఎల్ఈడీ మాడ్యుల్, 15పుష్‌టుఆన్ స్విచ్‌లు, 14సాకెట్స్, బల్బులు వాడారు.



సిగ్నల్ లోపంతో నిలిచిన రైళ్లు

తడ, న్యూస్‌టుడే: చెన్నై-కోల్‌కతా రైల్వే మార్గంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తడ వద్ద శుక్రవారం సిగ్నల్ వ్యవస్థలో తలెత్తిన లోపంతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో తడ రైల్వే స్టేషన్‌కు రెండు వైపులా ఉన్న సిగ్నల్ వ్యవస్థ మొండికేసింది. దీంతో ఎక్కడికక్కడ పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగిపోయాయి. హుటాహుటిన సిగ్నల్ సిబ్బంది రంగంలోకి దిగి సరిచేశారు. అనంతరం రైళ్లు యథావిధిగా నడిచాయి. గంట పాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. సిగ్నల్ వ్యవస్థలో లోపం కారణంగా యశ్వంత్‌పూర్, పినాకిని, షాలిమార్, సంఘమిత్ర తదితర రైళ్లు గంట పాటు ఆలస్యంగా నడిచాయి.

అన్నదాతా సుఖీభవ!

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాకు ఒక్కో సీజన్‌లో రూ.5 వేలు చొప్పున, రెండు సీజన్లకూ కలిపి ఏటా రూ.10 వేలు చొప్పున ఇవ్వాలన్నది ప్రతిపాదన. దీన్ని ఎలా అమలు చేయాలన్న అంశంపై విస్తృత కసరత్తు జరుగుతోంది. ఈ పథకం విధి విధానాల్ని మరో వారం పది రోజుల్లో ప్రకటించనుంది. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి ఈ పథకం అమల్లోకి రానుంది. రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్న భూ విస్తీర్ణం రెండు కోట్ల ఎకరాలకుపైగా ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా. ఆ లెక్కన ఈ పథకంపై ఒక్కో సీజన్‌లో రూ.10,000 కోట్లు చొప్పున, సంవత్సరానికి రూ.20 వేల కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ పథకం వల్ల 96 లక్షల మందికి పైగా రైతులు, కౌలు రైతులకు మేలు జరగనుంది.

ఖరీఫ్ నుంచే ఎందుకంటే..?

ఈ పథకాన్ని తక్షణం అమల్లోకి తేవాలని భావించినా.. . రాష్ట్రంలో భారీ సంఖ్యలో ఉన్న కౌలు రైతుల్ని ఈ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు విస్తృత కసరత్తు చేయాల్సి రావడం, ప్రస్తుత రబీ సీజన్ కూడా ఇప్పటికే సగం పూర్తి కావడం వంటి కారణాల వల్ల వచ్చే ఖరీఫ్ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో కౌలు రైతులు సగటున 67 శాతం ఉంటారని అంచనా. తూర్పుగోదావరి నుంచి నెల్లూరు జిల్లా వరకు వీరు అత్యధికంగా ఉంటారు. ఈ జిల్లాల్లోని కొన్ని గ్రామాల్లో 90-95 శాతం వరకు ఉంటారు. కౌలు రైతుల్ని గుర్తించడం, వారిని 'అన్నదాత సుఖీభవ' పథకం పరిధిలోకి తీసుకురావడం ప్రభుత్వం ముందున్న పెద్ద సవాల్. రాష్ట్రంలో ఎంత మంది కౌలు రైతులు ఉంటారన్న విషయంలో ప్రభుత్వం వద్ద కచ్చితమైన లెక్కల్లేవు. ప్రభుత్వం సాగు ధ్రువీకరణ, రుణ అర్హత పత్రాలు ఇవ్వడం ద్వారా 11.06 లక్షలమంది కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రూ.5 వేల కోట్ల వరకు రుణాలు ఇప్పించింది. అటు అసలు రైతులు, ఇటు కౌలు రైతుల్లో ఎవరికీ అన్యాయం జరగకుండా, ఇద్దరి మధ్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం విస్తృత కసరత్తు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సమర్థ యంత్రాంగాన్ని, విధివిధానాల్ని రూపొందించి.. వచ్చే ఖరీఫ్ నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలన్న నిర్ణయానికొచ్చింది. ఈ పథకాన్ని తక్షణం అమలు చేయకపోవడానికి ప్రభుత్వం వద్ద ప్రస్తుతం ఆర్థిక వనరుల లభ్యత తక్కువగా ఉండటం కూడా ఒక కారణం.

అసలు రైతుకీ, కౌలు రైతుకీ చెరిసగం..!

'అన్నదాత సుఖీభవ' పథకాన్ని వచ్చే జూన్ 1 నుంచి ప్రభుత్వం అమల్లోకి తేనుంది. భూ యజమానులే స్వయంగా సాగు చేస్తున్న చోట మొత్తం ఆర్థిక సాయాన్ని వారికే అందజేయనుంది. కౌలు రైతులు సాగు చేస్తున్న చోట ఆర్థిక సాయంలో సగం అసలు రైతుకి, సగం కౌలు రైతుకి ఇవ్వాలన్నది ప్రతిపాదన.

అగ్నిమాపకశాఖలో డ్రైవర్ పోస్టుల భర్తీ

నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖలో 85 డ్రైవర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి పోలీసు నియామక మండలి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 29 ఉదయం 10.30 నుంచి ఫిబ్రవరి 6 సాయంత్రం 5 మధ్య అన్ని పనిదినాల్లో ఆయా జిల్లాల ఎస్పీ కార్యాలయాలకు వెళ్లి అభ్యర్థులు దరఖాస్తులను పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 29 ఉదయం నుంచి ఫిబ్రవరి 7 సాయంత్రం 5 గంటల్లోగా ఆయా జిల్లాల ఎస్పీ కార్యాలయాల్లో అభ్యర్థులే స్వయంగా అందజేయాలి. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయిన తర్వాత అర్హులైన అభ్యర్థులకు ఫిబ్రవరి 12 ఉదయం 8 గంటలకు డ్రైవింగ్, శారీరక కొలతల పరీక్ష నిర్వహిస్తారు. 100 మార్కులకు డ్రైవింగ్ పరీక్ష ఉంటుంది.

జిల్లా	పోస్టుల సంఖ్య
శ్రీకాకుళం	2
విజయనగరం	1
విశాఖపట్నం	10
తూర్పుగోదావరి	6
పశ్చిమగోదావరి	5
కృష్ణా	20
గుంటూరు	18
ప్రకాశం	2
నెల్లూరు	4
కర్నూలు	4
అనంతపురం	3
చిత్తూరు	6
కడప	4
మొత్తం	85

★ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన దరఖాస్తుదారులకు విశాఖపట్నం పరేడ్ గ్రౌండ్స్‌లోనూ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఏలూరులో, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అభ్యర్థులకు ఒంగోలులో, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల అభ్యర్థులకు కడపలో డ్రైవింగ్ పరీక్ష నిర్వహిస్తామని పోలీసు నియామక మండలి ఛైర్మన్ కుమార్ విశ్వజిత్ తెలిపారు.

★ **అర్హతలు:** 2018 జులై ఒకటో తేదీ నాటికి ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన అర్హత కలిగిన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. హెవీ మోటారు వాహన లైసెన్సు కలిగి ఉండాలి.

★ వయసు: 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.

ఈవీఎంలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

'ట్విటర్'లో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పుగా పరిణమించనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. వాటిలో చాలా తేలిగ్గా మార్పులు చేసేందుకు, అవకతవకలకు పాల్పడే అవకాశం ఉందని శుక్రవారం ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు. "అమెరికా, జపాన్, జర్మనీ సహా అభివృద్ధి చెందిన, టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తున్న ఏ దేశమూ ఈవీఎంలను వాడటం లేదు. భారత్‌లోనూ మళ్లీ పేపర్ బ్యాలెట్‌ను పునరుద్ధరించాలి'' అని ఆయన ట్వీట్ చేశారు. 'అవుట్ లుక్ ఇండియా.కామ్'లో వచ్చిన తన ఇంటర్వ్యూ లింక్‌ని దీనికి జత చేశారు. చంద్రబాబు ఇటీవల కోల్‌కతా వెళ్లినప్పుడు ఇచ్చిన ఇంటర్వ్యూని అవుట్ లుక్ ఇండియా.కామ్ గురువారం ప్రచురించింది. ఆ ఇంటర్వ్యూలో చంద్రబాబు ఈవీఎంల గురించి తన అభిప్రాయాన్ని తెలియజేశారు. త్వరలో భాజపాయేతర విపక్ష పార్టీలన్నీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి పేపర్ బ్యాలెట్ పునరుద్ధరించాలని డిమాండ్ చేయనున్నట్టు చంద్రబాబు తెలిపారు. "ఏ ఇతర ప్రజాస్వామ్య దేశంలోనూ ఈవీఎంలను ఉపయోగించడం లేదు. దీనిపై మేం దేశ వ్యాప్తంగా చర్చిస్తాం. ఈవీఎంల్ని వాడటమంటే ప్రజాస్వామ్య భవిష్యత్తుని తీసుకెళ్లి ఒక కంప్యూటర్ ఆపరేటర్ చేతిలో పెట్టినట్టే'' అని వ్యాఖ్యానించారు. "ఈ యంత్రాల్లో ఏ వ్యక్తయినా మార్పులు చేయవచ్చు. అది కంప్యూటర్ ఆపరేటర్ కావొచ్చు. ప్రోగ్రామర్ కావొచ్చు. ప్రజాస్వామ్యాన్ని కొందరు వ్యక్తుల చేతుల్లో పెట్టడం చాలా ప్రమాదం'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

29న ఉండవల్లి అఖిలపక్ష సమావేశం


దేవీచౌక్, న్యూస్‌టుడే: విభజన తర్వాత రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై చర్చించేందుకు ఈ నెల 29వ తేదీన మంగళవారం విజయవాడ ఐలాపురం హోటల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెదేపా, వైకాపా, భాజపా, కాంగ్రెస్, జనసేన, సీపీఐ, సీపీఎం ముఖ్యనేతలను ఈ సమావేశానికి ఆహ్వానించినట్లు చెప్పారు. అయితే తెదేపాతో కలిసి ఒకే వేదికను పంచుకోలేమని, ఈ సమావేశంలో తాము రామని వైకాపా నాయకత్వం తెలిపిందని ఉండవల్లి వెల్లడించారు. సమావేశానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ హాజరవుతారని తెలిపారు.

పైపులైన్ ధ్వంసం మా పని కాదు

మావోయిస్టు కోరుకొండ దళం పేరిట లేఖ

పాడేరు, న్యూస్‌టుడే: 'ఆంధ్ర-ఒడిశా సరిహద్దు(ఏవోబీ) పరిధిలో ఈ నెల 20న జరిగిన ఎస్ఆర్ గుజరాత్ కంపెనీకి చెందిన పైపులైన్ ధ్వంసం మా పని కాదని' పేర్కొంటూ మావోయిస్టు పార్టీ కోరుకొండ ఏరియా కమిటీ ప్రతినిధి రమణ శుక్రవారం పత్రికలకు ఓ లేఖ విడుదల చేశారు. విశాఖ జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయతీని ఆనుకొని ఒడిశా సరిహద్దులో రోళ్లగడ్డ, చీకుపనస గ్రామాల మధ్య పైపులైన్‌ను మావోయిస్టులే ధ్వంసం చేశారంటూ పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ప్రచారం జరిగిందని వెల్లడించారు. పలగరేవు పరిసరాల్లో రెండు పర్యాయాలు ఎస్ఆర్ గుజరాత్ కంపెనీలో పనిచేసే మధ్య దళారీలే డబ్బు కోసం పైపులైన్‌ను కట్ చేసి మావోయిస్టులపై అభాండాలు మోపారని పేర్కొన్నారు. ఈ చర్య కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు.

సమ సమాజానికి ఓటే పునాది



గణతంత్ర దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి కోవింద్ పిలుపు

దిల్లీ

ఎన్నికలు కేవలం రాజకీయ కసరత్తు కాదని, సమసమాజ నిర్మాణం కోసం పునరంకితం చేసుకునే ప్రక్రియ అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. ఓటు వేయడాన్ని కర్తవ్యంగా గుర్తించి పౌరులందరూ తప్పనిసరిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 21వ శతాబ్దంలో జన్మించిన వారికి తొలిసారిగా ఓటు వేసే అవకాశం వచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. 70వ గణతంత్రదినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశం సాధించిన ప్రగతిని వివరించడంతోపాటు బాధ్యతలను గుర్తు చేశారు. రాష్ట్రపతి ప్రసంగం ఆయన మాటల్లోనే...

అభివృద్ధి ప్రయాణంలో ఎన్నికలే మైలురాయి

ఈ ఏడాది దేశంలోని ప్రతి ఒక్కరికీ మరో బాధ్యత ఉంది. 17వ లోక్‌సభ కోసం జరిగే సాధారణ ఎన్నికల్లో పాల్గొనవలసి ఉంది. 21వ శతాబ్దంలో జన్మించినవారు తొలిసారిగా ఇందులో భాగస్వాములు కానున్నారు. ఎన్నికలంటే కేవలం రాజకీయ కసరత్తు కాదు. సమసమాజ నిర్మాణం కోసం అందరిలో ఉన్న ఆశయాలు, లక్ష్యాలకు పునరంకితం చేసుకునే సందర్భం. అందుకే ఓటు వేయడం పవిత్ర కార్యంగా మారింది. దయచేసి అందరూ ఈ కర్తవ్యాన్ని నిర్వహించండి. మీకు నచ్చినవారికి ఓటేయండి. నా విన్నపం ఏమిటంటే అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోండి. ఇది కీలక సమయం. ఇప్పుడు తీసుకునే నిర్ణయాలు 21వ శతాబ్దంలోని మిగిలిన కాలంపై ప్రభావం చూపుతాయి. అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించడం కోసం జరుగుతున్న ప్రయాణంలో ఎన్నికలు ఓ మైలు రాయి లాంటివి. దేశంలో తొలిసారిగా కటిక దారిద్ర్యాన్ని నిర్మూలించగలిగాం. సార్వత్రిక, సమాన ఆరోగ్య సౌకర్యాలు కల్పించే ప్రయత్నాల్లో ఉన్నాం. అధిక శాతం మందికి ఆధునిక వసతులు, విద్యుత్తుతో గృహ సౌకర్యాలను కల్పించగలుతున్నాం.

భారత్ నమూనా అంటే ఇదీ...

మనం వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతోంది. రంగాల వారీగా, వస్తువుల వారీగా కొరతను అధిగమిస్తున్నాం. ఆహార ధాన్యాలు, గ్యాస్ సిలిండర్లు, టెలిఫోన్ కనెక్షన్లు...ఇలా ప్రతి రంగంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఈ సౌకర్యాలన్నీ అందరికీ అందుబాటులో ఉండాలన్నదే అభివృద్ధి సూత్రం. 'భారత్ నమూనా' బహుళత్వం, ప్రజాస్వామ్యం, అభివృద్ధి అనే ముక్కాలిపీటపై ఆసీనమయింది. ఈ మూడింటిలో ఒకదానిని ఎంచుకోమంటే అది సాధ్యం కాదు. ఎందుకంటే ఆ మూడూ తప్పనిసరిగా ఉండాల్సిందే.

గాంధీజీ కలల సాధనకే

ఈ సంవత్సరం మనకు మరికొంత ప్రత్యేకమైనది. అక్టోబరు రెండున మహాత్మాగాంధీ 150వ జయంతిని జరుపుకోనున్నాం. ఆయన బోధనలే మన దేశానికి నైతిక సూచికలు. 'నా కలలలో భారత దేశం' అన్న పుస్తకంలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. నిరుపేదకు కూడా స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం ఉండాలని; పేద, ధనిక తేడాలు ఉండకూడదని; అన్ని వర్గాలూ సామరస్యంతో జీవించాలని; పురుషులకు ఉన్న హక్కులే మహిళలకూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు అధికారం కల్పించాలన్నదే స్వాతంత్ర్య సమరంనాటి ఆశయం. ఆ విలువలనే రాజ్యాంగంలో పొందుపరిచారు. మనం వాటిని కాపాడుకుందాం.

భాగస్వామ్యాలను నిర్మిద్దాం

మానవ అనుభవాలు అంటే భాగస్వామ్యాల నిర్మాణమే. ఇంట్లో భాగస్వామ్యాలు కుటుంబాన్ని నిర్మిస్తాయి. పనిచేసే చోట భాగస్వామ్యం వ్యాపారాన్ని నిర్మిస్తుంది. ప్రభుత్వం, ప్రజలు భాగస్వామిగా ఏర్పడి మన జాతిని నిర్మిస్తున్నారు. దాపరికంలేని, నిజాయతీగల సంభాషణలు, అంతులేని కరుణతోనే భాగస్వామ్యాలు వృద్ధి చెందుతాయి. తరాలుగా అణచివేతకు గురయ్యే వర్గాల సమస్యలను వినాలి. సత్వర మార్పులకు లోనయ్యే సమాజంలో ఇలాంటి సంభాషణలకు అవకాశాలు కల్పించాలి.

ఆర్‌ఎస్‌ఎస్ గుప్పిట్లో వ్యవస్థలు బందీ

- ఈ దాడిని సహించబోం
- ప్రియాంక చేరిక ఆకస్మికం కాదు
- ఒడిశా పర్యటనలో రాహుల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భాజపాకు మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ దేశంలోని అన్ని వ్యవస్థల్లోనూ వేలుపెడుతూ తన నియంత్రణలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షుడి హోదాలో ఆయన తొలిసారి ఒడిశాలో పర్యటించారు. భువనేశ్వర్‌లో ఓ సభలో మాట్లాడిన రాహుల్ గాంధీ, మరో కార్యక్రమంలో మేధావులతో ముచ్చటించారు. ఉత్తర, దక్షిణ బ్లాక్‌లు సహా అన్నింటా ఆర్‌ఎస్‌ఎస్ తన ముద్రవేస్తూ దేశంలో అనేక వ్యవస్థల్లో గందరగోళం సృష్టిస్తోందని దుయ్యబట్టారు. స్వామి నిసర్గదత్తా రాసిన 'ఐ యామ్ దట్' పుస్తకాన్ని ప్రధాని మోదీ చదవాలని సూచించారు. విశ్వంతో పోల్చుకుంటే ఎవరెంత స్వల్పమో ఆ పుస్తకం బోధిస్తుందన్నారు. దేశ విజయం; భారత రాజ్యాంగం; వ్యవస్థల స్వతంత్రత, పురోగతిల మధ్య సంబంధం ఉందని తాము బలంగా విశ్వసిస్తామన్నారు. కీలక వ్యవస్థలపై దాడిని కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదన్నారు. ప్రధాని మోదీ ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను రిమోట్‌తో నియంత్రిస్తున్నారని ఎద్దేవా చేశారు.



శుక్రవారం భువనేశ్వర్ విమానాశ్రయంలో తన ఫొటో తీయబోతూ మెట్ల మీద నుంచి జారిపడిన పాత్రికేయుడిని గమనించిన రాహుల్ గాంధీ మెట్లు దిగి వచ్చి మరీ ఆతన్ని పైకి లేపారు

ప్రియాంక నిర్ణయం ఆనాటిదే..

తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాను రాజకీయాల్లోకి తీసుకురావాలన్నది ఆకస్మిక నిర్ణయం కాదని, తన పిల్లలు పెరిగిపెద్దవారైన తర్వాత రాజకీయాల్లోకి రావాలని ఆమె ఎప్పుడో నిర్ణయం తీసుకున్నట్లు రాహుల్ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే రాజకీయాల్లో ఆమె ప్రధాన పాత్రగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తన సోదరితో తనకున్న గట్టి అనుబంధాన్ని వివరించారు. తమ తండ్రి, నాయనమ్మల హత్య అనంతర పరిణామాలతో తాము పడిన వేదనను, ఎదుర్కొన్న కఠిన పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. తామిద్దరినీ వేర్వేరు గదుల్లో ఉంచి ఒకే ప్రశ్నలు అడిగితే 80 శాతం వరకూ ఒకేలాంటి సమాధానాలిస్తామన్నారు. కాగా భాజపా నేత వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరుతారంటూ వస్తున్న ఊహాగానాల గురించి తనకేమీ తెలియదని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. కైలాస్ మానస సరోవర్ పర్యటన సందర్భంగా తాను ఇద్దరు చైనా మంత్రులను కలిసినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. ఉద్యోగాల కల్పనకు సంబంధించి వారితో చర్చించినట్లు తెలిపారు. అయితే ఈ భేటీ గురించి ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలేదంటూ భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర విమర్శించారు.

ఫిబ్రవరి 10న కుంభమేళాకు రాహుల్

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వసంత పంచమి రోజైన ఫిబ్రవరి 10వ తేదీ లేదంటే...ఆ మర్నాడు (11వ తేదీ)న ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో ఆయన పుణ్యస్నానమాచరిస్తారని పార్టీ పేర్కొంది

భూ కుంభకోణంలో హుడ్డాపై మరో కేసు నమోదు

20 చోట్ల సోదాలు చేసిన సీబీఐ

దిల్లీ: దాదాపు పదేళ్ల నాటి భూకేటాయింపు కుంభకోణానికి సంబంధించి హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడ్డాపై సీబీఐ శుక్రవారం కొత్తగా మరో కేసును నమోదు చేసింది. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలోని 20 చోట్ల సోదాలు నిర్వహించింది. హరియాణాలోని రోహ్‌తక్‌లో ఉన్న హుడ్డా నివాసంలోనూ సోదాలు జరిగాయి. 2009లో గురుగ్రామ్‌లో జరిగిన భూకేటాయింపుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్నది సీబీఐ ఆరోపణ.

జ్ఞానపీఠ్ గ్రహీత కృష్ణా సోబ్తీ మృతి!



దిల్లీ: ప్రఖ్యాత హిందీ రచయిత్రి, జ్ఞానపీఠ్, సాహిత్య అకాడమీ పురస్కారాల విజేత అయిన కృష్ణాసోబ్తీ మరణించారు. త్వరలోనే 94వ ఏట అడుగుపెట్టనుండగా శుక్రవారం ఇక్కడి ఓ ఆసుపత్రిలో ఆమె తుదిశ్వాస విడిచారు. కృష్ణా సోబ్తీ గతంలో 'పద్మభూషణ్' పురస్కారాన్ని తిరస్కరించి వార్తల్లో నిలిచారు. 1925లో జన్మించిన ఆమె వ్యాసరచయితగా కూడా సుప్రసిద్ధులు. ఆమె కలం నుంచి జాలువారిన 'మిత్రో మర్జానీ' భారత సాహిత్యంలో నూతన శైలిని ప్రతిబింబిస్తుందని సాహితీప్రియులు అంటారు.

రాజా కృష్ణమూర్తికి అరుదైన గౌరవం

కాంగ్రెస్‌లో కీలక కమిటీకి నాయకత్వం



వాషింగ్టన్: భారత మూలాలున్న అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తికి అరుదైన గౌరవం దక్కింది. ఆర్థిక, వినియోగ విధాన కమిటీ ఛైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు. దక్షిణాసియా మూలాలున్న ఒక వ్యక్తి కాంగ్రెస్ కమిటీ లేదా ఉప కమిటీకి నాయకత్వం వహించడం ఇదే మొదటిసారి. విద్య, శ్రామిక శక్తి అభివృద్ధి, ఆదాయ అసమానతలు, ఆరోగ్య పరిరక్షణ, వినియోగదారుల పరిరక్షణ, డేటా గోప్యత వంటి అంశాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పదవి దక్కడంపై కృష్ణమూర్తి హర్షం వ్యక్తంచేశారు.

భద్రతా వలయంలో దిల్లీ

దిల్లీ: గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేసేందుకు కుట్ర పన్నిన ఇద్దరు ఉగ్రవాదులు అరెస్టయిన నేపథ్యంలో శనివారం జరిగే ఈ వేడుకల కోసం దిల్లీలో భారీ భద్రతను కల్పించారు. దాదాపు 25వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. జైషే మహ్మద్‌కు చెందిన ఇద్దరు ముష్కరులు దిల్లీలోని లజ్‌పత్ నగర్ మార్కెట్, హజ్ మంజిల్, తుర్క్‌మన్ గేటు, పహార్‌గంజ్, ఇండియా గేట్, ఐజీఎల్ గ్యాస్ పైప్‌లైన్ వంటి ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురుకాకుండా నగరమంతటా బహుళ అంచెల భద్రతను కల్పించారు.

ఉపాధి హామీకి మరో రూ. 5 వేల కోట్లు

ఈనాడు, దిల్లీ: రానున్న బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి మరో రూ.5,000 కోట్లు కేటాయించే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో బకాయిలు ఉండడంతో వాటిని చెల్లించడానికి ప్రభుత్వం అదనంగా ఈ నిధులు ఇచ్చే అవకాశం ఉంది.

ఒకరికి అశోక చక్ర, ఇద్దరికి కీర్తి చక్ర

- 308 మంది సైనిక సిబ్బందికి నేడు శౌర్య పురస్కారాలు



అహ్మద్ వానీ

దిల్లీ: ఈసారి గణతంత్ర దినోత్సవ వేడుకలో 308 మంది సైనిక సిబ్బంది శౌర్య పురస్కారాలు అందుకోనున్నారు. శాంతి కాలంలో ఇచ్చే అత్యున్నత పురస్కారానికి అమర సైనికుడు లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వానీ ఎంపికయ్యారు. శనివారం రాజ్‌పథ్‌లో జరిగే వేడుకలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా నజీర్ సతీమణి మహజబీన్ ఈ అవార్డును స్వీకరించనున్నారు. కశ్మీర్‌కు చెందిన నజీర్ ఒకప్పుడు ఉగ్రవాది. అయితే ఆ బాటను వీడి భారత సైన్యంలో చేరిన ఆయన.. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జరిగిన అనేక ఎన్‌కౌంటర్లలో పాలుపంచుకున్నారు. గతేడాది నవంబర్‌లో ఓ భీకర పోరులో ఇద్దరు ముష్కరులను అంతమొందించిన ఆయన ఈ క్రమంలో తన ప్రాణాలు కోల్పోయారు. అశోక చక్రతోపాటుగా 19 పరమ విశిష్ట సేవా పతకాలు, రెండు కీర్తి చక్ర పురస్కారాలు, మూడు ఉత్తమ యుద్ధ సేవా పతకాలు, 32 అతి విశిష్ట సేవా పతకాలు, తొమ్మిది శౌర్య చక్ర పురస్కారాలు, 10 యుద్ధ సేవా పతకాలు, 109 సేనా పతకాలను కూడా శనివారం రాష్ట్రపతి ప్రదానం చేయనున్నారు. మేజర్ తుషార్ గౌబా, సవార్ విజయ్ కుమార్ (మరణానంతరం)లకు శాంతి కాలంలో అందించే రెండో అత్యున్నత పురస్కారమైన కీర్తి చక్ర అవార్డులు దక్కనున్నాయి. 2018 మేలో జమ్మూకశ్మీర్‌లోని కుప్వారాలో ఎనిమిది మంది ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని తుషార్ (జాట్ రెజిమెంట్) మాటు వేసి భగ్నం చేశారు. మరోసారి ఓ సమీప పోరులో అసమాన ధైర్య సాహసాలు చూపి ముగ్గురు ముష్కరులను మట్టుపెట్టారు. గతేడాది ఆగస్టులో విజయ్ కుమార్ (రాష్ట్రీయ రైఫిల్స్) ఓ సైనిక ఆపరేషన్‌లో పాల్గొంటున్న సమయంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఆయన ఎదురుకాల్పులకు దిగడంతో ముష్కరులు ఓ మొక్కజొన్న తోటలోకి పారిపోయి దాక్కున్నారు. వారి కోసం గాలింపు జరుపుతున్న బృందంపై కాల్పులకు దిగారు. తన సహచరులపై నుంచి ఉగ్రవాదుల దృష్టి మళ్లించేందుకు విజయ్ బహిరంగ ప్రాంతంలోకి వచ్చి పోరుకు దిగారు. గాయపడ్డప్పటికీ ఓ ముష్కరుడిని మట్టుపెట్టారు. ఆసుపత్రికి వెళ్లడానికి నిరాకరించి అక్కడే ఉన్న ఆయన పాకుతూ వెళ్లి ఓ ఉగ్రవాదిని పట్టుకున్నారు. వట్టి చేతులతో వాడిని అంతమొందించారు.

48 మంది మానవతామూర్తులకు 'జీవన్‌రక్ష' పురస్కారాలు!

దిల్లీ: ప్రాణాలకు తెగించి ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలు రక్షించిన 48 మంది మానవతా మూర్తులకు ప్రభుత్వం 'జీవన్ రక్ష' పురస్కారాలను ప్రకటించింది. ఇందులో 8 మందికి మరణానంతరం ఈ పురస్కారాలు లభించాయి. 'సర్వోత్తమ్ జీవన్‌రక్ష....'ఉత్తమ్ జీవన్ రక్ష'.. .'జీవన్‌రక్ష' పతక్ అంటూ మూడు కేటగిరీల కింద మానవతా మూర్తులను ప్రభుత్వం సగౌరవంగా సత్కరించనుంది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ శుక్రవారం వివరాలను ప్రకటించింది. ఈ 48 మందిలో 8 మందికి 'సర్వోత్తమ్ జీవన్‌రక్ష', 15 మందికి 'ఉత్తమ్ జీవన్ రక్ష', 25 మందికి జీవన్‌రక్ష అవార్డులను అందచేయనున్నట్లు హోంశాఖ తెలిపింది. ఈ పురస్కారం కింద పతకం, కేంద్రహోంమంత్రి సంతకంతో ఉన్న సర్టిఫికేట్, నగదు బహుమతినిచ్చి ప్రభుత్వం సత్కరిస్తుంది. త్వరలోనే వాటిని అందచేస్తారు.

855 మంది పోలీసులకు సేవా పురస్కారాలు

- ముగ్గురు సీఆర్‌పీఎఫ్ అమరులకు రాష్ట్రపతి పోలీసు శౌర్య పతకాలు

దిల్లీ: దేశవ్యాప్తంగా విశిష్ట సేవలు అందించిన 885 మంది పోలీసు సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పురస్కారాలను ప్రకటించింది. వీరిలో కేంద్ర రిజర్వు పోలీసు దళానికి (సీఆర్‌పీఎఫ్‌కు) చెందిన ముగ్గురు అమరవీరులకు రాష్ట్రపతి పోలీసు శౌర్య పతకాలు (పీపీఎంజీ) వరించాయి. మొత్తం 146 మందికి పోలీసు శౌర్య పతకాలు; 74 మందికి రాష్ట్రపతి పోలీసు పతకాలు; 632 మందికి పోలీసు పతకాలు దక్కాయి. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు మహమ్మద్ యాసీన్, బోర్సే దినేశ్ దీపక్, జశ్వంత్‌సింగ్‌లను పీపీఎంజీలను ప్రభుత్వం ప్రకటించింది.

- అగ్నిమాపక సేవలకు సంబంధించి 86 మందికి పురస్కారాలు దక్కాయి. వీరిలో 15 మందికి రాష్ట్రపతి అగ్నిమాపక సేవల శౌర్య పతకాలు; 14 మందికి అగ్నిమాపక సేవల శౌర్య పతకాలు; ఏడుగురికి రాష్ట్రపతి అగ్నిమాపక సేవల పతకాలు; ఐదుగురికి అగ్నిమాపక సేవల పతకాలు వరించాయి.
- మరో 58 మందికి 'హోంగార్డ్-సివిల్ డిఫెన్స్' అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో ఎనిమిది మందికి రాష్ట్రపతి అవార్డులు దక్కాయి.

ఉగ్రవాదిని మట్టుబెట్టినందుకు...

2017లో జమ్ము-కశ్మీర్‌లోని పుల్వామాలో లష్కర్-ఎ-తైబా కమాండర్ అబూ దుజానాను మట్టుబెట్టిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటీబీపీ) అసిస్టెంట్ కమాండెంట్ అనురాగ్ కుమార్‌సింగ్‌కు పోలీసు శౌర్య పతకం దక్కింది. ఇదే విభాగానికి చెందిన మరో 15 మంది సిబ్బందికి విశిష్ట సేవా పురస్కారాలు వరించాయి.

రెండు బిల్లులను తిరస్కరించిన అమెరికా సెనేట్

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వ 'షట్‌డౌన్' ఇంకా కొనసాగుతోంది. ఈ పరిస్థితికి తెరదించేందుకు గురువారం ప్రవేశపెట్టిన రెండు బిల్లులనూ ఆ దేశ సెనేట్ తిరస్కరించింది. అక్రమ వలసలను నిర్మూలించేందుకు దేశ దక్షిణ సరిహద్దుల్లో 'భారీ గోడ' నిర్మించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి పట్టుదలతో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పరిస్థితి నెలకొని శుక్రవారానికి 35 రోజులు గడిచింది. అమెరికా చరిత్రలోనే ఇది సుదీర్ఘమైన షట్‌డౌన్. ఈ నేపథ్యంలో సెనేట్‌లో తాజాగా గోడ నిర్మాణ ప్రతిపాదనతో కూడిన బిల్లును అధికార రిపబ్లికన్లు మరోసారి ప్రవేశపెట్టారు. గోడ నిర్మాణానికి 'ప్రాథమిక చెల్లింపులు' (డౌన్ పేమెంట్) జరిపే అంశం ఉంటే ప్రభుత్వ వ్యయ బిల్లుపై సంతకం చేస్తానని ట్రంప్ తాజాగా స్పష్టంచేశారు.

చిదంబరాన్ని కస్టడీలో విచారించాల్సి ఉంది


హైకోర్టుకు తెలిపిన సీబీఐ, ఈడీ

దిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరంను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందని శుక్రవారం సీబీఐ, ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సంస్థలు దిల్లీ హైకోర్టుకు తెలిపాయి. అవినీతి, నగదు అక్రమ చలామణి ఆరోపణలు ఎదుర్కొంటున్న చిదంబరం ముందస్తు బెయిల్ కోసం జస్టిస్ సునీల్ గౌర్ ధర్మాసనం ముందు దరఖాస్తు దాఖలు చేశారు. దానిని వ్యతిరేకిస్తూ సీబీఐ/ఈడీల తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. అడిగిన ప్రశ్నలకు చిదంబరం దాటవేత ధోరణిని అవలంబిస్తున్నారని, సుదీర్ఘ సమాధానాలు ఇస్తున్నారని తెలిపారు.

అయిదో పెద్ద అగ్ర రాజ్యం భారత్

- ప్రధాని మోదీ వెల్లడి
- దక్షిణాఫ్రికాతో ఒప్పందాలు ఖరారు

దిల్లీ: భారత దేశం ప్రపంచంలోనే అయిదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. శుక్రవారం ఇక్కడ జరిగిన భారత్-దక్షిణాఫ్రికా వాణిజ్య సదస్సులో ఆయన ప్రసంగిస్తూ భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం రూ.182 లక్షల కోట్ల (2.6 ట్రిలియన్ డాలర్ల)కు చేరిందని చెప్పారు. ప్రస్తుతం అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, యూకే తరువాత ఆరోస్థానంలో ఉందని తెలిపారు. త్వరలో ఒక స్థానాన్ని మెరుగుపరచుకుంటామని అన్నారు. పెట్టుబడులకు భారత్ అనుకూలదేశంగా మారిందని, ఇందుకు ఉద్దేశించిన సంస్కరణలను ప్రభుత్వం రోజువారీ పద్ధతిలో సమీక్షిస్తోందని చెప్పారు. నూతన భారత్ నిర్మాణంలో భాగంగా కొత్తగా మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా ప్రసంగిస్తూ రెండు దేశాల మధ్య వాణిజ్యం మెరుగుదలకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తమ దేశంలో ప్రస్తుతం 150కిపైగా భారత కంపెనీలు ఉన్నాయని అన్నారు. భారత్‌లో తమ దేశానికి చెందిన 29 కంపెనీలు ఉన్నాయని, వీటి సంఖ్యను రెట్టింపు చేస్తామని చెప్పారు.



ప్రధాని మోదీ, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాల సమక్షంలో ద్వైపాక్షిక ఒప్పంద పత్రాలను చూపుతున్న విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి లిండివె సిసులు

మూడేళ్ల వ్యూహాత్మక సహకారానికి ఆమోదం

ఇరు దేశాల మధ్య అనేక కీలకాంశాల్లో సహకారాన్ని పెంపొందించుకునే దిశగా భారత్, దక్షిణాఫ్రికాలు మూడేళ్ల వ్యూహాత్మక కార్యక్రమానికి శుక్రవారం ఆమోదముద్ర వేశాయి. ఈ విషయమై భారత ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాల మధ్య చర్చలు జరిగాయి. వివిధ అంశాల్లో విస్తృతరీతిలో సహకారాన్ని అందించుకునే లక్ష్యంతో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించినట్లు ప్రధాని మోదీ ఓ ప్రకటనలో తెలిపారు. ఇచ్చిపుచ్చుకునే రీతిలో మూడేళ్ల వ్యూహాత్మక కార్యక్రమం అమలు ద్వారా భారత్‌తో సఫలీకృత భాగస్వామ్యాన్ని తమ దేశం కోరుకుంటున్నట్లు రామఫోసా తెలిపారు. ఈ సందర్భంగా రామఫోసా ఇక్కడ తొలి మహాత్మాగాంధీ-నెల్సన్ మండేలా స్మారక స్వేచ్ఛా ప్రసంగాన్ని ఇచ్చారు. అన్ని ప్రాంతాలు, మతాలు, జాతుల మధ్య సహనం ఉండాలని ఇరువురు నేతలూ ఆశించారని చెప్పారు. సహనంతో కూడిన ప్రపంచాన్నే వారు కోరుకున్నారని తెలిపారు.

రెండు రోజుల పర్యటన నిమిత్తం రామఫోసా శుక్రవారం దిల్లీ చేరుకున్నారు. శనివారం గణతంత్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. భారత దేశం తమకు వ్యూహాత్మక భాగస్వామిని ఆయన అభివర్ణించారు.

'దివాలా స్మృతి' రాజ్యాంగబద్ధమే: సుప్రీం

దిల్లీ: దివాలా స్మృతి (ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్-ఐబీసీ) పూర్తిగా రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రుణాల ఎగవేతలకు ఇక కాలం తీరిందని... ఆర్థిక వ్యవస్థను ఈ స్మృతి బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.ఎఫ్. నారిమన్, జస్టిస్ నవీన్ సిన్హల ధర్మాసనం శుక్రవారం 150 పుటల తీర్పును వెలువరించింది. గతంలో రుణగ్రహీతలు న్యాయస్థానాలను ఆశ్రయించి, తాము దివాలా తీసినట్లు నివేదించేవారు. అయితే... ఐబీసీ నిబంధనల ప్రకారం రుణదాతలే న్యాయస్థానాన్ని ఆశ్రయించి, తమ బకాయిదారులను దివాలా తీసినట్టుగా ప్రకటించాలని కోరేందుకు వీలవుతుంది. ఇందుకు సంబంధించిన వివాదాస్పద సెక్షన్ 29ఏ రాజ్యాంగ బద్ధతను సవాలుచేస్తూ పలు సంస్థలు వ్యాజ్యాలను దాఖలు చేశాయి. వీటిపై విచారణ చేపట్టిన ధర్మాసనం... ఐబీసీ ఆద్యంతం రాజ్యాంగబద్ధంగానే ఉందని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ నిపుణుల కమిటీ ఈ స్మృతి అమలును పర్యవేక్షిస్తోందనీ... అందరి సూచనలను పరిగణనలోకి తీసుకుని తక్కువ వ్యవధిలోనే దీనికి సంబంధించి సవరణలు కూడా చేసిందని పేర్కొంది.

అయోధ్య కేసుపై కొత్త ధర్మాసనం

- 29 నుంచి విచారణ

దిల్లీ: అయోధ్యలోని రామజన్మభూమి- బాబ్రీ మసీదు కేసుపై విచారణకు సుప్రీంకోర్టులో అయిదుగురు సభ్యులతో శుక్రవారం కొత్త రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటయింది. ఈ నెల 29 నుంచి విచారణ ప్రారంభించనుంది. ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ అశోక్ భూషణ్‌లు సభ్యులుగా ఉన్నారు. ధర్మాసనంలోకి కొత్తగా జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ అశోక్ భూషణ్‌లను తీసుకుంటున్నట్టు ప్రధాన న్యాయమూర్తి ప్రకటించారు. వీరిద్దరూ గతంలో అయోధ్య కేసును విచారించిన అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర ఆధ్వర్యంలోని ధర్మాసనంలో సభ్యులు కావడం గమనార్హం. ఇస్లాం మతంలో మసీదు అంతర్భాగం కాదంటూ 1994లో ఇచ్చిన తీర్పును సమీక్షించడానికి అయిదుగురు సభ్యుల బెంచ్‌ను ఏర్పాటు చేయాలన్న వినతిని గత సెప్టెంబరులో ఇదే ధర్మాసనం మెజార్టీ తీర్పుతో తిరస్కరించడం గమనార్హం. అయిదుగురు సభ్యుల బెంచ్ అవసరం లేదని జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ అశోక్ భూషణ్‌లు అభిప్రాయపడగా, ఏర్పాటు చేయాలని జస్టిస్ అబ్దుల్ నజీర్ తీర్పు ఇచ్చారు. అనంతరం కేసు విచారణకు ఏర్పాటయిన అయిదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ గొగొయి, జస్టిస్ బోబ్డే, జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ చంద్రచూడ్‌లు ఉండేవారు. ధర్మాసనంలో కొనసాగబోనని జస్టిస్ లలిత్ చెప్పడంతో కొత్తది ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అయోధ్యకు సంబంధించిన ఓ కేసు విషయమై గతంలో తాను న్యాయవాదిగా పనిచేసినందున ధర్మాసనంలో ఉండబోనంటూ ఆయన వైదొలిగారు.

పేదలకు 10శాతం కోటాపై స్టేకు నిరాకరణ

ఈనాడు, దిల్లీ: జనరల్ కేటగిరీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన 103వ రాజ్యాంగ సవరణ సహేతుకమేనా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. దీనిపై మధ్యంతర స్టే ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగొయి, జస్టిస్ సంజీవ్‌ఖన్నాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు అభిప్రాయపడింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను ఆయా రాష్ట్రాలు ఎప్పటికప్పుడు నోటిపై చేస్తాయని, ఈ తరగతులను ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించారని పిటిషనర్లు వివరించారు. వీటిపై నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వ్యాజ్యాలన్నీ మరో ధర్మాసనం ముందుకు

ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టానికి చేసిన సవరణలను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను విచారించడానికి తగిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించనున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది. ఈ వ్యాజ్యాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం సమర్పించిన రివ్యూ పిటిషన్‌ను కూడా కలిపి విచారించనున్నట్టు శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి ఆధ్వర్యంలోని ధర్మాసనం తెలిపింది.

ఛాంపియన్స్



హారిక

మన చెస్ ప్రతిభకు పద్మం

ద్రోణవల్లి హారికకు పద్మశ్రీ పురస్కారం ● గంభీర్, ఛెత్రి సహా 8 మందికి అవార్డులు

చదరంగ ధ్రువతార ద్రోణవల్లి హారిక ప్రతిభను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. అంతర్జాతీయ చెస్‌లో అనేక ఘనతలు సాధించి దేశానికి ఎంతో పేరు తెచ్చిన ఈ తెలుగు తేజాన్ని పద్మశ్రీ పురస్కారం వరించింది. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో భాగంగా హారికతో పాటు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్, భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి, తమిళనాడుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగు టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు శరత్ కమల్, స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పునియా సహా మొత్తం ఎనిమిది మందికి పద్మశ్రీ అవార్డులు దక్కాయి.

దిల్లీ

భారత చెస్‌పై తనదైన ముద్ర వేసిన తెలుగు క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక భారత నాలుగో అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైంది. చిన్న వయసులోనే ప్రతిభ చాటి 20 ఏళ్ల వయసుకే గ్రాండ్‌మాస్టర్ అయిన హారిక.. 2007-08 సంవత్సరానికి అర్జున అవార్డు గెలిచింది. మహిళల చెస్‌లో అత్యున్నత టోర్నీ అయిన ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో మూడు కాంస్యాలు గెలవడంతో పాటు అంతర్జాతీయ టోర్నీల్లో మరెన్నో పతకాలు సాధించిన హారికను ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 28 ఏళ్ల హారిక గత ఏడాదే పెళ్లి చేసుకుని వ్యక్తిగత జీవితంలో స్థిరపడింది. ఇప్పుడీ అవార్డు ఆమెకు మరింత ఆనందాన్నిచ్చేదే. మరో ఏడుగురు భారత క్రీడాకారులకు పద్మశ్రీ అవార్డులు దక్కాయి. సికింద్రాబాద్‌లో పుట్టి ఇక్కడే ప్రాథమిక విద్యను అభ్యసించిన భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రి తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక కావడం విశేషం. గత ఏడాది వందో అంతర్జాతీయ మ్యాచ్ ఆడి రికార్డులకెక్కిన ఛెత్రి.. 67 గోల్స్ కూడా సాధించాడు. టీమ్‌ఇండియా మాజీ ఓపెనర్, 37 ఏళ్ల గౌతమ్ గంభీర్‌కు సైతం పద్మశ్రీ దక్కింది. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ విజయాల్లో ముఖ్య పాత్ర పోషించడంతో పాటు టీమ్‌ఇండియా టెస్టుల్లో నంబర్‌వన్ కావడంలోనూ గంభీర్ కీలకంగా ఉన్నాడు. తెలుగు వాడే అయినా, తమిళనాడులో స్థిరపడి ఆ రాష్ట్రానికే ప్రాతినిధ్యం వహిస్తూ.. ప్రపంచ స్థాయిలో మెరిసిన టేబుల్ టెన్నిస్ స్టార్ శరత్ కమల్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత క్రీడాకారుడిగా చరిత్రకెక్కిన స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పునియాలతో పాటు సీనియర్ ఆర్చరీ క్రీడాకారిణి బాంబేలా దేవి, భారత కబడ్డీ కెప్టెన్ అజయ్ ఠాకూర్, బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి ప్రతిమా సింగ్ పద్మశ్రీ దక్కించుకున్నారు. పర్వతారోహకురాలు 64 ఏళ్ల బచేంద్రి పాల్‌ను కేంద్రం క్రీడా కోటా కింద పద్మభూషణ్ అవార్డుతో గౌరవించింది.



గంభీర్

హారిక ఘనతలివీ.. 2011లో, 20 ఏళ్ల వయసులో గ్రాండ్ మాస్టర్ హోదా ★ ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో మూడు కాంస్యాలు (2012, 2015, 2017) ★ 2016 ఫిడె మహిళల గ్రాండ్‌ప్రి ఈవెంట్లో టైటిల్. ★ 2016లో ప్రపంచ చెస్ ర్యాంకింగ్స్‌లో ఐదో స్థానం. ★ 2010 ఆసియా క్రీడల్లో కాంస్యం ★ 2016లో కెరీర్ అత్యుత్తమ ఫిడె ఎలో రేటింగ్ 2543.




దుమ్మురేపిన జకోవిచ్

ఆస్ట్రేలియా ఓపెన్‌కు రోమాంచిత ముగింపే. ప్రపంచ నంబర్ వన్ జకోవిచ్ తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ.. నంబర్ 2 రఫెల్ నాదల్‌తో ఆదివారం టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. సెమీఫైనల్లో నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డ జకోవిచ్.. లుకాస్ పౌలీని చిత్తుగా ఓడించాడు.


- అలవోకగా ఫైనల్లోకి నంబర్‌వన్
- టైటిల్ కోసం రేపు నాదల్‌తో ఢీ
- అమ్మాయిల ఫైనల్లో నేడు క్వితోవా × ఒసాకా

మెల్‌బోర్న్

టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో అడుగుపెట్టాడు. ఇక్కడ ఏడో టైటిల్‌పై కన్నేసిన అతడు శుక్రవారం ఏకపక్షంగా సాగిన పోరులో 6-0, 6-2, 6-2తో ఫ్రాన్స్ ఆటగాడు లుకాస్ పౌలీని మట్టికరిపించాడు. 2016 తర్వాత రాడ్ లేవర్ ఎరీనాలో ఫైనల్ చేరడం జకోవిచ్‌కు ఇదే తొలిసారి. ఆరు ఏస్‌లు, 24 విన్నర్లు కొట్టిన అతడు. . కేవలం ఐదు అనవసర తప్పిదాలు చేశాడు. పౌలీ 27 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. ఆరంభం నుంచే సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన జకోవిచ్‌కు పౌలీ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయాడు. తొలి సెట్ అయితే కేవలం 21 నిమిషాల్లో ముగిసింది. ఆ తర్వాతి సెట్లలో కూడా జకోవిచ్ అతడికి పుంజుకునే అవకాశం ఇవ్వలేదు. ''ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నేను బాగా ఆడిన మ్యాచ్‌ల్లో ఇదొకటి. అంతా నేను అనుకున్నట్లే సాగింది'' అని మ్యాచ్ అనంతరం జకోవిచ్ వ్యాఖ్యానించాడు. అతడు ఆదివారం జరిగే ఫైనల్లో రఫెల్ నాదల్‌ను ఢీకొంటాడు. రఫెల్ కూడా జోరు మీదున్న నేపథ్యంలో టైటిల్ సమరం రసవత్తరంగా సాగడం ఖాయం.



ఒసాకా × క్వితోవా



మధ్యాహ్నం 2 గంటల నుంచి సోని నెట్‌వర్క్‌లో

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఆసక్తికర ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. శనివారం జరిగే పోరులో చెక్ తార పెట్రా క్వితోవా.. జపాన్ యువ సంచలనం, నాలుగో సీడ్ నవోమి ఒసాకాను ఢీకొంటుంది. ఈ మ్యాచ్ విజేత ప్రపంచ నంబర్‌వన్ అవుతుంది.



స్టోసర్-షుయ్ జోడీకి డబుల్స్ టైటిల్


సమంత స్టోసర్ (ఆస్ట్రేలియా), జాంగ్ షుయ్ (చైనా) మహిళల డబుల్స్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఫైనల్లో ఈ ద్వయం 6-3, 6-4తో టిమియా బాబోస్ (హంగేరి), మ్లదనోవిచ్ (ఫ్రాన్స్) ద్వయంపై విజయం సాధించింది. షుయ్‌కి ఇది తొలి గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్.

సెమీస్‌లో సైనా

సింధు, శ్రీకాంత్ పరాజయం



జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత స్టార్ క్రీడాకారుల్లో సైనా నెహ్వాల్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లగా.. పి.వి.సింధు, కిదాంబి శ్రీకాంత్ ఇంటిముఖం పట్టారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో 8వ సీడ్ సైనా 21-7, 21-18తో పోర్న్‌పావీ (థాయ్‌లాండ్)పై విజయం సాధించింది. రెండో సీడ్ సింధు 11-21, 12-21తో ఐదో సీడ్ కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో 8వ సీడ్ శ్రీకాంత్ 18-21, 19-21తో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) చేతిలో ఓడాడు. శనివారం జరిగే సెమీస్‌లో హి బింగ్జియావొ (చైనా)తో సైనా తలపడుతుంది.



ఉమేశ్‌యాదవ్ (5/31)

విజృంభించిన ఉమేశ్

- ఫైనల్లో విదర్భ
- రంజీ సెమీస్‌లో కేరళపై విజయం

వయనాడ్: పేసర్లు ఉమేశ్‌యాదవ్ (5/31), యశ్ ఠాకూర్ (4/28) విజృంభించడంతో రంజీ ట్రోఫీలో విదర్భ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం ముగిసిన సెమీఫైనల్లో విదర్భ ఇన్నింగ్స్, 11 పరుగుల ఆధిక్యంతో కేరళను చిత్తుచేసింది. ఓవర్‌నైట్ స్కోరు 171/5తో రెండో రోజు ఉదయం ఆట కొనసాగించిన విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 52.4 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. 102 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. అనంతరం కేరళ రెండో ఇన్నింగ్స్‌లో 24.5 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. ఉమేశ్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టిన సంగతి తెలిసిందే. అతడికే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. పేసర్ల దెబ్బకు సెమీఫైనల్ మ్యాచ్ రెండ్రోజుల్లోనే ముగిసింది.

కర్ణాటక, సౌరాష్ట్ర జట్ల మధ్య బెంగళూరులో జరుగుతున్న రంజీ ట్రోఫీ సెమీస్‌లో ఆధిక్యం ఇరుజట్లతో దోబూచులాడుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 264/9తో రెండో రోజు, శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక 275 పరుగులకు ఆలౌటైంది. ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 227 పరుగులు సాధించింది. సుఖ్‌దేవ్ పటేల్ (85), పుజారా (45), జాక్సన్ (46) రాణించారు.

పట్టుబిగించిన ఆస్ట్రేలియా

బ్రిస్బేన్: శ్రీలంకతో తొలి టెస్టుపై ఆతిథ్య ఆస్ట్రేలియా పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 72/2తో రెండో రోజు, శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. 323 పరుగులకు ఆలౌటైంది. ఓ దశలో 82 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఆ జట్టును లబుషేన్ (81), హెడ్ (84) ఆదుకున్నారు. వీళ్లిద్దరు ఐదో వికెట్‌కు 166 పరుగులు జోడించారు. ఆసీస్‌కు 179 పరుగుల ఆధిక్యం లభించింది. లక్మల్ (5/75) ఆసీస్‌ను కట్టడి చేశాడు. ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసింది.

ఉత్సాహం ఉరకలేస్తుండగా..

కివీస్‌తో భారత్ రెండో వన్డే నేడు



సొంతగడ్డపై ఏ జట్టయినా బలమైందే. అందులోనూ న్యూజిలాండ్ జట్టు మంచి ఫామ్‌లో కూడా ఉంది. భారత్‌కు అక్కడ మరీ గొప్ప రికార్డు కూడా లేదాయె. దీంతో వన్డే సిరీస్ కఠిన సవాలే అనుకున్నారంతా. తొలి వన్డేలో హోరాహోరీ తప్పదని అంచనా వేశారు. కానీ నేపియర్ పోరు ఆశ్చర్యకరంగా ఏకపక్షమైంది. ఇటు బౌలింగ్, అటు బ్యాటింగ్‌లో సంపూర్ణ ఆధిపత్యంతో అలవోకగా మ్యాచ్‌ను సొంతం చేసుకుంది టీమ్ ఇండియా. ఈ గెలుపు ఊపులో.. రెట్టించిన ఉత్సాహంతో రెండో వన్డేకు సిద్ధమైంది కోహ్లిసేన. నేడే రెండో వన్డే.

మౌంట్ మాంగనుయ్

కివీస్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో ఒక మ్యాచ్ అవ్వగానే ఫేవరెట్ సీట్లోకి వచ్చి కూర్చుంది టీమ్‌ఇండియా. న్యూజిలాండ్‌ను దాని సొంతగడ్డపై 8 వికెట్ల తేడాతో చిత్తు చేయడం కంటే సిరీస్‌లో మంచి ఆరంభం మరేముంటుంది? ఇప్పుడు ఒత్తిడంతా ఆతిథ్య జట్టు మీదే. సాధారణంగా న్యూజిలాండ్ పిచ్‌లు పేసర్లకు అనుకూలం. కానీ తొలి వన్డేలో భారత మణికట్టు స్పిన్నర్లు యుజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్ విజృంభించారు. పేసర్ మహ్మద్ షమి కూడా చెలరేగినప్పటికీ.. స్పిన్నర్లను కాచుకోవడమే కివీస్ బ్యాట్స్‌మెన్‌కు సవాలుగా నిలుస్తోంది. మరి రెండో వన్డేకు ఆతిథ్యం ఇవ్వనున్న బే ఓవల్ మైదానం పిచ్ స్పిన్నర్లకు ఏమేరకు సహకరిస్తుందో, భారత స్పిన్ జోడీ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు ఎలాంటి సవాలు విసురుతుందో చూడాలి. తొలి వన్డేకు భిన్నంగా ఈ మైదానంలో పరుగుల వరద పారుతుందని అంచనా. చివరగా ఇక్కడ శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో తరచుగా మూడొందల స్కోర్లు నమోదయ్యాయి. శనివారం కూడా 300+ స్కోరు ఖాయమంటున్నారు.

రెండో వన్డేకు భారత్ మార్పుల్లేని జట్టుతో బరిలోకి దిగుతోంది. కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్‌కు ప్రధాన బలంగా నిలుస్తున్న టాప్-3 బ్యాట్స్‌మెన్ రోహిత్, ధావన్, కోహ్లిల మీదే తాము ప్రధానంగా దృష్టిసారించామని కివీస్ బౌలర్లు చెబుతున్న నేపథ్యంలో వారిని ఈ త్రయం ఎలా ఎదుర్కొంటుందన్నది ఆసక్తికరం. తొలి మ్యాచ్‌లో ధావన్, కోహ్లి సత్తా చాటిన సంగతి తెలిసిందే. ధోని నాలుగో స్థానంలో సత్తా చాటడం, జాదవ్ ఫామ్ చాటుకున్న నేపథ్యంలో రాయుడు సత్తా చాటాల్సిన స్థితిలో ఉన్నాడు. బుమ్రా లేకపోయినా.. బౌలింగ్ పరంగా ఇబ్బందులేమీ లేవు. తొలి మ్యాచ్ ప్రదర్శనను బౌలర్లు పునరావృతం చేస్తారని భారత్ ఆశిస్తోంది. మరోవైపు కివీస్ నేపియర్ పరాభవం నుంచి కోలుకుని కోహ్లిసేనను దెబ్బకు దెబ్బ తీయాలని చూస్తోంది. తొలి వన్డేలో సత్తా చాటిన విలియమ్సన్‌పై భారత బౌలర్లు దృష్టి పెట్టాల్సిందే. కేన్‌తో గప్తిల్, రాస్ టేలర్‌ల నుంచి కివీస్ మెరుగైన ప్రదర్శన ఆశిస్తోంది. పిచ్ స్పిన్నర్లకు అనుకూలమనుకుంటే శాంట్నర్‌తో పాటు రెండో స్పిన్నర్ ఇష్ సోధిని కూడా బరిలోకి దించే అవకాశముంది.

"భారత విజయ రహస్యం టాప్-3 బ్యాట్స్‌మెనే. మా బౌలింగ్ దళం వారిని దెబ్బ తీసి మిడిలార్డర్‌పై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉంది. తొలి 10 ఓవర్లలో మూడు వికెట్లు తీయగలిగితే మిగతా జట్టు కచ్చితంగా ఇబ్బంది పడుతుంది. **- ట్రెంట్ బౌల్ట్**

6 రెండో వన్డే వేదిక బే ఓవల్‌లో న్యూజిలాండ్ ఆడిన వన్డేలు. 3 మ్యాచ్‌లు నెగ్గి, మూడింట్లో ఓడింది



ట్రోఫీతో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు

ఛాంప్ సెంట్రల్ ఆంధ్ర

స్ప్రైట్ ఈసీసీ కప్-2018

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: స్ప్రైట్ ఈసీసీ కప్- 2018 మహిళల విభాగంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ (పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ సంఘం) ఛాంపియన్‌గా నిలిచింది. శుక్రవారం మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన ఫైనల్లో సెంట్రల్ ఆంధ్ర 4 వికెట్ల తేడాతో రాయలసీమ రాకర్స్ (కృష్ణతేజ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్)పై నెగ్గింది. ముందుగా బ్యాటింగ్ చేసిన రాయలసీమ రాకర్స్ 17.5 ఓవర్లలో 58 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో హంస (22) టాప్‌స్కోరర్. శ్రీలేఖ (2/6) రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో సెంట్రల్ ఆంధ్ర 6 వికెట్లు కోల్పోయి 13.3 ఓవర్లలో లక్ష్యాన్ని అందుకుంది. బ్యాటింగ్‌లోనూ శ్రీలేఖ (14) మెరిసింది. టోర్నీ సాంతం నిలకడగా రాణించిన సత్యవేణి (సెంట్రల్ ఆంధ్ర) "వుమన్ ఆఫ్ ద సిరీస్"గా నిలిచి స్కూటీని సొంతం చేసుకుంది. సీనియర్స్ ఫైనల్లో రాయలసీమ రాకర్స్ (బాలాజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఐటీ అండ్ మేనేజ్‌మెంట్, కడప) 5 వికెట్ల తేడాతో నార్త్ ఆంధ్ర నింజాస్ (డా.లంకపల్లి బుల్లయ్య కళాశాల, విశాఖపట్నం)పై విజయం సాధించింది. జూనియర్స్‌లో హైదరాబాద్ హీరోస్ జయకేతనం ఎగరవేసింది. తుదిపోరులో హైదరాబాద్ హీరోస్ (భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కళాశాల) 30 పరుగుల తేడాతో రాయలసీమ రాకర్స్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల)పై గెలిచింది. ముగింపు సమావేశానికి మల్లారెడ్డి విద్యాసంస్థల ఛైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ తిరుపతయ్య ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇటలీపై రాణిస్తా: ప్రజ్ఞేశ్

కోల్‌కతా: ఇటలీతో పచ్చిక కోర్టులో జరిగే డేవిస్‌కప్ ప్రపంచ గ్రూప్ క్వాలిఫయర్‌లో రాణిస్తానని భారత ఆటగాడు ప్రజ్ఞేశ్ గుణేశ్వరన్ అన్నాడు. "నేను పచ్చిపై బాగా ఆడతా. ఇటీవలే ప్రపంచ నంబర్-23 డెనిస్ షపొవలోవ్‌ను ఓడించా. ఇటలీపైనా రాణిస్తా" అని చెప్పాడు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఎంతెంత దూరం?

సచిన్ అంటే రికార్డులు.. రికార్డులంటే సచిన్!
క్రికెట్ రికార్డులకు సరికొత్త నిర్వచనం చెప్పిన ఘనుడతడు. అనితర సాధ్యమైన పరుగుల ప్రవాహంతో కుప్పలు కుప్పలుగా రికార్డులు పోగేశాడు. క్రికెట్లో ఇలాంటివి సాధ్యమా అనిపించే ఘనతలు అందుకున్నాడు.
తన ఘన ప్రస్థానాన్ని సచినుడు ముగిస్తున్నపుడు.. అతడి రికార్డుల జోలికి ఇంకెవ్వరూ రారనే అనుకున్నారంతా! మానవ మాత్రులెవరికీ తెండుల్కర్ రికార్డుల్ని అందుకోవడం సాధ్యం కావనే అంచనా వేశారంతా!
కానీ వచ్చాడు ఒకడు.. ఇతను మానవ మాత్రుడేనా.. వేరే గ్రహం నుంచి ఊడిపడ్డాడా అనిపించేట్లుగా..!
పేరు విరాట్ కోహ్లి!
సచిన్‌కు కూడా సాధ్యం కాని నిలకడ.. అతడిని మించిన వేగం.. క్రికెట్ చరిత్రలోనే ఎవ్వరికీ సాధ్యం కాని పరుగుల వరద.. దెబ్బకు రికార్డులు ఒక్కొక్కటిగా అతడి ముందు మోకరిల్లుతున్నాయ్! అతడి ఊపు అంతకంతకూ పెరుగుతోందే తప్ప తగ్గట్లేదు. మరి సచిన్ రికార్డుల్ని విరాట్ నిలవనిస్తాడా? ఈ ఘనతలకు అతనెంత దూరంలో ఉన్నాడు? 'మాస్టర్' రికార్డుల్ని 'బ్లాస్ట్' చేయడానికి విరాట్‌కు ఇంకా ఎంత కాలం పడుతుంది?

ఒకప్పుడు వన్డేల్లో పది వేల పరుగుల మైలురాయిని అందుకోవడమే అద్భుతం! ఆ ఘనతను తొలిసారి అందుకున్నది సచినే. అప్పుడు దానికే ఆశ్చర్యపోతే.. అతను ఏకంగా 18,426 పరుగుల వద్ద వన్డే ప్రవాహాన్ని ముగించాడు. అతను రిటైరయ్యే సమయానికి రెండో స్థానంలో ఉన్న పాంటింగ్‌కు అతడికి అంతరం దాదాపు 5 వేలు. వన్డేలు అంతకంతకూ తగ్గిపోతున్న నేపథ్యంలో సచిన్ దరిదాపుల్లోకి వెళ్లే ఆటగాడు భవిష్యత్తులో రాడనే అంచనా వేశారంతా. కానీ సచిన్ కన్నా తక్కువ వ్యవధిలో, ఇంకా తక్కువ మ్యాచ్‌ల్లో పది వేల పరుగుల మైలురాయిని అందుకుని అబ్బురపరిచాడు విరాట్ కోహ్లి. అరంగేట్రం చేసిన 10వ ఏట కోహ్లి ఈ మైలురాయిని అందుకుంటే.. సచిన్ 12 ఏళ్లకు ఈ ఘనత సాధించాడు. 10 వేల మైలురాయిని అందుకోవడానికి సచిన్ 272 మ్యాచ్‌ల్లో 259 ఇన్నింగ్స్‌లు ఆడితే.. కోహ్లి 213 మ్యాచ్‌ల్లో 205 ఇన్నింగ్స్‌లకే ఈ ఘనతను చేరుకోవడం విశేషం. వన్డేల్లో ఛేదనలో అత్యధిక శతకాలు సాధించిన బ్యాట్స్‌మన్‌గా సచిన్ (17) పేరిట ఉన్న రికార్డును కోహ్లి (24) ఎప్పుడో అధిగమించాడు. సచిన్ 232 ఇన్నింగ్స్‌ల్లో ఈ శతకాలు సాధిస్తే.. కోహ్లి 102వ ఇన్నింగ్స్‌లోనే సచిన్‌ను దాటేశాడు. సచిన్ రికార్డుల్ని వేటాడుతూనే.. మూడు ఫార్మాట్లలో అతడికి సాధ్యం కాని కొత్త రికార్డులెన్నో కోహ్లి అందుకున్నాడు. సచిన్ కెరీర్లో చాలా వరకు ఓపెనర్‌గా ఆడగా.. విరాట్ మూడో స్థానంలో ఆడుతూనే మాస్టర్ రికార్డులకు చేరువ అవుతున్నాడు. ప్రస్తుతం అతడి వయసు 30 ఏళ్లు. అతను ఇంకో ఏడెనిమిదేళ్లు ఆటలో ఉండి.. ఐదారేళ్లు ఫామ్‌ను కొనసాగించగలిగితే సచిన్ రికార్డులు నిలవడం కష్టమే. సచిన్ మిగతా రికార్డుల మాటెలా ఉన్నా.. టెస్టులు, వన్డేల్లో అతను నెలకొల్పిన అత్యధిక పరుగులు, శతకాల రికార్డును కోహ్లి అందుకుంటాడా లేదా అన్నదానిపై అందరి దృష్టి నిలిచి ఉంది.

వన్డే ఛేదనల్లో ఎవరెలా?

సచిన్		కోహ్లి
232	ఇన్నింగ్స్‌లు	122
8720	పరుగులు	6370
17/52	100/50	24/28
42.33	సగటు	68.49
175	అత్యధిక స్కోరు	183

విరాట్ విలక్షణత అదే..

వన్డేల్లో లక్ష్యాన్ని ఛేదించడం, టెస్టుల్లో నాలుగో ఇన్నింగ్స్‌ల్లో ఆడటం సవాలే. అందుకే కెరీర్ సగటుతో పోలిస్తే వన్డే ఛేదనల్లో, టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌ల్లో సగటు తక్కువగా ఉంటుంది. ఐతే విరాట్ ఇందుకు మినహాయింపు. అతను వన్డేల్లో ఛేదన అంటే చెలరేగిపోతాడు. తొలి ఇన్నింగ్స్‌లో కంటే రెండో ఇన్నింగ్స్‌ల్లోనే అతడి పరుగులు, సగటు, శతకాలు ఎక్కువ. టెస్టుల్లో కూడా నాలుగో ఇన్నింగ్స్‌ల్లో కోహ్లి ప్రదర్శన మెరుగే. ఈ రెండు అంశాల్లో కోహ్లి కన్నా సచిన్ వెనుకబడి ఉన్నాడు.



టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌ల్లో ఎవరెలా?

సచిన్		కోహ్లి
60	ఇన్నింగ్స్‌లు	23
1625	పరుగులు	896
3/7	100/50	2/6
36.93	సగటు	49.77
136	అత్యధిక స్కోరు	141

వన్డేలు తగ్గుతున్నాయ్.. కానీ!

టెస్టుల సంగతేమో కానీ.. వన్డేల్లో మాత్రం సచిన్ రికార్డుల్ని విరాట్ బద్దలు కొట్టలేడనే అంతా అనుకున్నారు. ఎందుకంటే ప్రపంచ క్రికెట్లో గత కొన్నేళ్లుగా వన్డేలకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. ఒకప్పుడు ప్రతి జట్టూ ఏటా సగటున 30-40 వన్డేలాడేది. కానీ నిరుడు భారత్ ఆడిన వన్డేలు 19 మాత్రమే. అందులో కోహ్లి ఆడిన మ్యాచ్‌లు 14 మాత్రమే. మ్యాచ్‌లు ఇంత తగ్గితేనేం.. కోహ్లి ఏకంగా 1202 పరుగులు చేశాడు. అతడి సగటు 133.55 కావడం విశేషం. 14 మ్యాచ్‌ల్లోనే ఆరు శతకాలు బాదేశాడతను. ఈ స్థాయిలో పరుగుల ప్రవాహం సాగిస్తుంటే.. ఇక సచిన్ రికార్డులు కొట్టడానికి అడ్డేముంది? పరుగుల సంగతేమో కానీ.. వన్డే శతకాల విషయంలో అయితే రాబోయే రెండు మూడేళ్లలో సచిన్‌ను కోహ్లి దాటేసే అవకాశముంది.


– తిమ్మాపురం చంద్రశేఖర్ రెడ్డి

ఈ ఊపులో అయితే ఏడేళ్లలో..

ఇప్పటిదాకా విరాట్ స్కోరింగ్ రేట్ ప్రకారం చూస్తే.. టెస్టుల్లో సచిన్‌ను అధిగమించడానికి 10 ఏళ్లు పడుతుంది. వన్డేల్లో ఎనిమిదేళ్లలో సచిన్‌ను అధిగమించగలడని అంచనా. ఐతే గత మూడేళ్లలో కోహ్లి జోరు మామూలుగా లేదు. ఈ మూడేళ్లలో టెస్టుల్లో 66.6 సగటుతో 14 శతకాలు సహా 3596 పరుగులు చేశాడు. వన్డేల్లో అయితే ఏకంగా 94.5 సగటుతో 15 సెంచరీలు సహా 3401 పరుగులు బాదేశాడు. ప్రస్తుతం కోహ్లి కెరీర్ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నాడు. ఈ ఊపును అతను కొనసాగిస్తే సచిన్ రికార్డులేవీ మిగిలే అవకాశాలే లేవు. గత మూడేళ్ల జోరులోనే అయితే.. కోహ్లికి టెస్టుల్లో మాస్టర్‌ను అధిగమించడానికి 7 ఏళ్ల 10 నెలలు పడుతుంది. వన్డేల్లో అయితే ఏడేళ్ల ఒక నెలలు చాలన్నది అంచనా.


గత మూడేళ్లలో విరాట్..

	పరుగులు	సగటు	శతకాలు
టెస్టులు	3596	66.6	14
వన్డేలు	3401	94.5	15




వన్డేల్లో పది వేల పరుగులు ఇలా..

సచిన్		కోహ్లి
272	మ్యాచ్‌లు	213
259	ఇన్నింగ్స్‌లు	205
42.63	సగటు	59.62
86.52	స్ట్రైక్ రేట్	92.51
28/50	100/50	37/48
19.3	జట్టు పరుగుల్లో శాతం	20.2
38	మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లు	30




టెస్టుల్లో



శతకాలు
సచిన్ : 51
కోహ్లి : 25
అర్ధశతకాలు
సచిన్ : 68
కోహ్లి : 20

వన్డేల్లో



శతకాలు
సచిన్ : 49
కోహ్లి : 39
అర్ధశతకాలు
సచిన్ : 96
కోహ్లి : 48

మరి ఎవరు గొప్ప?

నిజమే.. గణాంకాల్లో కొలిస్తే సచిన్ కంటే కోహ్లినే మిన్నగా కనిపిస్తున్నాడు! అతను ఇప్పటికే ఎన్నో ఘనతలు సాధించాడు. సచిన్ రికార్డుల్ని కొన్నింటిని అలవోకగా దాటేశాడు. కొన్ని ప్రమాణాల్లో తెండుల్కర్ కన్నా విరాట్ చాలా ఎత్తులో నిలుస్తున్నాడు. అలాగని సచిన్‌ను తక్కువగా చూడగలమా? విరాటే గొప్ప అనగలమా అన్నది చర్చ. ఎందుకంటే సచిన్ ఆడిన రోజులు వేరు.. ఇప్పటి రోజులు వేరు. అప్పుడు బ్యాటుకు, బంతికీ గట్టి పోటీ ఉండేది. అక్రమ్, మెక్‌గ్రాత్, ఆంబ్రోస్, డొనాల్డ్, వార్న్, మురళీధరన్.. లాంటి మేటి బౌలర్లుండేవాళ్లు. ఇప్పటి బౌలర్లను తక్కువ చేయడం కాదు కానీ.. వారిలా వీళ్లు అంత భీకరంగా కనిపించట్లేదు. ఒక బౌలర్‌ను చూసి బ్యాట్స్‌మెన్ వణికిపోయే రోజులు కావివి. ఇప్పుడంతా బ్యాట్స్‌మెన్ ఆధిపత్యమే. నిబంధనలు బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా మారడంతో స్కోరింగ్ రేట్ పెరిగింది. బ్యాట్స్‌మెన్ సగటులు, స్ట్రైక్ రేట్‌లు పెరిగాయి. తొలి పదేళ్లలో సచిన్ జట్టు భారాన్ని ప్రధానంగా తనే మోశాడు. భారత్ ఎక్కువగా అతడిపై ఆధారపడింది. విపరీతమైన అంచనాల ఒత్తిడిని మోస్తూ బ్యాటింగ్ సాగించాడు. ఇంతటి ఒత్తిడిని, అంతలా జట్టు భారాన్ని మోసిన ఆటగాడు ప్రపంచ క్రికెట్లో మరొకరు కనిపించరేమో! అప్పటి బ్యాటింగ్ ప్రమాణాల్ని మించి అత్యున్నత స్థాయిలో ఆడాడు. అతనో వైపు.. మిగతా బ్యాట్స్‌మెన్ అంతా ఒకవైపు అన్నట్లుండేది పరిస్థితి. సచిన్ ఆడే రోజుల్లో ప్రపంచ బ్యాట్స్‌మెన్ సగటు సరాసరిగా 32గా ఉండేది. అప్పుడతను 44 సగటుతో పరుగులు చేశాడు. మిగతా బ్యాట్స్‌మెన్ స్ట్రైక్ రేట్ సగటున 69.9గా ఉంటే.. అతడిది 82. ప్రస్తుతం ప్రపంచ బ్యాట్స్‌మెన్ సరాసరి సగటు 34.5గా ఉంటే.. స్ట్రైక్ రేట్ దాదాపు 82. ఇప్పుడు అంతటా బ్యాట్స్‌మెన్ ఆధిపత్యమే. సెంచరీ చిన్న విషయం అయిపోయింది. పరుగులకు విలువ తగ్గిపోయింది. భారత జట్టు సంగతే తీసుకుంటే.. కోహ్లితో పాటు రోహిత్, ధావన్ సైతం పరుగుల వరద పారించేస్తున్నారు. ముగ్గురూ శతకాల మోత మోగించేస్తున్నారు. విరాట్‌కైతే అసలు ఎదురే లేదు. అతడికి సవాలు విసిరే బౌలర్లే కనిపించడం లేదు. పిచ్‌లు సైతం ఒకప్పటి స్థాయిలో భీకరంగా ఏమీ లేవు. అలాగని విరాట్ నైపుణ్యాల్ని, అతడి శ్రమను తక్కువగానూ చూడలేం. కాబట్టే చాలామంది దిగ్గజాలు చెప్పే మాటేంటంటే.. వేర్వేరు తరాలకు చెందిన ఇద్దరు ఆటగాళ్లను పోల్చి చూడొద్దు.. ఎవరి స్థాయిలో వాళ్లు గొప్ప అని! సచిన్, విరాట్‌లూ అంతే!

పరుగులు, శతకాలు, అర్ధశతకాలు కాకుండా సచిన్ ప్రపంచ రికార్డులు మరి కొన్ని..


- **463** అత్యధిక వన్డే మ్యాచ్‌లు
- **9** ఒక జట్టుపై (ఆస్ట్రేలియా) అత్యధిక వన్డే శతకాలు
- **200** అత్యధిక టెస్టులు
- **195** టెస్టుల్లో 10 వేల పరుగులు చేసేందుకు ఆడిన ఇన్నింగ్స్

ఈ ఓపెన్ సాక్షిగా..

హోరాహోరీ పోరాటాలు, అనూహ్య మలుపులతో ఆస్ట్రేలియన్ ఓపెన్ అభిమానులను అలరిస్తోంది. అయితే కాసేపు ఆట సంగతి పక్కన పెడితే.. తమ ప్రియుడు లేదా ప్రియురాలు గెలవాలని కోర్టు బయట ఉంటూ ప్రోత్సహిస్తున్న ప్రేమికులు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. మొత్తం మీద ఏడాదిలో మొట్టమొదటి గ్రాండ్‌స్లామ్ టెన్నిస్‌లోని మజానే కాదు.. ప్రేమలోని మాధుర్యాన్నీ పంచుతోంది. అగ్ర క్రీడాకారిణి హలెప్, వెటరన్ ఆటగాడు వావ్రింకా, యువ సంచలనం అలెగ్జాండర్ జ్వెరెవ్.. ఇలా చాలా మందే టెన్నిస్‌ను ప్రేమ మయం చేస్తున్నారు. ఎక్కువ జంటల్లో భాగస్వాములు ఇద్దరూ టెన్నిస్ ప్లేయర్లే కావడం విశేషం. మనమూ ఆ ప్రేమ ప్రపంచంలోకి వెళదామా!


అల్లరి పిల్లాడు.. ఆమె..: నిక్ కిర్గియోస్.. ఈ పేరు చెప్పగానే వివాదాలే గుర్తొస్తాయి. ప్రత్యర్థిని దూషించడం.. అంపైర్‌ను తిట్టిపోయడం.. రాకెట్లు విరిచేయడం.. ఇలా చాలానే ఉదంతాలున్నాయి. కుదురుగా ఉండటమే తెలియని ఈ ఆస్ట్రేలియా అల్లరోడు నాలుగేళ్లుగా ఓ అమ్మాయి ప్రేమలో మునిగితేలుతున్నాడు. ఆమె కూడా టెన్నిస్ ప్లేయరే. ఆస్ట్రేలియాకే ఆడుతుంది. పేరు టామ్లిజనోవిచ్. శిక్షణ సమయంలో స్నేహితులుగా మారిన వీరు ప్రేమికులుగా కలిసిపోవడానికి ఎంతో కాలం పట్టలేదు. కిర్గియోస్ శ్రుతిమించిన ప్రతిసారి అతడిని దూరంగా పెట్టడం జనోవిచ్‌కు అలవాటు. 2017లో లండన్ క్లబ్‌లో కిర్గియోస్ ఇద్దరు మహిళలతో పార్టీ చేసుకోవడం భరించలేక టామ్లిజనోవిచ్ అతడితో విడిపోయింది. కొద్ది కాలానికే మళ్లీ ఒక్కటయ్యారు. "ఆమెతో ఉన్నప్పుడు నేనెంతో ఆనందంగా ఉంటాను. ఎప్పుడూ ఆమె నాతో ఉంటే బాగుంటుంది" అంటాడు కిర్గియోస్.





అందరి నోటా.. అదే మాట: తాజా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఎక్కువగా ఆకర్షిస్తున్నది ఎలినా స్వితోలినా, మోన్‌ఫిల్స్ జోడీనే. టోర్నీలో ఎక్కడ చూసిన ఈ జోడీదే హవా. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లోనే పరాజయం పాలైన 32 ఏళ్ల మోన్‌ఫిల్స్.. తన ప్రేయసి స్వితోలినా ఆడుతుంటే దగ్గర ఉండి మరీ ప్రోత్సహించాడు. మహిళల సింగిల్స్ ప్రపంచ మాజీ మూడో ర్యాంకు క్రీడాకారిణి, 24 ఏళ్ల స్వితోలినా క్వార్టర్స్‌లో ఒసాకా చేతిలో ఓడింది. మ్యాచ్‌ల సంగతి పక్కన పెడితే.. టోర్నీలో మాత్రం ఈ ప్రేమ జంట ఆకర్షణగా నిలిచింది. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్న ఈ జోడీ తాజాగా ఆ విషయాన్ని ప్రకటించింది. అంతేకాకుండా ఇద్దరు కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో ఉమ్మడి ఖాతాను ఆరంభించారు. దాంట్లో వాళ్లకు సంబంధించిన ఫొటోలను పోస్టు చేస్తున్నారు. "నాకోసం మోన్‌ఫిల్స్ ఉన్నాడు. అతని కోసం నేనూ ఉన్నా" అని స్వితోలినా తెలిపింది.

మాటలతో ధైర్యాన్నిచ్చింది: 2014 ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత స్టాన్ వావ్రింకా మూడేళ్ల క్రితం తన భార్యకు విడాకులిచ్చాడు. గాయం కారణంగా ఆటలో ఫామ్ కోల్పోయిన అతను కుటుంబ కలహాలతో మానసికంగా కుంగిపోయాడు. ఆ సమయంలోనే అతనికి క్రొయేషియా ముద్దుగుమ్మ డొనా వికిచ్ పరిచయమైంది. తన మాటలతో అతణ్ని ఓదార్చింది. 22 ఏళ్ల వికిచ్ కూడా టెన్నిస్ క్రీడాకారిణే. ఇద్దరూ 2019 ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలోకి దిగారు కూడా. వీళ్లు తమ అనుబంధాన్ని ఎప్పటికప్పుడూ సామాజిక మాధ్యమాల ద్వారా చాటుతూనే ఉన్నారు.



ఆటలోనూ తోడుగా..: అతడు ఆస్ట్రేలియా ఆటగాడు.. ఆమె ఫ్రాన్స్ క్రీడాకారిణి. టెన్నిస్ టోర్నీల సందర్భంగా ఏర్పడిన పరిచయం ఇద్దరినీ ఒకటి చేసింది. కలిసి ఉండేలా మార్చింది. అంతేనా.. సాధనలో ఒకరికొకరు సాయం చేసుకుంటూ.. ఆటలో మేటిగా మారే ప్రయత్నంలో ఉన్నారు.. డొమినిక్ థీమ్, మ్లదనోవిచ్. 2017 ఫ్రెంచ్ ఓపెన్ సందర్భంగా ఆస్ట్రేలియా బృందంలో మ్లదనోవిచ్ ఉండటంతో తొలిసారి వారి ప్రేమాయణం బయటపడింది. ఆ విషయాన్ని వారూ ధ్రువీకరించారు. ఎక్కువ రోజులు కలిసి ఉండేందుకు ఉమ్మడిగా టోర్నీల ప్రణాళికలు సిద్ధం చేస్తోంది ఈ జంట. టోర్నీల సందర్భంగా ముద్దు ముచ్చట్లు మాత్రమే కాదు.. తరుచుగా సామాజిక మాధ్యమాల్లోనూ ప్రేమను ఒలకబోస్తుంటారు.



తొలి చూపులోనే: ఏడాది క్రితం టెన్నిస్ కోర్టులో రష్యా అమ్మాయి ఓల్గా షరిపోవా సాధన చేస్తోంది. సరిగా అప్పుడే అక్కడికి జర్మనీ అగ్ర శ్రేణి టెన్నిస్ ఆటగాడు జ్వెరెవ్ వచ్చాడు. అమ్మాయిని చూడగానే మనసు పారేసుకున్నాడు. ఆ విషయాన్ని తనకు చెప్పాడు. తను కూడా సంతోషంగా ఒప్పుకుంది. అప్పటి నుంచి చెట్టాపట్టాలే. మొదట్లో వీళ్ల బంధం గురించి అడిగితే.. అవన్నీ ఊహాగానాలు మాత్రమేనని కొట్టిపారేశారు. కానీ కొన్ని నెలల క్రితం జ్వెరెవ్‌తో కలిసి దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన షరిపోవా వాళ్ల బంధాన్ని ప్రపంచానికి చాటింది. ఇద్దరు ఒకే ఏడాది (1997) జన్మించడం విశేషం.



ఈనాడు సినిమా

టీజర్‌లో 'భారత్' మెరుపులు


సల్మాన్‌ఖాన్

'నీ ఇంటి పేరు ఏంటి? ఏ జాతి ఏంటి? నీ మతం ఏంటి? అని అందరూ అడుగుతున్నారు. వాళ్లందరికీ నేను చెప్పిన సమాధానం ఒక్కటే.. దేశాన్ని దృష్టిలో పెట్టుకొనే మా నాన్న నాకు 'భారత్' అనే పేరు పెట్టారు'..సల్మాన్‌ఖాన్ నటిస్తోన్న తాజా చిత్రం 'భారత్'లోని సంభాషణ ఇది. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. అందులో వయసులోని వివిధ దశల్లో సల్మాన్‌ను చూపిస్తూ బ్యాక్‌గ్రౌండ్‌లో పై డైలాగ్ వినిపిస్తుంది. ర్యాక్ స్టార్, నావికాదళ అధికారి, ముసలి వ్యక్తి ఇలా సల్మాన్ వివిధ పార్శ్వాల్లో కనిపిస్తాడు. ఇందులోని 20 ఏళ్ల యువకుడిగా కనిపించే సన్నివేశాల్లో బాగా సన్నగా కనపడటానికి సల్మాన్ చాలా కష్టపడ్డాడట. అలీ అబ్బాస్ జాఫర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సల్మాన్, అబ్బాస్ కలయికలో వచ్చిన 'సుల్తాన్', 'టైగర్ జిందా హై' చిత్రాలు మంచి విజయం సాధించాయి. ఈ చిత్రంలో కత్రినాకైఫ్, దిశా పటానీ, టబు, సునీల్ గ్రోవర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని రంజాన్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

హిందీ నుంచే వస్తారా?


పరిణీతి చోప్రా

ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మల్టీస్టారర్ 'ఆర్.ఆర్.ఆర్' శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటోంది. ఇటీవలే రెండో షెడ్యూల్ మొదలైంది. ఎన్టీఆర్, రామ్ చరణ్‌ల సరసన ఆడిపాడే కథానాయికలు ఎవరన్నది మాత్రం ఇంకా ఖరారు కాలేదు. కొత్త షెడ్యూల్‌లో కూడా కథానాయకుల నేపథ్యంలోనే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. కథానాయికల్ని హిందీ నుంచే తీసుకొచ్చే ప్రయత్నాల్లో రాజమౌళి ఉన్నట్టు సమాచారం. ఈ చిత్రం పలు భాషల్లో విడుదల కాబోతోంది. 'బాహుబలి' తర్వాత రాజమౌళి తీస్తున్న సినిమా ఇదే కాబట్టి అన్ని ప్రాంతాల ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే పలు భాషలకి చెందిన నటుల్ని రాజమౌళి ఎంపిక చేశారని ప్రచారం సాగుతోంది. హిందీ కథానాయిక పరిణీతి చోప్రాని సంప్రదించినట్లు ఫిల్మ్‌నగర్ వర్గాలు మాట్లాడుకొంటున్నాయి. రాజమౌళి, ఆయన బృందం ఈ సినిమాకి సంబంధించిన ఏ విషయాన్నీ బయటికి రానీయడం లేదు.


తమన్, వెంకీ అట్లూరి, బీవీఎస్ఎన్ ప్రసాద్, అఖిల్, నిధి అగర్వాల్


మా నమ్మకం నిజమైంది

"మా కుటుంబానికి... మజ్ను అనే పేరుకు చాలా అనుబంధం ఉంది. అదే పేరుతో నేను సినిమా చేసి ఆ పేరుకున్న గౌరవాన్ని నిలబెట్టానని ప్రశంసలు వస్తున్నాయి. అన్నిచోట్లా ప్రేక్షకులు సినిమాని బాగా ఆస్వాదిస్తున్నారు. చాలామంది భావోద్వేగాలు బాగా పండించావని మెచ్చుకున్నార"ని చెప్పారు అఖిల్ అక్కినేని. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. శుక్రవారం చిత్రం విడుదలైన సందర్భంగా విలేకర్ల సమావేశం నిర్వహించారు. అఖిల్ మాట్లాడుతూ "ఇదొక ప్రేమకథే కాదు, మంచి వినోదాత్మక చిత్రం. ప్రేక్షకులు నవ్వుకుంటారనే నమ్మకంతోనే చేశాం. అది నిజమైనందుకు సంతోషంగా ఉంది. దర్శకుడు ఈ సినిమాతో తన స్థాయిని పెంచుకొన్నాడు. తమన్ సంగీతం, జార్జ్ కెమెరా పనితనం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయ"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "అక్కినేని నాగేశ్వరరావుకి 'లైలా మజ్ను', నాగార్జునకి 'మజ్ను' ఎలా మైలురాయిగా నిలిచాయో, అఖిల్‌కి 'మిస్టర్ మజ్ను' ఆ స్థాయిలో విజయాన్ని అందిస్తుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కథ రాసేటప్పుడే 'మిస్టర్ మజ్ను' అని పేరు పెట్టి, దీన్ని అక్కినేని వారసులతోనే తీయాలనుకొన్నా. ఇష్టంతో చేసిన సినిమాని ప్రేక్షకులు అంతే ఇష్టంగా స్వీకరించినందుకు ఆనందంగా ఉంది. ప్రేక్షకుల హృదయాలకి దగ్గరగా వెళ్లింది చిత్రం" అన్నారు. తమన్ మాట్లాడుతూ "అఖిల్ డ్యాన్సు, ఫైట్లు బాగా చేస్తాడని పేరుంది. ఇందులో వాటితో పాటు భావోద్వేగాలకీ పేరొచ్చింది. ప్రేమకథలకి సంగీతం ప్రాణం. అందుకు తగ్గట్టే సంగీతం కుదిరింది" అన్నారు. ఈ కార్యక్రమంలో నిధి అగర్వాల్ పాల్గొన్నారు.

సూర్యకాంతం సందడి


నిహారిక, రాహుల్ విజయ్

ఆ అమ్మాయిని నీ పేరేంటని అడిగితే... 'పేరు తెలుసుకొని ఏం చేస్తావు? రేప్పొద్దున నీకు పుట్టబోయే పిల్లలకి పెట్టుకుంటావా?' అని గడుసుగా సమాధానమిస్తుంది. ఆమెతో మాట కలిపిన ప్రతి ఒక్కరూ 'ఏం పిల్లరా మామా' అనాల్సిందే. ఆ గడుసమ్మాయి కథేంటో తెలియాలంటే 'సూర్యకాంతం' సినిమా చూడాల్సిందే. నిహారిక కొణిదెల, రాహుల్ విజయ్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రమిది. ప్రణీత్ బ్రమండపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. నిర్వాణ సినిమాస్ పతాకంపై సందీప్ ఎర్రంరెడ్డి, సృజన్ యారబోలు, రామ్ నరేష్ నిర్మాతలు. కథానాయకుడు వరుణ్‌తేజ్ సమర్పిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చి 29న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. శుక్రవారం టీజర్‌ని విడుదల చేశారు. "రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రమిది. వరుణ్‌తేజ్ చేతుల మీదుగా విడుదలైన ఫస్ట్‌లుక్‌తో పాటు టీజర్‌కి మంచి స్పందన లభిస్తోంది. నిహారిక, రాహుల్ విజయ్‌ల అభినయం, వాళ్లు పంచే వినోదం ప్రేక్షకుల్ని అలరిస్తుంద"ని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: మార్క్ కె. రాబిన్, ఛాయాగ్రహణం: హరిజ్ ప్రసాద్.


వేదికపై డ్యాన్స్ చేస్తున్న రణ్‌వీర్ సింగ్


దూకుతున్న రణ్‌వీర్

డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకుల మీదకు దూకేశాడు!


ఆలియాభట్

ముంబయిలోని ఓ సాధారణ కుర్రాడు దేశం గర్వించే ర్యాప్ గాయకుడిగా ఎదుగుతాడు. రణ్‌వీర్ సింగ్ నటించిన 'గల్లీబాయ్' కథ ఇదే. ర్యాప్ గాయకుడు అంటే జనాన్ని తన పాటలతో ఉర్రూతలూగించాలి. ఓ కొత్త లోకంలోకి తీసుకుపోవాలి. అందుకే ఈ సినిమా పాటల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ప్లాన్ చేశారు. ర్యాప్ గీతాలతో వేడుకకు వచ్చిన ప్రేక్షకుల్ని హుషారెత్తించారు. సాధారణంగా రణ్‌వీర్ ఎక్కడుంటే అక్కడ సందడే. ఇక అతని ఆహార్యం అంటారా... ఎప్పుడూ ట్రెండీగానే ఉంటుంది. 'గల్లీబాయ్' పాటల వేడుకలో రణ్‌వీర్ మరింత రెచ్చిపోయాడు. నియాన్ పచ్చ రంగు దుస్తులు... దానిపై వెండి రంగు జాకెట్ ధరించి వేదికపైకి వచ్చాడు. అప్పటికే వేదిక ర్యాప్ గీతాలతో మార్మోగుతుంది. రణ్‌వీర్ రాకతో ప్రేక్షకులు ఒకటే అరుపులు... కేకలు. రణ్‌వీర్ మైక్ అందుకొని డ్యాన్స్ చేయడం మొదలుపెట్టాడు. ఆ హుషారులో డ్యాన్స్ చేస్తూ చేస్తూ వేదిక కింద డ్యాన్స్ చేస్తూ ఊగిపోతున్న ప్రేక్షకుల మీదకు దూకేశాడు రణ్‌వీర్. 'గల్లీబాయ్'లో నాయికగా నటించిన ఆలియాభట్ కూడా పాటల వేడుకలో ప్రేక్షకుల మధ్యలో తిరుగుతూ జోష్ నింపింది. జోయా అక్తర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం వచ్చే నెల 14న విడుదల కానుంది.

రెండింతల కిక్ ఇచ్చింది 'ఎఫ్2'


తమన్నా, దిల్‌రాజు, అనిల్ రావిపూడి

"సంక్రాంతి పండగ సందర్భంగా విడుదలైన 'ఎఫ్2' చిత్రాన్ని రెండు వారాలైనా ప్రేక్షకులు కేరింతలు కొడుతూ ఆస్వాదిస్తున్నారు. సినిమాకి రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లు రావడం మా అందరికీ ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రేక్షకులు మరింతగా నవ్వుకోవాలని కొత్తగా ఐదు సన్నివేశాల్ని జోడిస్తున్నాం" అన్నారు దిల్‌రాజు. ఆయన సమర్పణలో అనిల్ రావిపూడి తెరకెక్కించిన చిత్రం 'ఎఫ్2'. వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ నాయకానాయికలు. శిరీష్, లక్ష్మణ్ నిర్మించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమ, ప్రేక్షకుల నుంచి సినిమాకి ప్రశంసలు లభిస్తూనే ఉన్నాయి. అందరికీ ప్రోత్సాహకరంగా ఉండాలనే ఉద్దేశంతో రూ.వంద కోట్ల గ్రాస్‌కి సంబంధించి జ్ఞాపికల్ని పంపించనున్నామ"న్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ "ఇదివరకు ఓవర్సీస్‌లో నా సినిమాలకి అంతగా ఆదరణ దక్కలేదు. ఈ సినిమా అక్కడా మెప్పించడం సంతృప్తినిచ్చింది. రూ.100 కోట్ల గ్రాస్‌కి చేరువయ్యామంటే దీని వెనక అందరి కృషి ఉంది. పదేళ్ల తర్వాత తన మార్క్ కామెడీని ఈ సినిమాలో చేసిన వెంకటేష్‌కీ, తొలిసారి కామెడీ జోనర్ చేసిన వరుణ్‌కీ, కథానాయికలు తమన్నా, మెహరీన్‌లకి ఈ చిత్రం రెండింతల కిక్‌నిచ్చింది" అన్నారు. తమన్నా మాట్లాడుతూ "దిల్‌రాజు సినిమాల్లో నాకెప్పుడూ విజయమే లభిస్తుంది. మళ్లీ వెంకీతో కలిసి సినిమా చేయడానికి నేను సిద్ధమే. వరుణ్ కామెడీగా నటించడంతో అతనికి అభిమానిగా మారా. హనీగా ప్రేక్షకులు గుర్తుపెట్టుకునేలా మెహరీన్ నటించింది. సాంకేతికనిపుణుల పనితనం బాగా కలిసొచ్చింద"ని అంది. ఈ కార్యక్రమంలో ప్రగతి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


అక్షయ్ కుమార్

శుభవార్త చెబుతారట

అక్షయ్ కుమార్, కరీనా కపూర్ కలసి నటిస్తున్న చిత్రం 'గుడ్ న్యూస్'. వారిద్దరూ జోడీగా గతంలో 'కంబక్త్ ఇష్క్', 'అజ్‌నబీ', 'ఐత్‌రాజ్' లాంటి పలు హిట్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు 'గుడ్ న్యూస్' కోసం మరోసారి తెరను పంచుకోబోతున్నారు. ఇందులో కియారా అడ్వాణీ, దిల్జిత్ దొసాంజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కరణ్ జోహార్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని రాజ్ మెహతా తెరకెక్కిస్తున్నారు. సంతానం కోసం పరితపించే ఓ పంజాబీ జంట చుట్టూ కథ సాగనుంది. ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. సెప్టెంబరు 6న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.


కరీనా కపూర్

తెలుగు సినిమాకి బహుమానం


కృష్ణ, విజయనిర్మల

ప్రముఖ నటులు కృష్ణ, విజయనిర్మల దంపతులకి '86 సంవత్సరాల తెలుగు సినిమా' గ్రంథాన్ని అంకితం చేసినట్టు రచయిత డా. కె. ధర్మారావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కృష్ణ నివాసంలో పుస్తక అంకితోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రచయిత ధర్మారావు మాట్లాడుతూ "తెలుగు సినిమా అభిమానిగా దశాబ్దాలుగా తాను సేకరించిన సమాచారంతో ఈ పుస్తకాన్ని రాశాన"న్నారు. "విలువైన విషయాలతో కూడిన పుస్తకాన్ని రచించిన ధర్మారావుకి అభినందనలు. ఈ పుస్తకం తెలుగు సినిమాకి బహుమానంగా భావిస్తున్నాం" అన్నారు కృష్ణ, విజయనిర్మల. ఈ కార్యక్రమంలో నరేష్, రేలంగి నరసింహారావు, రాధ ప్రశాంతి, వంశీ రామరాజు, కీమల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సూర్య ప్రతాపం


బండి సరోజ్‌కుమార్

బండి సరోజ్‌కుమార్ కథానాయకుడిగా నటించడంతో పాటు కెమెరా వెనక 11 విభాగాల్ని పర్యవేక్షిస్తూ తెరకెక్కించిన చిత్రం 'సూర్యాస్తమయం'. త్రిశూల్ రుద్ర, హిమాన్సీ కాట్రగడ్డ ప్రధాన పాత్రలు పోషించారు. రఘు పిల్లుట్ల, రవి కుమార్ సుదర్శి నిర్మించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని ఫిబ్రవరి ద్వితీయార్ధంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచే చిత్రమిది. సహజ సిద్ధమైన లొకేషన్లలో తెరకెక్కించాం. నటీనటులకు మేకప్ కూడా ఉండదు. ఒక పోలీసుకీ, గ్యాంగ్‌స్టర్‌కీ మధ్య జరిగే ఈ కథ అందరినీ అలరిస్తుంది. ఇందులో సూర్యుడు ఎవరు? అతని ప్రతాపం ఎలాంటిదన్నది ఆసక్తికరం. తమిళ నటుడు డేనియల్ కీలకమైన పాత్రలో కనిపిస్తారు. ఇటీవల విడుదల చేసిన పాటకి మంచి స్పందన లభిస్తోంది. త్వరలోనే ట్రైలర్‌ని విడుదల చేస్తాం" అన్నారు.

మూడో చిత్రం బయోపిక్?


సారా అలీఖాన్

'కేదార్‌నాథ్'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి విజయం అందుకొంది సైఫ్ అలీఖాన్ కుమార్తె సారా అలీఖాన్. ఆ తర్వాత రణ్‌వీర్‌సింగ్‌తో కలసి నటించిన 'సింబా' బాక్సాఫీసు వద్ద కాసులు కురిపించింది. దీంతో ఆమె క్రేజ్ మరింత పెరిగింది. అవకాశాలు వరుస కడుతున్నాయి. ఆమె నటించబోయే మూడో చిత్రం ఓ భారీ చిత్రమట. కరణ్ జోహార్ నిర్మించనున్నారు. ఈ చిత్రం ఓ బయోపిక్ అని సమాచారం. మూడో చిత్రం ఓ బయోపిక్ అనేసరికి సారా సంబరపడిపోతుందట. కథ బాగా నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేసిందంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. మరి సారా ఎవరి బయోపిక్‌లో కనిపించనుందనే ఆసక్తి బాలీవుడ్ వర్గాల్లో నెలకొంది.

దంగల్ అక్కాచెల్లెళ్లు మళ్లీ

ఫాతిమా సనా షేక్, సాన్యా మల్హోత్ర, గుర్తున్నారా? 'దంగల్'లో ఆమీర్‌ఖాన్ కూతుళ్లుగా, అక్కాచెల్లెళ్లుగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఈ ఇద్దరూ కలసి నటించబోతున్నారు. ప్రముఖ దర్శకుడు అనురాగ్ బసు తెరకెక్కించబోయే చిత్రంలో ఈ ఇద్దరూ నటించనున్నారు. డార్క్ యాక్షన్ కామెడీగా తెరకెక్కనున్న ఈ చిత్రంలో అభిషేక్ బచ్చన్, రాజ్ కుమార్ రావ్, ఆదిత్య రాయ్ కపూర్, పంకజ్ త్రిపాఠీ ప్రధాన పాత్రధారులు. "ఓ మంచి కథకు తగ్గట్టు కొత్త తరం నటులు కుదిరారు" అని చెప్పారు బసు. భూషణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.


ఫాతిమా సనా షేక్, సాన్యా మల్హోత్ర

కొత్త కబుర్లు

వసుంధర

రాజ్‌పథ్‌లో రైఫిల్ బృందం!

గణతంత్ర దినోత్సవాలకు దిల్లీలోని రాజ్‌పథ్ సిద్ధమైంది. రకరకాల విన్యాసాలకు వేదికైంది. ఇందులో అసోంకు చెందిన పారామిలటరీ రైఫిల్ విభాగం మహిళా సిబ్బందితో ప్రత్యేక ప్రదర్శన ఇస్తోంది. ఈ ప్రదర్శనలో కుటుంబసభ్యుల స్ఫూర్తితో ఇటువైపు వచ్చిన జవానులే కాదు, ఆర్మీలో భర్తల్ని కోల్పోయిన మహిళలు కూడా ఉన్నారు. వారందర్నీ పలు విభాగాల్లో వడకట్టి, ముప్పై ఎనిమిది మందిని ఇందుకు ఎంపిక చేశారు. ఈ బృందానికి మేజర్ కుష్బూ కన్వార్ నాయకత్వం వహిస్తోంది. పూర్తిగా మహిళా కాంటింజెంట్ పారామిలటరీ బలగం... ఇలా రాజ్‌పథ్‌లో పాల్గొనడం ఇదే ప్రథమం. బృందంలో కీలక సభ్యురాలైన అధికారిణి సునీత భర్త ఒకప్పుడు ఆర్మీలో పని చేశాడు. అతను జవానుగా వీరమరణం పొందిన తరువాత... ఆమె తన భర్త ఆశయాలను కొనసాగించాలని ఇటువైపు వచ్చింది. అలానే రైఫిల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తోన్న గాయత్రీ శర్మ కూడా అంతే. ఆమెకు మూడేళ్లున్నప్పుడే తండ్రి సైన్యంలో కన్ను మూశాడు. తండ్రి ఆలోచనల్లో పెరిగిన గాయత్రి కూడా అదే రంగం ఎంచుకుని రైఫిల్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తోంది. ఇక అసోంకి చెందిన ఈ మహిళా బలగమంతా ఈ రోజున రైఫిల్ విన్యాసాలు చేయడానికి సిద్ధమైంది.



తొలి మహిళా ఐపీఎస్‌గా...



చండీగఢ్ పోలీసు కాంటిన్‌జెంట్‌కు నిహారికా భట్ నేతృత్వం వహిస్తోంది. గణతంత్రదినోత్సవంలో పాల్గొంటున్న చండీగఢ్ పోలీసు దళం ఈమె సారథ్యంలో పెరేడ్ నిర్వహించనుంది. దీంతో ఈ రాష్ట్రంలో ఈ తరహా బాధ్యతలను వహిస్తోన్న మొదటి మహిళా పోలీసు ఆఫీసర్‌గానూ నిహారిక నిలిచింది. ఆమె 2015లో ఉత్తరాఖండ్‌లో డీఎస్పీగా చేరింది. మూడేళ్లపాటు అక్కడే విధులు నిర్వహించి, 2018 జూన్‌లో చండీగఢ్‌కు బదిలీ అయ్యింది. ప్రస్తుతం సౌత్ డివిజన్ ఆఫ్ చండీగఢ్‌కు ఏఎస్పీగా పనిచేస్తోంది. రిపబ్లిక్ డేలో నిర్వహించనున్న పెరేడ్‌కు ఆ రాష్ట్రం నుంచి పోలీసు దళానికి నేతృత్వం వహించమంటూ సీనియర్లు కోరడంతో ఈమె ఈ బాధ్యతలను చేపట్టింది. ఐపీఎస్‌గా విధులు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇటువంటి బాధ్యతలను తాను తీసుకోలేదంటుంది నిహారిక. 'ఇదే మొదటిసారి చేస్తున్నా. నా పై అధికారులు, సీనియర్ ఆఫీసర్ల కోరిక మేరకు మా రాష్ట్ర దళానికి నేతృత్వం వహించడానికి ఒప్పుకొన్నా. ఇందుకు నేను గర్వపడుతున్నా. ఇదొక గౌరవంలా భావిస్తున్నా' అని అంటుందామె. చండీగఢ్‌లో నేరాల సంఖ్య అధికం. అటువంటి చోట బాధ్యతలు తీసుకున్న నిహారిక అక్కడి నేరాల శాతాన్ని తగ్గించే దిశగా కృషి చేసింది. మహిళా రక్షణ కోసం పోలీసులను మారువేషంలో ఆయా ప్రాంతాల్లో నియమించింది. ఇరవైనాలుగ్గంటలూ మహిళల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులను అప్రమత్తం చేసింది. పోలీసుల నెంబర్లన్నింటినీ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయడంతో చాలా సమస్యలు తగ్గాయి.

నాన్న మాట... సీఏ బాట

'గెలవాలనే ఆశలేకపోతే ఆటకు ముందే ఓడిపోతాం'.
- ఈ సూత్రమే తన విజయ రహస్యం అంటుంది గుంటూరుకు చెందిన కమటం విజయలక్ష్మి. సీఏ (ఛార్టెడ్ అకౌంటెన్సీ) ఫైనల్స్‌లో అఖిలభారత నాలుగో ర్యాంకు, దక్షిణభారత దేశంలో మొదటి ర్యాంకు సొంతం చేసుకున్న ఆమె... ఇందుకోసం పోరాటమే చేసింది. కుటుంబ పరిస్థితులు అంతంత మాత్రమైనా... ఎట్టకేలకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. ఆమె విజయరహస్యం విజయ మాటల్లోనే చదువుదాం రండి.



విజేత

అఖిలభారత స్థాయిలో నాలుగో ర్యాంకు, దక్షిణభారత దేశంలో మొదటిర్యాంకు వచ్చిందంటే... ఇది నా ఒక్కదాని శ్రమ మాత్రమే కాదు. నేను కేవలం చదివానంతే. నా వెనుక అమ్మానాన్నల కష్టం, త్యాగం ఎంత ఉందో చెప్పలేను. పిల్లలు ఉన్నత చదువులు చదివితే...తమలా కష్టపడక్కర్లేదనే వారి ఆలోచన, తపన మమ్మల్ని ఈ స్థాయికి చేర్చాయి. మాది గుంటూరు. నాకు అక్క, తమ్ముడు ఉన్నారు. మా ముగ్గురి లక్ష్యాలు ఒకటే... సీఏ కావడం. దానికి కారణం ఒకవిధంగా నాన్నే. ఆరు నెలల క్రితం అక్క సీఏ పూర్తిచేసి ఉద్యోగంలో చేరింది. నేను ఇప్పుడు నా గమ్యాన్ని చేరుకున్నా. తమ్ముడు ఐపీసీసీ పూర్తిచేసి ఆ దిశగా అడుగులు వేస్తున్నాడు.

స్కాలర్‌షిప్ సాయంతో...

నాన్న రమేష్ పెద్దగా చదువుకోలేదు. అయితేనేం మమ్మల్ని ఉన్నతంగా చదివించాలనుకున్నారు. అలాగని ఇంజినీరింగ్, మెడిసిన్ వంటివాటి వైపు ప్రోత్సహించే తాహతు లేదు. దానికి కారణం ఆర్థిక సమస్యలే. ఆయన పదిహేనేళ్లుగా ఓ బేకరీలో పని చేస్తున్నారు. అదీ చిరుద్యోగమే. ఇంటికి ఆయనే జీవనాధారం. ఇలాంటి పరిస్థితుల్లో ఒకరిని లేదా ఇద్దరిని బాగా చదివించి, మరొకరిని నిర్లక్ష్యం చేయడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే ముగ్గురికీ న్యాయం చేయాలనుకున్నారు. మా చదువు ఉన్నతంగా ఉండాలి, తక్కువ ఖర్చులో అయిపోవాలని అనుకున్నారట. నాన్నకు సీఏ గురించి తెలియడంతో... పదో తరగతి పూర్తయ్యేటప్పుడు మా ముగ్గురికీ దాని గురించి చెప్పేవారు. 'చిన్న చదువు, పెద్ద చదువు అనేది ఏదీ లేదు. ఏ చదువు కష్టం కాదు, తేలిక కాదు. కష్టపడితే గుర్తింపు వస్తుంది. చదువే మీ ఆస్తి' అని వివరిస్తూనే మాలో స్ఫూర్తిని పెంచారు. అలా అక్క, నేను, తమ్ముడు ఇటువైపు వచ్చాం. అలాని ఆయన ఏ రోజూ మమ్మల్ని బలవంతం చేయలేదు. ఇటువైపు రావడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో వివరించేవారంతే. ఎన్ని కష్టాలు పడైనా సరే... చదివిస్తానని చెప్పేవారు. చిన్నప్పటినుంచీ ఆయన మాటలు మమ్మల్నెంతో ప్రభావితం చేశాయి. దాంతో మేం కూడా చదువుల్లో ముందుండేవాళ్లం. నేను పదో తరగతిలో 9.5 శాతం మార్కులతో పాసయ్యా. ఆ తరువాత కాలేజీవాళ్లు కొంత ఫీజు రాయితీ ఇచ్చారు. స్కాలర్‌షిప్పులూ వచ్చాయి. ఇంటర్ ఎంఈసీ శ్రీమేధలో చేరా. అక్కడే సీఏ సీపీటీ, ఐపీసీసీ పూర్తయ్యింది. ఆర్టికల్స్ ఉమామహేశ్వరావు అండ్ కంపెనీలో ఆర్టికల్స్ పూర్తి చేస్తూనే మాస్టర్‌మైండ్స్‌లో శిక్షణ తీసుకున్నా.

పాకెట్‌మనీ కూడా దాచిపెట్టి...!

ముగ్గురు పిల్లల్ని చదివించాలంటే మాటలేం కాదని, కాస్త పెద్దయ్యేకొద్దీ మాకు అర్థమైంది. నాన్న నెలంతా కష్టపడితే వచ్చే ఆదాయాన్ని అమ్మ అరుణకుమారి చాలా జాగ్రత్తగా వాడేది. ఆయన సంపాదనకు వేణ్ణీళ్లకు చన్నీళ్లు తోడు అనుకుంటూ మిషన్ కుట్టేది. అలా వచ్చిన మొత్తంతో వారిద్దరూ తిన్నా తినకపోయినా ప్రతి రూపాయినీ మా చదువులకోసం దాచిపెట్టేవారు. వాళ్లకోసం ఓ రూపాయి ఖర్చుపెట్టుకోవాలంటే... ఆలోచించేవారు. కాలేజీకి ఆయనే తీసుకెళ్లి, తీసుకొచ్చేవారు. ఆ కష్టం చూసి నాకు బాధేసేది. దాంతో పాకెట్‌మనీగా ఓ వందా, రెండొందలు ఇచ్చినా దాచుకునేదాన్ని. నాన్న అవి చూసి 'మరీ అంత పొదుపు అక్కర్లేదు. అవసరం అయితే వాడుకో...' అనేవారు. డబ్బు అవసరం ఎంతో, దాని విలువ తెలుసు కాబట్టి ఆచీతూచే ఖర్చు చేసేదాన్ని. అక్కా, తమ్ముడు కూడా అంతే. అమ్మావాళ్లు కూడా ఏ ఖర్చులు పెట్టుకునేవాళ్లు కాదు. మేమే లోకం అనుకునేవాళ్లు. మేం నలుగురితో సమానంగా ఉండాలని చూసేవాళ్లు. మంచి బట్టలు, పుస్తకాలు, తిండి, చెప్పులు.. అన్నీ మా కోసమే. వాళ్లు మాత్రం తక్కువ ఖరీదులో కొనుక్కునేవాళ్లు. వాళ్లకంటూ ఏ సరదాలు ఉండేవి కావు. నాన్న బయట అసలు తినేవారు కాదు. టిఫిన్, భోజనం అన్నీ ఇంట్లోనే. అవసరం అయితేనే రూపాయి ఖర్చుచేసేవారు. అమ్మ కూడా అంతే. ఇద్దరూ ఒక్కమాట మీద ఉండి... మమ్మల్ని తీర్చిదిద్దారు.

గంట చదివినా...

మొదటి నుంచీ నాకు అర్థం చేసుకుంటూ చదవడమే అలవాటు. ఎప్పుడూ ఏ పాఠాన్నీ బట్టీపట్టేదాన్ని కాదు. తరగతి గదిలో విన్న పాఠాలు అయినా, నేను ప్రణాళికలో పెట్టుకున్న అంశాలు అయినా సరే! ఏ రోజుకారోజు ఆ షెడ్యూల్‌ని పూర్తి చేసేదాన్ని. ఓ గంట అయినా సరే... ఏకాగ్రతతో చదివేదాన్ని. ఏ కాస్త ఖాళీ దొరికినా అమ్మకు వంటపనిలో సాయపడటం, కాస్త ఒత్తిడిగా అనిపించినప్పుడు స్నేహితులు, కుటుంబ సభ్యులతో కబుర్లు చెప్పడం ద్వారా ఉపశమనం పొందేదాన్ని. ఇప్పుడు నేను, అక్క సీఏ పూర్తిచేశాం. తమ్ముడు అదే పనిలో ఉన్నాడు.

మా పరిస్థితి చూసి కొందరు బంధువులు రకరకాల మాటలు అనేవారు. 'నీకు ఇద్దరు ఆడపిల్లలు. ఉన్నదంతా వాళ్ల చదువులకే ఖర్చు చేస్తే... పెళ్లి ఎలా చేస్తావు. డబ్బులేని వాళ్లకు చదువులెందుకు. పైగా సీఏ అంటే మాటలు కాదు. చాలా సమయం పడుతుంది. కాబట్టి ఆ డబ్బును వాళ్ల పెళ్లి కోసం దాచడం మంచిది' అని అనేవారు. కానీ అమ్మానాన్నలు ఆ మాటలకు ప్రభావితం కాలేదు. ఆడా, మగా అనే తేడా లేకుండా మమ్మల్ని సమానంగా చదివించారు. అందుకే మేం ఈ స్థాయికి చేరగలిగాం. అయితే మా ర్యాంకులు చూసి క్రమంగా బంధువుల్లోనూ మార్పు వచ్చింది. ఇప్పుడు 'మంచి నిర్ణయం తీసుకున్నారు. బాగా చదివించారు. వాళ్లకంటూ జీవితం ఇచ్చారు...' అని మెచ్చుకుంటున్నారు. ఇంతకన్నా కావాల్సిందేముంటుంది. కొందరు మాత్రం మా కష్టాన్ని చూసి డబ్బు సాయం చేసేవారు. నాన్న మరో పని కూడా చేశారు. పదో తరగతి పూర్తవడం ఆలస్యం. మా ముగ్గురికీ బ్యాంకు ఖాతాలు తెరిచారు. మాకు వచ్చిన స్కాలర్‌షిప్‌లు అందులోనే జమేసేవారు. అలాగే ఇంటికి ఎవరైనా బంధువులు వచ్చి మేం బాగా చదువుకుంటున్నామని ఏ కాస్త డబ్బు ఇచ్చినా... మా అకౌంటులోనే వేసేవారు. ఇంట్లో సమస్యలు ఉన్నా... ఒక్కరూపాయి తీసుకొనేవారు కాదు...'.

– స్వాతి కొరపాటి

ఉత్తమ క్యాడెట్‌గా హైదరాబాదీ!

హైదరాబాద్‌కు చెందిన రుతు సెరేన్ తెలుగు రాష్ట్రాల తరఫున రిపబ్లిక్‌డే క్యాంప్‌నకు ఉత్తమ క్యాడెట్‌గా ఎంపికైంది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దిల్లీలో జరుగుతున్న క్యాంప్‌లో ఆయా రాష్ట్రాల నుంచి పలు రకాల విభాగాలకు చెందిన క్యాడెట్లను ఎంపిక చేశారు. ఎయిర్‌ఫోర్స్ వింగ్ నుంచి అలా ఎంపికైంది రుతు సెరేన్.

భారతసైనిక విభాగంలో చేరి, దేశరక్షణలో పాలుపంచుకోవాలనే ఆసక్తితోనే నేను స్కూల్ స్థాయి నుంచి ఎన్‌సీసీలో చేరా. అలాగే కాలేజీలోనూ ఎన్‌సీసీ ద్వారా సేవలను అందించి, సీనియర్ వింగ్ క్యాడెట్‌నయ్యా. దిల్లీలో జరిగే శిబిరానికి ఎంపిక కావడానికి పలు పరీక్షలకు హాజరయ్యా. గతేడాది అక్టోబరు నుంచి ఈ అర్హత పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇందులో తొమ్మిది గ్రూపుల అభ్యర్థులు పాల్గొన్నారు. దీని కోసం భైసన్ మైదానంలో ఎనిమిది శిబిరాలకు హాజరయ్యా. వీటిలో పలు రకాల అర్హత పోటీలు జరిగాయి. ఫైరింగ్, కల్చరల్స్, రాత పరీక్ష, ప్రసంగించడం, సహా పలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటన్నింటిలో విజేతగా నిలవడానికి చాలా కష్టపడ్డా. ఇందులో ఎంపికైతేనే దిల్లీ గణతంత్ర దినోత్సవ ప్రదర్శనలకు వెళ్లగలం. ఆ తరువాత అక్కడ జరిగే మరో అర్హత పరీక్షల్లో పాల్గొనడానికి అవకాశం దొరుకుతుంది. అందుకే కష్టపడ్డా. ఈ పరీక్షలన్నింటిలో ముందు నిలిచి, సీనియర్ ఎయిర్‌వింగ్ విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తమ క్యాడెట్‌గా అర్హత పొందా.

బీఆర్క్ చేస్తున్నా...

దిల్లీలో పలు ప్రదర్శనల్లో పాల్గొంటాం. ఫిబ్రవరి రెండో తేదీ వరకు 29 రాష్ట్రాల నుంచి వచ్చిన క్యాడెట్లకు పలు పోటీలు నిర్వహిస్తారు. ఈ గణతంత్రదినోత్సవం తరువాత జరిగే పోటీల్లో కూడా పాల్గొంటున్నా. అందులో ఎంపికైతే, దేశం నుంచి ఉత్తమ క్యాడెట్‌గా అర్హత వస్తుంది. గతేడాది స్వాతంత్ర్యదినోత్సవ కార్యక్రమంలో హైదరాబాద్ గోల్కొండ కోటలో జరిగిన క్యాడెట్ల ప్రదర్శనలో పాల్గొనే అవకాశం దక్కింది. అలాగే వాయు సైనిక్ క్యాంప్‌లో కూడా పాల్గొన్నా. భవిష్యత్తులో దేశరక్షణలో విధులు నిర్వహించాలనే ఆశయంతో ఉన్నా. ఓ వైపు నా ఆశయం కోసం కృషి చేస్తూనే, మరో వైపు శ్రీవెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో బీఆర్క్ చేస్తున్నా. అమ్మానాన్నలకు మేమిద్దరం ఆడపిల్లలం. మమ్మల్ని చిన్నప్పట్నుంచీ క్రీడల్లో ప్రోత్సహించారు. అమ్మ మేరీ సరళ ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. నాన్న ఎలీషా ఎల్ఐసీలో హెచ్‌డీఏలో సీనియర్ మేనేజరుగా ఉన్నారు. తనూ అథ్లెట్. అలాగే చెల్లి రియాగ్రేస్ కూడా అథ్లెటిక్స్‌లో ఇటీవల తెలంగాణ ఛాంపియన్‌గా నిలిచింది. అమ్మానాన్నలు ఇచ్చిన ఉత్సాహమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది. దేశరక్షణలో పాల్గొని, అమ్మ కళ్లల్లో అసలైన గర్వాన్ని చూడాలన్నదే నా లక్ష్యం' అంటోంది రుతు సెరేన్.



కళ్లు తిరిగి పడిపోతోంది...ఏం చేయాలి?

మా అమ్మకు ఇరవైఏళ్ల క్రితం హిస్ట్రెక్టమీ జరిగింది. ఇప్పుడు తన వయసు 65. ప్రస్తుతం తను పొత్తికడుపు నొప్పితో బాధపడుతోంది. అలాగే డిఫికేషన్ సమయంలో కళ్లు తిరిగి పడిపోతోంది. తనని మళ్లీ మామూలు మనిషిని చేయడం కష్టంగా అనిపిస్తోంది. మేమేం చేయాలి?

- ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

మల విసర్జన సమయంలో కళ్లు తిరిగి పడిపోవడాన్ని డిఫికేషన్ సింకోపీ అంటాం. వేగస్ నాడి పనితీరులో తేడా జరిగినప్పుడు ఇలా అవుతుంది. మలబద్ధకం ఉన్నా, మలంలో రక్తం పడుతున్నా... కళ్లు తిరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మీ అమ్మగారికి ఆపరేషన్ జరిగి ఇరవై ఏళ్లు అయ్యిందంటున్నారు. అప్పట్లో ఆపరేషన్‌లో భాగంగా అండాశయాలు కూడా తొలగించారా లేదా అనేది ప్రస్తావించలేదు. వాటిని తొలగించకపోతే అండాశయాల్లోని కంతుల్లాంటివి ఏవయినా ఉన్నాయేమో గమనించాలి. వాటి ఒత్తిడి జీర్ణకోశంపై పడినప్పుడు కూడా ఇలా అవుతుంది. కాబట్టి ఓసారి అల్ట్రాసౌండ్ స్కాన్ చేయిస్తే... ఓ స్పష్టత వచ్చేస్తుంది. కొన్నిసార్లు థైరాయిడ్ మూలంగా వచ్చే మలబద్ధకం కూడా కారణం కావచ్చు. పొట్టనొప్పి కూడా వస్తోందని చెబుతున్నారు. దానివల్ల కూడా కొన్నిసార్లు కళ్లు తిరిగి పడిపోయే అవకాశాలు ఉంటాయి. అల్ట్రాసౌండ్ స్కానింగ్‌తోపాటు ఓసారి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టును కూడా సంప్రదిస్తే... అసలైన కారణాన్ని తెలుసుకుంటారు. అవసరం అనుకుంటే కొలొనోస్కోపీ కూడా చేసి, ఆ తరువాత సమస్యను బట్టి చికిత్స చేస్తారు. కాబట్టి భయపడకుండా వైద్యుల్ని సంప్రదించడం మంచిది.



– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

అలంకరణ నిలవాలంటే...

ఉద్యోగినులే కాదు... కాలేజీ అమ్మాయిలు కూడా కాస్తయినా మేకప్ లేకుండా బయటకు అడుగు పెట్టడంలేదు. ప్రత్యేక సందర్భాలయితే... అలంకరణ అవసరం కూడా పెరుగుతుంది. మరి ఆ అలంకరణ ఎక్కువసేపు నిలిచి ఉండాలంటే... ఏం చేయాలో చూద్దాం.




- అలంకరణలో కీలకంగా ఉండే ఫౌండేషన్, ఐషాడో వంటివి ఎక్కువ సేపు నిలిచి ఉండాలంటే ముందుగా నాణ్యమైన ప్రైమర్‌ని ఎంచుకోవాలి. ఆ తరువాతే మిగిలిన అలంకరణ మొదలు పెట్టాలి. రోజంతా మేకప్‌తో ఉండాల్సి వచ్చినప్పుడు అది చెరిగితే మళ్లీ మొదట్నుంచి వేయాలని లేదు. కాస్తంత టోనర్‌ని ముఖంపై చల్లుకుని, టిష్యూతో అద్ది, ఆపై కొద్దిగా లూజ్ పౌడర్‌ని రాసుకుంటే చాలు. మళ్లీ తాజాగా కనిపించొచ్చు.
- పెదవులపై లిప్‌స్టిక్‌నో, లిప్‌గ్లాస్‌నో రాసుకుంటే సరిపోదు. ముందుగా పెదవులని పంచదారతో రుద్దుకోవాలి. దానివల్ల మృతకణాలు తొలగిపోతాయి. అప్పుడు లిప్‌స్టిక్ వేసుకుంటే ఎక్కువ సమయం నిలిచి ఉంటుంది.
- వాతావరణం కాస్త వేడిగా, చెమటలు కారిపోతున్నప్పుడు పదేపదే మేకప్‌ని దిద్దుకోవాల్సిన పనిలేదు. బ్లాటింగ్ కాగితంతో అద్దుకుని బయటకు వెళ్లే ముందు ఓ సారి పౌడర్ అద్దుకోవాలి.

నజరానా

కొత్తిమీర, పుదీనా వంటివి ఎక్కువరోజులు నిల్వ ఉంచాలంటే.. వాటి కాడల్ని ఓ అంగుళం మేర కత్తిరించి నీళ్లున్న గ్లాసుల్లో పెట్టాలి. ఈ గ్లాసుల్ని ఫ్రిజ్‌లో ఉంచితే... చాలు.

బంగారం వెండి



25న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	33,410	33,340	33,400	33,300
ఆర్నమెంట్	31,210	31,150	30,900	30,850
వెండి (కిలో)	40,200	39,780	40,300	40,300
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	33,150	33,200	33,450	33,340
ఆర్నమెంట్	30,710	30,710	30,960	30,870
వెండి (కిలో)	40,000	40,000	40,100	39,900
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	33,200	33,200	-------	-------
ఆర్నమెంట్	30,880	30,880	3,092 గ్రా	3,089 గ్రా
వెండి (కిలో)	40,000	40,000	42.20 గ్రా	42.10 గ్రా

ఆమె దుస్తుల సంఖ్య 55వేలు

ఎంతటి పెద్ద సెలబ్రిటీకైనా వార్డ్‌రోబ్‌లో వెయ్యి లేదా రెండువేల రకాలు దుస్తులుంటాయి. కానీ ఈ ఇంట్లో అడుగుపెడితే మాత్రం అది దుస్తుల షోరూమేమోనని భ్రమపడతాం. అన్ని రకాల రంగుల్లో, వివిధ డిజైన్లలో వరుసగా వార్డ్‌రోబ్‌లోని హ్యాంగర్లకు దుస్తులు వేలాడుతూ కనిపిస్తాయి ఆ ఇంట్లో!. ఆ ఇల్లే జర్మనీలోని మార్గట్ బ్రాక్‌మన్‌ది. ఆ దుస్తులన్నీ ఆమెవే. అయితే ఆమె సెలబ్రిటీ మాత్రం కాదు.

జర్మనీకి చెందిన మార్గట్ బ్రాక్‌మన్‌ను ఓ డాన్స్ హాల్‌లో తొలిచూపులోనే పాల్ ప్రేమించాడు. అలా ప్రేమలో పడిన వారిద్దరూ పెళ్లితో ఒక్కటయ్యారు. దానికన్నా ముందుగానే పాల్ తన భార్యని ప్రతీ రోజూ కొత్త గౌనులో చూడాలనుకున్నాడు. దాంతో ఒకేసారి వేల రకాల గౌన్లను కొనేశాడు. ప్రస్తుతం 66 ఏళ్లు నిండిన మార్గట్ గత 40 ఏళ్లగా ప్రతీ రోజూ ఓ కొత్త గౌను ధరిస్తూ వస్తోంది. తన భార్య ఒకసారి వేసుకున్నది రెండోసారి ధరించకూడదనే ఆలోచనతోనే అతను ఇదంతా చేశాడు. అంతేకాదు ఎప్పటికప్పుడు కొత్త దుస్తులను కొనుగోలు చేస్తూనే ఉన్నాడు. వీటన్నింటిని ఉంచడం కోసం ఇంట్లో ప్రత్యేకంగా కంటైనర్లనే ఏర్పాటు చేసుకుందీ జంట.



అమ్మేస్తోంది!


గత నాలుగు దశాబ్దాలుగా నిత్యం దుస్తులను కొనుగోలు చేస్తుండటంతో ప్రస్తుతం మార్గట్ వద్ద 55వేల దుస్తులు పేరుకుపోయాయట. దాంతో భర్తను ఇక కొత్తవి కొనొద్దని చెప్పిందట. అంతేకాదు, కొన్నింటిని విక్రయించే పనిలోనూ పడిందామె.

మూడ్ రింగ్!



సాయంత్రం అమ్మాయితో కలిపి అలా కాఫీ షాప్‌కి వెళ్తున్నారు. తనకు నచ్చిన రంగు బ్రేస్‌లెట్టే పెట్టుకోవాలని అమ్మాయి గారి ఆదేశం. ఆ రంగులో ఉన్న బ్రేస్‌లెట్ కాదుకదా... రింగు కూడా లేదే అని ఆలోచిస్తున్నారా! మరీ ఎక్కువ ఆలోచించకండి. అప్పటికప్పుడు నచ్చిన రంగులో ఉన్న నగలని సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తుంది ఐగ్లామ్. ఐగ్లామ్ మూడ్‌రింగ్ పేరుతో యువత కోసం ప్రత్యేకమైన స్మార్ట్ నగలని విడుదల చేసింది. ఇందుకోసం మీరు చేయాల్సిందల్లా మీఫోన్‌లో యాప్‌కి మీరు ధరించిన నగలను అనుసంధానం చేసుకోవడమే. అంతే యాప్‌లోని కలర్ పేలెట్ సాయంతో బ్రాస్‌లెట్లు, ఉంగరాలకి నచ్చిన రంగుల్లోకి మార్చుకోవచ్చు. ఇందుకోసం మీరు ధరించే నగలని ఒక్కసారి ఛార్జింగ్ పెట్టుకుంటే చాలు... ఐదు గంటలపాటు రంగులు మార్చుకోవచ్చు.

తోచిందేదో మాట్లాడేస్తారు
క్షణాల్లో నిర్ణయాలు తీసుకుంటారు..
నచ్చిందేదో చేసేస్తారు
కెరీర్‌లో దూకుడుగా వ్యవహరిస్తారు..
తమని తామే ప్రేమించుకుంటారు..
.. వీళ్లంతా ఎవరు? మిలీనియల్స్.
మాట జారడం వీరికి తెలియదు.
ఎప్పుడూ నియంత్రణ కోల్పోరు..
బాధ్యతగా ప్రవర్తిస్తారు
ఎదుటివారి కోణంలో ఆలోచిస్తారు..
ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటారు
... మరి, వీళ్లు?
వినయ విధేయ మిలీనియల్స్.
అదేనండీ.. సినిమాటిక్‌గా చెప్పాలంటే
వినయ విధేయ రాముళ్లు!! వీళ్లంతా.



వాడేయడానికి మాటేం డేటా కాదు!

మీరు దేంట్లోకి వస్తారు? తెలుసుకుని తీరాలి. లేకుంటే.. చదువు.. కెరీర్‌లో ఎదురుదెబ్బలు తగలొచ్చు. ఒత్తిడి కోరల్లో చిక్కుకోవచ్చు. ఎలాగంటే.. క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ మాదిరే. క్రికెట్‌ని కెరీర్‌గా మలుచుకుని వారిదైన ప్రత్యేకతని చాటుతూ సాగిపోతున్న తరుణంలో సస్పెన్షన్ వేటు. ఊహించని ఓ కుదుపు. ఇంటికే పరిమితం. గది దాటలేని పరిస్థితి. కారణం? ఓ షోలో నోరు జారి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం. ఏళ్లు కష్టపడి సాధించిన గుడ్‌విల్ మొత్తం గంగలో కలిసిపోయింది. పొగిడినవారే ప్రవర్తన సరైంది కాదంటున్నారు. వారీ పరిస్థితికి ఎందుకొచ్చారు? కేవలం మిలీనియల్స్‌లానే ఆలోచించడం.. తోచిందేదో మాట్లాడేయడం..!! దానికి పర్యవసానంగా తగిన మూల్యం చెల్లించుకోవడం. అందుకే నేటి తరం వినయ విధేయ రాముళ్లుగా మారాల్సిన అవసరం ఉందని మానసికశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. అందుకు ఏం చేయాలి? ఏదైనా వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కోర్సు చేయాలనుకునేరు. ఏం అక్కర్లేదు. 'మాట జాగ్రత్త!' అనుకుంటే చాలు. ఎందుకంటే.. మాటేం చౌకగా దొరుకున్న మొబైల్ డేటా కాదు. అన్‌లిమిటెడ్ అని అదుపు లేకుండా వాడేయడానికి. మీ నెట్‌వర్క్ పరిధిని పెంచే సెల్ టవర్ లాంటిది. అదుపు చేయకుంటే టవర్ కూలిపోయే ప్రమాదం ఉంది.

'ఏక్యూబ్' ఫార్ములా

✪ ప్రశాంత్ ఆఫీస్‌లో హుందాగా వ్యవహరిస్తాడు. కానీ, ఓపిక తక్కువ. ముక్కుసూటిగా సమాధానం చెబుతాడు. ఇక ఇంటికొస్తే చాలు. ఒకటే విసుగు. చిన్నా.. పెద్దా.. అని చూడడు. నోటికొచ్చినట్టు మాట్లాడతాడు. అదే ఎవరైనా చుట్టాలింటికి వెళ్తే నోరు మెదపడు. మిత భాషిలా ప్రవర్తిస్తాడు.

- ఇక్కడ ప్రశాంత్‌కి 'ఏక్యూబ్ ఫార్ములా' తెలియదన్నమాట. అంటే.. 'ఎక్కడ? ఎలా? ఎందుకు?' మాట్లాడుతున్నాం? అనే స్పష్టత లేకపోవడం. మరైతే, తనకి ఫార్ములాని అభ్యసించాలంటే? ఐక్యూతో పాటు 'ఈక్యూ' (ఎమోషన్ కొషెంట్), 'ఎస్‌క్యూ'లను (సోషల్ కొషెంట్) ఒంటపట్టించుకోవాలి. ఆఫీస్‌లో హుందాగా వ్యవహరించే వాడు. ఇంటికొచ్చాక అరుపులు.. కేకలు వేయాల్సిన అవసరం లేదు. అలా చేస్తున్నాడంటే.. అతనికి ఎమోషనల్ కొషెంట్ లేదని అర్థం. ఇతరుల భావాల్ని అర్థం చేసుకునే స్థితి లేకపోవడం. ఇదే మాదిరిగా చుట్టాలొస్తే మూతి ముడుచుకుని కూర్చుంటున్నాడంటే.. వారికి సోషల్ కొషెంట్ సున్నా అని పరిగణించాలి. సమాజం పట్ల స్పష్టమైన వైఖరి లేకపోవడం. వారి ఇష్టాలు, అభిప్రాయాలకు మాత్రమే విలువ ఇస్తారు. దీంతో వారికి తెలిసిందే మాట్లాడి ఇబ్బందులు కొనితెచ్చుకుంటారు.



- గీతా చల్లా, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

దృష్టి కోణం మారాలి

✪ ప్రసన్న ఆఫీస్‌లో ఎవ్వరితోనూ కలవదు. ఎవరైనా ఏదైనా అడిగితే 'రాననో.. నాకిష్టం లేదనో.. ఎందుకనో..' అన్నీ పొడి పొడి మాటలే. తనకి అసలు మాట్లాడడం రాదనేది అందరి ఫీలింగ్. దీనికి ప్రసన్న సమాధానం ఏంటంటే.. తనకి నచ్చేలా ఇతరులు ప్రవర్తించకపోవడం. ఒక్క ఆఫీస్‌లోనే కాదు.. ఇంట్లో.. బయట.. అంతటా ఇదే సమస్య.

- ఇక్కడ ప్రసన్న గుర్తించాల్సిందేంటే.. తనకి నచ్చేలా ఎవ్వరూ ప్రవర్తించరని. తనే అందరికీ నచ్చేలా ప్రవర్తించాలని. అప్పుడే కెరీర్‌లో నెగ్గుకురాగలదు. అందుకు ఉన్న ఏకైక మార్గం మాట. సందర్భం ఏదైనా.. ఎక్కడైనా.. కేవలం మన దృష్టి కోణం నుంచి మాట్లాడే ప్రయత్నం చేస్తే ముప్పులు తప్పవు. కెరీర్ అయినా క్రికెట్ అయినా!

మైండ్ పవర్ ఒక్కటే కాదు

✪ నెల రోజులుగా నగేష్‌కి విశ్రాంతి లేదు. గడువు తేదీకల్లా ప్రాజెక్టుని పూర్తి చేశాడు. టీఎల్‌గా బృందంతో పోటీ పడి శ్రమించాడు. బాస్ పిలిచి కంగ్రాట్స్ చెప్పి విందుకు ఏర్పాటు చేస్తే.. ప్రాజెక్టు అనుభవాన్ని పంచుకునే క్రమంలో 'కోట్ల రూపాయల ప్రాజెక్టు.. నేను చేసిన కోడింగ్ వల్లే పూర్తయింది.' అనగానే బృందం ముఖాల్లో చిరునవ్వు చెరిగిపోయింది. ఒక్కమాటతో ప్రాజెక్టు క్రెడిట్ అంతా నగేష్‌కి చెల్లినట్లయింది. బాస్‌కి టీఎల్‌గా నగేష్ మాట్లాడే విధానం నచ్చలేదు. దాని ప్రభావం తర్వాత ప్రాజెక్టులో పడింది. టీమ్‌లీడర్ కాస్త టీమ్‌లో ఒక్కడయ్యాడు.

- చదువు, కెరీర్ ఎందులోనైనా మేధస్సుకి పదును పెడితే చాలు. మార్కులు బాగా వచ్చాయ్. లాజిక్‌పైన పట్టుసాధిస్తే చాలు. టీఎల్ దగ్గర మంచి మన్ననలు పొందొచ్చు.. అనుకునే పోటీ ప్రపంచంలో 'మాట పవర్'కి ఉన్న ప్రాధాన్యతని మర్చిపోతున్నారు. కానీ, మాటలు తూటాల్లా తగిలే రోజు ఒకటి వస్తుంది. అప్పుడు తెలుస్తుంది. మైండ్ పవర్ కంటే మాటకే ఎక్కువ పవర్ ఉంటుందని. ఇప్పుడు కంపెనీలు 'ఐక్యూ'ల కంటే 'ఈక్యూ', 'ఎస్‌క్యూ'ల పైనే దృష్టిపెడుతున్నారు.

మాటల్లోనే కాదు... చేతల్లోనూ అవే జాగ్రత్తలు అవసరం. చేజారాక పొరపాటైందనో... తెలియక జరిగిందనో చెబితే క్షమించేవారు తక్కువ. తటాలున చెయ్యెత్తడం.. కాలు దువ్వినట్లు రెచ్చగొట్టడం... వేలు చూపించడం... పెదవి కొరకటం, కన్ను గీటడం, కనుబొమలు ఎగరేయడం... వంటి వాటి విషయాల్లో అప్రమత్తత అవసరం. మన ఈ చేతలు ఏ సందర్భంలో వాడుతున్నాం... ఎవరి ఎదుట చేస్తున్నాం.. అనే విషయాలు గుర్తుంచుకొని నడుచుకుంటే ప్రమాదం ఉండదు.

మాటకి ముందు!

- సందర్భం ఏంటనేది తెలుసుండాలి
- మాట్లాడే అంశంపై అవగాహన ఉండాలి
- బాధ్యత కలిగి మాట్లాడాలి
- మాట తీరుని విశ్లేషించుకోవాలి
- సున్నితమైన అంశాలకు దురుసు మాటలొద్దు
- మాటల్లో మీదైన స్టైల్ ఉండాలి
- చక్కని పదజాలం అనివార్యం
- టక్కున స్పందించాలి
- నొప్పించేలా స్పందించొద్దు
- ఎదుటివారి దృష్టికోణం కూడా వినిపించాలి
- నెగిటివ్ అంశాల్ని పాజిటివ్‌గా చెప్పాలి
- మాటల్లో స్పష్టత అవసరం

ఆలోచించాలి.. స్వీకరించాలి

✪ తెలిసో.. తెలియకో పాండ్య, రాహుల్ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. మైదానంలో అంటుకున్న దుమ్ము కాదు. దులుపేసుకుని పరిగెత్తడానికి. ఏదైనా మాట్లాడే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించాలనే అనుకుంటారు అందరూ. కానీ, పొరబాటున నోరు జారితే!!

- స్వీకరించే స్థితిలో ఉండగలగడం మంచి లక్షణం. ఆఫీస్ మీటింగ్.. కాన్ఫరెన్స్ కాల్.. గ్రూప్ డిస్కషన్.. ఏదైనా కావచ్చు. తప్పుగా మాట్లాడితే తక్షణం స్వీకరించాలి. అంతేగానీ.. జారిన మాటని కప్పేందుకు మరిన్ని మాటల్ని జారవిడుచుకోవద్దు. అంతేకాదు.. ఆ సందర్భంలో ఎలా మాట్లాడితే బాగుండేదో అడిగి తెలుసుకోవాలి. అతి చురుకైన నాలుకని కంట్రోల్ చేయడానికి అభ్యాసన అవసరం.

క్రేజీ ప్రపంచంలోనూ తాతకు ప్రత్యేకస్థానం

- 'ఈతరం'తో గాంధీ మునిమనవరాలు మేథా

ఉరకలు వేసే ఉత్సాహానికి ఓ రూపమిస్తే అది ఆ అమ్మాయి. నెటిజన్లంతా ఆమెని 'ఇంటర్నెట్ ఫైర్' అంటూ ముద్దుగా పిలుచుకుంటారు. వేలాది మంది ఫాలోవర్స్‌తో ఆమె ఓ ఇన్‌స్ట్రాగ్రామ్ సంచలనం. అమెరికా యువత ప్రతిరోజూ తలుచుకునే నంబర్ వన్ మార్నింగ్ షో సహ వ్యాఖ్యాత. పేరు మేథ. ఇవన్నీ కాకుండా ఆమెకో గుర్తింపు ఉంది. అది గాంధీ మునిమనవరాలు మేథాగాంధీ అని. ఆధునికత్వం అచ్చులో పోసి తీసినట్టుండే మేథకి గాంధీ గురించి తెలిసిన విషయాలేంటో.. 'ఈతరం' తెలుసుకుంది.

■ *మీరు ఏ వయసులో మొదటిసారి గాంధీజీ గురించి తెలుసుకున్నారు?*

ఊహ వచ్చినప్పట్నుంచి ఇప్పటిదాకా ఆయన కథ నాకు తెలియని సందర్భం అన్నది ఒకటున్నట్టూ, ఎవరో వచ్చి ప్రత్యేకంగా నాకు చెప్పినట్టు గుర్తులేదు. గాంధీజీ జీవితాన్ని చాలామంది పాఠ్య పుస్తకాల్లో చదివినట్టుగా ఒక కథలా నేను చదవలేదు. నేను పెరిగే క్రమంలో ఊహ తెలిసేనాటికే అమ్మానాన్నలు చెబుతున్నప్పుడు ఆయన పాటించిన విలువల్ని, జీవితాన్ని క్రమంగా గ్రహించాను. మీ అమ్మానాన్నలని మొదటిసారి ఎప్పుడు అమ్మానాన్నలుగా గుర్తించావ్ అంటే ఏం చెబుతాం. నాదీ అలాంటి అనుభవమే గాంధీజీ విషయంలో!

■ *గాంధీజీ అనుసరించిన సత్యం, శాకాహార నియమాల వంటివి ఇప్పటి యువతలోనూ ఆసక్తి రేపుతున్నాయి. మీరేమంటారు?*

క్రేజీ ప్రపంచం అనుకునే సమాజంలో కూడా ఆయన చెప్పిన విషయాలకి ఎప్పుడూ ఓ ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ఆయన చెప్పిన, పాటించిన జీవిత విలువలని నేను నూటికి నూరుశాతం గౌరవిస్తాను. కానీ నేనున్న పరిస్థితుల్లో వాటిని పాటిస్తానని మాత్రం చెప్పలేను. నాకు ప్రకృతి సంబంధించిన విషయాలపట్ల ప్రేమ ఎక్కువ. ముఖ్యంగా జంతువులపై. అలాని నేను ఆయనలా శాకాహారిని కాదు. కానీ మారడానికి ప్రయత్నిస్తున్నాను. చూద్దాం. తక్కిన విషయాలంటారా.. నేనున్న ప్రపంచం వేరు. సగటు ఆధునిక అమ్మాయినే. అయితే ఓ విషయంలో నేను అదృష్టవంతురాలిననే చెప్పాలి. నేను నా ట్రాక్ దాటి బయటకు వస్తున్నప్పుడల్లా నా కుటుంబం మర్యాద, దయ వంటి వాటి గురించి గుర్తుచేస్తూనే ఉంటుంది.

హాట్‌బేబీసాస్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో తన అభిరుచులు, ట్రావెలాగ్ వివరాలను ఎప్పటికప్పుడు తెలియచేస్తుంది. ఆమె వేసే పంచ్‌లు, వ్యంగ్యోక్తులంటే ఇన్‌స్టాగ్రామ్ యువత ప్రాణం పెడతారు. 52వేలమంది ఆమె ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌ని అనుసరిస్తున్నారు.



గుడ్‌మార్నింoooooooంగ్.... బోస్టన్! అంటూ బోస్టన్ నగరాన్నే కాదు. యావత్ అమెరికానే ఒక్క కుదుపుకుదిపే కార్యక్రమం 'ఎల్విస్‌డ్యురాన్స్ మార్నింగ్ షో'. ఎక్కడా మూసకు తావివ్వకుండా... పొద్దుపొద్దునే బండెడు ఉత్సాహాన్ని కాఫీ కప్పులో పోసి అందించే ఆ కార్యక్రమానికి ప్రధాన వ్యాఖ్యాత ఎల్విస్ అయితే సహ వ్యాఖ్యాత మేథాగాంధీ.

■ *అమెరికాలో ఎప్పుడు స్థిరపడ్డారు?*

మా పెదనాన్న శాంతిగాంధీ డాక్టర్. ఆయన వచ్చిన తర్వాత నాన్న ప్రదీప్ కూడా వచ్చి అమెరికాలో స్థిరపడ్డారు.

■ *మీ అమ్మానాన్నల గురించి...*

మా అమ్మ యూఎస్ పోస్టల్ సర్వీస్‌కి చెందిన హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోంది. నాన్నది వ్యాపారం. అయితే అమ్మ జీవితం నా అంత సాఫీగా సాగలేదు. వర్ణవివక్ష వంటి అనేక అంతరాలని ఎదుర్కొని తనా స్థాయికి ఎదిగింది. చెల్లెలు ప్రియాగాంధీ. పీడియాట్రిక్ నర్స్‌గా శిక్షణ తీసుకుంది. యువతలో లైంగిక విజ్ఞానం పెంచే దిశగా చిన్న సైజ్ ఉద్యమమే సాగిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన యువత కోసం స్కూళ్లలో క్లినిక్‌లు తెరిచి యువతలో లైంగికపరంగా వచ్చే శారీరక, మానసిక సమస్యలపై పోరాడుతోంది. అన్నింటికీ మించి తను అమ్మకూచి... నాన్న కూచి. నా దృష్టిలో తనో అద్భుతం. నాకు దేశాలు చుట్టిరావడం అంటే ప్రాణం. పర్యటనలే నా ప్రపంచం. గత ఏడాది మొదటి నెలంతా భారత్‌లోనే ఉన్నాను. ముంబయి ఇష్టమైన నగరం.

■ *గాంధీజీ 150 జయంతి వేడుకలని మీరు ఎలా జరుపుకొన్నారు?*

నేనో విషయం చెబుతాను. నేను లేదా మేం ఆయన వారసులం మాత్రమే కానీ భక్తులమో, గాంధీగిరిని ప్రదర్శించాలనుకునేవాళ్లమో కాదు. నలుగురి దృష్టిలో పడటం కోసం గాంధీని ఇంటి పేరుగా మార్చుకునే వాళ్లను చూశా. నువ్వు అసలు గాంధీ వారసురాలివేనా అని నన్ను అడిగేవాళ్లని చూశా. కానీ నేను వీటన్నింటికి దూరం. నేను మా వారసత్వాన్ని గౌరవిస్తా. తక్కిన వాళ్లలాగే ఆయన గురించి తెలుసుకుంటా.

మేథాగాంధీ మరెవరో కాదు. గాంధీజీ పెద్దకొడుకు హరిలాల్‌గాంధీ మనవరాలే ఈ అమ్మాయి. భారతీయతకు, గాంధీగిరీకి పూర్తిగా దూరంగా అమెరికాలోని మియామిలో పుట్టి పెరిగింది. అచ్చంగా పడమటిదేశాల సంస్కృతికి ప్రతినిధిలా వంకీలు తిరిగిన బ్లాండెడ్ జుట్టుతో, అమెరికన్ యాసతో గలగలమంటూ నాన్‌స్టాప్‌గా మాట్లాడుతుంది. అయినా సరే నా భారతీయ మూలాలింకా పదిలం అని చెప్పడానికా అన్నట్టుగా మధ్యమధ్యలో తళుక్కుమనే ముక్కుపుడక.. చారడేసి కళ్లు జిగేల్‌మంటాయి.

■ *మీకే కనుక గాంధీజీతో కలిసి భోజనం చేసే అవకాశం వస్తే ఆయనతో మీరేం మాట్లాడతారు?*

నేటి ప్రపంచ పరిణామాలని మీరు పైనుంచి చూస్తూనే ఉన్నారా తాతయ్యా? సరే మిమ్మల్ని తట్టుకోలేనంతగా నిరాశ నిస్పృహల్లోకి నెట్టేసిన మీ కుటుంబసభ్యులు ఎవరు? తప్పకుండా నేను కూడా ఆ సభ్యుల్లో ఉండే ఉంటాను కాబట్టి... ఇప్పటికైతే ఈ ప్రశ్న దాచుకుంటాను. మరెప్పుడైనా వేస్తానులే!


- శ్రీ సత్యవాణి గొర్లె

ఎందుకిలా చేశావ్ చెల్లీ?

మనసులో మాట

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి రక్త సంబంధమే అవసరం లేదు. ఆత్మీయత ఉంటే చాలు. అది నాకు తెలియజేసిందీ, ఆ బంధంలోని తీయదనం నాకు రుచిచూపిందీ చిన్ని. నోరారా అన్నయ్యా అని ముద్దుగా పిలుస్తుంటే మళ్లీ మళ్లీ వినాలనిపించేది. ఆ పిలుపు వినడానికి నా మనసు ఎదురు చూస్తూనే ఉంది.

చిన్నీ..! నా స్నేహితుడి మేనకోడలు. ఇద్దరిదీ నిజామాబాద్ జిల్లా. ప్రతి సంక్రాంతి సెలవులకు తను తన అమ్మమ్మ వాళ్లింటికి వచ్చేది. చిన్నీ వాళ్ల అమ్మమ్మ వాళ్లది మా పక్క ఊరే. అక్కడ సంక్రాంతి సంబరాలు చాలా బాగా జరుగుతాయి. ఓసారి పండగకు నా స్నేహితుడు తన ఇంటికి ఆహ్వానించాడు. అప్పుడే మొదటిసారిగా చిన్నీని చూశాను. చాలా మంచి అమ్మాయి. ఎవరితోనైనా ఇట్టే కలిసిపోతుంది. తన సందడితో పండగ నిజంగానే చాలా బాగా అనిపించింది. సాయంత్రానికి అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుని ఇంటికి వెళ్తున్నపుడు 'అన్నయ్యా ఆగు' అంది. నా నంబరు అడిగి తీసుకుంది. ఊరెళ్లాక ఫోన్ చేసింది. ఇంట్లో వాళ్లనీ పరిచయం చేసింది. ప్రతి ఆదివారం తనతోపాటు తన ఇంట్లో వాళ్లతో మాట్లాడుతుండేవాడిని. ఏడాది కాలం గిర్రున తిరిగింది. కాలంతోపాటు మా బంధమూ బలపడింది. పదో తరగతి ఫలితాలు వచ్చాయి. చిన్నీ స్కూలు టాపర్. మండలంలోనూ తనే మొదటి స్థానంలో నిలిచింది. తనతోపాటు మా ఆనందానికీ హద్దులు లేవు. ఉత్సాహంగా ఇంటర్‌లో చేరింది. హాస్టల్‌లో ఉండటంతో ఫోన్ అనుమతి లేదు. దీంతో సెలవుల్లో ఇంటికి వచ్చినపుడు మాట్లాడేది. ఆ సెలవుల్లో తన కాల్ కోసం ఎదురు చూస్తుండేవాడిని. ఒకరోజు ఎప్పటిలానే ఫోన్ వచ్చింది. అయితే తన నుంచి కాదు. సారాంశం- కళాశాలలో చిన్నీ కళ్లు తిరిగి పడిపోయింది. ఇంటర్ పరీక్షలేమో ఇంకో వారంలో ఉన్నాయి. వాళ్ల అమ్మానాన్న ఆసుపత్రిలో చూపించి, డాక్టర్ సూచన మేరకు స్థల మార్పిడి ఉంటుందని అమ్మమ్మ వాళ్లింటికి పంపారు. తనను చూడటానికి వెళ్లాను. ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ ఉండే చిన్ని ముఖం డీలా పడిపోయింది. బాధనిపించింది. ఏమైందని అడిగా. 'చదువుపై సరిగా దృష్టి పెట్టలేకపోతున్నాను. ర్యాంకు తెచ్చుకోలేకపోతున్నా.' అంది. ఈ చదువుల పోటీని కొంచెం తట్టుకోలేకపోతోంది. తనే నెమ్మదిగా అలవాటు పడుతుంది అనుకున్నా. అనవసరంగా కంగారు పడుతున్నావ్! మంచి మార్కులు వస్తాయి. అని ధైర్యం చెప్పా. నవ్వి తలూపింది. అయితే ఆ నవ్వులో మాత్రం ఎప్పుడూ ఉండే వెలుగు లేదు. తనూ అక్కడే నాలుగు రోజులుండి వెళ్లింది. తను వెళ్లిన వెంటనే, అక్కడి నుంచి ఫోన్ వచ్చింది. చిన్నీ ఆత్మహత్య చేసుకుందని విని నమ్మలేకపోయాను. వాళ్ల ఊరెళ్లాను.. అదంతా అబద్ధం అవుతుందనే ఆశతో.. నా ఆశ తీరలేదు.



చిన్నీ!! ఏం కష్టమొచ్చిందమ్మా? ప్రతిదీ పంచుకునే నీవు నీ మనసులో బాధని మాతో పంచుకోలేకపోయావా? మాదే తప్పేమో! ఎప్పుడూ కాంతులు నిండే నీ కంటిలో ఆ బేలతనం చూసినపుడే సరిగా ఆరా తీయాల్సిందేమో! చిన్నవిషయం అని తేలికగా తీసుకుంటే నిన్నే మాకు దూరం చేస్తుందనుకోలేదు.

- శంకర్ యాదవ్

సృజన చెత్త కొత్తగా!

చెత్తే కదా అని తీసి పారేస్తాం... కానీ యువత కాస్త కొత్తగా ఆలోచిస్తే నయా రూపాలవుతాయి... ట్రెండీ ట్రెండీ దుస్తులవుతాయి... హుషారెత్తించే గిటారులవుతాయి! కావాల్సింది కొంచెం ఆలోచన, ఇంకొంచెం సృజనాత్మకత అంతే.



- చక్కని చెక్కతో తయారయిన టేబుల్ కాదు ఇది. ఇంట్లో పక్కన పెట్టిన హాకీ కర్రలతోనే ఈ కాఫీ టేబులయ్యింది. విరిగిన, పనికిరాని హాకీ కర్రల చెక్కను ఉపయోగించి రూపొందించారు.



- షూలు సాధారణంగా జీన్స్ క్లాత్‌తోనో లెదర్‌తోనో తయారవుతాయి. కానీ ఇక్కడున్న షూలు మాత్రం పాడైన మామిడి పండ్ల గుజ్జు నుంచి తయారయ్యాయి.



- ఈ గిటార్ ఎలా తయారయ్యిందో తెలుసా? పాత స్కేట్ బోర్డ్స్ నుంచి!



- వాటర్ బాటిళ్లు నీళ్లు తాగి పడేస్తాం. కానీ ఇక్కడున్న ఈ స్పోర్ట్స్ దుస్తులు తయారైంది వాటితోనే మరి!

ఇలా వృథాతో తయారైన వస్తువుల వైపు యువత ఎక్కువగా మొగ్గు చూపడంతో ఇవి మార్కెట్లో ట్రెండ్ అవుతున్నాయి. ట్రేడ్ అవుతున్నాయి.

సహకారం: **సోనీ** - బీబీసీ ఎర్త్